వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 10 సంచిక : 8 హైదరాబాద్ 133 ఆగస్ట్ 2012 పేజీలు : 68 రు. 15

- లక్ష్మింపేట - భూమి సమస్యే మౌలికం
- బాసగూడ ఆదివాసి హత్యాకాండ
- యానాం - మానేసర్ కార్మిక వివాదాలు
- కరపత్రం ఉంటే యావజ్జీవ శిక్ష !
- విశ్వ రహస్యం విప్పే హిగ్స్ బోసాన్
- బలపడుతున్న ఇసుక మాఫియా
- రాజకీయ ఖైదీలు అడుగుతున్నదేమిటి?

వీక్షణం దశాబ్ది సంచిక రూపకల్పన కోసం..

జూలై 8, 2012, ఎమెస్కో సమావేశ మందిరం, హైదరాబాద్



133

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఆగస్ట్ 2012
సంపుటి : 10
సంచిక : 8

లోపలి పేజీల్లో...

❖ పాఠకుల వీక్షణం			4
❖ సంపాదకీయం	◆ లక్షింపేట, బాసగూడ - నరహంతక రాజ్యం ఇది!		5
❖ సంపాదకీయ వ్యాఖ్యలు	◆ యానాం, మానేసర్ కార్మిక వివాదాల పాఠాలు	◆ భారత పాలనా విధాన నిర్ణేత బారక్ ఒబామా!	6
❖ కొత్త పుస్తకాలు / సి.డి.లు			7
❖ ఈ నేల		- డి.వి. రామకృష్ణారావు	8
❖ కత్తిరింపులు			10
❖ వర్తమానం	- లక్షింపేట హత్యాకాండ - భూమి - కులం	- వై. రామచంద్రం, డి.వి. రామకృష్ణారావు	11
❖ వర్తమానం	- లక్షింపేట ఘటన ఏం తెలియజేస్తోంది?	- చిమ్మె జాన్ బర్నబాస్	18
❖ వర్తమానం	- ధ్వంసమవుతున్న ఆదివాసి జీవితం	- మైపతి అరుణ్‌కుమార్	21
❖ శాస్త్ర విజ్ఞానం	- విశ్వ రహస్యాలు - హిగ్స్ బోసాన్	- డా. జి. రామదేవుడు	23
❖ దేశీయం	- కరపత్రం ఉంటే యావజ్జీవ శిక్ష!	- పియుసిఎల్, పియుడిఆర్	26
❖ సంస్మరణ	- గోరు మాధవరావు		29
❖ దేశీయం	- మానేసర్ కార్మికుల పోరాటంపై తప్పుడు ప్రచారం	- పి.వి. రమణ	30
❖ దేశీయం	- పన్నుల ఎగవేత, నల్లధనం సమస్య-2	- డి. నరసింహారెడ్డి	33
❖ విధానవిమర్శ	- మనుషులపై సామ్రాజ్యవాద మాయ	- లోకసంచారి	35
❖ ప్రాంతీయం	- బలపడుతున్న ఇసుక మాఫియా	- ముప్పాళ్ల భార్గవశ్రీ	40
❖ విధానవిమర్శ	- అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గిన భారత్	- ఎ. నర్సింహారెడ్డి	42
❖ పరిశోధన	- గ్రామ అధ్యయనం - మార్క్సిస్టు పద్ధతులు	- ఎన్. వేణుగోపాల్	46
❖ సామాజికాంశం	- రాజకీయ ఖైదీలు అడుగుతున్నదేమిటి?	- రాజకీయ ఖైదీలు	51
❖ శాస్త్ర విజ్ఞానం	- అణువులనేవి ఉన్నాయా?	- డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్	53
❖ సంస్థాగతం	- వీక్షణం కృషిలో అందరమూ భాగమవుదాం!		55
	- విలువైన సూచనలు ఇచ్చిన రచయితల సమావేశం		57
❖ ఇరుగు పొరుగు		- వై. రామచంద్రం	62
❖ భూగోళం		- సి. రాజశేఖర్, ఎ. మల్లేశ్	64
❖ అసహజ మరణాలు		- వై. రామచంద్రం, రాంకి	66

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191


'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రేరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.



ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల దగ్గర వీక్షణం మిత్రులు ఏర్పాటు చేసిన బ్యానర్. ఆ తరగతుల్లో ఉపన్యసించడానికి జూలై 14న వెళ్లిన వీక్షణం సంపాదకుడితో మంచిర్యాలలోని డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల కరెస్పాండెంట్‌ల, ప్రిన్సిపల్‌ల సమావేశం కూడా జరిగింది. వీక్షణం విస్తరణకు సహకరిస్తామని వారు వాగ్దానం చేశారు. ఈ ఏర్పాట్లు చేసిన వీక్షణం మిత్రుడు సి.ఎచ్. శ్రీమన్నారాయణకు కృతజ్ఞతలు.

వీక్షణం పత్రిక సక్రమంగా అందుతోంది. ఈ పత్రికలో రాజకీయ, సామాజిక, విదేశీ వార్తల విశ్లేషణ వ్యాసాలు చాలా ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా ఉంటున్నాయి. ఇలా పత్రిక నడిపించడం సామాన్య విషయం కాదు. మీకు నా హార్దిక అభినందనలు.

– డా. పోతుకూచి సాంబశివరావు, హైదరాబాద్

వీక్షణం బాగానే వస్తోంది గాని రావలసినట్టుగా రావడం లేదు. నా సూచనలు ఇవి: 1. మార్క్సిజం గురించి వివరించే వ్యాసాలు గాని, అనువాదాలు గాని ఎక్కువగా రావాలి. ఇంతకు ముందు తరాల వారికి రష్యావో, చైనావో ప్రచురణలు, అనువాదాలు దొరికేవి. ప్రస్తుతం అవి దొరికే అవకాశం లేదు. మార్క్స్ నుంచి మావో వరకు రచనల భాగాలు, అనువాదాలు, పరిచయాలు వీక్షణంలో ప్రచురిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. 2. ఎన్నో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ఘటనలు జరిగిపోతుండగా వాటి మీద బూర్జువా పత్రికల వ్యాసాలు, వ్యాఖ్యలు మినహా మార్క్సిస్టు దృక్పథం నుంచి విశ్లేషణలు రావడం లేదు. వీక్షణంలో కూడ అవి రావడం లేదు. వీక్షణం పనిగట్టుకుని అటువంటి మార్క్సిస్టు విశ్లేషణలను రాయించి, లేదా ఇతర భాషల్లో వస్తే అనువాదం చేయించి ప్రచురించాలి. 3. గ్రామాల అధ్యయనం మీద వరుస వ్యాసాలు అనవసరం. చాల అకడమిక్ గా ఉన్నాయి. మార్క్సిస్టు దృక్పథం నుంచి గ్రామాలను ఎలా అధ్యయనం చేయాలో ఒక్క వ్యాసం రాస్తే సరిపోతుంది. గ్రామాల అధ్యయనం ఎట్లా చేయాలని చాల పొడుగ్గా రాస్తున్నారు. ఎవరికోసం చేయాలి, ఎందుకోసం చేయాలి అనేది ముఖ్యం. అది ఉండాలి. 4. ఇటీవలికాలంలో వీక్షణంలో కొన్ని వ్యాసాల అనువాదాలు వస్తున్నాయి గాని అనువాదాలు ఏమాత్రం బాగుండడం లేదు. తెలుగులో చదివి ఇంగ్లిషులో ఇలా ఉండి ఉంటుందా అని ఊహించు కుంటేనే అర్థమయ్యేటట్టుగా ఉంటున్నాయి. తెలుగుదనం కనబడడం లేదు. ఏ విషయమైనా, ఎంత కష్టమైన విషయమైనా సులభంగా చెప్పే కొడవటిగంటి కుటుంబరావుగారి రచనాశైలిని అలవరచుకోవాలి.

– పి. నాగభూషణం, హైదరాబాద్

మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ కృతజ్ఞతలు
వీక్షణం ఆర్థిక స్థితి గురించి విజ్ఞప్తికి ప్రతిస్పందనగా జూన్ నెలలో అందిన విరాళాలు, సహాయాలు

ఎం. నరసింహారెడ్డి (హైదరాబాద్) – రు. 10,000; నిర్మల ఎంటర్‌ప్రైజెస్ ప్రై.లి. (మంచిర్యాల) – రు. 12,000; కె. స్రవంతి, ఎన్. శ్రవణ్‌కుమార్ (పెన్సిల్వేనియా, అమెరికా) – రు. 20,000; ఎస్.పి. మోహన్‌రావు (విజయవాడ) – రు. 5,000 ***2013 జనవరి ప్రత్యేక సంచిక కోసం విరాళాలు*** *– ఎన్. ఆదిత్య రు. 500; ఎన్. అభిజ్ఞ రు. 500*

జూలై 2012 సంచికలోని కొన్ని వ్యాసాలకు మాత్రమే పరిమితమవుతున్నాను. 1) 'విద్య–శాస్త్రీయత' అనే వ్యాసం నేటి విద్యా విధానాన్ని గురించి తెలుసుకోగలందుకు ఉపయోగకరంగా ఉంది. మనదేశంలో అనాది నుండి ఈనాటి వరకు శాస్త్రీయమైన విద్యనందించలేదనేది యదార్థం. ఆనాటి అగ్రవర్ణ పాలకులు ఒకటి, రెండు కులాలకు మాత్రమే పరిమితం చేశారు. వారికే ఆ హక్కున్నదని, అది దైవదత్తమని కిందితరగతి ప్రజల్ని మోసగించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా నేడు అందరికీ విద్య అందుబాటులో కొచ్చింది. కాని దాని సనాతన స్వభావాన్ని మాత్రం పోగొట్టుకోలేదు. అప్పటి నుండి ఇప్పటి దాకా ఎన్ని సమాజాలు మారినా దాని రూపం మార్చుకొంటూ ప్రజల్ని బుద్ధిహీనుల్ని చేసేదిగానే ఉండిపోయింది. ఇది దోపిడీ పాలకవర్గాలకు ఎంతో సేవచేసేది. ప్రజలు మందబుద్ధులైతేనే దోపిడీ వర్గాల అధికారాన్ని ప్రశ్నించకుండా ఉండగలరు. కర్మ సిద్ధాంతాన్ని బోధించే ఈ అశాస్త్రీయ విద్యనే నేటికీ విద్యార్థుల మెదళ్లకెక్కిస్తున్నారనేది వాస్తవం. సమాజ పరివర్తన చెందించాలనే వారు ఈ వ్యాసాన్ని చదవాలని కోరుకుంటున్నాను. నేటి విద్యా విధానంలో భూగోళం, చరిత్ర, సామాజిక శాస్త్రం ఇవేవి బొత్తిగా లేకుండా చేశారు. అవంటే ఏమిటో తెలియని పరిస్థితిలోకి నెట్టేశారు విద్యార్థుల్ని. జ్ఞానంలేని విద్యనందిస్తూ వారిని అన్ని రకాల వ్యసనాలకు గురిచేస్తూ బానిస చాకిరీ చేసేవారిగా మార్చివేస్తున్నారు. 2) '2020 తరువాత ఏం జరుగబోతోంది' అనే వ్యాసంలో అప్పుల ఊబిలో కూరుకొనిపోయిన దేశాల దుస్థితి గురించి బాగా రాశారు. నేరుగా సామ్రాజ్యవాద బానిసత్వంలోకి ప్రయాణించే దౌర్భాగ్యం మన దేశ ప్రజలు ఎదుర్కోబోతున్నారు అనేది యదార్థమవుతున్నది. ప్రత్యక్షంగా సామ్రాజ్యవాద రాకాసి మన దేశ ప్రజలనెత్తినెక్కి కూర్చునే రోజులు వస్తున్నాయనేది ఈ వ్యాసం తెలియ జేస్తుంది. ప్రజలు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం గనుక ఈ వ్యాసాన్ని ప్రాముఖ్యత గలదిగా భావిస్తూ అందరూ చదవాలని, ఇతరులను కూడా చదివించాలని భావిస్తున్నాను. 3) 'మార్కెట్టు గుప్పిట్లో విద్య' అనే వ్యాసం ఆనాడు కొన్ని అగ్రవర్ణాల గుప్పిట్లో విద్య ఎట్లా బందీ అయిందో, ఈ రోజు కూడా కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ అయిందనేది తెలుపుతున్నారు రచయిత. 'విద్యనెరుంగనివాడు మర్త్యుడే?' అనే భర్తృహరి నీతిశతకంలోని పద్యం గుర్తొస్తుంది ఈ నాటి విద్యావిధానం చూస్తుంటే. ఆయన దృష్టిలో విద్య అంటే జ్ఞానం కలిగించేదని.

(మిగతా 59వ పేజీలో...)

చిమ్మె జాన్ బర్నబాస్ వ్యాసం 'న్యాయవ్యవస్థలో అవినీతిని ప్రశ్నిద్దాం'లో 25వ పేజీలో ఆఖరి నుండి రెండో పేరాలోని ఆఖరు వాక్యం 'ఈ వ్యవస్థ, అమానవీయతనూ, అవినీతి అక్రమాలనూ సహనంతో ఒప్పుకొనే విధంగా వ్యక్తులను మారుస్తాం.' ను ఈ వ్యవస్థ, అమానవీయతనూ, అవినీతి అక్రమాలనూ సహనంతో ఒప్పుకొనే విధంగా వ్యక్తులను మార్చుతున్నది.'గా సరిచూసుకోగలరు. అలాగే, జూలై, ఆగస్ట్ సంచికలలో సరళావందనం 'ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పాలన' సీరియల్ వ్యాసాన్ని అందించలేక పోతున్నాం. – సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, గుంటూరు........ – ఏకుల మల్లేశ్ (ఇంటర్నెట్ ద్వారా)

వీక్షణం

లక్షింపేట, బాసగూడ - నరహంతక రాజ్యం ఇది!


‘శిశు హంతక రాజ్యం ఇది, పశుసంతతి పాలన ఇది’ అని కవి చెరబండరాజు రాసి నలభై ఏళ్లు కావస్తున్నది. అది అక్షరాలా నిజమని పాలకవర్గాలు మరొకసారి రుజువు చేసుకుంటున్నాయి. చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా బాసగూడలో పది మంది పిల్లలతో సహా పద్దెనిమిది మంది ఆదివాసులను ప్రభుత్వ బలగాలు కాల్చిచంపాయి. శ్రీకాకుళం జిల్లా లక్షింపేటలో పట్టపగలు ఐదుగురు దళితులను గ్రామంలోని కాపులు నరికిచంపారు, ఆ హంతకులను పాలకులు రక్షిస్తున్నారు. ఈ రెండు హత్యాకాండలకూ మధ్య తేడా ఉన్నట్టు కనబడవచ్చు. ఒక చోట చనిపోయినది ఆదివాసులు, మరొకచోట దళితులు. ఒకటి స్వయంగా రాజ్య భద్రతా బలగాలు చేసినది, మరొకటి కుల దురహంకారులు చేసినది. ఒకటి ‘దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పు’ మీద యుద్ధంలో భాగం. మరొకటి గ్రామీణ అహంకార ప్రదర్శన. ఒకటి అత్యంత విలువైన ఖనిజవనరులను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టే దళారీ వ్యూహంలో ఒకానొక ఘటన, మరొకటి భూమిమీద అధికారం తమకే ఉండాలని, అంటరానివారికి ఉండగూడదని తలపోసిన కుల దుర్మార్గం. ఇవన్నీ పైకి కనబడే తేడాలు మాత్రమే. అట్టడుగున రెండు హత్యాకాండలూ ఈ దేశ పాలకవర్గాల నిజస్వభావానికి చిహ్నాలు. అతి ఎక్కువ దోపిడీకీ పీడనకూ గురవుతున్న ఆదివాసులు, దళితులు ఈ హత్యాకాండల లక్ష్యాలు. ఆదివాసుల మీద, దళితుల మీద సమాజపు హంతక నిర్లక్ష్యానికి, చిన్నచూపుకు, లెక్కలేనితనానికి నిదర్శనాలు ఈ హత్యలు. ఆదివాసులు ఈ వ్యవస్థను మార్చదలచిన మావోయిస్టులకు సహకరిస్తున్నారు గనుక వారిని చంపిపారేసినా ఫరవాలేదు. దళితులు ఈ వ్యవస్థ అంచులలోని అస్పృశ్యులు గనుక వారిని వేటాడి నరికి చంపినా ఫరవాలేదు. ఆదివాసులు స్వావలంబనను, తమ జల్ జంగల్ జమీన్ మీద తమ హక్కును కోరుతున్నారు గనుక వారికి రక్తసిక్తమైన హెచ్చరిక చేయాలి. దళితులు తమ భూమి మీద తాము వ్యవసాయం చేసుకుని ఆత్మగౌరవంతో జీవించదలిచారు గనుక వారు తల ఎత్తలేని గుణపాఠం నేర్పాలి. ఆదివాసుల పట్ల, దళితుల పట్ల, అన్ని పీడిత వర్గాల పట్ల పాలకవర్గ వైఖరి ఇది. ఈ దేశం, ఇక్కడి వనరులు, ఇక్కడి సంపదలు, ఈ ప్రజల శ్రమఫలితాలు తమకో, తమ యజమానులైన సామ్రాజ్యవాదులకో మాత్రమే చెందాలని, చెందుతాయని, ఆ వ్యవస్థను ప్రశ్నించే, ధిక్కరించే వారినెవరినైనా ఎంత హింసాత్మకంగానైనా మట్టుపెట్టవచ్చునని పాలకవర్గాల ఆలోచన. ఆదివాసుల మీద, దళితుల మీద ఇటువంటి హత్యాకాండలు ఈ దేశ పాలకవర్గాలకు కొత్త కాదు. అది రామాయణ కాలపు దండకారణ్య ఆదివాసులనుంచి, రాముడికి ఎదురుపడిన దళితుల నుంచి ఇవాళ్టి దాకా సాగుతున్న పాలకవర్గ, హైందవ, అగ్రవర్ణ యజ్ఞం. ఈ యజ్ఞానికి ఇటీవలి కాలంలో సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు వంటి కొత్త బలిపశువులు కూడ దొరుకుతున్నారు. బాసగూడలో ఆదివాసులను చంపి, ‘కేంద్ర హోం మంత్రి చిదంబరం ప్రశాంతంగా ఎలా నిద్రపోగలుగుతున్నాడు’ అని ఔట్ లుక్ వారపత్రిక ప్రశ్నించింది గాని రోజురోజూ ప్రజల నెత్తురు కళ్లజూడకపోతే పాలకవర్గాల ఉనికే కొనసాగదు, వాళ్లకు నిద్రే పట్టదు. కనుక చిదంబరం నిద్ర గురించి ఆశ్చర్యపోనక్కరలేదు. ప్రతిరోజూ పాలకవర్గాల సేవలో ఎంత నెత్తురూ చెమటా దోపిడీ చేయగలిగాను, ఎన్ని ప్రాణాలు తీయగలిగాను అని లెక్కలు తేల్చుకుంటేగాని నిద్రపోని ప్రభుత్వాలు ఇవి. కాని పాలకవర్గాలూ ప్రభుత్వాలూ సరే, ప్రజల సంగతేమిటి? ఇటువంటి దాడులకే రేపోమాపో గురికానున్న పాలితులు, తమ విద్యాబుద్ధులను శ్రామిక ప్రజల కోసమే వెచ్చించవలసిన మధ్యతరగతి బుద్ధిజీవులు ఈ నెత్తుటి మరకలతో ఎలా నిద్రపోగలుగుతున్నారు? సమాజం మొత్తంగానే ఈ దుర్మార్గ హత్యాకాండల పట్ల తీవ్రమైన ప్రతిస్పందన చూపకుండా ఎలా ఉండగలుగుతున్నది? గతంలో తానే ప్రదర్శించిన చైతన్యాన్నయినా, స్పందననయినా చూపలేనంత నిస్సహాయ స్థితిలోకి ఎందుకు జారిపోతున్నది? ప్రాణాలు బలిగొనడం ఒక ఎత్తు కాగా, ఆ హత్యాకాండను సమర్థించడానికి, నేరస్తులను తప్పించడానికి సాకులు, హత్యాకాండలకు ఇతర కారణాలు వెతకడానికి ప్రయత్నిస్తున్నారంటే ఈ సమాజం, బుద్ధిజీవులు ఎంత అమానవీయమైన స్థితికి చేరారనుకోవాలి! భయంకరమైన శత్రువును ఎదుర్కొంటూ భద్రతాబలగాలు అత్యంత సాహసోపేతమైన చర్య చేశాయని హోంమంత్రి కితాబు ఇస్తాడు. పత్రికా సంపాదకులు ఆదివాసులను చంపడం పెద్ద సమస్య కాదంటారు. మావోయిస్టులు ఆదివాసులను మానవకవచాలుగా పెట్టుకుంటున్నారు గనుక ఈ మరణాలు సహజమేనని, అనివార్యమని, ఇటువంటివి ఇంకా జరిగినా ప్రభుత్వం వెనుకాడకుండా మావోయిస్టులను కాలరాచివేయాలని సలహాలు ఇస్తారు. రాత్రి చీకట్లో తుపాకులకు ఎదురుగా ఉన్నది మావోయిస్టులో ఆదివాసులో ఎలా తెలుస్తుందని, ఎవరో ఒక ఆదివాసి పొరపాటున మరణిస్తే దానికి ఇంత రాద్ధాంతం దేనికని భద్రతా బలగాల నాయకుడు వ్యాఖ్యానిస్తాడు. అసలు ఆదివాసులు రాత్రిపూట ఎందుకు సమావేశం పెట్టుకోవాలని ఒక మాజీ సంపాదకుడు ప్రశ్నిస్తాడు. దళితులపై హత్యాకాండల పట్ల తానే ఒకప్పుడు ప్రదర్శించిన స్పందనను తెలుగు సమాజం మరచిపోతుంది. కారంచేడు నుంచి వేంపెంట దాకా దళితులమీద హత్యాకాండల పట్ల వచ్చిన స్పందనలో పదోవంతయినా కనబడదు. పైగా, స్థానిక శాసనసభ్యుడు దళితుడు గనుక దీని మీద యాగీ చేయవద్దని సన్నాయి నొక్కులు నొక్కేవారు కొందరు. కింది నుంచి పైదాకా అధికారవర్గం దళిత బహుజనులే అయినా హత్యాకాండను చూసీచూడనట్టు నటిస్తారు. నష్టపరిహారం ప్రకటిస్తే, ఇస్తే సమస్య పరిష్కారమైపోతుందంటారు. ఈ పరిణామాలు ఈ వ్యవస్థ కుళ్లిపోయిందనీ, ఇక దీన్ని సమూలంగా మార్చడం తప్ప మరొక పరిష్కారం లేదనీ వేనోళ్ల చెపుతున్నాయి. ఈ సమయంలో మాట్లాడగలిగిన, రాయగలిగినవాళ్ల మౌనం, సామరస్యం, దిగజారుడు ఈ కుళ్లిన వ్యవస్థకు బలం చేకూరుస్తున్నాయి. ఇవాళ్టి సామాజిక సంక్షోభం పార్లమెంటరీ రాజకీయ పక్షాల సంబద్ధతను ప్రశ్నార్థకం చేసింది. అవినీతి, అలసత్వం, ఉన్నతవర్గాల బానిసత్వం అధికారవర్గాన్ని ప్రజలకు దూరం చేశాయి. ఇటీవల న్యాయవ్యవస్థ సంబద్ధత కూడ సందేహాస్పదం అవుతోంది. ఇక వలస వ్యతిరేక జాతీయోద్యమ కాలం నుంచి ప్రపంచీకరణ దాకా వంద సంవత్సరాల పైగా ప్రజానుకూల పాత్ర పోషించిన మధ్యతరగతి ఇలా పాలకవర్గాల సమర్థనకూ, బాధ్యతారాహిత్యానికీ పూనుకుంటే ప్రజలకు పోయేదేమీ లేదు గాని, ప్రజావెల్లువ పెల్లుబికే రోజున అది అవసరమైనదానికన్న ఎక్కువ హింసాత్మకంగా, సామాజిక పరివర్తనలో మిత్రులు కాదగినవాళ్లను కూడ శత్రువులుగా చూసేలా జరుగుతుంది. ఇవాళ అనేక రకాలుగా వ్యవస్థను సమర్థిస్తున్నవాళ్లే ఆ మూల్యం చెల్లించవలసి వస్తుంది. వీ

యానాం, మానేసర్ కార్మిక వివాదాల పాఠాలు


యానాంలో ఆరు నెలల కింద రిజెన్సీ సెరామిక్స్ కార్మిక నాయకుడిని పోలీసు లాకప్‌లో చంపిన తర్వాత కార్మికులు కర్మాగారాన్ని తగులబెట్టి కంపెనీ అధ్యక్షుడిని కొట్టి చంపేశారు. పది రోజుల కింద మానెసర్‌లో మారుతి సుజుకి కర్మాగారం తగులబడిపోయింది. కార్మికులు మేనేజర్ల మీద, సూపర్‌వైజర్ల మీద, ఎగ్జిక్యూటివ్‌ల మీద దాడి చేశారు. హ్యూమన్ రిసోర్సెస్ జనరల్ మేనేజర్ మంటల్లో సజీవదహనమై పోయాడు. ఇంత ఘోరమా అని పాలకవర్గాలు, వ్యాపారవేత్తలు, వారి మేధావులు గగ్గోలుపెడుతున్నారు. ఆ యాజమాన్య ప్రతినిధుల మరణాలు విచారకరమైనవే కావచ్చు. ఆ ఒకటి రెండు బహిరంగ మరణాలకు విచారం వ్యక్తం చేసే ముందు అంతవరకూ ఆ కర్మాగారాల్లో సాగుతూ వచ్చిన వందలాది, వేలాది నిశ్శబ్దమరణాల గురించి ఆలోచించాలి. మేనేజర్ల మరణాలు అశాంతికీ హింసకూ అరాచకత్వానికీ నిదర్శనమనేవాళ్లు ఏళ్ల తరబడి అక్కడ కార్మికుల మీద జరిగిన అశాంతికీ హింసకూ అరాచకత్వానికీ ప్రతిగానే, ఆ నేపథ్యంలోనే ఈ ఘటనలు జరిగాయని గుర్తించాలి. హత్యను సమర్థించనక్కరలేదు గాని దాని నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. రెండు చోట్లా యాజమాన్యాలు కార్మికుల చేత అత్యంత దుర్భరమైన పరిస్థితులలో పని చేయించుకున్నాయి. కనీస చట్టాలను పాటించి, కార్మికులకు న్యాయమైన, గౌరవప్రదమైన ప్రతిపత్తి ఇవ్వలేదు. ఎవరి నెత్తురు చెమటగా మారి తమకు కోట్లాది రూపాయలు సంపాదించిపెట్టిందో వారికి కనీస ప్రతిఫలం ఇవ్వడానికి కూడ గింజుకున్నారు. ఉదాహరణకు జపాన్ కు చెందిన బహుళజాతి కార్ల ఉత్పత్తి సంస్థ మారుతి సుజుకి గుడ్‌గావ్‌లోను, మానెసర్‌లోను కార్ల ఉత్పత్తి చేస్తోంది. రెండు చోట్ల కలిపి సాలీనా పదిహేను లక్షల కార్లు తయారు చేస్తోంది. మానెసర్‌లో 2500 మంది కార్మికులుండగా అందులో 950 మాత్రమే ఉద్యోగ భద్రత ఉన్న రెగ్యులర్ కార్మికులు, మిగిలిన వాళ్లు రోజు కూలీల్లా పనిచేసే కాంట్రాక్టు కార్మికులు. రెగ్యులర్ ఉద్యోగి కనీస జీతం పద్దెనిమిది వేలు కాగా కాంట్రాక్టు కార్మికుల వేతనం ఆరు వేలు. మరొకవైపు కంపెనీ 2011-12లో రు. 31,000 కోట్ల అమ్మకాలు జరిపి రు. 2,800 కోట్ల లాభాలు చేసుకుంది. కాని ఆ కార్లను నిజంగా ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు మాత్రం రెండుపూటల తిండి దొరికే పరిస్థితి లేదు. అంతేకాదు, కార్మికులు, ముఖ్యంగా కాంట్రాక్టు కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించడానికి యూనియన్ ఏర్పాటు చేసుకుంటే యాజమాన్యానికి, కార్మికులకు మధ్య ఏడాదికి పైగా ఘర్షణ జరుగుతున్నది. చట్టప్రకారం కార్మికులకు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, న్యాయమైన ప్రతిఫలం కోసం పోరాడే హక్కు ఉందని వాదించి చట్టాన్ని కాపాడవలసిన ప్రభుత్వం, అధికారులు యాజమాన్యం కొమ్ముకాశారు గాని తమ చట్టాలను తాము కాపాడాలని అనుకోలేదు. లాభాపేక్షతో అమానుషంగా ప్రవర్తించే పెట్టుబడి, దాని తొత్తు ప్రభుత్వం, తమ చట్టాలను తామే పాటించని కార్మిక శాఖ, పెట్టుబడిని సమర్థించే ప్రచారసాధనాలు... ఎటు చూస్తే అటు దగా నిండిన వాతావరణంలో కార్మికులకు యానాం, మానేసర్‌ల లాంటి ప్రతీకారాలు తప్ప మరొక దిక్కు లేదు. ఇది కార్మికుల విజ్ఞత ప్రశ్న కాదు, చూస్తూ మౌనంగా కూచున్న ఆలోచనాపరుల విజ్ఞతకు సవాల్.

భారత పాలనా విధాన నిర్ణేత బారక్ ఒబామా!

భారత ప్రభుత్వం ఏం చేయాలో, ఏం చేయగూడదో ఎవరు చెపుతారు? ఎవరు చెప్పాలి? భారత ప్రజలు తమకు తాము ఇచ్చుకున్న సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగం ప్రకారం భారత పాలన నడుస్తుందని పాఠ్యపుస్తకాలు చెపుతాయి. ప్రజలచేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు చట్టసభల్లో కూచుని పాలనా విధాన నిర్ణయాలు చేస్తారని అమాయకులు అనుకుంటారు. అదంతా నిజం కాదనీ, రాజ్యాంగాన్నీ, ప్రజాప్రయోజనాలనూ, జాతీయోద్యమ ఆదర్శాలనూ తుంగలో తొక్కిన పాలకులు, తమ యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చడం, పనిలో పనిగా తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం అనే ఏకైక లక్ష్యంతో పాలిస్తున్నారనీ విమర్శకులు ఎప్పటినుంచో అంటున్నారు. భారతరాజ్యం అటు వలసగా సామ్రాజ్యవాద దళారీ పని చేస్తూ ఇటు స్థానిక పునాది కోసం భూస్వామ్యంతో మిలాఖత్తు అయిన అర్ధ భూస్వామ్య, అర్ధ వలస రాజ్యమని విమర్శకులు అంటున్నారు. ఆ మాటలను అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా ఇటీవల వెయ్యిన్నొకటోసారి రుజువు చేశాడు. ఒక సర్వసత్తాక దేశపు ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు మరే దేశానికీ లేదనే సహజ న్యాయసూత్రాన్ని పక్కనపెట్టి ఒబామా భారత ప్రభుత్వం ఏం చేయాలో సూచించాడు. 'కష్టభరితమైన, కాని అత్యవసరమైన ఆర్థిక సంస్కరణలను పరిపూర్తి చేయండి, చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించండి. అమెరికన్ వ్యాపార వర్గాల ఆందోళనలను పట్టించుకొని పెట్టుబడుల ప్రవేశానికి అనువైన పరిస్థితులు కల్పించండి' అని సూచనల్లా కనబడే ఆదేశాలు ఇచ్చాడు. అంతర్జాతీయ ద్రవ్యవ్యాపారుల, బహుళజాతి సంస్థల ప్రతినిధిగా, వారికోసం ప్రపంచాన్ని శాసిస్తున్న పాలకుడిగా ఒబామా ఇలా ఆదేశించడం తన విదేశాంగ విధానంలో భాగమని అనుకోవచ్చు. కాని భారత ప్రభుత్వం, భారత ప్రజానీకం తమ ఆంతరంగిక రాజకీయార్థిక విధానాలను ఇలా శాసిస్తున్న అగ్రరాజ్యాధిపతి అభిప్రాయాలకు ఎలా స్పందించాలి? అగ్రరాజ్యాలన్నిటినీ సమానంగా ప్రతిఘటించడానికి పుట్టుకొచ్చిన ఒకప్పటి అలీన ఉద్యమ నాయకురాలు, తనను తాను సర్వసత్తాక గణతంత్రాన్నని, అతిపెద్ద ప్రజాస్వామిక రాజ్యాన్నని భావించుకునే భారత ప్రభుత్వం ఈ ప్రకటనను కనీసం ఖండించలేదు. బహుళజాతి సంస్థల తైనాతీగా, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల బంటుగా ఆర్థిక మంత్రి పదవిని చేపట్టి, నూతన ఆర్థిక విధానాలు ప్రకటించి, ఇప్పుడు ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ నుంచి అది ఆశించడమే అసాధ్యం. సామ్రాజ్యవాదుల నోటి నుంచి ఊడిపడే ప్రతిమాటకూ 'జీ హుజూర్, జో హుకుం' అనడమే ఆయనకు తెలుసు. కొందరు పారిశ్రామిక వ్యాపార వేత్తలు, వామపక్ష నాయకులతో సహా కొందరు ప్రతిపక్ష రాజకీయ నేతలు మాటవరుసకు ఖండించారు గాని వారు కూడ ఒబామా ప్రకటించిన భావజాలాన్ని నమ్మేవారే, ఈ ఇరవై ఏళ్లలో కేంద్రంలోనో, రాష్ట్రాలలోనో అధికారంలో ఉన్నప్పుడు ఆ విధానాలను అమలు చేసినవారే కనుక ఆ ఖండనలకు విలువ లేదు. ఈ ఒబామా జోక్యాన్ని ఖండించవలసిన, ప్రతిఘటించవలసిన బాధ్యత ప్రజలది. ఆ ప్రజా వ్యతిరేకతను సమీకరించి సంఘటితం చేసి నిర్మాణరూపం ఇవ్వవలసిన బాధ్యత నిజమైన ప్రజాశక్తులది.










- **జర్నలిస్టు అంతర్వీక్షణం** – ఆరు దశాబ్దాల అనుభవాలు – అనుభూతులు – వి. హనుమంతరావు – డేటా న్యూస్ ఫీచర్స్ – 80 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: వి. హనుమంతరావు, సి.ఆర్. ఫౌండేషన్, హైదరాబాద్ – 500 084
- **బీల–భూమి–సముద్రం** – దీర్ఘ కవిత – రెడ్డి రామకృష్ణ – సాహిత్య సాంస్కృతిక సంస్థ – 54 పేజీలు, 1/8 డెమీ, రు: 30, ప్రతులకు: ఎస్. రామినాయుడు, వెలుగు, పొనుగుటివలస, రాజాం, శ్రీకాకుళం – 532127; సెల్: 8985922183, 9440175465; అన్ని పుస్తక షాపుల్లో
- **మరో జలియన్‌వాలాబాగ్ – పరకాల** – రేపాల నర్సింహరాములు – గ్లోబల్ పబ్లికేషన్స్ – 106 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: ఇ.నెం. 5–167, సిఎంఎస్ రోడ్, పోస్ట్: పరకాల (మం), వరంగల్ – 506164; విశాలాంధ్ర బుక్‌హౌస్, వాణి బుక్‌సెంటర్, మేన్‌రోడ్, పరకాల
- **కాళోజీ కథలు** – కాళోజీ ఫౌండేషన్ – 68 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: కాళోజీ ఫౌండేషన్, 2–5–311, నక్కలగుట్ట, హనుమకొండ – 506001, అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో
- **చైనా ప్రజా విముక్తి సైన్యం – పుట్టుక – అభివృద్ధి** – దిక్సూచి ప్రచురణలు – 116 పేజీలు, 1/8 డెమీ, రు: 40, ప్రతులకు: గోరు మాధవరావు, జింకిభద్ర గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం
- **తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భీమిరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు** – సంపాదకత్వం: ఎలికట్టె శంకర్‌రావు; సలహాదారు: డా. నోముల సత్యనారాయణ – నోముల సాహిత్య సమితి – 181 పేజీలు, 1/8 డెమీ, రు: 150, ప్రతులకు: ఎన్ ఎస్ అరుణ, 206, సాయి టవర్స్, నాగార్జున కాలనీ, నల్లగొండ; సెల్: 9346359268; ప్రముఖ పుస్తకాల దుకాణాలు
- **కథా పార్వతీపురం** – సంకలనకర్తలు: అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు – స్నేహ కళా సాహితి – 443 పేజీలు, 1/8 డెమీ, రు: 250, ప్రతులకు: జి. గౌరునాయుడు, జనశక్తి కాలనీ, బెలగాం, పార్వతీపురం, విజయనగరం – 535501, సెల్: 9441415182 ఈమెయిల్ : langulya@gmail.com; పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. ఫోన్ : 9848787284, ఇమెయిల్: palapittabooks@gmail.com
- **జతగాళ్లు కతగాళ్లు** – కెం. మునిరాజు, గౌనోళ్ల సురేశ్‌రెడ్డి – కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం – 128 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2–1095, ఆవులపల్లి రోడ్డు, బస్తి, హోసూరు – 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు; అన్ని ముఖ్యమైన పుస్తక కేంద్రాలు
- **జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం** – కొడవటిగంటి రోహిణీప్రసాద్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 175 పేజీలు, 1/8 డెమీ, రు: 100,
- **అణువుల శక్తి** – కొడవటిగంటి రోహిణీప్రసాద్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 192 పేజీలు, 1/8 డెమీ, రు: 100,

పై రెండు ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 128 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006. ఫోన్ : 23521849, www.hyderabadbooktrust.blogspot.com







టిజెఎఫ్ దశాబ్ది సభలు

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టిజెఎఫ్) పదేళ్ల పోరాట మహాసభలు జూన్ 24న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ఈ సభల్లో మాట్లాడుతూ 'ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుతోనే తెలంగాణపై సాంస్కృతిక దాడి మొదలైంద'ని సుప్రింకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణపై ఆంధ్ర దాడి విధ్వంసకర దాడి, విధ్వంసకర అభివృద్ధితో జతకూడి 'తెలుగుజాతి ఆత్మగౌరవం' పేరుతో వ్యాపించిందని అన్నారు. టిజెఎఫ్ కొత్త కమిటీ అధ్యక్షునిగా అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికిరణ్ ఎన్నికయ్యారు. ఈ సభల్లో పలువురు జర్నలిస్టులూ, పత్రికా సంపాదకులూ, తెలంగాణ ఉద్యమ నాయకులూ పాల్గొన్నారు.

జర్నలిస్టుగా అరవై ఏళ్లు

వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు వి. హనుమంతరావు (88) జర్నలిస్టుగా అరవై ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వయోధిక పాత్రికేయుల సంఘం, ప్రెస్ అకాడమీ, జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో జూన్ 21న సాయంత్రం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సన్మాన సభ జరిగింది. ఈ సభకు సీనియర్ పాత్రికేయులు జి.ఎస్. వరదాచారి అధ్యక్షత వహించగా, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్‌తో సహా పలువురు ప్రముఖులు సీనియర్ జర్నలిస్టులు సభలో పాల్గొని వి. హనుమంతరావును అభినందించారు.

మద్యం షాపులకై దరఖాస్తుల వెల్లువ

రాష్ట్ర వ్యాప్తంగా 6,596 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తే 893 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మిగిలిన 5703 దుకాణాలకు కలిపి 68,342 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి ఇఎండి రూపంలో ఎక్సైజ్ ఖజానాకు రు. 170 కోట్ల ఆదాయం వచ్చింది. జూన్ 26న మద్యంపై ప్రభుత్వ లాటరీ విధానాన్ని నిరసిస్తూ విపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేపట్టాయి. లాఠీచార్జీలు, అరెస్టులు కొనసాగాయి. మద్యం కేటాయింపుల ఈ కొత్త విధానం వల్ల మద్యం మాఫియాలు గతం కంటె పెట్రేగిపోతాయని ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి.లపై దాడులు

లక్షింపేటలో దళితులపై దాడుల నేపథ్యంలో కేంద్ర మంత్రి ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని మానవ హక్కుల వ్యవహారాల స్థాయీ సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, వివిధ మంత్రులతో జూన్ 27న సమావేశమైంది. బాధితులకు ముందే రక్షణ ఇవ్వడంలోనూ, తరువాత తగిన చర్యలు చేపట్టడంలోనూ ప్రభుత్వం విఫలమైందని స్థాయీ సంఘం పేర్కొంది. రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి.లపై అత్యాచారాల, దాడుల నిరోధ చట్టం అమలు తీరును స్థాయీ సంఘం పరిశీలించింది. దేశవ్యాప్తంగా ఈ చట్టం కింద 2010లో 38,449 కేసులు నమోదు కాగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లోనే 5,074 కేసులు ఉన్నట్లు ముకుల్ వాస్నిక్ తెలిపారు. ఈ కేసుల్లో దేశవ్యాప్తంగా 31 శాతం శిక్షలు పడగా, అది ఆంధ్రప్రదేశ్‌లో 13 శాతంగానే ఉన్నదన్నారు.

పోలమ్మ మృతి

శ్రీకాకుళ రైతాంగ పోరాటానికి (1967-72) పురిటిగడ్డ బొడ్డపాడు పలాసకు ఐదు కిలోమీటర్లు. అక్కడ కమ్యూనిస్టు కార్యకర్త తామాడ గణపతి సహచరి పోలమ్మ. ఆమె జూన్ 21న బొడ్డపాడులో చనిపోయారు. సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చిన్నబాబు, పంచాది కృష్ణమూర్తి, నిర్మల మొదలైన వారందరినీ పోలమ్మ కన్నతల్లిలాగా చూసుకుంది. ఆనాటి ఉద్యమకారులకు ఆదరణ, ఆప్యాయతలు పంచింది. పోలీసు కాల్పుల్లో తామాడ గణపతి (నవంబర్ 1969) చనిపోయారు. అప్పటి హోంమంత్రి జలగం వెంగళరావు ఆమెను ఉద్దేశించి 'ప్రభుత్వం నీకు మూడెకరాల భూమి ఇస్తుంద'ని అన్నప్పుడు పోలమ్మ 'మీ సర్కారు దయాదాక్షిణ్యాలు నాకక్కర్లేదు. నేనిక్కడ మట్టి బుక్కి బతుకుతాన'ని జవాబుగా చెప్పింది. ప్రజలతో మమేకమై బతికింది.

ఎంసెట్ ఫలితాలు

ఎంసెట్ ఫలితాలను ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ జూన్ 29న ప్రకటించారు. ఈసారి ఎంసెట్ మార్కులను, ర్యాంకులను ఒకేసారి విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 73.18 శాతం మంది, మెడికల్‌లో 85.57 శాతం మంది అర్హత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,83,477 పరీక్ష రాయగా, 2,23,886 మంది అర్హత సాధించారు. కాగా రాష్ట్రంలో 667 ఇంజినీరింగ్ కాలేజీల్లో 3.31 లక్షల సీట్లు, 277 ఫార్మసీ కాలేజీల్లో 29,840 సీట్లు, 37 మెడికల్ కాలేజీల్లో 4950 సీట్లు, 21 డెంటల్ కాలేజీల్లో 1870 సీట్లు అందుబాటులో ఉన్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గెలుపు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో పదిహేను కార్మిక సంఘాలు పోటీ పడగా, పదకొండు సంఘాలకు ఓట్ల సంఖ్య వెయ్యి కూడా దాటలేదు. కొత్తగూడెం, రామగుండం-3, భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలో టిబిజికెఎస్ విజయం సాధించింది. ఇల్లందు, బెల్లంపల్లి ఏరియాలలో ఎఐటియుసి, రామగుండం-1,2 ఏరియాలలో ఎచ్ఎంఎస్ విజయం సాధించాయి. సింగరేణి వ్యాప్తంగా టిజిబికెఎస్‌కు 23,311 ఓట్లు లభించగా, ఎఐటియుసికి 16,724 ఓట్లు, సింగరేణి కోల్ మైన్ లేబర్ యూనియన్ (ఎచ్ఎంఎస్)కు 12,077 ఓట్లు, సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు 5,983 ఓట్లు లభించాయి.

కాంట్రాక్ట్ కొలువులకు కనీస హక్కులుండవా?

సిఐటియు పదమూడవ రాష్ట్ర మహాసభలు జూలై 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగాయి. ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వరంగ సంస్థలన్నిట్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు 5.5 లక్షల మంది ఉన్నారనీ, వారంతా గౌరవ వేతనం, పారితోషికంతో పని చేస్తున్నారని సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు అన్నారు. వారిలో మూడు లక్షల మందికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సెలవులు, ఉద్యోగ భద్రత వంటివి ఏమీ లేవన్నారు. సెజ్‌లు, మధ్యతరహా పరిశ్రమల్లో కార్మిక చట్టాలు వర్తింపచేయడం లేదని అన్నారు. గ్రామ పంచాయతీ, గ్రామ సేవకులు, 104, 108, అంగన్‌వాడి, మధ్యాహ్నం భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు, బీడీ, మున్సిపల్, ఈ-సేవా, ఐకెపి, ఆనిమేటర్స్, ఆశ, కంప్యూటర్ టీచర్స్, ట్రిపుల్ ఐటి రంగాల్లో జరిగిన రాష్ట్ర వ్యాప్త సమ్మెలు, ఆందోళనల్లో పాల్గొన్న కార్మిక వర్గంపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాల కార్మికులందరికీ వెయ్యి రూపాయల పారితోషికం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చంద్రశ్రీ ఇక లేరు

ప్రజా గాయకురాలు, విప్లవ, దళిత సాంస్కృతిక ఉద్యమాలలో పనిచేసిన నేత శివసాగర్ అనుయాయి చంద్రశ్రీ అనారోగ్యంతో మరణించారు. సుదీర్ఘ కాలంగా ఛాతి క్యాన్సర్‌తో బాధపడ్డారు. జూలై 7న ప్రకాశం జిల్లా చీరాలలో మృతి చెందారు. కారంచేడు దళితుల హత్య నేపథ్యంలో చంద్రశ్రీ పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. అనంతరం గద్దర్ నేతృత్వంలోని జననాట్యమండలి కళాకారిణిగా కీలక భూమిక పోషించారు. కారంచేడు దళిత మరణాలపై ఉత్తేజపరిచే గీతాలెన్నిటినో స్వయంగా రాసి, పాడారు. అనంతర కాలంలో దళిత ఉద్యమంలో పనిచేశారు.

అమరుల బంధు మిత్రుల సంఘం దశాబ్ది సభలు

విప్లవోద్యమంలో అసువులు బాసిన వారి కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల సంఘం ఏర్పడి ఈ ఏడాదితో పదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జూలై 18, 19 తేదీలలో హైదరాబాద్‌లో సభలు జరిగాయి. ఈ సంఘం నూతన అధ్యక్షురాలుగా బి. అంజమ్మ, కార్యదర్శిగా పద్మకుమారితో సహా కొత్త కార్యవర్గం ఎంపికయింది. 18 నాడు హైదరాబాద్‌లోని సుభాష్‌నగర్ అమరుల స్థూపం వద్ద, 19 నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభలు జరిగాయి. ఈ సభల్లో కాశ్మీర్ నుంచి పర్వీన్ అంగార్, ఢిల్లీ నుంచి బబిత (హేమచంద్ర పాండే సహచరి) తో సహా పలువురు పాల్గొన్నారు. వీ

శిక్ష పూర్తయిన జీవిత ఖైదీలను విడుదల చేయాలి

జీవిత ఖైదు శిక్ష కాలంలో తమ సత్ప్రవర్తనను రుజువు చేసుకున్నామనీ, మానవతా దృక్పథంతో విడుదల చేయాలనీ జీవిత ఖైదీలు కోరుతున్నారు. 2004 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం జారీచేసిన జి.ఒ. 190 ప్రకారం క్షమాభిక్ష పెట్టి విడుదల చేయమని జీవిత ఖైదీలు అభ్యర్థిస్తున్నారు. గతంలో ఇచ్చిన జీవిత ఖైదీల క్షమాభిక్ష జిఒ నెం. 338/09, జి.ఒ. నెం. 283/11ల ప్రకారం కొందరు జీవిత ఖైదీలు విడుదలయ్యారు. అయితే ఆ తరువాత నిబంధనల పేరుతో వందలాది మంది జీవిత ఖైదీలు విడుదలను ఆపారు. అలా విడుదల కాకుండా ఉండిపోయిన వారిలో 13, 14, 15, 18, 20 సంవత్సరాల శిక్ష పూర్తయిన వారూ ఉన్నారు. వారిలో కొందరు విడుదల కాకపోవడానికి ఐపిసి 224–302, 302–376, 302–498 (ఎ) సెక్షన్‌ల కింద కేసులున్నాయి. ఎలాంటి షరతులు లేకుండా ఇరవై నెలల రెమిషన్ ముందుగా వర్తింపజేయమని ఖైదీలు కోరుతున్నారు. ఏడు సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న పురుష ఖైదీలను, అదే విధంగా ఐదు సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలను, వృద్ధులను, దీర్ఘ వ్యాధి గ్రస్తులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విడుదల చేయాలి. ఈ అసమ సమాజమే వారి చర్యలకు భూమికగా ఉన్నప్పుడు, నిర్ణీత గడువు శిక్షను పూర్తి చేసుకున్నప్పుడు వారిని విడిచి పెట్టాలి. జీవిత ఖైదు అంటే జీవితకాలం శిక్ష అని కొందరు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. విధానకర్తల విధానాలే ప్రజలను నేరస్తులుగా, దోషులుగా మారుస్తున్నాయి. శిక్షా కాలానికి రెండు, మూడు రెట్లు శిక్ష అనుభవించాక కూడా శిక్షను కొనసాగించడం దానికదే చాలా అన్యాయం. జైళ్లు, శిక్షలు మనుషులను సంస్కరించడానికి తోడ్పడాలి గానీ, వారిని హింసకు గురిచేయడానికి కాదు. ఈ దేశంలో ఎక్కువగా ఆదివాసులు, దళితులు, ముస్లింలు, మహిళలే ఈ బాధితుల కోవలోకి వస్తున్నారు. ఈ సమాజమే ఒక జైలుగా కూడూ, గూడూ, నీడ, విద్య, వైద్యం, తాగడానికి మంచినీరు, గౌరవ ప్రదంగా బతకడానికి ఉపాధి వంటివి అందక ఈనాటికీ అత్యధిక శాతం జనాభా అవస్థలు పడుతున్నారు. అదనంగా వారికి ఈ శిక్షలు ఏమిటి? వారు అలా ఉండడానికి కారణమవుతున్న వ్యవస్థను కదా శిక్షించాలి! జీవిత ఖైదీలుగా కాలాన్ని మించి శిక్షలు అనుభవించిన వారిని వెంటనే విడుదల చేయడమే అన్ని విధాలా న్యాయమవుతుంది. ప్రజాస్వామిక వాదులంతా ఈ విషయంలో ఒక్కటై న్యాయాన్ని సాధించాలి.

గ్రామాలకు తరలండి!

జూన్ 23న ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా – ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ప్రశ్నించే హక్కు ఉంటుందని, చట్టం ఎదుట అందరూ సమానులే అని అన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదంటూ ఇటీవల ఓ జడ్జికి శిక్ష పడిన విషయాన్ని గుర్తు చేశారు. యువతలో చైతన్యం వచ్చి, భగత్‌సింగుల్లా తయారైనప్పుడే నల్లధనం బయటపడుతుందని అన్నారు. అదే రోజు తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ ఆవరణలో జరిగిన పారా లీగల్ జిల్లా వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు చెడిపోయిన వారిని చూసి జనం ముక్కు మీద వేలేసుకునేవారనీ, ఇప్పుడేమో చెడిపోని వారిని చూసి ముక్కు మీద వేలేసుకునే పరిస్థితి వచ్చిందనీ అన్నారు. మనదీ, ఇతరులదీ మనకే కావాలనే భావన పెరిగిందని అన్నారు. సంపద అంటే, డబ్బు, ఆస్తులు, పదవులు కాదు, నిస్వార్థ సేవ అని విశ్లేషించారు. ఈరోజు అన్ని వ్యవస్థలూ చెడిపోయాయని అన్నారు. పైస్థాయిలోని వారు బలవంతంగా తప్పులు చేయించి వ్యవస్థను గబ్బు చేయాలని చూస్తున్నారని అన్నారు. విజయవాడలోని మేరీస్‌స్టెల్లా కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న శాసనసభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ విద్యార్థులను ఉద్దేశించి 'గ్రామీణ ప్రాంతాల్లో మానవ వనరులు అధికంగా ఉన్నాయని, అయితే విభిన్న అంశాల్లో అభివృద్ధి లేక, వారు వెనుకబడ్డారని, విద్యార్థు లంతా గ్రామాలకు వెళ్లి ప్రజలను కార్యోన్ముఖులను చేయడంలో తమవంతు సేవలు అందించాల'ని అన్నారు. న్యాయమూర్తులు దేశ పరిస్థితిపై వాపోయినా, స్పీకర్ చాలా పరిమిత అర్థంలోనే గ్రామాలకు వెళ్లమని చెప్పినా అలాంటి పనిచేస్తున్న వారిని రాజ్యం అణచివేయడమూ, నిర్మూలించడమూ చూస్తూనే ఉన్నాం. రాష్ట్రంలోనూ, దేశంలోనూ యువత నలభై ఐదేళ్ల క్రితమే భూమి, భుక్తి, ఈ దేశ నిజమైన విముక్తుల కోసం భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజుల ఆశయాలతోనే పోరాటాల్లోకి వెళ్లారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజలకు సత్యాలు చెప్పడానికి, ఇప్పుడున్న పరిస్థితిని మార్చడానికి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తూ, కొత్త చరిత్రను రాస్తున్నారు. ఇప్పుడు యువత నిజంగా చేయాల్సిందల్లా ఆ చరిత్రను తెలుసుకోవడం, చదవడం, ఆచరణకు పూనుకోవడం.

మహిళలపై హింసలో రాష్ట్రానిదే మొదటిస్థానం

విద్య, అభివృద్ధిలలో ఎలా ఉన్నా మహిళలపై అత్యాచారాలు, హింసలో మన రాష్ట్రం ముందుకు దూసుకెళ్తోంది. గత ఏడాది మహిళలపై అత్యధికంగా నేరాలు నమోదైన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచింది. పశ్చిమ బెంగాల్ మొదటిస్థానంలో ఉంది. దేశ వ్యాప్తంగా 2011లో మహిళలపై 2,28,650 నేరాలు జరిగాయి. బెంగాల్‌లో అత్యధికంగా 29,133 కేసులు (12.7శాతం), ఆంధ్రప్రదేశ్‌లో 28,246 (12.4 శాతం) కేసులు నమోదు అయ్యాయి. దేశ సగటుతో (0.7 శాతం) పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో క్రైం రేటు ఎక్కువగా (4.3 శాతం) ఉంది. రాష్ట్రంలో లైంగిక వేధింపుల కేసులు 3,658, వరకట్నం కేసులు 1,899 నమోదు అయ్యాయి. 'జాతీయ నేర నమోదు సంస్థ' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. బంధువుల చేతిలోనే మహిళలు ఎక్కువగా వేధింపులకు గురవుతున్నట్లు ఆ నివేదిక వివరించింది. దేశంలో మహిళలపై వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు పెరిగిపోయాయని తెలిపింది. 53 ముఖ్యమైన నగరాలను పరిశీలిస్తే దేశ రాజధాని ఢిల్లీలో మహిళలపై ఎక్కువ నేరాలు (4,489 కేసులు) జరిగాయి. వీటిలో 17.6 శాతం అత్యాచారం కేసులు కాగా, 31.8 శాతం అపహరణలు, 14 శాతం వరకట్నం కేసులు, 10.1 శాతం లైంగిక వేధింపులు ఉన్నాయి. మొత్తం నేరాల సంఖ్య పరంగా ఢిల్లీ 4,489, బెంగుళూరు 1,890, హైదరాబాద్ 1,860, విజయవాడ 1797 వంతున కేసులు నమోదయ్యాయి. మహిళలపై నేరశాతం అధికంగా ఉన్న నగరాలలో విజయవాడ 120.5 శాతం పెరుగుదలతో అగ్రస్థానంలో ఉంది. నాగాలాండ్ (90 శాతం ఆదివాసి జనాభా ఉన్న రాష్ట్రం)లో మహిళలపై వేధింపులకు సంబంధించిన 38, సిక్కింలో 55 కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. ఈ రెండు రాష్ట్రాలు జాబితాలో చివరిస్థానంలో ఉన్నాయి. ఉత్పత్తిలో, ప్రత్యుత్పత్తిలో అన్నిటా తామై అత్యధికంగా శ్రమ చేసే మహిళలపట్ల అఘాయిత్యాల్లో రాష్ట్రం ముందు ఉండడం మనకు అవమానకరం. పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా, పురుషాధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితి సూచిస్తోంది. మహిళల హక్కులే మనవ హక్కులనే స్ఫూర్తిని వ్యాప్తి చేయాల్సి ఉంది.

వార్త – వ్యాఖ్య : డి.వి. రామకృష్ణారావు

చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడిన అక్టోబర్ 1949 నుంచి మరణించేవరకూ (జనవరి 1976) దేశ ప్రధాని చౌ ఎన్ లై 1943 మార్చ్ 18న చోంగ్ క్వింగ్ రాష్ట్రంలోని హెంగ్యూన్‌లో రాసుకున్న స్వీయ మార్గదర్శక సూచనలు ఇవి. అప్పటికి రెండు దశాబ్దాలకు పైగా ప్రతిభావంతుడైన కమ్యూనిస్టుగా సుదీర్ఘ రాజకీయాచరణ ఉన్నప్పటికీ 1942-44 మధ్య చైనా కమ్యూనిస్టు పార్టీలో నడిచిన దిద్దుబాటు ఉద్యమంలో చౌ ఎన్ లై వ్యవహార సరళి మీద తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఆయన పిడివాది, అనుభవవాది అని స్వయంగా మావో కూడా విమర్శించాడు. ఈ విమర్శల నేపథ్యంలో చౌ ఎన్ లై లోతయిన ఆత్మవిమర్శ చేసుకుని, ఎన్నో రచనల్లో, ఉపన్యాసాల్లో దాన్ని ప్రకటించాడు. అందులో భాగమే ఈ పత్రం. దీని ఇంగ్లిష్ అనువాదం మొదటి సారిగా 1981లో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన పార్టీ సాహిత్య సంపాదకవర్గ బృందం రూపొందించగా, ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, బీజింగ్ ప్రచురించిన చౌ ఎన్ లై సెలెక్టెడ్ వర్క్స్ మొదటి సంపుటంలో అచ్చయింది.

1) శ్రద్ధగా అధ్యయనం చేయాలి, ప్రధానాంశాలను ఆకళించుకోవాలి. చాల విషయాల మీద పైపై పరిజ్ఞానం సంపాదించే బదులు ఒక అంశం మీద కేంద్రీకరించాలి. 2) కష్టపడి పనిచేయాలి. ప్రణాళికా బద్ధంగా, ఏకదీక్షతో, పద్ధతి ప్రకారం పనిచేయాలి. 3) అధ్యయనాన్నీ ఆచరణనూ కలగలపాలి. సమయాన్ని, స్థలాన్ని, పరిస్థితులను బట్టి అధ్యయనానికీ ఆచరణకూ మధ్య సరైన సమతుల్యత ఉండేలా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. క్రమబద్ధంగా ఉండాలి. నూతన అన్వేషణలు, నూతన సృష్టి సాగించాలి. 4) ఇతరులలోనూ నాలోనూ ఉన్న తప్పుడు భావజాలాన్ని సూత్రబద్ధమైన పునాదిపై కచ్చితంగా ఎదుర్కొంటూ ఉండాలి. 5) వీలయినంతవరకు నా బలాలను ఎక్కువగా ఉపయోగించుకోవాలి, నా బలహీనతలను అధిగమించడానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. 6) ఎట్టి పరిస్థితిలోనూ ప్రజల నుంచి దూరం కావద్దు. వారి నుంచి నేర్చుకోవాలి. వారికి సహకరించాలి. సమష్టి జీవనాన్ని గడపాలి. చుట్టూ ఉన్న మనుషుల సమస్యలు తెలుసుకోవాలి. వారి సమస్యలను అధ్యయనం చేయాలి. క్రమశిక్షణా సూత్రాలకు కట్టుబడి ఉండాలి. 7) ఆరోగ్యం కాపాడుకుంటూ సాధ్యమైనంత క్రమబద్ధమైన జీవితాన్ని గడపాలి. స్వీయ అభివృద్ధికి భౌతిక పునాది అదే.

– చౌ ఎన్ లై, సెలెక్టెడ్ వర్క్స్, మొదటి సంపుటం

ఉద్యమాన్ని ఉధృతంగా ముందుకు తీసుకువెళ్తున్న వారిపైన అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చిక్కుడు ప్రభాకర్, డా. చెరుకు సుధాకర్‌లపై కేసులు పెట్టారు. ప్రభుత్వం తాజాగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు ఆకుల భూమయ్య, నడుస్తున్న తెలంగాణ సంపాదకులు, అసిస్టెంట్ ప్రొ. డా. సి.కాశీం, అమరుల బంధు మిత్రుల సంఘం అధ్యక్షుడు గంటి ప్రసాదం, భారతిలపై యుఎపిఎ టెర్రరిస్టు కేసులను పెట్టి ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తుంది.

– సంపాదకీయం, తెలంగాణ విద్యార్థి గళం, ఏప్రిల్-జూన్ 2012

ప్రజలకు విశ్వసనీయ సమాచారం అందించడం జర్నలిస్టుల వృత్తిధర్మం. ఆ కర్తవ్య నిర్వహణలో అధికార రహస్యాల చట్టం ఒక తీవ్ర ప్రతిబంధకం. 1889లో బ్రిటన్‌లో రూపొందించిన ఈ చట్టాన్ని 1923 నుండి, మన దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం, స్వాతంత్ర్యం అనంతరం కూడా యథాతథంగా అమలు చేస్తున్న తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉంది. ప్రజాస్వామ్య దేశంలో ఇది కూడదని, పారదర్శక పరిపాలన నేటి ధర్మమని చెప్పిన ప్రజల ఒత్తిడికి ఎట్టకేలకు లొంగిన కేంద్ర ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించింది. అయినా, అధికార రహస్యాల చట్టంలోని కొన్ని సెక్షన్లను, ప్రత్యేకించి సెక్షన్-5 లోని కొన్ని అంశాలను యథారీతిన కొనసాగిస్తూనే ఉంది. నిజానికి అధికార రహస్యాల చట్టం సమాచార హక్కు చట్టానికి వ్యతిరేకమైంది.

– సంపాదకీయం, ప్రతిస్పందన, మాసపత్రిక, జూలై 2012

ప్రముఖ మార్క్సిస్టు - లెనినిస్టు కా. తరిమెల నాగిరెడ్డి తన ప్రఖ్యాత 'తాకట్టులో భారతదేశం'లో 'తెగించిన ఆగ్రహం అనివార్యం' అంటూ చెప్పిన మాటలను గుర్తు చేసుకుందాం. 'భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా అర్ధ ఫ్యూడల్, అర్ధ వలస స్వభావాన్ని కలిగి ఉంది. ఈ కాలమంతటిలోనూ ఈ స్వభావంలో ప్రాథమికమైన ఎలాంటి మార్పు సంభవించకపోవడమే సమాజంలో కుల వ్యవస్థ అలాగే నిలిచి ఉండడానికి కారణమైంది. సరుకుల ఉత్పత్తితో కూడిన ఆర్థిక వ్యవస్థలో సంపదల తారతమ్యాలు సైతం కుల వ్యవస్థను మరింత తీవ్రం చేస్తాయి. అందువల్ల అణగొదక్కబడిన వారి తిరుగుబాటు వర్గ స్వభావం కొన్ని సందర్భాలలో కొన్ని కులాల రూపంలో వ్యక్తమయినంత మాత్రాన, అట్టడుగు పీడిత వర్గాల అణచివేత కొన్ని పీడిత కులాలపై క్రూరమైన యుద్ధరూపం తీసుకున్నంత మాత్రాన వర్గపోరాటం మౌలిక స్వభావాన్ని ఎంత మాత్రమూ మరుగుపరుచజాలవు.' (తాకట్టులో భారతదేశం పేజీ, 420, 421)

– లక్షింపేట దళితన్నల బలిదానం.. రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్), జూలై, 2012

రాజకీయమంటే వ్యాపారం కాదని, ప్రజల పక్షాన మాట్లాడడానికి, పోట్లాడడానికి, నిలబడడానికి, గెలవడానికి ఒక వేదికనే సత్యాన్ని గుర్తిద్దాం. ప్రపంచీకరణ తెచ్చిన మనోహరమైన సుఖాన్ని, సుఖ సాధనాలని కాసేపు పక్కన పెట్టి మనకి మాత్రమే ఉన్న కళ్లతో, చెవులతో చూడడానికి, వినడానికి ప్రయత్నిద్దాం. అలా విన్న సంఘటనలను, చూసిన దృశ్యాలను మనసుతో అంచనా వేద్దాం. ప్రతిసారీ కంప్యూటర్‌నే కాకుండా మనల్ని మనం కూడా ఆన్ చేసుకుందాం. ఎప్పుడూ బయట నుండే కాకుండా మనలోంచి కూడా కొన్నింటిని డౌన్‌లోడ్ చేసుకుందాం. మనలని మనం చూడడం మొదలుపెడదాం. అప్పుడు మనకి కనపడే మార్గాలు, ఎంచుకోవలసిన గమ్యాలు కొత్త బంగారు లోకానికి దారితీస్తాయి. అలా దారితీయడం కోసం, ఒక్కసారి మనం ఆలోచించడం మొదలుపెడదాం.

– సంపాదకీయం, చినుకు, మాసపత్రిక, జూన్ 2012

మన పాలకులకు భాషా స్పృహలేదు. చారిత్రక స్పృహలేదు. సాంస్కృతిక స్పృహలేదు. మన వారసత్వ సంపదను కాపాడుకోవాలన్న ఆలోచనే లేదు. తెలుగు భాషోద్యమ సమాఖ్యలాంటి కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు తమ కార్యక్రమాల ద్వారా, రచనల ద్వారా ఈ స్పృహను కలిగించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నా అది కొంతమంది మేధావుల వరకే పరిమితమవుతున్నది. నిద్రపోతున్న ప్రభుత్వాలను కదిలించే విధంగా ప్రజా ఉద్యమాలు రావాల్సే ఉంది. తమిళనాడులో ద్రవిడ ఉద్యమంలా, కర్ణాటకలో రాజ్‌కుమార్ భాషా ఉద్యమంలా మందిని కదిలించే ఉద్యమాలు రావాలి. మన భాషకు, వారసత్వ సంపదకు, ప్రకృతికి, చరిత్రకు జరుగుతున్న విధ్వంసాన్ని ఆపే దిశగా ఈ ఉద్యమాలు కొనసాగాలి.

– డా. కాలువ మల్లయ్య, నడుస్తున్న చరిత్ర, మాసపత్రిక, జూన్ 2012

భారతదేశంపై ముస్లిం దండయాత్రికులు రావడం వలన జరిగిన ఒక ముఖ్యమైన పరిణామం ఏమిటంటే హిందూ సమాజానికి బ్రాహ్మణులు తిరుగులేని నాయకులయ్యారు. వారి మాటే శాసనమయింది. కేవలం మూడు కులాలకే అంటే ఉన్నత వర్గాల ప్రజలకే బ్రాహ్మణులు పురోహితులుగా గతంలో చెప్పుకునే వారు. శూద్రులు, ఇతర భారతీయులను దూరంగానే ఉంచారు. ముస్లిమేతరు లందరినీ హిందువులని పిల్చారు. అంటే వాళ్ల ఉద్దేశ్యం ముస్లింలు కాని వారని మాత్రమే. ఈ విధంగా మొట్టమొదటిసారిగా మొత్తం భారత ప్రజానీకం అంతా బ్రాహ్మణుల ఆధిపత్యం కిందకు ఈడ్చుకురాబడ్డారు. కోట్లాది మంది ప్రజానీకం హిందూ అనే ఐక్యత భావంతో బ్రాహ్మణ పురోహితుల పాదాక్రాంతమైయ్యారు. అసలు హిందూ అన్న పదమే విదేశీయమైనది. హిందువులు ఏ సంస్కృత గ్రంథంలోనూ ఆ పదాన్ని ఉపయోగించలేదు. ఇలా భారతీయులు హిందువు లయ్యారు. వారి మతం హిందూ మతమైంది. బ్రాహ్మణ మతం హిందూ మతమైంది. అది ముస్లింలు కాని వారందరి మతం అయింది. మొత్తం హిందువు లను బ్రాహ్మణులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. మరోపక్క బ్రాహ్మణులు తమ స్వప్రయోజనాల కోసం ముస్లిం రాజులకు అనుకూలంగా పనిచేశారు. కేవలం బ్రాహ్మణులే కాదు అగ్రవర్ణాల వారు సైతం ఇస్లాం స్వీకరించారు. కాని కులాధిక్యతను మాత్రం వారు వదులుకోలేదు. పశ్చిమోత్తర రాష్ట్రాలలో వారు ఇస్లాం స్వీకరించినా జాట్ కులస్తులుగానే మిగిలిపోయారు. గంగా, యమునా తీరంలో అట్టడుగువర్గాల నామశూద్రులు అత్యధికంగా ఇస్లాం స్వీకరించారు. బీహార్, బెంగాల్ రాష్ట్రాలలో వీరు అస్పృశ్యులతో సమానం.

ఇస్లాం విదేశీయమే. కాని ముస్లింలు విదేశీయులు కారు. వారంతా పూర్వ దశలో హిందువులే. హిందూ సమాజంలోని కుల విభేదాలతో విసిగిపోయి చాలా మంది మతం మార్చుకున్నారు. హిందూ సమాజంలోని కుల విభేదాలే ఇస్లాం వ్యాప్తికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

– ఫజులుల్లా ఖాన్, భారతీయులు హిందువుగా ఎలా మారారు?
మిసిమి, మాసపత్రిక, జూలై 2012

లక్షింపేట హత్యాకాండ - భూమి - కులం

లక్షింపేట సంఘటన పూర్వాపరాలనూ, దీని వెనుక మౌలికంగా ఉన్న భూమి సమస్యనూ వివరిస్తున్నారు

వై. రామచంద్రం, డి.వి. రామకృష్ణారావు

శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలోని లక్షింపేట గ్రామంలో జూన్ 12 ఉదయాన మాలల రక్తం ఏరులై పారింది. బతకడానికి ఇంత భూమి దున్నుకుంటామన్నందుకు, తలెత్తుకుని బతుకుదామని అనుకున్నందుకు, మేము మనుషులమే అన్నందుకు, ఆత్మగౌరవంతో బతుకుదామనుకున్నందుకు ఐదుగురు మాలలు చనిపోవాల్సి వచ్చింది. ఆ ఉదయం 7:30 గంటలకల్లా లక్షింపేట తూర్పు కాపులు చిన్న పెద్ద, ఆడ, మగతో పాటు ఇరుగు పొరుగు గ్రామాలైన విక్రంపురం, పదమవలస, శేఖరపల్లి, బలిజపేట, మద్దివలస గ్రామాలకు చెందిన తూర్పు కాపులని కలుపుకొని రెండు ట్రాక్టర్‌లు, మూడు ఆటోల్లో వచ్చి మాలలపై పెద్ద ఎత్తున హింసకు పాల్పడ్డారు. పదేసి మంది గుంపులుగా ప్రతి ఇంటికి వెళ్లి దాడులకు పాల్పడ్డారు. రాళ్లు, కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, బరిసెలు, బాంబులతో దాడిచేశారు. ఆడవాళ్లు కూడా పాల్గొని కారం చల్లారు. గాయపడిన వారికి మంచి నీళ్లు కూడా అందకుండా చూశారు. ఈ దాడుల్లో నివర్తి సంగమేశు (40), చిత్తిరి అప్పడు (30), నివర్తి వెంకటి (51), బూరాడ సుందరరావు (40)లు అక్కడికక్కడే చనిపోయారు. బొద్దూరు పాపయ్య (50) తీవ్రగాయాలపాలై విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ జూన్ 20న చనిపోయారు (అంతకు ముందే చనిపోయినట్లు అనుమానిస్తున్నారు). అతని భార్యకు కూడా తెలియనీయకుండా హడావిడిగా మృతదేహాన్ని రాజాం ఆస్పత్రికి తరలించారు.

తూర్పు కాపులు మాలలపై దాడులకు పాల్పడినపుడు 'భూములు కావాల్రా మీకు, ఇప్పుడు దున్నండ్రా' అనీ, 'ఒక్కళ్లని చంపినా అదే శిక్ష, పది మందిని చంపినా అదే శిక్ష' అనీ, 'మిమ్మల్ని తగలేసి, మీ ఇళ్లల్లో మా పశువుల్ని కడతాంరా' అనీ ఇంకా చెప్పనలవికాని బూతుమాటలతో తిడుతూ తమ క్రౌర్యాన్ని ప్రదర్శించారు. కూటికి పేదయినా కులానికి పేదను కాననే వైఖరినీ, వర్గ అంతరాల్లేని ఐకమత్యాన్ని తూర్పు కాపులు ప్రదర్శించారు. దాడుల్లో తూర్పు కాపులకు చెందిన పెద్ద, చిన్న, ఆడ, మగ, పిల్లలు, ధనిక, పేద అంతా కలిసి హిందూమతోన్మాదులు ముస్లిం మైనారిటీలపై చేసే దాడుల్లో కనబరిచే ఐకమత్యమే ఇక్కడా కనబరిచారు. ఈ దాడుల్లో పాల్గొన్నారు.) ఈ మొత్తం క్రమానికి బొత్స వాసుదేవరావు నాయుడు సూత్రధారి అయితే, ఆవు శ్రీనివాసరావు పాత్రధారిగా వ్యవహరించారు. వీరికి అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రి కోండ్రు మురళిమోహన్‌లాంటి వారి పరోక్ష అండదండలు ఉన్నాయనేది ఈ ఘటన క్రమాన్ని చూస్తే అర్థమవుతుంది.

శ్రీకాకుళం జిల్లా తొమ్మిది నదుల (నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, చంపావతి, బహుద, కంబికోట గడ్డ, సువర్ణముఖి, వేగవతి, గోముఖి)తో, సారవంతమైన భూములతో విశాలమైన అటవీ ప్రాంతంతో, శ్రమచేసే మనుషులతో నిండి ఉన్న జిల్లా. ఆ జిల్లాలోని వంగర మండలంలోని సువర్ణముఖి కాలువ అంచున ఉన్నదే లక్షింపేట. మడ్డువలస రిజర్వాయర్‌కోసం భూములను సేకరించినపుడు కొట్టిస, లక్షింపేట, మగ్గూరు, దేవకవాడ, నరేంద్రపురం, గుడివాడ గ్రామాలు పూర్తిగా మునిగిపోయాయి. ఇంకొక ఆరు గ్రామాల భూములు కొద్దిమేరకు ముంపుకు గురయ్యాయి. పూర్తిగా మునిగిపోయిన ఆరు గ్రామాలలోని నాలుగు గ్రామాల ప్రజలు బలిజపేట, మిత్తివలస, పదమవలస, శేఖరపల్లి, పార్వతీపురం, ఇక్కరామపురం, రాజాం, నగనాపురం, వీరఘట్టం, బూరుగు, చలివేంద్ర, పాలమెట్ట, తూడి, కవిటి, ఓని, బాసురు లక్షింపేట, రుషింగి, మద్దివలస, కొప్పర వలస, సీతారామాపురం, వంగర, మగ్గూరుదగ్గర ఓని, డోలపేట, కంచరామం, తలగాము, కాగితాపల్లి, తలవారం, బాలకైవలస, ఉప్పర్నేదువలస, అంపావిల్లి, కొత్తపేట, కొంచ, శంఖంపేట, రేగులపాడు గ్రామాలతోపాటు హైదరాబాద్ కూడా పోయి స్థిరపడ్డారని చెప్పారు. అయితే లక్షింపేట, కొట్టిస గ్రామాల వారు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 2000 సంవత్సరంలో స్థిరపడ్డారు. లక్షింపేటలో ఎక్కువశాతం, కొట్టిసలో మూడవవంతు జనాభా మాత్రమే కొత్త గ్రామంలో స్థిరపడ్డారు. వీరిలోనూ చాలా మంది బయటికిపోయారు. ఈ గ్రామంలో కాంగ్రెస్, టి.డి.పి పార్టీలు ఉన్నాయి. మాలలు అంతా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఈ గ్రామంలో 690 మంది ఓటర్లు ఉన్నారు. ముందు మాలలు రాగా తరువాత 2 సంవత్సరాలకు తూర్పు కాపులు వచ్చారు. ఈ ఊరిలో ముంపుకు గురికాని ప్రభుత్వ భూమిలో పదేసి ఎకరాలు భూమి కలిగిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలిసింది. ఉద్యోగాలు చేసుకుంటున్న వారూ భూమిని కలిగి ఉన్నారు.

శ్రీకాకుళం జిల్లా సువర్ణముఖి, వేగవతి నది సంగమ ప్రాంతంలో ప్రభుత్వం మడ్డువలస రిజర్వాయర్‌ని నిర్మించింది. వంగర, రేగిడి ఆముదాల వలస, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు మండలాల్లోని 104 గ్రామాలకు చెందిన 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు నిర్మించారు. ఇది 2002లో పూర్తయింది. ఈ రిజర్వాయర్‌కు 3,373 మిలియన్‌ల క్యూసెక్కుల నీరు నిలువ చేయగల సామర్థ్యం ఉంది. ఈ ప్రాజెక్టు వలన 7,133 ఎకరాలు ముంపుకు గురవుతాయని నిపుణుల అంచనా.

పాత లక్షింపేట గ్రామంలో కులాల వారిగా ఇళ్లను చూస్తే తూర్పు కాపుల ఇళ్లు - 75, మాలలు - 55, పద్మశాలీలు - 50, చాకళ్లు - 15, మంగలి - 3, కరణాలు - 2, బ్రాహ్మలు - 20 ఇళ్లు ఉండేవని చెప్పారు. ఇప్పుడు (కొత్త) లక్షింపేటలో తూర్పు కాపుల ఇళ్లు - 95,

మాలలు – 85, పద్మశాలి – 4, చాకలి – 4, మంగలి – 2, కరణాలు – 2, బ్రాహ్మలకు చెందిన ఒక ఇల్లు ఉన్నట్లు చెప్పారు. పాత ఊరిలో సాగు భూమి దాదాపు 350 ఎకరాలు ఉండేది. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలో 250 ఎకరాలు ముంపుకు గురికాకుండా కొత్త గ్రామానికి అందుబాటులో ఉంది. వర్షాధారంగా మాత్రమే పండే భూమి అయితేనో, అంత సారవంతంకాని భూమి అయితేనో ఇంత రక్తపాతం జరిగి ఉండేది కాదేమో? ఆ భూమి మూడు పంటలు పండుతున్న భూమి. తోటపల్లి రిజర్వాయర్ కాలువ నీళ్లు పుష్కలంగా అందుతున్న భూమి. ఈ భూమిలో ఏడాదికి (వరి, పెసర, నువ్వు) మూడు పంటలు పండుతున్నాయి. మడ్డు వలన రిజర్వాయర్‌కోసం భూమి సేకరించినపుడు అసలు పట్టాదారులు అంటే ప్రధానంగా తూర్పు కాపులు, ఇతర కులాల వారు ఎకరానికి రెండున్నర లక్షల చొప్పున నష్టపరిహారం పొందారు. 41 మంది తూర్పు కాపులకి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. అప్పుడూ, ఇప్పుడూ నష్టపోయినది ఏ భూమిలేని పేదలే. ఈ గ్రామంలో అయితే ప్రత్యేకించి మాలలు.

అప్పటి వీరి ఇళ్లకు ఎనిమిది, పది వేల రూపాయలు నష్టపరిహారం పొందితే తూర్పు కాపులతో సహా పై కులాల వారు ఇంటికి 50 నుండి 60 వేల వరకు నష్టపరిహారం పొందారు. చాలా మంది వేరే గ్రామాల్లో పట్టా భూములు కొనుక్కొని స్థిరపడ్డారు. కొందరు రాజాం, పార్వతీపురం, బొబ్బిలి, బలిజపేటలలో ఇళ్లు కట్టుకొని అద్దెలకు కూడా ఇచ్చుకున్నారు. పాత ఊరిలో అయినా, కొత్త ఊరిలో అయినా భూమి కోసం పరితపిస్తున్నది మాలలే. కొత్త ఊరిలో ముంపుకి గురికాని భూమిని, ప్రభుత్వం నష్టపరిహారాలు చెల్లించేసిన ప్రభుత్వ భూమిని ఆశిస్తే ప్రాణాలు ఇవ్వాల్సిన పరిస్థితి దాపురించింది. ముంపుకి గురికాకుండా మిగిలిపోయిన భూమిలో 190 ఎకరాలు లక్ష్మింపేటకు చెందిన తూర్పు కాపులవి కాగా, 60 ఎకరాలు దేవకవాడ తూర్పు కాపులవి. పూర్తిగా వదిలిపెట్టి పోయిన దేవకవాడ తూర్పుకాపుల భూములను మాలలు సాగుచేసుకుంటున్నారు. దీనిలో కొంత భూమికి కౌలు కూడా చెల్లిస్తూ ఉన్నారు. 'ఇది ప్రభుత్వ భూమి, దీనికి మేము కౌలు చెల్లించనక్కర లేదు' అని 2011లో మాలలు నిర్ణయించుకోవడం కూడా ఘర్షణకు కారణమయింది.

లక్ష్మింపేట విషయంలో అక్కడి మాలలు భూస్వాముల భూములనో, ధనిక రైతుల భూములనో స్వాధీనం చేసుకోవడం వలన వచ్చిన గొడవ కాదు ఇది. ఏ విప్లవ పార్టీ నాయకత్వంలోనో రూపొందిన పోరాటం కాదు. అనాదిగా ఆ భూమిని నమ్ముకుని బతుకుతున్న వారు ప్రాజెక్ట్ పేరిట తమ బతుకుతెరువును కోల్పోయాక, బతుకు కోసం పెనుగులాటలో ప్రాణాలు కోల్పోయారు. ముంపుకు గురయిన పట్టా భూములకు తూర్పు కాపులు నష్టపరిహారం అన్ని రూపాలలోనూ అందుకున్నారు. ఏ పట్టాలేని, ఏ కాగితపు ఆధారంలేని, ఎవరి ఆసరా లేని దళితులే సమస్యల పాలయ్యారు. నష్టపరిహారం అందుకున్న వాళ్లు ముంపుకు గురికాని తమ భూమిని యథావిధిగా దున్నుకుంటున్నారు. అంతేకాకుండా దళితులు సాగుచేసుకుంటున్న కొద్దిపాటి భూమిని కూడా తమ ఆధీనంలోకి తీసుకోవాలనుకునే క్రమంలోనే ఈ పరిస్థితి ఎదురయింది.

ఈ గ్రామంలో దళితులు వివిధ రూపాలలో ఉన్న కుల ఆధిపత్యాన్ని, అంటరానితనాన్ని, పై వర్గాల పెత్తనాన్ని నిత్యం ఎదుర్కొన్న క్రమం కనబడుతుంది. ముంపుకు గురికాని ప్రభుత్వ భూమికి కూడా తూర్పు కాపులు కౌలు కింద 'కొంత భూమికి' ఎకరానికి పది బస్తాల ధాన్యం మాలల నుంచి వసూలు చేస్తూనే ఉన్నారు. మాలలు, తూర్పు కాపులు తగువు పడి న్యాయస్థానానికి పోతే ఆ భూమిని ఎవరూ దున్నొద్దని కడుపు మీద తన్నింది న్యాయస్థానం. దీంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కోర్టు న్యాయం చెప్పలేదు.

నిర్వాసిత గ్రామాల కోణం నుంచి లక్ష్మింపేట, కొట్టిసలను చూస్తే – కొత్త ప్రాజెక్టులను, ఆ పేరుతో ఇచ్చే పునరావాసాన్ని ప్రజలు ఎందుకు అంత బలంగా తిరస్కరిస్తారో ఎవరికైనా అర్థమవుతుంది. ఈ రోజుకీ ఈ గ్రామాలకు మంచినీటి సదుపాయం లేదు. సి.సి. రోడ్లు లేవు. డ్రైనేజీ సదుపాయాలు లేవు. వీధి లైట్లు లేవు. ప్రభుత్వ పథకం కింద ఇచ్చిన ఇళ్లు ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పోవాలంటే ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంగరకు పోవాలి. పోలీస్‌స్టేషన్ కూడా వంగరలోనే ఉంది. అక్కడా సరియైన వైద్య సదుపాయం అందదు కాబట్టి ముప్పై ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజాం ఆస్పత్రికి వెళ్లాలి. ఊరిలో ఐదో తరగతి వరకు మాత్రమే ఉంది. హైస్కూలు చదువుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతారాంపురం పోవాలి. చనిపోయిన మనిషిని పాతిపెట్టడానికి స్మశాన వాటిక లేదు. (పాత గ్రామంలో చాలా పెద్ద స్మశానం ఉండేదని చెప్పారు.)

గత రెండు సంవత్సరాల నుండి పంటలు పండించడం లేదు. రేషన్ డీలర్ తూర్పు కాపు కులస్తుడు ఉన్నారు. గొడవల నేపథ్యంలో ఎవరి

సహచరులను కోల్పోయిన మహిళలు

చిత్తిరి శ్రీదేవి – ఈమె హత్యకు గురయిన వారందరిలోకి చిన్నవాడైన చిత్తిరి అప్పడు భార్య. సంవత్సరం క్రితం వీరి పాప సెరిబ్రల్ మలేరియాతో చనిపోయింది. ఎనిమిది సంవత్సరాల బాబు, ఆమె ఉన్నారు.

బూరాడ కాసాలు – చదువుకున్న మధ్య వయస్కుడు, కళాకారుడు హత్యకు గురయిన బూరాడ సుందరరావు భార్య. ఈమె కూడా దాడులలో గాయాలపాలైంది. వైద్యం పొందుతూ ఇంటిలోనే ఉండిపోయింది. వారికి పదిహేనేళ్ల కొడుకు, పన్నెండేళ్ల కూతురు ఉన్నారు.

నివర్తి రావులమ్మ – ఈమె హత్యకు గురయిన నివర్తి సంగమేశు భార్య. వీరికి ఇరవై ఏళ్ల కొడుకు, పద్దెనిమిదేళ్ల కూతురు ఉన్నారు.

బవిరి అనురాధ – ఈమె హత్యకు గురయిన నివర్తి వెంకటేశు కూతురు. నివర్తి వెంకటేశుకు ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురిలో అనురాధ ఆఖరామె. తల్లితండ్రులకు సేవ చేస్తూ ఊరిలో ఉందామనే నిర్ణయంతో పెద్దక్క భర్తనే తనూ పెండ్లి చేసుకుంది. అయితే ఈ భూమి గొడవల నేపథ్యంలో ఈ ఏడాది సంక్రాంతికి ముందు తల్లి రాములమ్మను కోల్పోయింది. జూన్ 12న తండ్రిని కూడా కోల్పోయింది. ఈమెకు ఏడు సంవత్సరాల అమ్మాయి, ఐదు సంవత్సరాల అబ్బాయి ఉన్నారు.

బొద్దూరి నర్సమ్మ – ఈమె బొద్దూరి పాపయ్య భార్య. వీరికి పిల్లలు లేరు. భర్తను కూడా కోల్పోయి ఇప్పుడు ఒంటరయింది.

రేషన్ వారు వేరు వేరుగా దింపుకుని పంచుకుంటున్నారు. ప్రభుత్వం పునరావాసం కింద ఇల్లు కట్టుకోవడానికి కుటుంబానికి మూడు సెంట్ల చొప్పున భూమి ఇచ్చింది. ఇందులోనూ తూర్పు కాపులు ముందు చూపుతో ఉన్న వారివి, లేనివారివి పేర్లు రాయించి మూడు సెంట్ల చొప్పున భూమిని పొంది, ఇప్పుడు ఉన్నవారు ఆరేసి సెంట్ల స్థలాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ రకంగా భూమికి నష్టపరిహారం పొందడం దగ్గర నుంచి మొదలు పెట్టి, ఉద్యోగ అవకాశాలు, ఇళ్ల స్థలాలు, కొత్త అవకాశాలు ఇలా నిర్వాసితులుగా పొందాల్సినవన్నీ పైకులాలకు చెందిన వారు, రాజకీయ ఆధిపత్యం ఉన్నవారు ఒనగూర్చుకున్నారు. పది సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన కొద్దిపాటి ఆర్థిక సహాయంతో మాలలు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ డబ్బులు చాలక కొందరు రేకులు వేసుకున్నారు. కొన్ని రెండు రూములు స్లాబ్ వేసుకున్నా వాటికి ఇప్పటికీ ప్లాస్టరింగ్ చేయలేదు. కొన్ని పునాదులు వేసి ఉన్నాయి. బాత్ రూమ్‌లు లేవు. దొడ్డికి వెళ్లడానికి కూడా అనువయిన స్థలం లేక, రోడ్డుకు ఇరువైపుల దొడ్డికి వెళుతున్నారు. ఇది మాలల పరిస్థితి. ప్రభుత్వ ప్రాజెక్టుల వెలుగులు కొద్ది మంది అనుభవిస్తుంటే, ఆ ప్రాజెక్టు నీడల కింద అట్టడుగు వర్గాల ప్రజలు నలిగిపోయారు.

మనుషుల మధ్య స్నేహాలూ, పలకరింపులూ ఎలా ఉన్నాయని పరిశీలిస్తే ఊరు చీలిపోయ్యింది. ఆ ఊరు ముక్కలయిపోయింది. లక్ష్మింపేట బాధితులను కులపరంగాను పై కులాల వారు హింసకు గురిచేశారు. తూర్పుకాపుల ఇళ్లల్లో పెళ్లిళ్లు జరిగితే మాలలను కూడా పిలిచేవారని చెప్పారు. ముందు తూర్పు కాపులు టేబుళ్లపైన భోజనం చేసేవారనీ, తరువాత మాలలకు కింద కూచొని, మిగిలినవి తినడానికి వదిలి పెట్టేవారనీ చెప్పారు. ఈ అంటరానితనం సహించలేక, అవమానాన్ని భరించలేక పెళ్లిళ్లకు, ఇతర కార్యక్రమాలకు పిలిచినా కొత్త తరం పిల్లలు వెళ్లడం మానుకున్నారు. పాత తరం వాళ్లు ఒకరో ఇద్దరో తప్పకో మొహమాటానికో వెళుతున్నారు. కులం పేరిట అంటరానితనపు హింసను ఈ మొత్తం క్రమంలో మాలలు అనుభవిస్తూనే ఉన్నారు. లక్ష్మింపేట, పరిసర గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి నడుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని లక్ష్మింపేటలో దళిత మహిళలు వండితే పైకులాలకు సంబంధించిన వారి పిల్లలు తినలేదు. కాపు కులస్తుల చేత భోజనాన్ని వండిస్తేనే తిన్నారు. సర్పంచ్ సింహాలమ్మను కూడా సమావేశాల్లో తూర్పు కాపులు తమతో సమానంగా కూర్చోనిచ్చేవారు కాదు. అంటే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలపడుతున్న, పై వర్గంలోకి ఎదుగుతున్న బి.సి కులాల వారూ పై కులాల వారిలాగే ప్రదర్శించిన బ్రాహ్మణీయ, భూస్వామ్య ఆధిపత్య భావజాలాన్ని చూడవచ్చు.

2006లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో లక్ష్మింపేట దళిత మహిళ చిత్తిరి సింహాలమ్మకు ఎస్.సి. మహిళ రిజర్వేషన్ వలన సర్పంచ్ పదవి దక్కింది. అయితే చదువురాని దళితురాలు, అందులోనూ మహిళ తాము చెప్పినట్లు వింటుందిలే అని తూర్పు కాపులు అనుకున్నారు. వాస్తవానికి అంతకు ముందు సర్పంచ్‌తో పోలిస్తే ఈమె భర్త చిత్తిరి గంగులు సహకారంతో ఊరికి ఎంతో కొంత మేలు చేసే ప్రయత్నమే చేసింది. అయితే ఆమె సొంత చైతన్యంతో వ్యవహరించడం తూర్పు కాపులకు కంటగింపయింది.

ఈ దేశ ఎన్నికల రాజకీయాలకు, సామాన్యుల కష్టాలకు ఏమీ సంబంధం లేదనే విషయానికి రుజువుగా ఉపఎన్నికల సందర్భంలోనే, ఆ నెపంతోనే గ్రామంలో ఏర్పాటుచేసిన కొద్దిపాటి పోలీసు రక్షణనూ ఎత్తివేశారు. అప్పటికే మూడేళ్లుగా ఈ గ్రామంలోని పరిణామాలు రోజు రోజుకి కొత్త కొత్త మలుపులు తీసుకుంటున్నాయి. ఘర్షణలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. తూర్పు కాపుల దాడికి గురయి, ఆ క్రమంలో నివర్తి వెంకటేశు భార్య జనవరి 2012 సంక్రాంతికి ముందు చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సర్పంచ్ మరిది చిత్తిరి అప్పడు చేను దగ్గర తూర్పు కాపులతో జరిగిన ఘర్షణలో తీవ్రంగా దెబ్బలు తిన్నాడు. మొన్నటి దాడిలో అతను చనిపోయాడు. ఈ మూడేళ్లలో వారు చూపించిన ఆధారాల ప్రకారమే లక్ష్మింపేట మాలలు ఊరిలోని భూమి సమస్య కోసం, తమ గొడవల పరిష్కారం కోసం, తమపై జరుగుతున్న అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్‌ల చుట్టూ, ఎంఆర్‌ఓ ఆఫీసు చుట్టూ, కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరిగారు. స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఏ, మంత్రి కోండ్రు మురళి మోహన్‌కు తమ భూమి సమస్యను వివరించుకుంటే 'ఆ బురదలోకి నన్ను లాగవద్ద'ని ఆయన అన్నారు. ఎంఎల్‌ఏ, డిఎస్‌పి ఇంకా వివిధ స్థాయిల్లో అధికారులు మాల కులానికి చెందిన వారే అయినప్పటికీ లక్ష్మింపేట మాలలకు న్యాయం జరగలేదు. 'మనోడే' అనుకున్నా అతను ఉపయోగపడగలిగేది ఆధిపత్య వర్గాలకే తప్ప, అణగారిన వారికి కాదనేది అర్థమవుతుంది. చాలా పెద్ద పెద్ద చదువులు చదువుకుని, అత్యున్నత స్థాయి పరీక్షలు ఎదుర్కొని ఐఎఎస్, ఐపిఎస్‌లు అయిన వారి విషయంలోనూ ఈ ధోరణి మనం చూస్తూనే ఉన్నాం. ఇక్కడ న్యాయం, చట్టం,ధర్మం, పాలనా వ్యవస్థలు అన్నీ భూస్వాములకు, బూర్జువాలకు,

దాడిలో గాయపడిన వారు

1) **బొడ్డూరి బోగేశ్** (40) – కాలు విరగ్గొట్టారు; 2) **బొడ్డూరి భూషణ్ రావు** (18) – బరిశెలతో వెన్నులో, కాలుపై పొడిచి, తలపై గొడ్డళ్లతో కొట్టారు; 3) **నివర్తి రామారావు** (45) – రెండు కాళ్లపై బరిశెలతో పొడిచారు; 4) **గొంగాడ శివుడు** (45) – కుడిచేయి విరిగింది; 5) **కలవటి గెడ్డయ్య** (40) – కాలు విరగ్గొట్టారు; 6) **ప్రకాశ్** (50) – చెయ్యి, కాలు విరగ్గొట్టారు; 7) **నివర్తి దాలప్ప** (35) – ఒక చెయ్యి విరగ్గొట్టారు; 8) **నివర్తి నర్సయ్య** (55) – తలపై కొట్టి ఛాతిలో పొడిచారు; 9) **నివర్తి గంగయ్య** (55) – తలపై కొట్టారు; 10) **కలమటి గణేష్** (36) – కుడికాలు విరగ్గొట్టారు; 11) **బోనుల రవి** (25) – రెండు చేతులపై కొట్టారు; ఒక కాలు విరగ్గొట్టారు; 12) **కలమటి గడ్డయ్య** (40) (తండ్రి అప్పయ్య) – కుడి కాలు రెండు చేయిలు విరగ్గొట్టారు; 13) **నివర్తి సింహాలు** (50) – నడుముపై కొట్టారు; 14) **నోపింటి పైడయ్య** (40) – తలమీద, కాలుకి తీవ్ర గాయాలయ్యాయి; 15) **కలమటి సింహాచలం** (35) – చేయి బొటనవేలు విరగ్గొట్టారు; 16) **కలమటి గంగయ్య** (40) – చెయ్యి విరగ్గొట్టారు; 17) **చిత్తిరి ఎల్లయ్య** (60) – చెయ్యి నడుము విరగ్గొట్టారు; 18) **బొడ్డూరు గవరోడు** (30) – నడుముపై కొట్టారు; 19) **కలమటి సంగమ్మ** (45) – చెయ్యి విరగ్గొట్టారు; 20) **చిత్తిరి ముత్తమ్మ** (60) – కాళ్లపై కొట్టారు.

పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు మొత్తంగా దేశంలోని దళారీలకు లోబడి పనిచేయాల్సిందే తప్ప, అవి స్వతంత్రంగా పనిచేసిన దాఖలాలు కనపడవు.

ఈ గ్రామంలోని మాలలకు అరకొరగా అందుతున్న ప్రభుత్వ సహకారాన్ని కూడా తూర్పు కాపులు తమకున్న రాజకీయ అండదండలతో ఆపించారు. వృద్ధాప్య పెన్షన్లను, ఉపాధి హామీ పనులను నిలిపివేశారు. గతంలో జాయింట్ కలెక్టర్ తలా ఇంతా దున్నుకొమ్మని మాలలను అనుమతించినట్లు చెప్పారు. పాత గ్రామంలో ఉండగా మాలలకు ప్రతి కుటుంబానికి ముత్యాలమ్మ చెరువులో 15 సెంట్ల చొప్పున ప్రభుత్వం భూమి ఇచ్చింది. దాన్ని కూడా తూర్పు కాపులు సాగు చెయ్యనివ్వ లేదన్నారు. ఇవన్నీ కూడా ప్రభుత్వ దృష్టిలో ఉన్నప్పటికీ అధికారులు కూడా తమ ఉద్యోగ భద్రత కోసం, స్వప్రయోజనాల కోసం పెత్తందారీ వర్గాల వైపే ఉన్నారు. ఉపాధి పని ఆపేసినా, పక్క ఊళ్లలోనూ పని దొరకకుండా చేసినా, పింఛన్లు ఆపేసినా, వీటన్నిటి వెనక దళితులను బతుకు నుంచి దూరం చేసి, ఆత్మగౌరవం లేకుండా పడి ఉండేలా చేసే ప్రయత్నం ఉంది. వీటన్నిటిని మించి వారు సాగుచేసుకుంటున్న 60 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలనే కుట్ర ఉంది.

లక్షింపేట మాలలు చుట్టు పక్కల ఉన్న కొవ్వరవలస, నారాయణపురం, చాకరబెల్లి, మద్దివలసలకు కూలీకి వెళుతుంటారు. ఊరిలో పనులు లేనపుడు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, మద్రాస్‌లకు పోయి బిల్డింగ్ నిర్మాణ పనులు చేసుకొని వస్తుంటారు. ఈ గొడవల నేపథ్యంలో లక్షింపేట మాలలకు చుట్టు పక్కల గ్రామాలలో కూడా పని ఇవ్వడం లేదు.

గతంలో ఘర్షణలు చోటు చేసుకున్నపుడు బాధితులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ కేసు పెట్టినా, పోలీసులు దోషులను మూడు రోజులు ఉంచుకొని వదిలిపెట్టారు. చిత్తిరి గంగులుతో 'కేసులు పెట్టి మమ్మల్ని ఏమీ చేయలేరు. పన్నెండు ఊర్ల తూర్పు కాపులం కలిసి వచ్చి నీ సంగతి తేలుస్తాం'అని బొత్సా వాసుదేవరావు నాయుడు అన్న మాటలు సంవత్సరం తిరిగే సరికి నిజమయ్యాయని చిత్తిరి గంగులు గుర్తుచేసుకున్నాడు. జూన్ 12న దాడిలో చిత్తిరి గంగులు తప్పించుకోవడంతో అతని తమ్ముడు చిత్తిరి అప్పడుని చంపేశారు.

ఇప్పుడు అరెస్టైన ఎనభై రెండు మంది తూర్పు కాపులు (72 మంది మగవారు, 10 మంది ఆడవారు) విడుదలయ్యాక మళ్లీ తమ పరిస్థితి ఏమిటో అని ఊరిలో మాలలు ఆందోళన పడుతున్నారు. ఏ చిన్న పరిణామానికైనా ఉలిక్కిపడుతున్నారు. ఊరిలో ఒక భయానక స్థితి నెలకొని ఉంది. 50 మందికి పైగా పోలీసు బలగాలు ఊరిలోనే ఉన్నాయి. ఘటన జరిగి దాదాపు నెల రోజులకు మేము వెళ్లినప్పటికీ బాధితులు ఉలికిపాట్లు, గగురుపాట్లకు గురవుతూ ఆందోళనతో ఉన్నారు. గాయాలపాలయిన వారు దాదాపు నెల రోజుల పాటు చికిత్సపొంది జూలై 10, 11 తేదీలలో గ్రామానికి చేరుకున్నారు. వచ్చిన వారిని చూసి ఆ కుటుంబాల వారు, ఇరుగు పొరుగు వారు పెద్ద ఎత్తున రోదనల్లో మునిగిపోయారు.

లక్షింపేట మాలలు ప్రధానంగా వ్యవసాయ కూలీ పనుల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. మడ్డువలస రిజర్వాయర్ వలన నిర్వాసితులై, భూమి లేకపోవడం వల్ల ఎటువంటి నష్ట పరిహారం అందలేదు. దీంతో వారి జీవితం పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. దళితులకు సొంత భూమి ఉంటే, తమదైన బతుకు, వ్యవసాయం ఉంటే తమకు లోబడి ఉండరనే కారణం ఈ హత్యాకాండ వెనుక దాగి ఉంది. కూలీలు కూలీలుగానే ఉండాలనే, అడుక్కునే వాళ్లుగానే ఉంచాలనే ప్రయత్నం ఉంది. భూస్వాములకు సేవకులుగా, కూలీలుగా, ప్రభుత్వాలకు అడుక్కునే వాళ్లు (ప్రభుత్వం దృష్టిలో వాళ్లు ఓటర్లు, లబ్ధిదారులు; మార్కెట్ దృష్టిలో వాళ్లు వినియోగదారులు) గా ఉండి, ఓటు బ్యాంకుగా ఉండాలే తప్ప తమ స్వంతకాళ్లపై నిలబడకూడదనేది ఈ ఘటనల్లో దాగి ఉన్న సత్యం. ఈ ఘటన ప్రధానంగా భూమిని కేంద్రంగా చేసుకుని సాగినదే. అయితే ఇక్కడ భూమి మాలలకు జరుగుబాటు కోసం కావాల్సి వచ్చింది. తూర్పు కాపులకు ఆధిపత్యం, కుల అహంకారం కలగలిసిన దురాశతో కావాల్సి వచ్చింది.

లక్షింపేట లాంటి ఘటనలు ఒక పెద్ద కుదుపుగా సమాజం ముందుకు వచ్చిన వెంటనే ప్రభుత్వాలు రకరకాల రాయితీలు ప్రకటించి పైపై పూతలతో, పైపై మాటలతో వాటిని చల్లార్చాలని, కప్పిపుచ్చాలని చేసిన ప్రయత్నాలు చరిత్ర పొడవునా మనకు కనబడతాయి. అయితే ఈ ప్రభుత్వాలు కానీ, మొత్తంగా పాలక వర్గాలు కానీ ఇటువంటి ఘటనల్ని, సమస్యల్ని కప్పిపుచ్చే ప్రయత్నం మాత్రమే చేశాయి. ఆ ఘటనలకు కారణమైన క్రమాన్ని వారు మార్చరు. మార్చాలని అనుకోరు. ఆ క్రమాన్ని తప్పుదారి పట్టించే, గందరగోళ పరిచే ప్రయత్నాన్ని తమ సంస్కరణలతో చేస్తారు. అందువల్ల లక్షింపేటలు మళ్లీ మళ్లీ పునరావృతం అవుతూనే ఉంటాయి. కాబట్టి నడుస్తున్న ఈ క్రమాన్ని మార్చడానికి చైతన్యయుతంగా, సంఘటితంగా ముందుకు కదలాల్సిందే. బ్రాహ్మలు, రాజులు, కమ్మలు, రెడ్లు, వెలమలు దాటి ఇప్పుడు కొన్ని బిసి కులాలూ ఆధిపత్య స్వభావం సంతరించుకుంటున్నాయి. గ్రామాలలో భూమి, దానితో పాటు రాజకీయ ఆధిపత్యం బిసి కులాల్లోకి వెళుతున్న క్రమ పరిణామాన్ని లక్షింపేటలో చూడవచ్చు.

లక్షింపేట ఘటన పై ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'శాంతికి నిలయాలుగా ఉండాల్సిన గ్రామసీమలు ఇలా కక్షలకు వేదికలుగా మారడం బాధాకరమ'న్నారు. 'మనుషుల్లో ఓపిక నశించిపోవడం వల్లనే ఇలాంటి దారుణమైన సంఘటనలు జరుగుతున్నాయ'న్నారు. దళిత కుటుంబాలకు భూమిని కేటాయిస్తామ'ని వాగ్దానం చేశారు. అయితే ఇక్కడ ఓపిక ఎవరికి నశిస్తోంది? ఎవరు ఓపికపట్టి శతాబ్దాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు? రోజు రోజుకు ఆదివాసులు, దళితులు, అట్టడుగువర్గాల ప్రజలు భూమి, నీరు, ప్రకృతి వనరుల నుంచి దూరం చేయబడుతూ బతుకులేకుండా అవుతున్నారు. లక్షింపేట ఘటనపై దళిత ఎంఎల్‌ఎలు, మంత్రులు, ఎంపిలతో సబ్ కమిటీ ఏర్పాటైందనీ, ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాకు అదనంగా ఈ కమిటీ ఆర్థిక సహాయం అందిస్తుందనీ, బాధితులకు ఆత్మస్థైర్యం కలిగించే దిశగా పాటుపడుతుందనీ బాధితులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆ సందర్భంలో సిబిసిఐడి విచారణకు డిమాండ్ చేశారు. ఆ క్రమంలోనే ముఖ్యమంత్రి సిబిసిఐడి విచారణకు ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి జాతీయ కమిషన్ సభ్యురాలు లతాప్రియాకుమారి దళితులపై దాడులు, అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఘటనకు ముందు లక్షింపేట మాలలు తమ సమస్యలు పరిష్కరించండంటూ ఎక్కని ప్రభుత్వ గడపలేదు. ఘటన జరిగిన తరువాత ఘటనకు కారకులంటూ గ్రామ సుంకరులు మొదలు కొని ఎ.ఎస్.పి, డి.ఎస్.పి, సి.ఐ, ఎస్.ఐ, ఎం.ఆర్.ఒ, ఆర్.డి.ఒ, వి.ఆర్.ఒ, వి.ఆర్.ఐలను సస్పెండ్ చేశారు. కలెక్టర్‌ను బదిలిచేశారు. ఊరిలో

లక్షింపేట గ్రామంలోని మాలలు పాత గ్రామంలో లాగా ఆధిపత్య వర్గాల కట్టుబాట్లకు లోబడి ఉండడంలేదు. పాత గ్రామానికి ఉండే కట్టుబాట్లు నిర్వాసిత గ్రామంలో అమలుచేయడానికి అవకాశమూ లేదు. రోజువారిగా తూర్పు కాపులతో రాజకీయార్థిక సంబంధాలు క్షీణిస్తూ వచ్చాయి. మాలలు బతుకుదెరువు కోసం మద్రాస్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లి నిర్మాణ పనులు చేసుకొని వస్తున్నారు. బయట చూసిన, నేర్చుకున్న చైతన్యంతో వారు ఇంకెంత మాత్రం అణిగిమణిగి ఉండడం లేదు. పాలకులు ప్రతి సంవత్సరం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని నమ్మబలుకుతూ ఇప్పటికే 65 జెండా పండుగలు చేశారు. ఇప్పటికీ ఈ దేశ అట్టడుగు వర్గాలుగా బతుకు వెళ్లదీస్తున్న అత్యధిక జనాభాగా ఉన్న దళితులు, ఆదివాసులు, బహుజనులు, ముస్లిం మైనారిటీలు కూదు, నీడ, గుడ్డల కోసం, ఆత్మగౌరవంతో జీవించడం కోసం ఊపిరి ఉన్నంతసేపూ పెనుగులాడుతూనే ఉన్నారు.

దేశంలో చోటుచేసుకున్న మారణకాండల స్వభావాన్ని గుర్తు చేసుకుంటే, గుజరాత్‌లో ముస్లింలపై దాడులకు ఆదివాసులను, దళితులను, ఇతర వెనకబడిన కులాల వారిని హిందూ మతం పేరుతో ఎగదోయడం జరిగింది. ఖైర్లాంజీలో బిసి కులస్తులు దళితులపై దాడి చేయడం చూశాం. అంటే కింది వర్గాల ప్రజలకు తమ అసంతృప్తులకు, అశాంతికి, దారిద్ర్యానికి పరిష్కారాలను మరో సమూహ ప్రజల్ని చంపి వేయడంలో చూపిస్తున్నాయి పాలకవర్గాలు. పై వర్గాలకు ఎదిగిన, పార్లమెంటరీ రాజకీయాల్లోకి ఎదిగిన వ్యక్తులు, శక్తులు వాటి నేపథ్యం ఏదయినా తమకన్నా కింది వారిని అణిచి ఉంచడం, ఆధిపత్యం చలాయించడం, హింసకు గురిచేయడంలో తేడాలను చెరిపేస్తున్నాయి. దేశవ్యాప్తంగా బయటపడిన అనేక కుంభకోణాలలో, ప్రజా వ్యతిరేక పథకాలలో ఇరుక్కున్న పాలకుల జాబితాను చూస్తే అగ్రకులాల నుంచి అట్టడుగు కులాలకు చెందిన వారంతా ఉన్నారు. అంటే ఈ అసమ సమాజంలో, నిచ్చెన మెట్ల వ్యవస్థలో అధికారాన్ని పొందిన ప్రతీ వారు చేసే పని ఆ నిచ్చెన మెట్ల వ్యవస్థను కాపాడడమే. ఆ నిచ్చెన మెట్ల వ్యవస్థను పెంచి పోషించడమే.

పోలీసు బలగాలను దింపారు. బాధితులకు నష్టపరిహారాలు ప్రకటించారు. కొన్ని చెల్లింపులు జరిగాయి. బ్యాంకు అధికారులు, రెవెన్యూ శాఖ వారు అందరూ ఇప్పుడు ఊరు చుట్టూ తిరుగుతున్నారు. ఉద్యోగాలు కల్పించారు. అన్ని చకచక జరిగిపోతున్నట్లు కనబడు తున్నాయి. అయితే ఇవేవీ సామాన్యులకు ప్రాణాలు పోతే తప్ప జరుగు తున్నవి కావు. అయితే వాళ్లడిగిన, వాళ్లలాగే బతుకు సమస్యను, భూమి సమస్యను ఎదుర్కొంటున్న ప్రజల నెత్తిన కత్తులు వేలాడుతూనే ఉన్నాయి.

ఈ ఘటనలో రెవెన్యూ, పోలీసు అధికారులతో మొదలు పెట్టి ప్రజా ప్రతినిధుల వరకు నిర్లక్ష్యం వహించారు. ఊరిలో పోలీసు పికెట్ ఎత్తివేశారు. దాడి మొదలయిన క్షణం నుంచి పలుమార్లు చిత్తిరి గంగులు ఎస్ఐకి ఫోన్ చేసినా నాలుగు గంటల తర్వాత గానీ ఎవరూ రాలేదు. నేరస్తులను శిక్షించాలని, నష్టపరిహారం అందించాలని మృతదేహాలు పట్టుకొని గొడవ చేస్తేగానీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ప్రధాన నిందితుల పేర్లను పెద్ద ఎత్తున పోరాటం చేశాకే ఎఫ్.ఐ.ఆర్‌లో నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలోనూ తాత్సారం చేశారు. ఇచ్చిన ఉద్యోగాలు మొదట వసతి గృహాల్లో వంట మనుషులుగా ఇచ్చారు. మేము చేయమని బాధితులు తిరస్కరించాకే ఉద్యోగాలు మార్చి ఇచ్చారు. ఉపాధి హామీ పనులు, పింఛన్లు ఆపించడంలో చూపిన చొరవ ప్రజలకు మేలు చేయడంలో ఎక్కడా కనబడదు. సి.ఐ.డి విచారణకు కూడా మంత్రుల స్థాయిలో డిమాండ్ చేస్తే గానీ విచారణకు ఆదేశించలేదు. భూములు దున్నుకోవద్దని హుటాహుటిన స్టే ఇచ్చిన కోర్టు వారికి న్యాయం చేయడంలో వెనకబడే ఉంది. ఇవన్నీ ఇలా ఉండగా దళితుడైన ఎంఎల్ఏ నియోజకవర్గంలో జరిగిన సంఘటనపై ఎందుకింత రాద్ధాంతం చేస్తారనే వాదనా ముందుకు వచ్చింది. దళితుడు అధికారంలో ఉంటే, 'మనోడు' పై స్థాయికి వస్తే ఇలా చేస్తారా అనే ధోరణి ఇది.

దాడికి గురయిన వారందరికి కాళ్లు, చేతులు, నడుములు విరిగిపోయాయి. భవిష్యత్తులో వీరు మళ్లీ శ్రమచేసి బతికే పరిస్థితి లేదు. అంటే శ్రమకు, భూమికి ఉండే సంబంధాన్ని శాశ్వతంగా తెగ్గొట్టే దుర్మార్గం చేశారు.

ఊర్లో జరిగిన సంఘటనల మీద తూర్పు కాపులు ఏమనుకుంటున్నారో తెలుసుకుందామని మేం పోయినపుడు ప్రస్తుతం తూర్పుకాపుల (ఖాళీగా ఉన్న) ఇళ్లల్లో పోలీసులు ఆశ్రయం పొందుతున్నారు. ఎక్కువ శాతం తూర్పు కాపుల ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. ఇంట్లో ఎవరైనా ఉన్నా ముసలివారు లేక చిన్న పిల్లలు, మహిళలు మాత్రమే కనబడ్డారు. ఘటనకు సంబంధించి మేము వారిని అడగగా ఇంతవరకు మా వద్దకు ఎవరూ రాలేదని అన్నారు. 'అధికారం చలాయిస్తున్నవారు మా ఓట్లు లేకుండానే గెలిచారా' అని ప్రశ్నించారు. పన్నెండు మందికి పైగా తూర్పుకాపు మహిళలు మేం వెళ్లిన ఇంటి వద్దకు వచ్చి చేరారు. సంఘటనకు తమ మగవారు బాధ్యులు కారన్నారు. తమ కులం వారికి చెందిన భూములు తమకే చెందాలని అన్నారు. కౌలు ఇవ్వడం మానేసారన్నారు. మాల సర్పంచ్‌కు చదువు రాదన్నారు. ఒకరు చెపితే ఒకరు రాస్తారనీ, మరొకరు చదువుతారనీ హేళనగా మాట్లాడారు. మేం గెలిపిస్తేనే కదా వాళ్లు గెలిచిందన్నారు. ఇప్పటికీ ఆధిపత్య స్వభావంతోనూ, కుల అహంకారంతోనూ మాట్లాడారు. 60 ఎకరాల భూమి కూడా తమ కులానికి చెందిన వారిది, తమ బంధువులది కాబట్టి మొత్తం భూమి తమకే చెందాలన్నారు. తమ భర్తలు, కుటుంబ సభ్యులు ఇంటికి వస్తే చాలన్నారు. వచ్చిన రాజకీయ నాయకులు గానీ, ముఖ్యమంత్రి గానీ, అధికారులు గానీ, విలేకరులు గానీ మమ్మల్ని ఎవరూ పలకరించలేదన్నారు. జరిగిన ఘటనలపై వారిలో ఎటువంటి పశ్చాత్తాప భావన, విచారం ఏమాత్రం లేవు. వారిని చూసినపుడు మళ్లీ ఈ ఊరు కుదురుకుంటుందా, కుదటబడుతుందా అనే అనుమానం కలిగింది.

జిల్లా బిసి సంక్షేమ సంఘ నాయకులు ఇరువర్గాల పైన చర్యలు తీసుకోవడం లేదని, దాడులతో సంబంధంలేని వారిని కేసులో ఇరికించడం సరైంది కాదని అంటున్నారు. కేసుతో సంబంధం లేనివారిని విడిచిపెట్టాలన్నారు. నియోజక వర్గ బిసిలంతా ఐకమత్యంతో బిసిలకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. ఇటువంటి కులపరమైన ఐక్యతల్లో మనకు కనబడేది పార్లమెంటరీ రాజకీయాల కొనసాగింపే. న్యాయ భావనతో విషయాలను చూడడం, నిర్ద్వంద్వంగా, బేషరతుగా న్యాయం వైపు నిలుచోవడం సమాజంలో చెరిగిపోతున్నాయి. సమాజానికి అనేక పోరాటాలు నడిచి వచ్చిన చరిత్ర ఉన్నా ఇంకా న్యాయం వైపు నిలబడే పరిపక్వతను సంతరించుకోలేదు. 'నేను 'నా' నుంచి 'మా' వరకే రాలేదు, 'మన' అన్నది చాలా పెద్ద మాట' అని కాళోజీ అన్నట్లే ఇప్పటికీ మన సమాజ స్థితి ఉంది.

ఈ దేశంలో నిజమైన భూసంస్కరణలు ఇప్పటికీ అమలు కాలేదు. భూమినే నమ్ముకుని శ్రమ చేస్తున్నవారికి భూమి దక్కలేదు. మెజారిటీ ప్రజానీకం అంటే శ్రమచేసే మనుషులు భూమి, మంచి నీరు, సాగునీరు, విద్య, వైద్యంలతో సహా కూడు, గూడు, గుడ్డలకు దూరంగా ఉన్నారు. దున్నేవారికి ఉన్న భూదాహానికి, భూమి అవసరానికి లక్షింపేట ఒక చిహ్నం మాత్రమే. ఆంధ్రప్రదేశ్ నిండా, దేశవ్యాప్తంగా ఇలాంటి లక్షింపేటలే ఉన్నాయి. 60 శాతానికి పైగా జనాభా ఆధారపడి ఉన్న వ్యవసాయ సమస్యలను, భూమి సమస్యలను పాలకులు ఎవరైనా, విధానాలు ఏవైనా నిర్లక్ష్యం చేస్తూనే వచ్చారు. ఆ నిర్లక్ష్యానికి సామాన్యులు, అట్టడుగు పేదలు మూల్యం చెల్లిస్తూనే ఉన్నారు.

ఇంతవరకు ఈ దేశంలో శాస్త్రీయమైన వ్యవసాయం జరగలేదు. ఇప్పటికీ సాగు భూమిలో 25 నుండి 30 శాతానికి మాత్రమే నీరు అందింది. భూసార పరీక్షల నుంచి మొదలు పెట్టి విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వంటి వాటిల్లో వేటిల్లోనూ శాస్త్రీయ పద్ధతులు అమలు కావడంలేదు. రోజు రోజుకీ వ్యవసాయం ఒక జూదంగా మారిపోయి, పెద్ద సంక్షోభానికి లోనయి రైతాంగపు ఆత్మహత్యలనేవి నిత్యకృత్యమై పోయాయి. భూమి సమస్యను శాస్త్రీయ దృష్టితో, శ్రమచేసే మనుషులు కేంద్రంగా పరిష్కరించాల్సి ఉండగా, మరోపక్క దున్నేవారికి భూమి నినాదానికే కాలం చెల్లిందనే వాదనలు చేస్తున్నవారు ఉన్నారు.

మొత్తంగా లక్షింపేట మన సమాజం ముందుకు చాలా సవాళ్లను విసిరింది. ఈ సమస్యలో భూమి సమస్య, నిర్వాసిత సమస్య, కుల సమస్యలన్నిటితోపాటు, అభివృద్ధి పేరిట వస్తున్న వెలుగులెవరికి, చీకట్లెవరికి అనే విషయాన్ని మరోసారి తేటతెల్లం చేసాయి. భవిష్యత్ పరిణామాలకు లక్షింపేట ఒక హెచ్చరిక. ఒక సూచిక. లక్షింపేట దళితులు ముంపుకు గురికాని ప్రభుత్వ భూమిని దున్నుకుంటామంటేనే ప్రాణాలు ఇవ్వాల్సి వచ్చింది. మొత్తంగానే రాష్ట్రంలోనూ, దేశంలోనూ భూముల లెక్కలు తేల్చమనే గొడవ ఇంకా ఎంత తీవ్రంగా ఉంటుందో నాలుగు దశాబ్దాలకు పైగా తమ రక్తం చిందిస్తూ సాగుతున్న రైతాంగ పోరాటాలు, విప్లవ పోరాటాలు తెలియజేస్తూనే ఉన్నాయి. ఒక పక్క భూమి సమస్య ఇంత తీవ్రంగా ఉంటే దేశంలోని భూస్వాములు, పెట్టుబడిదారులు కొత్త కొత్త పద్ధతుల్లో, కొత్త కొత్త ఎత్తుగడలతో, కొత్త కొత్త రూపాలలో, కొత్త కొత్త అవసరాల పేరిట వ్యవసాయ భూములతో సహా వేలాది ఎకరాల భూముల్ని ఆక్రమించుకుంటున్నారు. ఇటీవలే వ్యాన్‌పిక్ ప్రాజెక్ట్ మోసం బయట పడ్డాక స్వయంగా మంత్రి గారే ఆ ప్రాజెక్ట్ భూమిని దున్ని రసవత్తరమయిన నాటకానికి తెర తీశారు. ఈ నాటకానికి తెర దించాల్సింది ఈ దేశంలో భూమిని దున్నే సామాన్యులే. అక్రమంగానూ, అన్యాయంగానూ, అవసరానికి మించి, భూగరిష్ట పరిమితిని మించి ఉన్న భూములన్నిటినీ సామాన్యులు, భూమిని నమ్ముకుని బతుకుతున్న మట్టి మనుషులు దున్నుకోవాల్సే ఉంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్పత్తి సాధనాల మీద తమకు అధికారం కావాలన్నందుకు లక్షింపేట మాలలను హత్య చేశారు. ఈ ఘటన తరువాత చర్చ ఎక్కువ శాతం ఘటనను కేంద్రంగా చేసుకొని సాగుతోంది. అయితే చర్చ ఈ ఘటనలను పెంచిపోషిస్తున్న ఈ వ్యవస్థ మీద సాగాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కారంచేడు, చుండూరు లాంటి ఘటనలు జరిగి బాధితులకు నష్టపరిహారాలు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ నిరోధక చట్టం వంటివి వచ్చినా ఇలాంటి దుర్మార్గాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ, తిమ్మసముద్రం, చీమకుర్తి, చుండూరు, వేంపెంట, ప్యాపిలి, కల్వకోలు, పొట్టిలంకలు దాటి ఇవ్వాళ లక్షింపేట ఘటనలుగా మన ముందు ఉండవచ్చు కానీ, ఈనాడు ప్రతి గ్రామంలో దళితులు, భూమిలేని నిరుపేదలు నిత్యం మానసికమైన హేళనకు, భౌతిక దాడులకు గురిచేయబడుతున్నారు. భూమి చరిత్రను చూస్తే భూమి మీద ఎటువంటి శ్రమ చేయని వర్గం భూమి మీద అధికారం కలిగివుంది. భూమి మీద శ్రమ చేస్తూ ఉత్పత్తిలో పాల్గొంటున్న పేదలకు భూమి లేదు.

రాష్ట్ర జనాభాలో కోటి మందికి పైగా వ్యవసాయ కూలీ జనాభా ఉంది. కూలీల జనాభాలో 50 శాతానికి పైగా వ్యవసాయ కూలీలే ఉన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం మీద ఒత్తిడి ఇప్పటికీ కొనసాగుతూ వ్యవసాయ కూలీలు వలస పోతున్న పరిస్థితి ఉంది. వ్యవసాయ కూలీల శాతం పంజాబ్ తరువాత ఆంధ్రప్రదేశ్‌దే. రాష్ట్రంలో మిగులు భూములుగా ఉన్న ఒక కోటి ఇరవై లక్షల ఎకరాల భూమిని పేదలకు, ముఖ్యంగా దళిత రైతాంగానికి పంపకం చేయాలి. గైరుహాజరు భూస్వాముల హక్కులను రద్దుచేసి, భూమి రైతుకూలీలకు పంపకం చేయాలి. మిగులు భూమిని గుర్తించడం అనేది రెవెన్యూ ఆఫీసుల్లో రికార్డులు, ఇతర చట్టాల రికార్డుల వలన కాకుండా, ఆయా గ్రామాల ప్రజలు గుర్తించిన భూమిని పేదలకు ఇవ్వాలి. ఆదివాసులు పోడుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి. ఆ పని కేవలం రాష్ట్రంలోనే కాదు, వ్యవసాయ ప్రధానమైన దేశంలో ఇదే స్థితి ఉన్న అన్ని రాష్ట్రాలలోనూ దేశం అంతటా జరగాలి.

మరోపక్క అభివృద్ధి పేరుతో వస్తున్న రకరకాల ప్రాజెక్టులతో రాష్ట్రం మొత్తం అతలాకుతలమవుతోంది. ప్రత్యేకించి ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 12 థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. వీటిని వ్యతిరేకిస్తూ సోంపేట, కాకరాపల్లి ప్రజలు తమ ప్రాణాలొడ్డి ఆ ప్రాజెక్టులను తాత్కాలికంగా నిలువరించగలిగారు. అభివృద్ధి పేరుతో వస్తున్న ప్రాజెక్టులు స్థానిక ప్రజలను ఆ అభివృద్ధి(?)లో భాగం చెయ్యడం లేదు. సోంపేట అయినా, కాకరాపల్లి అయినా, లక్షింపేట అయినా పాలకులు తెస్తున్న అభివృద్ధి నమూనాకు, ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధికి, అవసరాలకు మధ్య ఉన్న వైరుధ్యమే.

లక్షింపేట ఘటన భూమి మీద ఆధిపత్యం కోసం జరగడం వలన దానికున్న భూస్వామ్య స్వభావం వ్యక్తం అయితే, ఆ భూస్వామ్య స్వభావంలోని భాగమైన కుల దురహంకారమూ కనబడుతున్నది. భూమి కోసం భౌతిక దాడులకు పాల్పడడం, ప్రత్యర్థులను లోబరుచుకోవడం, అవసరమైతే చంపివేయడం భూస్వామ్య సమాజ లక్షణంగా ఉంటాయి. మన దేశంలో భూస్వామ్యానికి పోలీసు, న్యాయ, పరిపాలనా వ్యవస్థలు లోబడి ఉండాలి. తాము కోరుకున్నట్లు అవి పనిచేయాలి. వారికి చికాకు అనిపించినపుడు, సత్వర పరిష్కారం చేసుకోవాలనుకున్నపుడు మనుషులను చంపేసి సెటిల్‌మెంట్లు చేసుకుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలకు బయట తమవైన పరిష్కారాలు, తీర్పులు వెలువరిస్తారు. మరోపక్క సామాన్యులు మాత్రం జీవితకాలం కోర్టుల చుట్టూ న్యాయంకోసం తిరుగుతుంటారు. భూస్వామ్యానికి తమ ఆధిపత్యం, అధికారం, ఆస్తులకు రక్షణ తప్ప వేరే వాటి మీద నమ్మకం ఉండదు.

సామాన్యులే ఈ వ్యవస్థలపై నమ్మకం ఉంచి, న్యాయం ఏదో ఒక రోజు జరగక పోతుందా అనుకుంటూ జీవితాలు వెళ్లదీస్తున్నారు.

గ్రామాలలో వైరుధ్యాలు భూమి మీద ఆధిపత్యం కోసం, రాజకీయార్థిక, సామాజిక ఆధిపత్యాల కోసం కులపరమైన కొట్లాట స్వభావాన్ని సంతరించుకుంటుంటే, నగరాలలో రాజకీయార్థిక,సామాజిక అధిపత్యాలకోసం మతపరమైన స్వభావాన్ని సంతరించుకోవడాన్ని గమనించవచ్చు. దానర్థం గ్రామంలో ఘర్షణలకు మత స్వభావం ఉండదు, పట్టణంలో ఘర్షణలకు కుల స్వభావం ఉండదని కాదు. కులం, మతం పాత్రలలో గ్రామంలో, పట్టణంలో వ్యక్తమయ్యే గాఢతల్లో ఉండే తేడా గురించే ఈ ప్రస్తావన. అందుకే మన సమాజ లక్షణాలను పరిశీలించినపుడు స్థూలంగా శ్రమ కేంద్రంగా ఉండే ఆదివాసి సమాజాలు, భూమి కేంద్రంగా ఉండే రైతాంగ సమాజాలు, పెట్టుబడి కేంద్రంగా ఉండే నగర సమాజాలుగా కనబడుతాయి. ఇప్పటికీ ఈ దేశంలో 65 శాతానికి పైగా ప్రజలు భూమి మీదే ఆధారపడి బతకడాన్ని గమనిస్తే, మనదేశంలో భూమి సమస్య ఎంత కీలకమైందో అర్థమవు తుంది. అటు ఆదివాసి సమాజాలు కానీ, ఇటు రైతాంగ సమాజాలు కానీ భూమి సమస్య పరిష్కారంకోసం ఎదురుచూడడం మొదలు పెట్టి 65 ఏళ్లు గడిచిపోయాయి. అయితే ఈ కాలమంతా వారేమీ మౌనంగా ఉండిపోలేదు. నాలుగు దశాబ్దాలకు పైగా దేశంలోనూ రాష్ట్రంలోనూ భూమి సమస్యను మళ్లీ మళ్లీ తమ ఆరాట, పోరాటాలతో ముందుకు తెస్తూనే ఉన్నారు. అది కళింగనగర్ కావచ్చు, కాకరాపల్లి కావచ్చు, అది లాల్‌గడ్ కావచ్చు, నారాయణపట్నం కావచ్చు. అది గుర్‌గాంవ్ కావచ్చు, వైనాడు కావచ్చు.

లక్షింపేట వేసిన ప్రశ్నలకు జవాబులు చెప్పకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. ఈ సందర్భంగా ప్రతి ఊరిలో ఉన్న మిగులు భూములు, వేరు వేరు పద్దుల కింద ఉన్న భూములు (దేవదాయ, ధర్మాదాయ భూములు, అటవీ భూములు, తీర ప్రాంత భూములు, ప్రభుత్వ బంజర్లు, పోరంబోకు భూములు, శివయిజమా భూములు, శ్రోత్రియం, ఇనాం, గ్రామ కంఠం, చెరువు షికం, భూదానం, పీర్ల మాన్యం, వక్ఫ్, ఈనాం, మిరాసి, ఎట్టి, మాన్యం, ముద్ద, ప్రభుత్వ గైరాన్, ఖారిజ్ ఖాతా పడావు వంటి అనేక రకాల భూములు), ప్రాజెక్టుల పేరిట అవసరానికి మించి సేకరించిన భూములు, లెక్కా పత్రం లేకుండా కొద్ది మంది వినియోగంలో ఉన్న భూములు, పరిమితికి మించి ఉన్న భూములు, బినామీ పేర్లతో ఉన్న భూములు ఉద్యోగ, వ్యాపారాలలో స్థిరపడిపోయిన వారి భూములు ఇలా మొత్తం భూముల లెక్కలు తీయాలి. కంప్యూటర్లు, సాంకేతిక పరిజ్ఞానం, సాటిలైట్ పరిజ్ఞానాలను వినియోగించి భూమి లెక్కలను సరిచేయాలి. ఏ గ్రామానికి ఆ గ్రామం అట్టడుగు వర్గాల ప్రజలందరూ, భూమిని నమ్ముకుని బతుకుతున్న వారంతా ఆ గ్రామంలో ఉన్న భూమిని కొలవాలి. లెక్కలు సరిచేయాలి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అంతటినీ మానవాభివృద్ధికి, మానవ మనుగడకు వినియోగించకుండా ప్రభుత్వం మానవ రహిత విమానాలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో మనుషులను చంపే కార్యక్రమంలో వినియోగిస్తోంది. ఈ తలకిందుల పద్ధతిని సరిచేయాల్సింది, ఎదుర్కోవాల్సింది ఈ దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజలే.

లక్షింపేట బాధితులకు అందిన ఆ కొద్దిపాటి సహకారాన్ని కూడా ఖర్చుపెట్టించేందుకు, వృథా పరిచేందుకు అనేక మార్కెట్ శక్తులు గద్దల్లా వాలిపోయే ప్రమాదం లేకపోలేదు. వారు పూర్తిస్థాయిలో కుదురుకునేదాకా ప్రజాస్వామిక శక్తులన్నీ వారికి అండగా నిలిచి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉంది. లక్షింపేట భూమి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇప్పటికైనా ఆ సమస్యను ప్రజలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ శక్తులు, న్యాయకోవిదుల ఆధ్వర్యంలో ముంపుకు గురికాకుండా మిగిలిపోయిన 250 ఎకరాల భూమి సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఆ భూమి లక్షింపేట బాధితులతో ప్రారంభించి భూమినే నమ్ముకుని బతుకుతున్న వారికి చెందేలా చేయాలి. లక్షింపేట వంటి సమస్యలే ఎదుర్కొంటున్న అనేక గ్రామాల్లోని భూమి సమస్యలను మరిన్ని విలువయిన ప్రాణాలు పోకముందే పరిష్కరించాలి.

(రచయితలు వీక్షణం కరస్పాండెంట్/ సర్క్యులేషన్ మేనేజర్, సహాయ సంపాదకులు)

వీ

లక్షింపేట బాధితుల డిమాండ్లు

- కేసు విచారణకోసం లక్షింపేటలోనే ప్రత్యేకకోర్టు ఏర్పాటు చేయాలి.
- మరణించిన వారి కుటుంబానికి రు. 15 లక్షలు ఇవ్వాలి.
- గాయాలపాలైన వారికి రు. 10 లక్షలు ఇవ్వాలి.
- 250 ఎకరాల భూమిని మాలలకు ఇవ్వాలి.
- లక్షింపేటలో మహిళలకోసం కుటీర పరిశ్రమను ఏర్పాటు చేయాలి.
- ఇంటికో ఉద్యోగం కల్పించాలి.
- మళ్లీ ఇలాంటి అఘాయిత్యాలు మాపై జరుగకుండా తగిన రక్షణ కల్పించాలి.

లక్షింపేట ఘటన ఏం తెలియజేస్తోంది?

***లక్షింపేటలో కుల దురహంకారంతో తూర్పు కాపులు సాగించిన దుర్మార్గాన్ని వివరిస్తూ, లక్షింపేట సమస్య పరిష్కారంలో అన్ని వ్యవస్థలు విఫలమయ్యాయని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

శ్రీకాకుళం జిల్లా వంగర మండలం, లక్షింపేట గ్రామంలో దళితులపై జరిగిన నరమేధం, గృహాలపై దాడులు, బాంబులు, కత్తులు ఉపయోగించి దాదాపు ఆరు గ్రామాల తూర్పుకాపు కులానికి చెందిన వారు కలిసి కట్టుగా, పథకం అల్లి అధికార దర్పాన్ని ఉపయోగించుకొని ఐదు మంది మాల కులానికి చెందిన వారిని చంపివేసిన ఘటనపై కొంత లోతుగా చర్చించుకుందాం. ఈ దేశంలోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న భూమి సమస్యను సాకుగా చూపించి, కుల దురహంకారంతో, అగ్రకుల శక్తులు (ఇక్కడ బి.సి.లైనప్పటికినీ, ఈ జిల్లాలో బలమైన సామాజిక పునాది ఉన్న కులం–తూర్పు కాపులు) దళితులపై ఏ విధంగా, ఇప్పటికినీ అణిచివేస్తున్నారో తెలుసుకోవచ్చు.

అటు నియోజక వర్గ కేంద్రానికీ, జిల్లా కేంద్రానికీ చాలా దూరంగా ఉన్న మారుమూల గ్రామమైన లక్షింపేట గ్రామం– మడ్డు వలస ప్రాజెక్టు నిర్మాణంలో భూమిని కోల్పోయి, ఎత్తికట్టబడిన పునరావాస గ్రామం. ఈ గ్రామంలో ఎనభై దళిత కుటుంబాలున్నాయి. గ్రామం పూర్తిగా పునరావాస గ్రామమైనందున, దాదాపు అన్ని గృహాలూ, వరుస క్రమంలో, ప్లాన్‌గా కట్టబడి, దళితుల గృహాలు బి.సి. కులాలైన తూర్పుకాపు కులాలకు కొంత సమీపంలో కట్టబడ్డాయి. 12 సంవత్సరాల క్రితం ఈ కొత్త గ్రామం ఏర్పడింది.

12 జూన్ 2012న ఉదయం 7.30–7.45 నిమిషాల సమయంలో దాదాపు 200 మంది తూర్పుకాపు కులానికి చెందిన వారు (అందులో మహిళలు కూడా కారంపొడి–నీళ్ల బాటిళ్లు పట్టుకొని ఉన్నారు) కత్తులు, బరిసెలు, రాళ్లు, గొడ్డళ్లు, పట్టుడు కట్టెలతో దాడి చేశారు. మొదట గ్రామాన్ని భయభ్రాంతులను చేయడానికి నాలుగు, ఐదు బాంబులను విసిరినట్లు గ్రామస్తులు మాతో అన్నారు.

హత్యకు గురయినవారు. 1. చిత్తిరి అప్పడు, 2. నివర్తి సంగమేశ్, 3. నివర్తి వెంకటి, 4. బొద్దూరు పాపయ్య 5. బూరడ సుందర రావు. ఇందులో బొద్దూరు పాపయ్య వారం రోజుల తర్వాత విశాఖ కింగ్ జార్జ్ హాస్పిటల్లో మరణించాడు. నివర్తి సంగమేశ్‌ను చంపడానికి ప్రయత్నించినపుడు అడ్డుపడిన అతని అక్క సంగమ్మ(50)ను చితకబాది, కాళ్లు, చేతులను విరిచేశారు. తలకు బలమైన గాయం చేశారు. సాక్షర భారతి– (వయోజన విద్య) కోఆర్డినేటర్ వంగడ జయమ్మ(30) విద్యావంతురాలు. ఆమె ఇంటిపై పడి, కుర్చీలను, తలుపులనూ, అన్నిటినీ పగులగొట్టారు.

చిత్తిరి అప్పడు (30 సంవత్సరాల లోపు యువకుడు) ఆ గ్రామ దళిత సర్పంచ్ చిత్తిరి సింహాలమ్మ భర్త గంగులు (35) తమ్ముడు. అన్న తప్పించుకున్నందుకు తమ్ముణ్ని నరికేశారు. నివర్తి వెంకటి (ముదుసలి 51 సంవత్సరాలు) ఎంత బతిమిలాడినా, రెండు కాళ్లమధ్య వృషణాలపై బరిసెలు ఉపయోగించి, పొడిచి చంపారు. బూరాడ సుందరరావు మంచి వాయిద్య కళాకారుడు, గాయకుడు. శంకర్ బ్యాండ్‌పార్టీ ఏర్పాటు చేసుకొని దాదాపు ఆ చుట్టు పక్కల ఐదు, ఆరు మండలాల్లో పెళ్లిళ్లకు బ్యాండ్ ట్రూప్‌కు నాయకుడు. అతడు ఎన్నడూ గ్రామ రాజకీయాలను పట్టించుకొనే వాడు కాదు. అయినప్పటికినీ, కేవలం అతనికి వస్తున్న పేరు ప్రఖ్యాతులను చూసి ఓర్వలేక, అసహనంతో, అసూయతో, దుర్బుద్ధితో ఇంటి మీద పడి, వాకిళ్లరగగొట్టి ఈడ్చుకొని వచ్చి చంపారు. వీరందరూ స్వయం కష్టంతో, కూలి, నాలి చేసుకొని జీవిస్తూ, కొద్దో గొప్పో గ్రామంలో మంచిపేరు ఉన్నవారే. ఎవరిపైనా ఎలాంటి వ్యక్తిగతమైన ఆరోపణలు కూడా లేవు. ఈ ఘటనలో దాదాపుగా 25 మంది క్షతగాత్రులయ్యారు. వారందరూ మొదట రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, ఇప్పుడు శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు.

క్షతగాత్రుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. వీరికి సేవలు చేయడానికి వచ్చే భార్యలు, పిల్లలు, అక్కలు, అన్నలు, చెల్లెళ్లు దాదాపుగా 70 కిలోమీటర్లు ఉన్న స్వగ్రామం నుంచి రావాలన్నా, పోవాలన్నా చాలా కష్టంగా ఉంది. ఆ గ్రామానికి ఏ మాత్రమూ బస్సు సౌకర్యం లేక పోవడం మరీ విచారకరం. భయం, భయంతో జీవిస్తున్నారు. తాము కూడా మరణించి ఉంటే బాగుండు అన్న రీతిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గ్రామం నుంచి వచ్చిపోతూ ఉన్నారు. ఆ గ్రామానికి సర్పంచ్ చిత్తిరి సింహాలమ్మ (30), ఆమె భర్త చిత్తిరి గంగులు మాల కులానికి చెందిన వారు కావడం, తూర్పు కాపు కులస్తులు సహించలేకపోయారు. ఈ గ్రామం రాజాం నియోజక వర్గ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుత శాసన సభ్యుడు కొండ్రు మురళి, వైద్య విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. మొత్తం సంఘటనకు బాధ్యుడైన మాజీ మండలాధ్యక్షుడు (వంగర), బొత్స వాసుదేవరావు నాయుడు, లక్షింపేట గ్రామానికి చెందిన ఆవు శ్రీనునాయుడు, శాతు పోసినాయుడు, కర్రినాయుడు, గంటెడు కృష్ణ, ఆవు తిరుపతి, గంటెడు వెంకటరమణ, వీరంతా బొత్స సత్యనారాయణ (ప్రస్తుత మంత్రి, పిసిసి అధ్యక్షుడు) అనుచరులే. ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలలో పూర్తిగా అధికార యంత్రాంగం అంతా ఈయన చెప్పు చేతుల్లో ఉంది. ఒక రకంగా ఈ పెద్ద ఘటనకు ఈయన కూడా బాధ్యుడే. ఎందుకంటే, తమ గ్రామ సమస్యను దళితులు, అనేక సందర్భాలలో మండల తహశీల్దార్ ద్వారా

కానీ, పాలకొండ ఆర్.డి.ఓ. వద్ద కానీ ఫిర్యాదులు చేసినప్పుడు బొత్స సత్యనారాయణ ద్వారా వీరు ఒత్తిడి తెచ్చి, కేవలం ఒక సివిల్ కేసుగా భూమి సమస్యను నీరు గార్చారు. ఈ ఘటనకు ముందు మూడు, నాలుగు సార్లు వంగర పోలీస్ స్టేషన్‌లో దళితులు తూర్పు కాపులపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు.

భూమి సమస్య.. మడ్డువలస రిజర్వాయర్ కోసం 20 సంవత్సరాల క్రితం, ఆరు గ్రామాల రైతుల భూమిని, దళితుల అసైన్డ్ భూములను (డి-పట్టా భూములు) ప్రభుత్వం సేకరించింది. తూర్పుకాపు రైతుల భూమికి ఎకరాకు రెండు-రెండున్నర లక్షల రూపాయల నష్ట పరిహారం ఆనాడే చెల్లించింది. దళితుల భూములు పట్టాలేనివి కాబట్టి, ప్రభుత్వం వాటికి నష్ట పరిహారం చెల్లించలేదు. 2000 లో రిజర్వాయర్‌కు పునాది ఏర్పడింది. 2005లో ప్రారంభమైంది. సేకరించిన భూమిలో 250 ఎకరాలు ముంపుకు గురికాలేదు. అందులో వ్యవసాయం చేసుకోవ డానికి లక్ష్మింపేట తూర్పుకాపులతో పాటు, దళితులైన మాలలు కూడా సిద్ధపడ్డారు. తూర్పుకాపులకున్న ధనబలం, అధికారబలం, రాజకీయ బలం ముందు దళితులు సరితూగలేరు కాబట్టి కేవలం 60 ఎకరాలు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. తూర్పుకాపులు 190 ఎకరాలు సాగుచేసుకుంటున్నారు. వారు అంతటితో సంతృప్తి చెందక, భూమి నుంచీ, ఊరి నుంచీ దళితులను గెంటివేయాలని నిర్ణయించుకున్నారు. గత రెండు సంవత్సరాలలో నాలుగుసార్లు దళితులపై దాడులు చేశారు. ఒక దాడిలో నివర్తి రాముడమ్మ(నివర్తి వెంకటి భార్య) మరణించింది. నివర్తి వెంకటి జూన్ 12 దాడిలో మరణించిన వ్యక్తి. దళితులు ఫిర్యాదు చేసినప్పటికినీ పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి, కేసు నమోదు చేయలేదు. ఈ విషయంలో పూర్తిగా మంత్రి బొత్స సత్యనారాయణ తూర్పుకాపులకు మద్దతిస్తూ, సహకరించాడు. ఈ గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా, వెంటనే బొత్స సత్యనారాయణ కు తెలియజేసేంత చనువుంది ఈ గ్రామ తూర్పుకాపులకు.

రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పూర్తిగా తూర్పుకాపుల పక్షం వహించి, దళితుల మాటలనూ, ఫిర్యాదులనూ పట్టించుకోలేదు. అది కేవలం ఒక ప్రభుత్వ భూమి సమస్యగా భావించి, ఇరువర్గాలనూ, ఆర్‌డిఒ కోర్టుకు ప్రతి రెండు వారాల కొకసారి పిలిపించేవారు. అంతకు తప్ప, ఈ గ్రామంలోని దళితుల స్థితిగతులపై రెవెన్యూ యంత్రాంగం ఎప్పుడూ శ్రద్ధ చూపిన పాపాన పోలేదు. అందుకే తూర్పుకాపులు ఇంత దారుణానికి పాల్పడ్డారు. ఇది కేవలం రెవెన్యూ యంత్రాంగం-పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంతో జరిగిన దారుణం తప్ప, మరొకటి కాదు. అందుకు ఉన్నతస్థాయిలో కుట్ర జరిగింది.

కొండ్రు మురళికి ఈ సమస్య గురించి అనేకసార్లు విన్నవించారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించకముందు నుంచీ దళితులు ఈ సమస్య ఆయన దృష్టికి ఎప్పుడో తెచ్చారు. (2009లో రాజాం నుంచి - అంతకు ముందు ఎచ్చర్ల నియోజకవర్గం నుంచీ ఎన్నికైనాడు). అయితే ఆయన కూడా దళితులతో, మీరు తూర్పుకాపుల జోలికి పోవద్దు- ఆ భూమిని విడిచిపెట్టండి, మీకు గ్రామానికి దూరంగా మరో గ్రామంలో పొలం ఇప్పిస్తానని చెప్పాడు. ఒక నియోజకవర్గంలో అసైన్డ్ భూములను దళితులకు, భూమిలేని నిరుపేదలకు పట్టాలు చేసి ఇచ్చే కమిటీకి (అసైన్‌మెంట్ కమిటీ) ఆ నియోజక వర్గ ఎంఎల్ఏ అధ్యక్షుడుగా ఉంటాడు. ఆర్‌డిఒ, స్థానిక తహసీల్దార్ కమిటీ అఫీషియల్ సభ్యులుగా ఉంటారు. రాజకీయ పార్టీలకు చెందినవారు ఒక్కొక్క పార్టీ నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. మరి ఒక ఎంఎల్ఏగా, దళితుల పక్షం వహించి ఎందుకు పట్టా చేయించలేకపోయాడు. కొండ్రు మురళి అనేది అసలు మన ముందు ఉన్న సమస్య. కేవలం బొత్స సత్యనారాయణ సహకారంతో 2009లో ఈ నియోజక వర్గం నుంచీ గెలువగలిగాడు కాబట్టి, ఆయనకు వ్యతిరేకంగా తాను ఏ పని చేయలేడు. పైగా అవతలి వారు బొత్స సత్యనారాయణ కులస్తులు, ఆయనకు సన్నిహితులు. కాబట్టి, కొండ్రు మురళి కూడా తూర్పుకాపుల పక్షమే వహించాడు. భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల విముక్తికై జీవితాంతం శ్రమించిన డా. బి.ఆర్. అంబేద్కర్ రిజర్వేషన్ల చేత శాసన సభ్యులుగా ఎన్నికైన వీరు, అంబేద్కర్ స్ఫూర్తితోనే, తాము ఆత్మగౌరవంతో సాగుచేసుకొంటున్న భూమిని ఏదో ఒక విధంగా స్వాధీనం చేసుకోవాలనీ, దళితులను ఈ గ్రామంలో నివసించకుండా, ఉంటే తమ కాళ్ల కింద చెప్పుల్లా అణిగి, మణిగి ఉండాలనీ, దాడి చేసిన ఈ తూర్పుకాపులను కొండ్రు మురళి వెనకేసుకొస్తూ మాట్లాడుతున్నాడంటే, ఈ నియోజకవర్గంలో తూర్పుకాపులకు వ్యతిరేకంగా ఏమీ చేయలేని పరిస్థితి ఆయనది. ఇంతకన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదు. కొండ్రు మురళి నిజంగా దళితవాదే అయితే తన మంత్రి పదవికి రాజీనామా చేసి, దళితుల పక్షం వహిస్తూ, మొత్తం 250 ఎకరాలు దళితులకు పంచాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి.

ప్రభుత్వం ఈ దేశంలో భూమిని, భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయకపోతే అంటే దళితులు, ఇతర వెనుకబడిన కులాలవారు, తమ ఆర్థిక వనరు గ్రామీణ ప్రాంతాలలో కేవలం భూమి మాత్రమే తప్ప మరొకటి కాదు కనుక (వారు ఆర్థికంగా వెనుకబడినన్నాళ్లు, ఆకలితో మాడినన్నాళ్లు) మరిన్ని దాష్టీకాలూ, దుర్మార్గాలూ, దాడులూ జరగొచ్చనేది ఒక హెచ్చరికగా ఈ సంఘటన మనకు తెలియజేస్తుంది. ఈ రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక మూల, ఏదో ఒక గ్రామంలో దళితులపై దాడులు జరుగుతున్నప్పటికినీ, సామాజికంగా, ఒక గ్రామంలో రెండు కులాల మధ్య ఘర్షణగా తీర్చిదిద్దబడి, ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో, అధికారుల అండతో, ఉత్తరాంధ్ర ప్రాంతంలో సామాజికంగా, దాదాపు 200 మంది తూర్పుకాపులు, కత్తులు, బరిసెలు, గొడ్డళ్లు, కర్రలతో దళితులపై దాడి చేయడం ఇదే మొదటిసారి. ఈ సంఘటన రాష్ట్రంలో గతంలో జరిగిన కారంచేడు, చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం, వేంపెంటలను జ్ఞప్తికి తెచ్చింది. ఇక్కడ రాజ్యాంగ యంత్రాంగం నిర్లక్ష్యం, ఉదాసీనత, దళిత వ్యతిరేకత, నిందితులతో కుమ్మక్కు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ దేశంలోని నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో, కుల దొంతర సమాజంలో బి.సి. కులాలకు చెందినవారు కూడా గ్రామాలలో దళితులపై దాడులు చేస్తారనడానికి ఇదొక చక్కటి ఉదాహరణ. కేవలం రెడ్డి, కమ్మ కులాలవారు మాత్రమే కాదు, మీపై దాడి చేసే అర్హత, హక్కు, అండ అన్నీ మాకు ఉన్నాయంటూ బిసి కులాల వారు అక్కడక్కడ మాట్లాడుతూ ఉండడం కూడా నిరూపించిన ఘటన ఇది. దీనిని దళిత, ప్రజాస్వామ్య, ప్రగతిశీల సంఘాలన్నీ తీవ్రంగా ఖండించాలి.

తమ తమ సంఘాలలో ఇలాంటి సమస్యను చర్చించుకొని, తరతరాలుగా బానిస మనస్తత్వానికి గురయిన దళితులను ఏ విధంగా భూమి సమస్యకు సన్నద్ధులను చేయాలో కూడా మేధావులుగా మనమంతా తీవ్రంగా, బాధ్యతాయుతంగా ఆలోచించాలి.

ఈ రాష్ట్రంలో ఉన్న 294 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్క నియోజకవర్గంలోని భూమి సమస్యను పరిష్కరించడానికి నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ వ్యవస్థ కారణంగా ఐదు మంది దళితులు బలయ్యారు. ఈ విధమైన పరిస్థితి అదే జిల్లాలో దాదాపు ఆరు గ్రామాలలో ఉన్నట్లు పత్రికలు ఘోషిస్తున్నాయి. కనీసం అవయినా లక్షింపేటలు కాకుండా శ్రద్ధ వహించాలి ఈ ప్రభుత్వం!

ఈ దేశంలో అగ్రకుల శక్తుల భూదాహం, దళితులకు ప్రాణాంతకమైంది. ఐదు మంది చనిపోయిన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రి రాజాం ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, చనిపోయిన దళితుల కుటుంబాల వారికి ఒక్కొక్కరికి ఒక ఎకరా భూమి, ఉద్యోగం, రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పడం గొప్ప విషయం ఏమీ కాదు. ఎందుకంటే, దళితుల రక్షణ కోసం ఏర్పడిన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం 1989 ప్రకారం, దళితులు హత్యకు గురయితే పైవన్నీ వారి వారసులకు ఇవ్వవలసిందే. ఇది కేంద్ర ప్రభుత్వ చట్టం. ముఖ్యమంత్రి చెప్పడం- దళితుల ప్రాణాలకు వెలకట్టినట్టు. అసలు నిందితుడు, బొత్స సత్యనారాయణను పక్కనే పెట్టుకొని, మాట్లాడడం మరింత దివాళాకోరుతనం. నిజంగా ప్రభుత్వం పంచడానికి భూమిని ఇవ్వదలిస్తే ఉన్న 60 కుటుంబాలకు ఆ 250 ఎకరాల భూమినివ్వాలి. ఎందుకంటే ప్రతి కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. దాదాపుగా ప్రతి ఇంటిలోనూ క్షతగాత్రులే. రెండు కాళ్ళు, రెండు చేతులు, తలకు బలమైన గాయాలయిన వారు ప్రతి ఇంటిలోను ఉన్నారు. వారిని పనులు చేసుకొని బతకడానికి వీలు లేకుండా హింసించి కొట్టారు. ఇందులో చాలా మంది యువకులే. ఇరవై, ఇరవై ఐదు సంవత్సరాల యువకులు, కొత్తగా పెళ్లయిన వారు ఉన్నారు. వారు తమ కాళ్ల మీద తాము నిలబడి జీవించడానికీ, కుటుంబాలను పోషించడానికీ చాలా ఇబ్బంది కలుగుతోంది. వీలు పడదు. అసలు వారు కోలుకోవడానికే (నామ మాత్రంగానయినా) దాదాపు రెండు, మూడు సంవత్సరాలు పడుతుంది. కాబట్టి దళితులకు కేవలం ఎక్స్‌గ్రేషియానే కాకుండా. మొత్తం పొలాన్నంతటినీ పంచి ఇవ్వాలి. మరో దుర్మార్గం ఏమంటే, ఈ సంఘటనకు రెండు నెలల ముందుగానే, ఈ గ్రామ దళితులకు ఉపాధి హామి పథకం నిలిపివేశారు. దాదాపు వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే పింఛన్లను కూడా నిలిపివేసి, అధికారుల అండతో వారే కాజేసినట్లు మా నిజనిర్ధారణలో తెలియజేశారు ఆ గ్రామ దళిత మహిళలు. కాబట్టి అన్ని ప్రభుత్వ పథకాలు, వెంటనే అమల్లోనికి తీసుకొని రావాలి. కోలుకునేంత వరకూ, ఆ గ్రామ దళితులకు ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేయాలి.

అంటరానితనం అమానుషం-కుల వివక్షత పాటించరాదంటూ గగ్గోలుపెట్టే ఈ ప్రభుత్వాలు జరిగిన ఈ మారణహోమానికి ఏమని సమాధానం చెబుతాయి? రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులలో భాగమైన జీవించే హక్కు (ఆర్టికల్ 21)ను కాలరాస్తూ, కేవలం ఒక కులంవారే జీవించాలి, మరొక కులం వారు అణిగి మణిగి ఉండాలి అంటూ గిరులు గీసుకొని, నియమ నిబంధనలు ఏర్పాటు చేసుకొని, ఒక్కొక్క గ్రామంలో ఒక్కో విధంగా స్వంత చట్టాలను తయారు చేసుకొని, అమలు చేస్తున్న ఈ కుల దురహంకారం ఈ దేశంలో ఎన్నాళ్లు ఉంటుందో విజ్ఞులైనవారు ఆలోచించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి ఏమి చేయగలమో, ప్రతి మేధావి కృతనిశ్చయంతో, చిత్తశుద్ధితో, సంకల్పంతో కృషి చేయాలి. నిందితులను అరెస్టు చేయాలనే డిమాండ్ మాత్రమే కాకుండా, దళితులకు గ్రామాలలో ఏ విధమైన రక్షణ లేదనే వాస్తవాన్ని మనమంతా అంగీకరిస్తూ ఉన్నాం కాబట్టి, పాలకులు, ప్రభుత్వాలు రక్షణ కల్పించలేనపుడు (ఎలాగూ కల్పించవు కాబట్టి) ప్రజల హక్కుల కోసం పోరాడే వారిగా, దళితుల విముక్తి కోసం, రాజ్యాంగ హక్కుల కోసం, వాటి అమలు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం, భూమికోసం, భుక్తి కోసం, పోరాడి సాధించుకున్న హక్కుల అమలు కోసం, ప్రభుత్వాలపై మరింత ఒత్తిడి పెంచడం కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలి. కోల్పోయిన హక్కులను తిరిగి పొందాలంటే పోరాటమొక్కటే మార్గం అన్నాడు అంబేద్కర్. దళితులను మరింత చైతన్య పరచడం ద్వారా, పోరాట మార్గాన వారిని నడిపించడానికి, కదిలించడానికి మరింత కృషి చేయాలనే వాస్తవాన్ని మనమంతా గ్రహించాలి. ఏ సమస్యనైనా పోరాడడం ద్వారానే సాధించుకోగలుగుతాం. పోరాటంలోనే అన్ని సమస్యలకు కూడా పరిష్కారం లభిస్తుంది.

(రచయిత న్యాయవాది,

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ధ్వంసమవుతున్న ఆదివాసి జీవితం

***పసి పిల్లలని కూడా చూడకుండా అత్యంత పాశవికంగా ఆదివాసులపై బాసగూడెంలో పభుత్వ సాయుధ బలగాలు జరిపిన మారణకాండను వివరిస్తున్నారు* మైపతి అరుణ్‌కుమార్**

సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, గణతంత్ర, సార్వభౌమత్వ రాజ్యాంగం ఏర్పడిన ప్రజాస్వామ్య భారతదేశం నేడు తన దేశ ప్రజలను రక్షించుకోవాల్సిన గురుతర బాధ్యతలను మరిచి, తన కడుపులో బిడ్డను తానే చంపుకున్నట్టు తన సార్వభౌమత్వంలోని ఆదివాసులను తానే అంతమొందిస్తోంది. ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన పాలకులు రాజ్యాంగంపై ప్రమాణం చేసి సామ్రాజ్యవాదమనే విషతత్వ అభివృద్ధి నమునాకు తోకముడిచి దేశవనరులను దోచిపెట్టడం కోసం నేడు బహుళజాతి కంపెనీల కాళ్ల కింద రాజ్యాంగ నియమావళిని తొక్కిపెట్టారు. దాని పర్యవసానమే 2006 నుండి నేటి వరకు వామపక్ష తీవ్రవాదమనే అణచివేత ముసుగులో కొనసాగుతున్న హరితవేట (ఆపరేషన్ గ్రీన్‌హంట్)లో అమలు చేసే ఆదివాసి వేట. వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు కాని ఒక నిర్దోషికి శిక్ష పడొద్దనేది మన రాజ్యాంగ సిద్ధాంతం. కాని దోషులు దర్జాగా తిరుగుతున్నారు. అమాయక ఆదివాసులు మాత్రం బూటకపు ఎన్‌కౌంటర్‌లలో ప్రాణాలు కోల్పోతున్నారు. వారికి న్యాయం జరిగిన చరిత్ర లేదు.

తొలకరి జల్లు కురిసిందంటే దేశంలోని ఆదివాసి ప్రాంతాలలో తెగల సంస్కృతి సంప్రదాయలు పకృతితో మమేకమై, విత్తు విత్తే మొదటి నుంచి పంట పండే అంతవరకు వివిధ రకాల పండుగలు కార్తెలననుసరించి జరుపుతుంటారు. అందులో ప్రధానంగా విత్తనాల పండగ, పొట్టపండగ, కొత్తల పండగ(పెద్దలపండగ)లు జరుపుకుంటారు. సాంస్కృతిక జీవన సంప్రదాయ నృత్యాలతో విప్పచెట్టు, బండరాయిలను పూజిస్తారు. ఆదివాసి ప్రాంతాలలో దీనిని ఎక్కడైనా మనం చూడవచ్చు. అదే క్రమంలో తీజ్ పండగ (విత్తనాల పండగ) జరుపుకోవడానికి బస్తర్ జిల్లాలలోని సర్కెగూడ, కొత్తగూడ, రాజంపేట గూడేల ఆదివాసులు బాసగూడలో పెద్దమనుషులు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కాని తమ జీవన విధానంలో భాగమైన తమ సంస్కృతి తమకు శాపంగా మారి ప్రాణాలను హరిస్తుందని పాపం అక్కడి ఆదివాసులకు తెలియదు. రాజ్యం తూటాకు బలికావడమే వారి విధి అయింది. ఈ పరిణామ క్రమంలో బాసగూడ ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది మావోయిస్టులు కారని, ఆదివాసులని మానవ హక్కుల, పౌరహక్కుల సంఘాలు ప్రజాస్వామిక వాదులు ఖండించారు. లేదు అందులో చనిపోయినది మావోయిస్టులే అని ప్రభుత్వం మొండిగా వాదిస్తోంది.

నిజ నిర్ధారణకు 32 మంది సభ్యులతో కూడిన సిడిఆర్‌ఓ నేతృత్వంలో బృందం జూలై 5న బాసగూడకు వెళ్లింది. వీరితో పాటు ఆరుగురు చత్తీస్‌గడ్ మీడియా సభ్యులు కూడా వెళ్లారు. బాధితులతో స్వయంగా మాట్లాడి నిజానిజాలను బయట ప్రపంచానికి తెలియచేశారు. అదే విధంగా మానవహక్కుల సంఘాలు, 11 మంది సభ్యులతో ఏర్పడిన చత్తీస్‌గడ్ కాంగ్రెస్‌పార్టీ, ఎలక్ట్రానిక్ మీడియా కూడా సంఘటనా స్థలానికి వెళ్లి నిజానిజాలను బయటి ప్రపంచానికి తెలియచేశారు. ఢిల్లీలో కూడా చనిపోయిన వారి ఆత్మలు శాంతించాలని స్వామి అగ్నివేష్ లాంటివారు ఇండియాగేట్ దగ్గర కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు.

మావోయిస్టులు పెద్ద ఎత్తున సమావేశం పెడుతున్నారనే సాకుతో ఎనిమిది వందల మంది సిఆర్‌పిఎఫ్, కోబ్రా పోలీసు సాయుధ బలగాలు మృగాల్లా విరుచుకుపడి, నలుదిక్కుల నుంచి చుట్టుముట్టి ఆదివాసులు జరుపుకుంటున్న సమావేశంపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మొదట ముగ్గురు చనిపోయారు. కాల్పుల అనంతరం పడిపోయిన వాళ్ళందరిని పట్టుకొని, చలనంలో ఉన్నదీ లేనిది పరిశీలించి కత్తులు, గొడ్డళ్లతో పాశవికంగా హత్యచేశారు. కొంతమందిని బండరాళ్లతో తలపై కొట్టి చంపారు. ఈ పదిహేడు మందిలో పన్నెండు మంది పిల్లలే. అందులో కాకసంధ్య (12), మడకం నరేశ్ (13), కాక రాహుల్ (15), పాప్క చోటు (18), కాక రమేశ్, (15), మడకం దేవ (15), మడకం రాంవిలాస్ (13), ఆడ్క మిట్టు (15), కోర్సబీం (15), ఇర్ప సురేష్ (16) కాక పార్వతి (15) ఉన్నారు. ముక్కుపచ్చలారని చిన్నపిల్లలు స్కూల్ యునిఫారం వేసుకున్న పిల్లలు మావోయిస్టుల్లా కనబడ్డారు.

బాలలహక్కులను రక్షించాల్సిన పాలకులు బాలలనే పొట్టన పెట్టుకోవడం ఇదెక్కడి రాజ్యనీతి? ఈ16మందిలో పదోతరగతి బాలుడు, తొమ్మిదవ తరగతి చదువుతూ బడిమానేసిన బాలుడు, నలుగురు యువకులు ఉన్నారు. ఒక యువకుడు సాధారణ గాయాలతో ఉంటే అతన్ని పట్టుకొని అందరు చూస్తుండగానే రెండు మోకాళ్లను గొడ్డలితో నరకడంతో తీవ్ర రక్తస్రావమై చనిపోయాడు. నాగేశ్ అనే వ్యక్తిని అతని భార్య వద్దని మొత్తుకున్నా, విలపించినా వదిలిపెట్టకుండా నరికి చంపారు. సరస్వతి అనే 12 సంవత్సరాల బాలికను ముందు బండతో తలపై కొట్టి, కణతలో బుల్లెట్ దింపారు. పోలీసు కాల్పుల్లో ముగ్గురు చనిపోతే, ఊచకోతలో పద్నాలుగు మంది చనిపోయారు. కాల్పుల అనంతరం అక్కడున్న యువకులందరినీ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఒక పక్క శవాలను పెట్టుకొని, అరెస్టైన వారికోసం స్టేషన్ ముందు కాపలాకాయడం ఎంత దారుణం! వాస్తవంగా పోలీసులు పేర్కొన్నట్టు ఇది ఎన్‌కౌంటర్ అయితే మొదట ముగ్గురు చనిపోగానే అక్కడి నుండి వెళ్లిపోవాలి, లేదా వారు మావోయిస్టులు కారని నిర్ధారించుకున్నప్పుడు వైద్యసేవలకు పంపించాలి. కాని కాల్పులు అయిపోయాక గొడ్డళ్లతో, వేట కొడవళ్లతో ప్రాణం ఉందో లేదో నిర్ధారించి మరీ హతమార్చారంటే ఇంత కంటే దుర్మార్గం ఉంటుందా? దండకారణ్యంలోని ఆదివాసులను అంత మొందించి, భయభ్రాంతులకు గురిచేసి, అడవినుండి విచ్ఛిన్నం చేసి బహుళజాతి కంపెనీలకు వనరులను తాకట్టుపెట్టే ప్రయత్నమే ఇదంతా. పైగా ఇక్కడ మావోయిస్టులుండడానికి అవకాశమేలేదు. ఈ బాసగూడకు అతిసమీపంలోనే బేస్‌క్యాంపు ఉంటుంది. ఆరోజు పోలీసులు

పేర్కొంటున్నట్టు చీకటి రాత్రి కూడా కాదు. పండువెన్నెల ఉంది. పోస్టుమార్టం రిపోర్టులో కూడా సిఆర్‌పిఎఫ్ బలగాలు అతి సమీపం నుంచి కాల్చినట్టు ఉంది. అదేగాక దూరంలో ఉన్న మనుషులను సైతం గుర్తించి, మావోయిస్టులా, సాధారణ వ్యక్తులా అని నిర్ధారణ చేసే అత్యంత ఆధునికమైన పరికరాలుంటాయి. ఏవిధంగా చూసినా ఇక్కడ ఎన్‌కౌంటర్ జరగడానికి వీలు లేదు. అయినా జరిగిందంటే ఆంతర్యమేమిటి? నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడం, తమ బిడ్డలను తామే చంపుకోవడం అని, నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన వారిని విధుల నుండి తొలగించి, శిక్షించాలని స్వయానా సుప్రీంకోర్టు పేర్కొంది. కాని పదిహేడు మంది అమాయకులను మావోయిస్టుల పేరుతో పొట్టన పెట్టుకున్న ఎనిమిది వందల మంది పోలీసులను ఎందుకు విధుల నుండి తొలగించలేదు. ఇక్కడ చనిపోయిన ప్రతివ్యక్తికి ఓటరు, రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇంకెంత కాలం ఆదివాసులపై ఈ రాజ్యహింస?

ప్రస్తుతం చత్తీస్‌గడ్‌లో సిఆర్‌పిఎఫ్ అధిపతిగా వ్యవహరిస్తున్న విజయకుమార్ గతంలో గంధం చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను పట్టుకునే క్రమంలో అక్కడున్న ఆదివాసులపై అనేకమైన దౌర్జన్యాలు చేసి, ఆదివాసి మహిళలను సంవత్సరాల తరబడి తుపాకులు ఎక్కుపెట్టి అత్యాచారం చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ అత్యాచారాలపై సుప్రీంకోర్టు వేసిన కమిషన్‌లో విచారణ ఎదుర్కొంటున్నాడు. ప్రస్తుతం చత్తీస్‌గడ్‌కు ఇన్‌చార్జి ఇవ్వడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది.

ఈ మారణకాండను మొదట ఎన్‌కౌంటర్ అని బుకాయించిన సిఆర్‌పిఎఫ్, హోంమంత్రి చిదంబరంలు దేశవ్యాప్తంగా నిరసనలు ఎదురవ్వడంతో 'సారీ తప్పయిందనీ', 'అమాయకులు ఎవరైనా చనిపోతే మన్నించండ'నీ మొసలి కన్నీరు కారుస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఎన్‌కౌంటర్ చేసిందేగాక బాధితులకు 2 డిసిఎంల నిండా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తే, గ్రామస్తులు మీరు పెట్టే చావుకూడు మాకొద్దని ప్రతిఘటించారు.

దండకారణ్యంలో ఇదేమీ కొత్తకాదు. ఒక అధ్యయనం ప్రకారం దండకారణ్యంలో అత్యాచారానికి గురికాని గడప లేదంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. 2006 నుండి అంటే, గ్రీన్‌హంట్ మొదలైన దగ్గర నుండి ఎర్రబోరు, తాకిలోడు, సింగనమడుగు, చింతలనార్, దంతెవాడ, నేడు బాసగూడల వరకు ఇటువంటి మానవ హక్కుల ఉల్లంఘనలు, హత్యాకాండలు, దురాగతాలు కొనసాగుతూనే ఉన్నాయి. భారత రాజ్యాంగం అధికరణ 29 ప్రకారం ఆదివాసి తెగల సంస్కృతి సంప్రదాయాల రక్షణను ప్రభుత్వం చూస్తుంది. కాని దీన్ని రక్షించాల్సిన పాలకులు రక్తపుమడుగులో నింపేశారు. అధికరణ 15(4) ప్రకారం ఆదివాసి తెగల విద్యా అభివృద్ధికి పాటుపడాలని పేర్కొంటే, అధికరణ 14 ప్రకారం పద్నాలుగు సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలి. ఇటీవల కాలంలో విద్యాహక్కు చట్టాన్ని సైతం అమలులోకి తెచ్చిన రాజ్యం ముక్కు పచ్చలారని ఇద్దరు విద్యార్థుల గుండెల్లో తూటాలు నింపింది.

అధికరణ 21 ప్రకారం అందరికీ జీవించే హక్కును కల్పించిన రాజ్యం దాన్ని కుళ్లబొడిచి ఆదివాసులను హతమార్చే హక్కులను కూడా కల్పించింది. అధికరణ 47 ప్రకారం మానవ హక్కులను కాపాడాలని రాజ్యాంగం చూపిస్తే, కోబ్రా దళాలు, సైనికబలగాలు, నాగాఫోర్స్, సల్వాజుడుం మూకలు, ఆదివాసి మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం, మహిళల స్తనాలను కోసేయడం, బాలింతల చేత నగ్నంగా నృత్యం చేయించడం, పారిపోతున్న వ్యక్తులను నీటి తొట్టిలో ముంచి చంపడం, గడ్డివాములో దాక్కున్న వారిని నిప్పంటించి సజీవ దహనం చేయడం వంటి దారుణాలు జరుగుతుంటే ఈ దేశంలో అసలు ప్రజాస్వామ్యం అనేది ఉందా? బ్రిటిష్ పాలనాకాలంలో భారత దేశాన్ని బ్రిటిష్ సైన్యాలు, బ్రిటిష్ పాలకులు భారతదేశ సంపదను దోచుకోవడానికి ఎటువంటి అకృత్యాలకు, దురాగతాలకు పాల్పడ్డారో, స్వతంత్ర భారతంగా ఏర్పడిన తర్వాత కూడా ఈ దేశ పాలకులు అలాంటి అకృత్యాలకే పాల్పడుతున్నారు.

దేశసరిహద్దులలో ఉండాల్సిన సైనిక బలగాలను దండకారణ్యంలోని ఆదివాసులను అంతమొందించడానికి వినియోగిస్తున్నారు.

భిల్లు తెగ ఆదివాసి మహిళా అత్యాచార కేసులో 2011లో సుప్రీంకోర్టు ఆదివాసులదే ఈ దేశం అని ఒక సంచలనాత్మక తీర్పు ఇచ్చింది. అందులో కొన్ని భాగాలను పరిశీలించినట్లయితే షెడ్యూల్డ్ తెగలు మినహా 92 శాతం మంది ప్రజలు భారత దేశానికి వలస వచ్చినట్లుగా పేర్కొంది. ఉత్తర అమెరికా, కెనడా, అమెరికా దేశాల లాగానే గత పది వేల సంవత్సరాలుగా ఈశాన్య, వాయవ్య ప్రాంతాల నుండి ప్రజలు వలస వచ్చారని పేర్కొంది. దీనికి కారణం, సారవంతమైన భూములు, సేద్యానికి కావల్సినంత నీరు, పశువులను మేపుకోవడానికి దట్టమైన అడవులు ఇలా వనరులన్నీ భారత దేశంలో ఉన్న కారణంగా వలస వచ్చారని పేర్కొంది. అదే విధంగా స్వతంత్ర పోరాటంలో భాగంగా భారత సమాజంతో ఆదివాసులు ప్రత్యేక భారతం కోసం భారతదేశానికి బ్రిటిష్ పాలకులు ఏవిధంగా వలసలు వచ్చారో మీరు కూడా అదే విధంగా వలసలు వచ్చారని, మీరు కూడా దేశాన్ని వదిలి వెళ్లాలని భారత సమాజంతో తిరుగుబాటు చేశారు. ఆ పోరాటాల్లో అనేకమంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారు. దీనిని గమనించిన నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటివారు 1947 ఆగస్ట్ 9న నెహ్రూ నివాసంలో రాజ్ దయాల్ ముండా లాంటి గిరిజన నాయకులతో చర్చలు జరిపి ఆదివాసి ప్రాంతాలను పాలించడం కోసం 5, 6 షెడ్యూళ్లను కల్పించారు. ఆదివాసి ప్రాంతాలన్నీ ప్రత్యేక పాలన కింద ఉండాలి. కాని నేడు దండకారణ్యం రణరంగంగా మారింది. అబూజ్‌మాడ్ సైనిక బలగాలతో నిండిపోయింది. నియమ్‌గిరి కొండలలో సామ్రాజ్యవాద కంపెనీలైన పోస్కో వేదాంత, టాటా, బిర్లా, మిట్టల్ లాంటి బహుళ జాతి కంపెనీలు రాజ్యామేలుతున్నాయి.

ఆదివాసులపై అకృత్యాల నివారణకు బాసగూడ ఘటనకు పాల్పడిన సైనిక బలగాలపై, పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. ఎస్.సి./ఎస్.టి. కేసు నమోదు చేయాలి. ఆ చర్యలకు పాల్పడిన వారిని విధులనుండి తొలగించాలి. సంఘటనా స్థలాన్ని కనీసం పరిశీలించని జిల్లా కలెక్టర్, ఎస్.పి.లపై ఎస్.సి./ఎస్.టి. అట్రాసిటీ కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలి. ఈపరిస్థితులపై సుప్రీంకోర్టు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దండకారణ్య పరిస్థితులపై ఒక కమిషన్ వేసి, మానవ హక్కులను కాపాడాలి. ఆదివాసులకు కల్పించిన చట్టాలను, హక్కులను అమలు చేసి ఆదివాసుల అభివృద్ధికి కృషి చేయాలి. న్యాయస్థానాల ఆజ్ఞలను పట్టించుకోకుండా దేశ అభివృద్ధిని మరిచిన ఈ బాసగూడ ఘటనకు బాధ్యుడైన హోంమంత్రి చిదంబరంను పదవి నుండి తొలగించాలి. దండకారణ్యం నుండి బలగాలను వెనక్కు పంపి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపి వేయాలి. లేదంటే ఆదివాసులు రాజ్యహింసకు వ్యతిరేకంగా, ఆదివాసిజాతి విముక్తి కోసం, వలస పాలన విముక్తి కోసం, భారత ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా మరో చారిత్రక తిరుగుబాటు చేసే అవకాశం లేకపోలేదు.

రచయిత రాష్ట్ర కార్యదర్శి (ఆం.ప్ర.), ఆదివాసి రచయితల సంఘం వీ

విశ్వ రహస్యాలు - హిగ్స్ బోసాన్

శాస్త్రవిజ్ఞాన పరిశోధనలో హిగ్స్ బోసాన్ అన్వేషణ ప్రాధాన్యతను వివరిస్తూ, శాస్త్రవిజ్ఞానాల చుట్టూ ఉద్దేశ పూర్వకంగా అల్లుతున్న మత భావాలను విమర్శిస్తున్నారు డా. జి. రామదేవుడు

ప్రకృతి ద్రవ్య (పదార్థ) కణాల సమూహంతో ఏర్పడింది. వివిధ ద్రవ్య కణాలు, బల వాహక కణాల చర్యల కారణంగా పదార్థం అవతరించింది. సామాన్య ప్రజలను అజ్ఞానాంధకారంలో మూఢ విశ్వాసాల పట్టు నుండి బయట పడకుండా ఉంచేందుకు తిరోగామి మతతత్వశక్తులు అనేక తప్పుడు సూత్రీకరణలను చేస్తున్నాయి. ప్రకృతి లేదా విశ్వం ఏదో 'శక్తి' లేదా వ్యక్తిచే సృష్టించబడిందనే తప్పుడు అవగాహనను ప్రబలంగా పెంచి పోషిస్తున్నారు. స్పష్టంగా గుర్తుంచుకో వలసిన అంశం ప్రకృతి 'సృష్టించబడలేదు'. అది వివిధ అవసరాలు, కారణాలు, అన్యోన్య చర్యల మూలంగా 'ఏర్పడింది'. విశ్వ ఆవిర్భావానికి కారణాలను శాస్త్రవేత్తలు చాలా ఏళ్లుగా వెతుకుతూనే ఉన్నారు. అందుకు అవసరమైన సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తూనే ఉన్నారు. చాలా విషయాలలో గొప్ప ముందడుగు వేసినా, ఇంకా చాలా విషయాలను శోధించవలసి ఉంది. సైన్స్ భౌతిక ప్రపంచ ఆవిర్భావాన్ని గురించి తెలుసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా, ప్రయోగ పరికరాలు, ప్రయోగాంశాలు, సిద్ధాంత విశదీకరణ వంటి అనేక అవాంతరాలు వస్తున్నాయి. వీటిని అధిగమించి నూతన ఐక్య సిద్ధాంతాన్ని ప్రకటించడానికి నూతన శాస్త్రసాంకేతిక పద్ధతులను ఉపయోగించు కుంటున్నారు. పదార్థానికి సంబంధించి ప్రాథమిక కణాలు, బలాలను భౌతిక శాస్త్రజ్ఞులు ఇతర శాస్త్రాల నిపుణులతో కలిసి కనుగొన్నారు. ఎలక్ట్రాన్‌లు, ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు వంటి స్థిరమైన కణాల గురించే మనకు ఎక్కువ తెలుసు. సూక్ష్మాతి సూక్ష్మ కణాలు అనేకం ఉన్నాయి. వీటి స్వభావం, ధర్మాలు, ప్రవర్తన గురించి అధ్యయనం చేసే శాస్త్రమే కణభౌతిక శాస్త్రం. పదార్థానికి ద్రవ్యరాశి ఎలా వచ్చింది? దీనికి కారణం ఏమిటి? అనే ప్రశ్నలకు జవాబు వెతికే క్రమంలో కొత్త కణాల ఆవిష్కరణ జరుగుతోంది.

భౌతిక శాస్త్రంలో పరిశీలనలు, ప్రయోగాలపరంగా చూస్తే కొంత మంది సూత్రీకరణలు చేసే సైద్ధాంతిక శాస్త్రవేత్తలు ఉంటే, ప్రయోగ పూర్వకంగా వాటికి భౌతిక రుజువులను కనుగొనే ప్రయోగకర్తలైన శాస్త్రజ్ఞులు మరికొంత మంది ఉన్నారు. కొందరు రెండు విభాగాలలోనూ నిష్ణాతులుగా ఉన్నారు. సైద్ధాంతిక అవగాహన కోసం క్లిష్టమైన గణిత సమీకరణాలను, నిత్యత్వ నియమాలను సిద్ధాంతకర్తలైన శాస్త్రజ్ఞులు వాడతారు. ఆ క్రమంలో ఒక చర్య లేదా ప్రక్రియను వివరించడానికి, అనువర్తించి నిత్యత్వ నియమాలను తృప్తి పరిచేందుకు కొన్ని బలాలు లేదా శక్తి, కొత్త ఊహాజనిత కణాలు తప్పనిసరిగా ఉండాలనే నిర్ణయానికి వారు వస్తారు. ఇటువంటి సూత్రీకరణ సందర్భంలో ఒక ప్రత్యేక కణం ఫలానా ధర్మాలతో ఉండాలని నిర్ధారణ చేస్తారు. ప్రయోగపూర్వకంగా అటువంటి కణం ఉనికిని కనుగొనే బాధ్యతను ప్రయోగ శాస్త్రవేత్తలు తీసుకుంటారు. గణిత సమీకరణాల ఆధారంగా ఊహించిన నూతన కణంను ప్రయోగపూర్వకంగా కనిపెట్టడం అంత సులభం కాదు. ఎందుకంటే పరమాణు ఉపకణాలు సూక్ష్మాతి సూక్ష్మమైనవి. వాటికి ఉండే భౌతిక పరిమితులు (ఉదాహరణకు ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి 9.1×10^{-31} కిలోగ్రాం మాత్రమే. అలాగే కేంద్రక కణాల చర్యలలో పాల్గొనే తటస్థ పయాన్ జీవిత కాలం కేవలం 8.4×10^{-17} సెకనులు) సాధారణ ఊహకు అందవు. కాబట్టి వీటిని గుర్తించడం కష్టం. అదే విధంగా వాటి ఉనికి నిర్ధారణకు సున్నితమైన, గొప్ప కచ్చితత్వం గల కాల ప్రమాణాలు, పరికరాలు అవసరం. సాంకేతికాభివృద్ధిలో ఇటువంటి అవసరాలను తీర్చే పరికరాల తయారీ మెరుగుపడింది. అలాగే కొత్త కణాల గుర్తింపుకు చాలా సునిశితమైన సెన్సార్లు కావాలి. సైద్ధాంతిక అవగాహన ద్వారా ప్రకటించిన కణం ఉనికిని కనుగొనడానికి చాలా సమయం పట్టవచ్చు. ఉదాహరణకు పరమాణు కేంద్రంలో ఉండే ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు తమ తమ స్థితులను పరస్పరం మార్పు చేసుకునే సందర్భంలో శోషణ చేసుకునే లేదా ఉద్గరించే కణం 'పయాన్' ఉంటుందని యుకావా అనే శాస్త్రవేత్త సూత్రీకరించారు. పన్నెండు సంవత్సరాల తర్వాత పయాన్‌ల ఉనికిని ప్రయోగ పూర్వకంగా నిర్ధారించారు. ఇదే విధంగా పదార్థ అస్తిత్వంకు సంబంధించిన కణాలను సిద్ధాంతపరంగానూ, చాలా వరకూ ప్రయోగ పూర్వకంగానూ కనుగొన్నారు. 'ప్రమాణ భౌతిక శాస్త్ర కణ నమూనా'కు అనుగుణంగా ద్రవ్య ఉనికికి అవసరమైన పన్నెండు ప్రాథమిక కణాలను, ఆరు బల వాహక కణాలను సూత్రప్రాయంగా కనుగొన్నారు. వీటిల్లో ఒకటి మినహా అన్నింటినీ ప్రయోగాత్మకంగా శోధించారు. ఆ ఒక్క కణమే పదార్థ ద్రవ్యరాశికి కారణం అవుతుందని పీటర్ హిగ్స్ తదితరులు 1960లలోనే భావించారు. ఆ కణంనే 'హిగ్స్ బోసాన్' అంటారు. తమ ప్రయోగాలలో 'హిగ్స్ బోసాన్'కు అన్ని విధాల ఇంచుమించు పోలి ఉన్న కణంను కనుగొన్నామని యురోపియన్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూక్లియర్ రిసెర్చ్ (ఫ్రెంచ్ భాషలో దీని క్లుప్తనామం సిఇఆర్ఎన్ – సెర్న్)కు చెందిన రెండు వేర్వేరు స్వతంత్ర శాస్త్రవేత్తల గ్రూపులు 4 జూలై 2012న ప్రకటించాయి. తమ పరిశోధన కచ్చితస్థాయి ఐదు సిగ్మా (35 లక్షల ఘటనలలో ఒక తప్పు వచ్చే సంభావ్యత)గా ఉందని ప్రకటించాయి. సంఖ్యాశాస్త్ర చాంచల్య భావన ప్రకారం ఈ స్థాయి కచ్చితత్వం కణం ఉనికిని కనుగొన్నట్లేనని భావించాలి. బహు జాగ్రత్తతో తమ పరిశోధనలో

కనుగొన్న అదృశ్యకణం హిగ్స్ బోసాన్‌కు అత్యంత సమీప ధర్మాలతో ఉందనీ, ఇదే ఇప్పటి వరకూ అన్వేషిస్తున్న హిగ్స్ బోసాన్ లేదా ఇతర బోసాన్ కణం కావచ్చునని ప్రకటించారు. హిగ్స్ బోసాన్ 'ప్రమాణ కణ నమూనా'లో ఇప్పటి వరకూ కనుగొనలేని కణం. ఇది ఒక బలవాహక కణం. ఇటువంటి కణాల ద్రవ్యరాశి చాలా సూక్ష్మం. కనుక వీటి ద్రవ్యరాశులను శక్తి రూపం (శక్తి (E)=ద్రవ్యరాశి×కాంతివేగం×కాంతివేగం=mc^2, ఐన్‌స్టీన్ సిద్ధాంతం)లో తెలియజేస్తారు. హిగ్స్ బోసాన్‌గా పిలవబడుతున్న ప్రస్తుత కణం ద్రవ్యరాశి 125–126 గిగా ఎలక్ట్రాన్ ఓల్ట్‌గా నిర్ధారించారు. ఇప్పటి వరకూ కనుగొన్న బోసాన్‌లలో ఇదే బరువైంది.

సెర్న్ సంస్థను ముప్ఫై సంవత్సరాల క్రితం స్విట్జర్లాండ్ – ఫ్రాన్స్ సరిహద్దుల్లో ఆల్ప్స్ పర్వత శ్రేణుల దగ్గర భూగర్భంలో 70 మీటర్ల దిగువన పరమాణు ఉపకణాలపై పరిశోధన కోసం, హిగ్స్ బోసాన్ ఆచూకీ గురించి, కృష్ణ పదార్థం, కృష్ణ శక్తి, విశ్వరచనకు సంబంధించిన పరిశోధనకై నిర్మించారు. 38 దేశాలకు చెందిన 176 సంస్థలకు చెందిన ఐదువేల మంది శాస్త్రజ్ఞులు ప్రస్తుత ప్రయోగంలో పాల్గొన్నారు. సెర్న్‌లో ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, హంగేరి, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, పోలాండ్, పోర్చుగల్, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, యుకె సభ్యదేశాలుగా ఉన్నాయి. రుమేనియా వీటికి జత కాబోతుంది. ఇజ్రాయిల్, సెర్బియాలు ప్రాథమిక సహ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఇండియా, జపాన్, రష్యా, అమెరికా, టర్కీ, యూరోపియన్ కమిషన్, యునెస్కో పరిశీలకుల హోదాలో ఉన్నాయి.

సెర్న్ పరిశోధనశాలలో ఉన్న లార్జ్ హెడ్రాన్ కొలైడర్ (ఎల్‌ఎచ్‌సి) 27 కిలోమీటర్ల కంకణం ఆకారంలో ఉండే కణ త్వరణకారిణి, అయస్కాంత క్షేత్ర సహాయంతో కణాల వేగాన్ని క్రమంగా పెంచుతూ వాటి త్వరణంలో మార్పును తీసుకొచ్చి వాటికి అధిక శక్తి కలిగేలా చేస్తారు. ప్రపంచంలోనే అత్యధిక శక్తిగల కణ పుంజాలను ఇది ఉత్పత్తి చేస్తుంది. పరమాణువులను అత్యధిక వేగంతో తాడనం చేయడం ద్వారా ఉద్భవించే పరమాణు ఉపకణాలను తెలుసుకోవడానికి ఇది ఉపయోగ పడుతుంది. ప్రస్తుత ప్రయోగంలో పరస్పర వ్యతిరేక దిశలలో చలించే ఎనిమిది టెర్రా ఎలక్ట్రాన్ ఓల్ట్‌ల శక్తిగల ప్రోటాన్‌లను ఢీకొట్టించడం ద్వారా విశ్వ ఆవిర్భావానికి కారణం అనుకుంటున్న బిగ్ బ్యాంగ్ విస్ఫోటనంలో తొలి సెకనులో ముప్ఫై లక్షో వంతు కాలంలో జరిగిన పరిస్థితులను సృష్టించడమే ప్రయోగంలోని ప్రధానాంశం. బిగ్‌బ్యాంగ్ తొలి సెకను ఆరంభంలో ప్రాథమిక కణాలు స్వతంత్రంగా ఉన్నాయి. ఈ ప్రయోగంలో హిగ్స్ బోసాన్ ఉనికిని స్పష్టంగా కొలవడానికి మూడు నెలల కాలంలో సుమారు ఐదు వందల ట్రిలియన్ల ప్రోటాన్ – ప్రోటాన్ తాడనాలను జరిపారు. ఈ తాడనాలలో విడుదలయ్యే కణాలలో 'హిగ్స్ బోసాన్' ఒకటి.

పన్నెండు పరమాణు ఉపకణాలు, నాలుగు ప్రాథమిక బలాల మధ్య ఉండే అంతఃసంబంధం ఆధారంగా విశ్వ ఆవిర్భావంను అర్థం చేసుకుంటారు. 1960లలో పీటర్ హిగ్స్, రాబర్ట్ బ్రాట్, ఫ్రాంకో ఎన్‌గ్లార్ట్ తదితరులు 'ప్రమాణ కణ నమూనా'ను ప్రతిపాదించారు. వీరి ప్రతిపాదన ప్రకారం పదార్థ ద్రవ్యరాశికి కారణం హిగ్స్ బోసాన్. కాంతి కణం ఫోటాన్ మాదిరిగానే హిగ్స్ ప్రక్రియలో హిగ్స్ మాధ్యమపు ప్రమాణ కణాన్నే హిగ్స్ బోసాన్ అంటారు. సత్యేంద్రనాథ్ బోస్ – ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన ధర్మాలను పాటించే కణాలను బోసాన్లు (బోసు పేరు మీదుగా) అంటారు. గురుత్వాకర్షణ బలం (కణం – గ్రావిటాన్) మినహా మిగిలిన మూడు ప్రాథమిక బలాలు, బల వాహక కణాల వినిమయ బదలాయింపు ఫలితంగా ఏర్పడతాయి. ద్రవ్య కణాల మధ్య శక్తి వివిక్తంగా బోసాన్‌ల మార్పిడి ద్వారా పరస్పరం బదలాయించు కుంటాయి. నాలుగు ప్రాథమిక బలాలు వాటికి అనురూపకమైన తమదైన బోసాన్‌ను కలిగి ఉంటాయి. విశ్వాంతరాళం అంతా హిగ్స్ క్షేత్రం వ్యాపించి ఉంటుంది. ఈ క్షేత్రంతో ఏదైనా ద్రవ్య కణం హిగ్స్ బోసాన్ ద్వారా చర్యలో పాల్గొంటే దాని ద్రవ్యరాశి వస్తుంది. చర్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఆ కణ ద్రవ్యరాశి కూడా ఎక్కువగా ఉంటుంది. ఏ కణం అయితే హిగ్స్ బోసాన్‌తో చర్య జరపదో దానికి ద్రవ్యరాశి ఉండదు. పన్నెండు ప్రాథమిక ద్రవ్య కణాలను ప్రధానంగా లెప్టాన్స్, క్వార్క్స్ అనే రెండు రకాలుగా విభజిస్తారు. ప్రతీ రకంలో ఆరు కణాలు జతలుగా లేదా తరం లేదా చానళ్లుగా ఉంటాయి. స్థిరమైన, తేలిక అయిన మొదటి తరం కణాలతోనే విశ్వంలో పదార్థం అంతా ఏర్పడింది. మొదటి తరం కణాలుగా లెప్టాన్స్ (ఎలక్ట్రాన్, ఎలక్ట్రాన్ న్యూట్రినో), క్వార్క్‌లు (డౌన్, అప్) రెండు రెండు చొప్పున ఉన్నాయి. ఈ నాలుగు కణాలచేత పదార్థం ఏర్పడింది. రెండోతరం లెప్టాన్లు – మ్యూయాన్, మ్యూయాన్ న్యూట్రినో, మూడోతరంలో టౌ, టౌ న్యూట్రినో కణాలు ఉన్నాయి. అలాగే క్వార్క్‌లలో రెండో తరానికి స్ట్రేంజ్, చార్మ్ క్వార్క్‌లు, మూడవ తరంలో బాటం, టాప్ క్వార్క్‌లు ఉన్నాయి. ఈ పన్నెండు కాక బల వాహక కణాలు ఆరు ఉంటాయని సిద్ధాంతపరంగా ముందే ఊహించినా వాటిలో ఐదింటిని గ్లూఆన్, W–బోసాన్, W^+–బోసాన్, Z–బోసాన్‌లను ప్రయోగాలలో కనుగొన్నారు. మిగిలిన ఆ ఒక్క కణం హిగ్స్ బోసాన్. సెర్న్ శాస్త్రజ్ఞులు ప్రకటించిన కణం ఆ హిగ్స్ బోసాన్ అయి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఒకవేళ అదే అయితే 'ప్రమాణ కణ నమూనా' అస్తిత్వంలో ఉంటుంది. కాకపోతే మరో సిద్ధాంత నమూనాను తయారు చేయవలసి ఉంటుంది. బిగ్‌బ్యాంగ్ విస్ఫోటనంలో ఏర్పడిన గ్రహాలు, నక్షత్ర సముదాయాలు తదితర పదార్థం కేవలం నాలుగు శాతం ద్రవ్యాన్ని మాత్రమే సూచిస్తుంది. మనకు తెలియకుండా అదృశ్యమైన 96 శాతంలో 23 శాతం కృష్ణ పదార్థం (డార్క్ మేటర్)గా, 73 శాతం కృష్ణశక్తి (డార్క్ ఎనర్జీ)గా మారింది.

పైన ఉన్న వివరణ ప్రకారం అన్ని కణాల మాదిరిగానే హిగ్స్ బోసాన్ సమీప కణాన్ని కూడా కనుగొన్నారు. దీనికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా అటు సాధారణ ప్రజల్లోనూ, ఇటు శాస్త్రవేత్తలు, విద్యార్థులలోనూ ప్రచారం ఎక్కువగా వచ్చింది. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా హిగ్స్ బోసాన్‌ను 'దైవకణం', 'గాడ్ పార్టికల్' అంటూ విశేష ప్రచారం చేశాయి. 'దైవకణం' అనే పద ప్రయోగాన్ని అమెరికాకు చెందిన కణ భౌతిక శాస్త్రవేత్త, న్యూట్రానోల పరిశోధనపై నోబెల్ బహుమతి గ్రహీత అయిన లీమాన్ లీడర్‌మన్ తాను డి. టెరసితో కలిసి రచించిన 'ది గాడ్ పార్టికల్' అనే పుస్తకంలో చెప్పాడు. అయితే హిగ్స్ బోసాన్ కణానికి దైవత్వాన్ని ఆపాదించే క్రమంలో దానిని ఉపయోగించలేదు. హాస్య చతురతకు, వ్యంగ్యానికి లీడర్‌మన్ పేరున్న భౌతిక శాస్త్రవేత్త. 'దైవకణం'గా ఎందుకు

అనవలసి వచ్చిందో వివరణ ఇస్తూ – ఈ కణం ఉనికిని తెలుసుకోవడం లో అది పోషించిన 'ప్రతినాయక' పాత్రను, ప్రయోగాలకు చేసిన ఖర్చును, తన పుస్తక ప్రచురణకర్త ఆ కణంకు 'Goddamn' పేరు పెడితే ఒప్పుకోక పోవచ్చునని పేర్కొన్నారు. అయితే హిగ్స్ బోసాన్‌కు సరైన పేరు 'Goddamn particle' గానే బాగుంటుందని రాశాడు. బైబిల్‌లో ఉన్న కథను ప్రస్తావిస్తూ 'దైవకణం'ను అలా పిలవవలసి వచ్చిందని పేర్కొన్నాడు.

మతతత్వ శక్తులు ప్రతీ శాస్త్ర ఆవిష్కరణలో 'దైవాన్ని' ఇమడ్చాలని ప్రయత్నిస్తూనే ఉంటాయి. సృష్టి కారకం దైవం అనే భావనను కాపాడుకుంటూ వస్తున్నారు. విశ్వం, భూమి ఏర్పడిన కాలంలో వీరు పేర్కొంటున్న దేవుళ్లు, దేవతలు, మత గ్రంథాలకు చోటు లేదు. 'మతం' అనే పదం పుట్టుకపైన చాలా చర్చ ఉంది. 'దైవంకు భయపడే' స్వభావం, ప్రవర్తన, విశ్వాసంగా లాటిన్ పదం 'రిలిజియో' నుండి వచ్చినట్లు తెలుస్తుంది. లాటిన్ పదం 'రిలిగేర్' అంటే 'బిగుతుగా పట్టి ఉంచడం' నుండి పుట్టింది 'మతం' అంటారు. ప్రాచీన లిథువేనియన్ పదం ప్రకారం మ్యాజిక్ చేసే వారిని దేవుడు (గాడ్)గా పిలిచేవారు.

దేవుళ్లు, దైవం అనే భావన కేవలం విశ్వాసాలకు, నమ్మకానికి చెందిన అంశంగా పేర్కొంటారు. అయితే ఆ విశ్వాసాలు, నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, మూఢనమ్మకాలకు సంబంధించింది. నిజమైన విశ్వాసాలకు, నమ్మకాలకు మతం లేదా దైవ సంబంధిత కార్యక్రమంలో చోటులేదని అందరికీ తెలిసిన విషయమే.

విశ్వం బిగ్‌బ్యాంగ్ విస్ఫోటనో సుమారు 1400 కోట్ల సంవత్సరాలు అయిందని శాస్త్రజ్ఞులు ప్రకటించారు. భూమి ఏర్పడి 454 కోట్ల సంవత్సరాలు అయింది. అప్పటికి ఎటువంటి జీవం భూమిపై లేదు. ఏక కణ జీవులు సుమారు 350 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడి ఉండవచ్చు. భూ వాతావరణం చల్లబడిన తరువాత సుమారు 250 కోట్ల సంవత్సరాల క్రితం ప్రాణవాయువు ఆక్సిజన్ సరిపడే స్థాయిలో ఏర్పడింది. మానవజాతి మనుగడ భూమిపై కేవలం రెండు లక్షల సంవత్సరాల క్రితమే మొదలైంది. సాహిత్య పరంగా గ్రీకు దేవతలు, పురాణాల కాలం క్రీస్తు పూర్వం 1800–1200 అయితే ఆర్కియాలజీ ప్రకారం ఈ కాలం క్రీస్తు పూర్వం 1200–550 ఉండవచ్చు. అలాగే అతి ప్రాచీన వేదమైన రుగ్వేద కాలమే వివాదాస్పదం. కొంతమంది రుగ్వేదకాలం క్రీ.పూ. 1700–1100 అంటే మరికొందరు క్రీ.పూ. 150 అంటారు. కొందరు క్రీ.పూ.7000 అంటారు. దక్షిణాసియా రాతియుగం కాలం క్రీ.పూ. 7000. వాల్మీకి రామాయణ కాలం క్రీ.పూ. 5–4 శతాబ్దాలు. కృష్ణుడు, మహాభారత కాలాలు క్రీ.పూ. 3102–3140 గా పేర్కొంటారు. అంటే మహాభారతం, రామాయణ గ్రంథాలు, అప్పటి యుద్ధాలు జరిగిన కాలాలకు భూమి, విశ్వం ఏర్పడి కాలాలకు ఏ మాత్రం పోలిక లేదు. 'విశ్వ సృష్టి' విశ్వావిర్భావం తరువాత చాలా కోట్ల సంవత్సరాల అనంతరం మతవాదులు చేశారు. క్రీస్తు శకం ప్రారంభమైంది రెండు వేల సంవత్సరాల క్రితమే. సుమారు 33 ఏళ్ల వయసులో క్రీస్తు చనిపోయి ఉండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయం. విశ్వం ఏర్పాటుకు, మానవజాతి ఆవిర్భావానికి మధ్య ఉన్న కాల భేదం చాలా ఎక్కువ. తెలియని, లేక లేని భావనను సృష్టించి సామాన్య ప్రజానీకంపై పట్టు జారకుండా ఉండాలని చరిత్రలో సైన్సు అంశాలలో దైవాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. సమాధానం, వివరణ ఇవ్వలేని సందర్భంలో 'దైవం విశ్వవ్యాప్తం' అని ప్రకటించేసారు సనాతన వాదులు. వాదనలో గెలవలేని పరిస్థితి వచ్చినప్పుడు సమాధానం ఇవ్వలేక ప్రహ్లాదుని వృత్తాంతాలు తెచ్చారు. ఇందుగలడు, అందుగలడు అంటూ ఎక్కడా లేని దైవాన్ని అంతా ఉన్నాడనే భ్రమను ప్రచారం చేశారు.

ప్రాథమిక కణాలు – విశ్వం ఏర్పడినప్పుడే అవీ ఏర్పడ్డాయి. వాటిని శోధించడానికి ఇంతకాలం పట్టింది. వాటి ఉనికి నేటికి బహుశా వ్యవస్థితమైంది. 'ప్రమాణ కణ నమూనా' ఇంకా వివరించవలసిన అంశాలు మిగిలే ఉన్నాయి. భవిష్యత్‌లో వీటిని పరిష్కరించే దిశగా భౌతిక శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. పురాణ కథలు, గాథలు, 'సోషల్ ఫాంటసీ'కి సంబంధించినవి. దేవుళ్లుగా చిత్రీకరిస్తున్న వ్యక్తులు అప్పటి రోజులలో (గ్రీకు, రోమన్ పురాణాలలో వలె) సమూహాలకు అధిపతులు మాత్రమే కావచ్చు. ఒక అంశాన్ని గొప్పగా చెప్పడానికి దానికి అనేక విశేషణాలు, విశేషాలు జోడించి కథలుగా ప్రచారం జరుగుతుంది. సాటిలేని వ్యక్తులుగా చెప్పేందుకు ఊహకందని 'శక్తులు' ఉన్నాయని పేర్కొంటారు. అటువంటి ఉన్మాదం మన సినిమా హీరోయిజంలో కూడా కనిపిస్తుంది. కత్తులు, తుపాకులు, బుల్లెట్, అనేక మంది కలిసి కూడా 'నాయక' పాత్రను ఏమీ చేయలేరు. ఊహాజనితమైన అంశాలలో కొన్ని నిజంగా ఊహకే పరిమితం. మరికొన్ని సైన్సు శాస్త్రీయంగా ఊహ లేదా నిజమాని నిగ్గు తెలుస్తుంది. ఆ క్రమంలోనే 'హిగ్స్ బోసాన్' కణంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. 'హిగ్స్ బోసాన్' కణాన్ని ప్రతిపాదించిన పీటర్ హిగ్స్ దానిని 'దైవకణం'గా పేర్కొనడాన్ని స్వయంగా వ్యతిరేకించాడు. సామాన్య ప్రజానీకాన్ని మభ్యపెట్టేలా ఉన్న ఈ పద ప్రయోగాన్ని శాస్త్రజ్ఞుల సమూహం వ్యతిరేకిస్తుంది. హిగ్స్ బోసాన్‌కు మత లేదా ఆధ్యాత్మిక సంబంధం ఏమీ లేదు. అది ద్రవ్యంకు సంబంధించి అంటే భౌతిక ప్రపంచానికి సంబంధించిన వాస్తవరూపం. బలవాహక కణం. 'దైవకణం' పదం తప్పుడు సంకేతాలను ప్రజలలో వ్యాపింపజేస్తుంది. లాటిన్, గ్రీకు భాషల నుండి వివిధ భాషలలోకి దిగుమతి అయిన పదాలకు సరి సమానమైన అర్థాలు, పదాలు లేనప్పుడు వాటిని అదే విధంగా మాతృభాషలో రాయడం, వాడకం సైన్సులో ఎప్పటి నుండో వస్తున్నదే. కాబట్టి హిగ్స్ బోసాన్‌కు తెలుగులో సమానార్థం లేదా తెలుగు పదం 'హిగ్స్ బోసాన్'. ఇప్పటికైనా సంచనాల కోసం కంటె నిజాల ప్రచారంకు పత్రికలు, మీడియా దృష్టి పెట్టాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ (సీనియర్),
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్, వాసవి ఇంజనీరింగ్ కాలేజి) వీ

కరపత్రం ఉంటే యావజ్జీవ శిక్ష!

పౌరహక్కుల కార్యకర్త సీమా ఆజాద్, ఆమె భర్త విశ్వ విజయ్‌లను అరెస్టు చేసిన తీరు, కోర్టు యావజ్జీవ శిక్ష విధించిన తీరును వివరిస్తున్నాయి పియుసిఎల్, పియుడిఆర్ సంస్థలు

రచయిత్రి, దస్తక్ (మాసపత్రిక) సంపాదకురాలు, ఉత్తరప్రదేశ్ పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) నిర్వాహక కార్యదర్శి సీమా ఆజాద్‌ని భారత ప్రభుత్వంపై యుద్ధం నెరిపిందనీ, తీవ్రవాద సంస్థ సభ్యురాలనీ, మద్దతుదారనీ ఆరోపణలపై విచారణ జరిపిన అలహాబాదు జిల్లా, సెషన్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి, అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్ సింగ్ 2012 జూన్ 8న తీర్పునిస్తూ జీవిత ఖైదు శిక్ష విధించారు. ఆమె భర్త విశ్వవిజయ్‌కి కూడా ఇదే శిక్ష విధించారు. ఆ ఇద్దరూ నైని జైలులో 27 నెలలు గడిపిన తరువాత ఈ తీర్పు వెలువడింది.

మావోయిజం, తీవ్రవాదాల పేర్లతో యుఎపిఎ వంటి నిర్బంధక చట్టాలను, భారతీయ శిక్షా స్మృతిలోని వలసపాలననాటి భద్రతా నిబంధనలను ఉపయోగించుకొని భారత భద్రతా వ్యవస్థ, పోలీసు, ఇంటెలిజెన్స్ న్యాయ వ్యవస్థలోని కొందరితో కలసి ఎవరినైనా ఖైదు చెయ్యవచ్చని మరోసారి వెల్లడయింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే, ప్రత్యామ్నాయ అభిప్రాయాలను కలిగి ఉండే వారి పరిస్థితి ఏమిటో ఈ తీర్పు హెచ్చరిస్తోంది.

ఈ నేపథ్యంలో ఈ కేసుని లోతుగా పరిశీలించి, తీర్పుని విశ్లేషించి, సీమా ఆజాద్, విశ్వవిజయ్‌లకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ, వారి విడుదలను కోరుతూ విస్తృత ప్రచారోద్యమాన్ని చేపట్టాలి. మావోయిజం, తీవ్రవాదాల పేర్లతో మనుషులు కనపడకుండా పోవడం, తప్పుడు కేసులు బనాయించడం, అక్రమంగా నిర్బంధించడం ఎక్కువ అవుతున్న ఈ తరుణంలో ఈ పని చేయడం ఎంతో అవసరం. అప్రకటిత అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నట్లు ఉంది. దేశ పౌరుల ప్రాణాలు, స్వేచ్ఛ ముప్పులో ఉన్నాయి. నిరసన గళాలను, మానవ హక్కుల కార్యకర్తల గొంతుకలను నొక్కివేస్తున్నారు. దీనిని తక్షణమే ప్రతిఘటించాలి.

అత్యవసర పరిస్థితి విధించిన కొద్ది రోజులకే, అంటే 1975 ఆగస్టు 5న సీమా పుట్టింది. ఆమె వయస్సు ఇప్పుడు 37 సంవత్సరాలు. ఆమె మొదట గోరఖ్‌పూర్‌లోనూ, తరువాత తండ్రికి బదిలీ అయినప్పుడు అలహాబాదులోనూ చదువు కొనసాగించింది. ఆమె అలహాబాదు నుంచి డిగ్రీ, మనస్తత్వ శాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేసింది. 1995 వరకూ ఆమె ఆసక్తులు విశ్వ రహస్యాలకు, శాస్త్రీయ అంశాలకు పరిమితమై ఉండేవి. జె.డి. బెర్నాల్ 'చరిత్రలో విజ్ఞాన శాస్త్రం' వంటి పుస్తకాలతో సామాజిక ఉద్యమాలవైపుకి ఆమె దృష్టి మళ్లింది. తాను ఉంటున్న సమాజ ప్రగతికి అవరోధంగా ఉన్నవాటిని అర్థం చేసుకోడానికి జ్యులియస్ ఫ్యుజిక్ 'రక్తాక్షరాలు' వంటి పుస్తకాలు దోహదం చేశాయి. 1995-96 నాటికి విద్యార్థి, మహిళా రాజకీయాల్లో ఆమె క్రియాశీలక పాత్రవహించసాగింది. 2001 వరకు మహిళా విముక్తి ఉద్యమంలో సీమా చురుకుగా పాల్గొంది. విప్లవ విద్యార్థి ఉద్యమాలతో ఏర్పడిన బంధం 2004 వరకు కొనసాగింది.

సీమా తన జీవిత భాగస్వామిని తానే ఎన్నుకొంది. విశ్వ విజయ్‌ని పెళ్లి చేసుకుని ఇల్లు విడిచిపెట్టింది. కులాన్ని తెలియచేసే శ్రీవాస్తవ అన్న ఇంటి పేరుని తీసేసి 'ఆజాద్' అని పెట్టుకుంది. ఒక కొత్త సీమా: సీమా ఆజాద్ ఉదయించింది. తన దగ్గర ఉన్న కొద్దిపాటి మొత్తాన్ని కూడగట్టుకుని ఒక మోటారుసైకిలు కొనుక్కుంది. ప్రజల జీవితాలు, వారి పోరాటాలు, వారి కలల గురించి రాయడానికి వారి మధ్యకు వెళ్లింది. దినపత్రికల్లో ప్రజల పోరాటాలు ప్రచురితమయ్యేలా చూడడానికి నిరంతరం కృషి చేసింది. 2006 వరకు సహారా దినపత్రికకు క్రమం తప్పకుండా రాసేది. అలహాబాదు నుంచి వెలువడే అనేక దినపత్రికలు ఆమె వ్యాసాలను ప్రముఖంగా ప్రచురించాయి. మానవ హక్కుల కోసం, కార్మిక, కర్షక అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో సీమా పాల్గొంది.

2006 తరువాత ప్రజల ఉద్యమాలు, సామాజిక-రాజకీయ ఆలోచనలకు ప్రాముఖ్యతను ఇచ్చే పత్రికను ప్రచురించాలని సీమా నిర్ణయించుకుంది. దస్తక్ అన్న ఈ పత్రిక ఉద్యమంలో భాగమయింది. వేలాది ప్రజలను నిర్వాసితులను చేసే గంగా ఎక్స్‌ప్రెస్ పథకం గురించి ఈ పత్రిక ద్వారా కూపీలు తీసింది. గంగా ఎక్స్‌ప్రెస్ పథకం వల్ల సంభవించే ముప్పులను మరింత మంది ప్రజలకు తెలియ చేయడానికి ఆమె చేసిన సర్వే ఫలితాలను ఒక చిన్న పుస్తకంగా ప్రచురించి, పంపిణీ చేసింది. అజామ్‌ఘఢ్‌లో ముస్లిం యువతపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) చేసిన అడ్డగోలు అరెస్టులను, దారుణాలను ఒక సుదీర్ఘ వ్యాసంగా దస్తక్‌లో ప్రచురించింది. మానవ హక్కుల ఉద్యమంలో సీమా ఆజాద్ క్రమేపీ మరింత క్రియాశీలక పాత్ర పోషించసాగింది. మూడవ ప్రపంచ దేశాల పేద ప్రజలు కోరుకుంటున్న మార్పు గురించి ఒబామా నిజంగా మాట్లాడుతున్నాడా అన్న అంశంపై ఒక సంచికలో రాసింది.

సీమాకి స్ఫూర్తినిచ్చిన వారిలో ఆమె తండ్రి ఎం.పి. శ్రీవాస్తవ కూడా ఉన్నారు. ఆయన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో సహాయక కార్మిక కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేలా చూడడానికి ఆయన చేసిన కృషి ఎంతో జనాదరణ పొందింది. పదవీ విరమణ తరువాత కార్మిక చట్టాలపైనా, దానితో ముడిపడి ఉన్న రాజ్యమూ, దేశంపైనా ఎన్నో పుస్తకాలు రాశారు. 2009లో సీమా ఉత్తరప్రదేశ్ పియుసిఎల్ శాఖలో చేరింది. అక్కడ ఆమె నిర్వాహక కార్యదర్శి బాధ్యతలను నెరవేరుస్తోంది.

సీమా అరెస్టు అయ్యే సమయానికి ఉత్తరప్రదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన, ముస్లింల వివరాలు సేకరించడం, అవినీతి రాజకీయాలు, వనరులను విధ్వంసం చేసే ఆర్థిక విధానం, పెరుగుతున్న సామాజిక

అభద్రత, హింసను ప్రేరేపించే రాజకీయాలు, దళితులు, మైనారిటీల ఓట్ల కోసం వేసే వేషాలు, తిరిగి వారిపైనే సాగించే దమనకాండ ప్రజల్లో అసంతృప్తిని, కోపాన్ని రగిలిస్తున్నాయి. ఒక కొత్త యువకెరటం వీటిపై గళమెత్తుతోంది. ఈ స్పందన కేంద్రానికీ, రాష్ట్రానికీ కంటకప్రాయంగా అనిపించసాగింది. ఈ నిరసనలు వ్యక్తపరుస్తున్న వారిలో సీమా ఆజాద్ ఒకరు.

ప్రతిసారీలాగానే ఈసారి కూడా ఢిల్లీలోని విశ్వ పుస్తక ప్రదర్శనకు సీమా వెళ్లింది. తిరిగి అలహాబాదుకి ప్రయాణమై ఢిల్లీలో ఫిబ్రవరి 5 సాయంత్రం రేవా ఎక్స్ ప్రెస్ ఎక్కింది. 6వ తారీకు ఉదయం కాన్పూరు దాటిన తరువాత ఆమె ఉన్న కోచ్‌లోకి పోలీసులనిపించే పొడవాటి వ్యక్తులు రావడంతో ఆమెకు అనుమానం కలిగింది. వాళ్లు తెలుగులో మాట్లాడుకుంటున్నారని గుర్తించి, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినవాళ్లని తెలుసుకుంది. అలహాబాదులో దిగినప్పుడు ఆమెను మరింతమంది పురుషులు చుట్టుముట్టసాగారు. అయినప్పటికీ ఆమె తన భర్త వేచి ఉన్న సివిల్ లైన్స్ వైపుకి బయటకు నడవసాగింది. పార్కింగ్ వద్ద మోపెడ్ నుంచి విశ్వ దిగుతుండగా ఇద్దరినీ అరెస్టు చేశారు. అప్పుడు సమయం ఉదయం 11.30 గంటలు.

కానీ, అలహాబాదులోని ఖుల్దాబాద్ పోలీసు స్టేషనులో 2012 ఫిబ్రవరి 6న నమోదైన ఎఫ్.ఐ.ఆర్. క్రిమినల్ కేసులో రైల్వే స్టేషను బయటికి మరో వైపు అయిన ఖుష్రుబాగ్ వద్ద రాత్రి 9.30కి వాళ్లు అరెస్టు అయినట్లు చూపించారు. వారిపై యుఎపిఎలోని 18, 20, 21, 23 (2) సెక్షన్లకింద, ఐపిసిలోని 120 (బి), 121, 121 (ఎ) సెక్షన్లకింద కేసు నమోదు చేశారు.

ఈ విషయం గురించి మరునాడు వార్తా ఛానళ్ల ద్వారా మాత్రమే సీమా కుటుంబానికి తెలిసింది. ఆ వెంటనే వాళ్లు పోలీసు స్టేషనుకి వెళ్లారు. ఆమెను చూడడానికి కెమెరామెన్లనూ, ఫొటోగ్రాఫర్లనూ నెట్టుకుంటూ వెళ్లవలసివచ్చింది. సీమా, విశ్వ విజయ్‌లను పోలీసు రిమాండుకి స్థానిక మెజిస్ట్రేటు అనుమతించలేదు. వాళ్లని ఫిబ్రవరి 7న అలహాబాదులోని నైనీ జైలుకి పంపించారు.

పోలీసులు దాఖలు చేసిన నేరారోపణ పత్రం ఎఫ్ఐఆర్‌ని మించి పోలేదు. ఎఫ్.ఐ.ఆర్. కథనానికి పోలీసులు జరిపిన ఇంటి సోదాకూ తేడా ఉంది. సీమా ఇంటి సోదా ఆమె అరెస్టు అయిన 5 నెలల తరువాత చట్టవిరుద్ధంగా జరిగింది. ఎఫ్ఐఆర్, సోదాల ఆధారంగా పోలీసులు చెప్పేదాని సారాంశం ఇక్కడ ఇస్తున్నాం.

సీమా ఆజాద్, ఆమె భర్తలపై ప్రాసిక్యూషన్ వారు ఆరోపణలు మోపడానికి చెబుతున్న కథనం ఇలా ఉంది:

1. భార్యా, భర్తలను అరెస్టు చెయ్యడానికి కొన్ని గంటల ముందు 6.2.2010న అరెస్టు అయిన సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యుని ద్వారా సీమా ఆజాద్, విశ్వ విజయ్‌లు సిపిఐ (మావోయిస్టు) పార్టీ కార్యకర్తలన్న సమాచారం అందింది. దీని ఆధారంగా వారిపై నిఘావేసి పట్టుకున్నారు.

2. సిపిఐ (మావోయిస్టు) పార్టీ బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ ప్రతినిధుల సమావేశానికి కాన్పూర్ వెళ్లడానికి రైల్వే స్టేషను దగ్గర సీమా ఆజాద్, ఆమె భర్త ఫిబ్రవరి 6న రాత్రి 9.30 గంటలకు ఉన్నారు. ఈ సమావేశానికి కొంతమంది ముఖ్యమైన నాయకులు కూడా హాజరు కానున్నారని సమాచారం.

3. వారి భుజాన ఉన్న సంచిలో సిపిఐ మావోయిస్టు పార్టీ ప్రచురించిందని చెప్పబడుతున్న సాహిత్యం కొంత ఉంది. (వీరిని సోదా చెయ్యడానికి ముందు ఎటువంటి ఆధారాలను వారిపై రుద్దకుండా ఉండడానికి నియమాల ప్రకారం పోలీసులు ఒకరినొకరు సోదా చేసినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సీమాని ఒక మహిళా కానిస్టేబుల్ సోదా చేసింది.)

4. ఎఫ్ఐఆర్ ప్రకారం వాళ్లిద్దరూ (రైల్వే స్టేషను బయట నిలబడి ఉన్నప్పుడు) తాము సిపిఐ మావోయిస్టు పార్టీ కార్యకర్తలమనీ, సాయుధ పోరాటం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టి మావోయిస్టు పాలనను తీసుకురావడం తమ ఉద్దేశమనీ చెప్పారు.

5. వారి మోపెడ్‌కి సంబంధించిన కాగితాలు చూపించలేకపోవడం వల్ల దానిని జప్తు చేసి మోటారు వాహనాల చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు.

6. వారి అరెస్టుకి ముందు గోరఖ్‌పూర్‌లోనూ, వారి అరెస్టు తరువాత కాన్పూర్, ఢిల్లీలలో అరెస్టు అయిన వాళ్లందరూ సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులు లేదా దాని సానుభూతిపరులు. వీరందరి దగ్గర పార్టీ సాహిత్యం దొరికింది, వీటిల్లో కొన్ని పుస్తకాలు సీమా ఆజాద్ దగ్గర కూడా దొరికాయి.

7. పైన పేర్కొన్న అరెస్టు అయిన వ్యక్తులు పోలీసుల ముందు ఇచ్చిన వాంగ్మూలంలో సీమా ఆజాద్, ఆమె భర్త మావోయిస్టు పార్టీ కార్యకర్తలని చెప్పారు. (ఎవరూ కూడా మెజిస్ట్రేటు ముందు నేరాంగీకార వాంగ్మూలం ఇవ్వలేదన్న విషయాన్ని గమనించండి. కేసు మొత్తం పోలీసుల ముందు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే నడుస్తుంది.)

8. సీమా ఇంటి సోదాలో దొరికిన వాటిల్లో దస్తక్ పత్రిక ప్రతులు, గంగా ఎక్స్‌ప్రెస్ వే పథకంపై ఒక నివేదిక, సిపిఐ మావోయిస్టు పార్టీకి సంబంధించిన 'రహస్య' పత్రాలు, ఒక సెల్‌ఫోను ఉన్నాయి. సీమా ఆజాద్, విశ్వ విజయ్‌లను అరెస్టు అయిన అయిదు నెలలకు పోలీసు రిమాండుకి తీసుకున్నారు.

9. సీమా ఆజాద్ సెల్‌ఫోనుకి సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం ఆమె 'రహస్య' ప్రదేశాలకు విస్తృతంగా ప్రయాణించింది.

10. భద్రతా సిబ్బందిని సిపిఐ మావోయిస్టు పార్టీ చంపినట్లు, భారత ప్రభుత్వంపై యుద్ధాన్నిప్రకటించినట్లు 'రహస్య' పత్రాలు పేర్కొన్నాయి.

ఈ వివరాల ఆధారంగా సీమా ఆజాద్, ఆమె భర్త సిపిఐ మావోయిస్టు పార్టీ కార్యకర్తలనీ, కుట్రదారులనీ, ప్రభుత్వంపై యుద్ధంలో పాల్గొన్నారనీ పేర్కొన్నారు. వీటి ఆధారంగా సీమా ఆజాద్, ఆమె భర్త పైన ఐపిసిలోని 120 బి, 121, 121 ఎ సెక్షన్ల కింద, యుఎపిఎ లోని 13, 18, 20, 21, 23 (2), 38, 39, 40 సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు.

పోలీసుల కథనానికీ, సీమా చెపుతున్నదానికీ అసలు పొంతనే లేదు. 6.2.2010న ఉదయం 11.30 గంటలకు ఆమె రేవా ఎక్స్‌ప్రెస్ నుంచి రైల్వే స్టేషన్‌లో దిగింది. స్టేషను బయట ఆమె భర్త ఆమె కోసం వేచి ఉన్నాడు. స్టేషను బయట పోలీసులు ఆమెను చుట్టుముట్టి ఆమె వస్తువులు, డబ్బు, దస్తక్ పత్రిక, సెల్‌ఫోను, కెమెరా బలవంతంగా లాక్కుని అలహాబాదులోని ఖుల్దాబాదు పోలీసు స్టేషనుకి తీసుకెళ్లారు. ఢిల్లీలోని పుస్తక ప్రదర్శనలో కొన్న పుస్తకాలన్నింటిని కూడా తీసుకున్నారు. ఆమెనుంచి జప్తు చేసిన వస్తువులలో బట్టలు, డబ్బులతోపాటు ఆమె దగ్గరలేని పత్రాలు, సాహిత్యాన్ని చేర్చి స్టేషనులో తప్పుడు జాబితా తయారు చేశారు. ఢిల్లీలోని పుస్తక ప్రదర్శనలో కొన్న పుస్తకాలను

జాబితాలో చేర్చనూ లేదు, ఆమెకు తిరిగి ఇవ్వనూ లేదు.

ఇంతకు ముందు చెప్పినట్లు సీమా ఆజాద్‌నీ, ఆమె భర్తనీ పోలీసు కస్టడీకి ఇవ్వడానికి జుడీషియల్ మెజిస్ట్రేటు కోర్టు, తరువాత సెషన్సు జడ్జి నిరాకరించారు. ప్రాసిక్యూషన్ అలహాబాదు హైకోర్టును ఆశ్రయిస్తే మళ్లీ కింది కోర్టుకి దరఖాస్తు చేసుకోమని ఆదేశించింది. సీమా ఆజాద్ దరఖాస్తు ఆధారంగా ఈ ఆదేశాలపై కోర్టు స్టే ఇచ్చింది. 2010 జులై 7న హైకోర్టు ఆమె పిటిషన్‌ని డిస్‌మిస్ చేయడంతో స్టే తొలగిపోయింది. ఇది సీమా పరోక్షంలో జరగడంతో ఆమె లాయర్లు హైకోర్టులో రికాల్ దరఖాస్తు వేశారు. దీనిపై విచారణ ఇంకా కొనసాగుతుండగానే ప్రాసిక్యూషన్ కింది కోర్టుకి 2010 జూలై 19న దరఖాస్తు చేసుకుని 2010 జూలై 20 నుంచి 22 వరకు 2 రోజులపాటు పోలీసు రిమాండుకు ఆదేశాలు పొందింది.

సీమా, ఆమె లాయర్లు, ఆమె కుటుంబ సభ్యుల ప్రకారం 2010 జులై 20న సూర్యాస్తమయానికి కొంచెం ముందు సీమా ఆజాద్ నీ, ఆమె భర్తనూ పోలీసులు తీసుకెళ్లారు. దుర్గా పూజా పార్క్ వద్ద ఆమె ఇంటికి రాత్రి 8 గంటలకు చేరుకున్నారు. ఆమె లాయర్లు, కుటుంబ సభ్యులు, ఇతర సాక్షులు ఎవరూ లేకుండానే ఆమె ఇంటిని సోదా చెయ్యడానికి తీసుకొచ్చారు. ఆమె ఇంటి తాళాలు పగలగొడుతుండగా తన తల్లిదండ్రులకు ఫోను చెయ్యాల్సిందిగా సీమా వత్తిడి చేసింది. కాని, ఆమె మాటలు పట్టించుకోకుండా తాళాన్ని పగలగొట్టారు. తలుపులు తెరిచిన తరువాత తన తండ్రిని పిలిస్తే తప్ప సహకరించనని సీమా అనడంతో పోలీసులు అతడిని పిలిపించారు. పొరుగు వ్యక్తితో కలసి శ్రీవాస్తవ ఉరుకులమీద వచ్చారు. సీమా, విజయ్ లు వెల్లడి చేసిన వాటి ఆధారంగా పోలీసులు ఇల్లు అంతా వెతికి మూడు వస్తువులు మాత్రమే తీసుకున్నారు: దస్తక్ పత్రిక ప్రతులు, గంగా ఎక్స్‌ప్రెస్ పథకంపై పుస్తకం, సహారా సమయ్‌లో ప్రచురితమైన ఆమె వ్యాసాలు.

ఇంటికి వెయ్యడానికి కొత్త తాళం తీసుకురమ్మని పోలీసులు సీమా తండ్రికి చెప్పారు. అతడు తెచ్చిన తాళం ఇంటికి వేసి, తాళంచెవి అతడికి ఇచ్చి ఆ విషయం రాసి ఉన్న కాగితం మీద సంతకం చెయ్యమన్నారు. అతడు సంతకం చేశాడు. సీమా తండ్రి ఇంటికి వెళ్లిపోయాడు. జైలుకి తిరిగి పంపించేముందు, మరునాడు సీమా ఆజాద్, విశ్వ విజయ్‌లకు వైద్య పరీక్ష చెయ్యవలసి ఉండడంతో వారిని పోలీసు స్టేషనుకి తీసుకెళ్లారు.

సీమా ఇంటిని సోదా చేసిన పోలీసులు ఒక కాగితంపై సంతకం చెయ్యమని పోలీసు స్టేషనులో వత్తిడి చేశారు. ఆ కాగితంపైన అనుబంధ పత్రాలు అని రాసి ఉండడంతో అన్ని కాగితాలు చూపిస్తే తప్పించి సంతకం చెయ్యనని సీమా పట్టు పట్టింది. ఆమెకు అనుబంధ పత్రాలు చూపించకపోవడంతో సీమా, విశ్వ విజయ్‌లు దానిమీద సంతకం చెయ్యనేలేదు. ఆమె ఇంటినుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చట్టబద్ధంగా ఉపయోగించుకోలేరని స్పష్టం అవుతూనే ఉంది.

విచారణ కోర్టులో ఎస్.టి.ఎఫ్. పోలీసులు 16 సాక్షులను ప్రవేశ పెట్టారు, వారిలో 14 మంది పోలీసులు కాగా ఇద్దరు మాత్రమే ఇతరులు. ఆ ఇద్దరు కూడా ప్రభుత్వ అధికారులు: వారిలో ఒకరు బిఎస్ఎన్ఎల్ ఇంజినీరు, మరొకరు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని అధికారి. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నదానిని పునరుద్ఘాటించడం తప్పించి సాక్షులు ఎవరి దగ్గరా ఇతర ఆధారాలు ఏమీలేవు. అంతే కాకుండా వారిపై మోపిన నేరాలకు ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేరు. సీమా, విశ్వవిజయ్‌ల నేరాంగీకార వాంగ్మూలాలు కూడా ఏమీ లేవు.

సీమా ఆజాద్ అరెస్టుకి ముందు, తరువాత వివిధ ప్రాంతాల్లో అరెస్టు అయిన వ్యక్తులు సీమా ఆజాద్, ఆమె భర్త మావోయిస్టు కార్యకర్తలని వాంగ్మూలాలు ఇచ్చారని పోలీసు సాక్షులు చెప్పారు. పోలీసు కస్టడీలో పోలీసుల ద్వారా రాబట్టిన వాంగ్మూలాలు అవి. ఇటువంటి వాంగ్మూలాలకు కోర్టుల్లో ఎటువంటి విలువ ఉండదు. విచారణ సమయంలో ఈ 'వాంగ్మూలాలు' ఇచ్చిన వ్యక్తులను ప్రాసిక్యూషన్ సాక్షులుగా ప్రవేశపెట్టనపుడు వీటికి అసలు విలువ ఉండదు. అంటే కోర్టులో నిరూపణకు నిలిచే ఆరోపణలు ఏమీ లేవు.

అలహాబాదులోని జిల్లా, సెషన్స కోర్టు 8.6.2012న తీర్పుని వెలువరిస్తూ సీమా ఆజాద్, ఆమె భర్తను యుఎపిఎలోని చట్ట విరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనడం (సెక్షన్ 13), తీవ్రవాద చర్యలకు కుట్ర చెయ్యడం (సెక్షన్ 18), తీవ్రవాద బృందం లేదా సంస్థలో సభ్యులుగా ఉండడం (సెక్షన్ 20), తీవ్రవాద సంస్థలో సభ్యత్వానికి సంబంధించిన నేరం (సెక్షన్ 38), తీవ్రవాద సంస్థకు మద్దతు ఇవ్వడం (సెక్షన్ 39) కింద, ఐపిసిలోని నేరపూరిత కుట్ర (సెక్షన్ 120 బి), భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించడం (సెక్షన్ 121), భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించడానికి కుట్ర (సెక్షన్ 121 ఎ) కింద నేరాన్ని నిర్ధారించింది. యుఎపిఎలోని సెక్షన్‌లు 13, 21. 23 (2) కింద నిర్దోషులుగా ప్రకటించింది.

ఈ నిర్ధారణకు రావడానికి కోర్టు వినిపించిన వాదనలు కింది విధంగా ఉన్నాయి:

1. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రదేశంలో ప్రశ్నించగా వారి నేరాంగీకార వాంగ్మూలం ప్రకారం వారిని అరెస్టు చేసి, ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసుల ముందు నేరాంగీకారం సాక్ష్యంగా చెల్లనేరదని చట్టం చెపుతున్నప్పటికీ, ఎఫ్ఐఆర్‌లో అది భాగం కావడంవల్ల దానిని సాక్ష్యంగా పరిగణించారు. సిపిఐ మావోయిస్టు పార్టీ సమావేశానికి హాజరు కావడానికి అలహాబాదు రైల్వే స్టేషను నుంచి బయలుదేరబోతున్న సీమా, ఆమె భర్తను అరెస్టు చేశారని నిర్ధారించుకోడానికి ఈ వాంగ్మూలాన్ని వాడుకున్నారు.

2. తాను అలహాబాదుకి తిరిగి వస్తున్నాననీ, తనను ఇంటికి తీసుకెళ్లడానికి తన భర్త వచ్చాడనీ, తమ అరెస్టు చూపడానికి కొన్ని గంటల ముందే పోలీసులు తమను కస్టడీలోకి తీసుకున్నారనీ సీమా నిర్ద్వంద్వంగా పేర్కొంది. ఆమె రైల్వే టిక్కెట్టుని తానే కొన్నానని, దాని ప్రతిని ఆమె సోదరుడు కోర్టుకి సమర్పించాడు. అయితే ఇది ఆమె ఉదయం వచ్చిందని మాత్రమే చూపిస్తోందనీ, పోలీసుల ప్రకారం ఆమెని రాత్రి అరెస్టు చేశారని ఈ సాక్ష్యాన్ని కోర్టు తిరస్కరించింది. కోర్టులో పోలీసు అధికారులు చెప్పిందే నిజమని భావించాలని కోర్టు తీర్మానించింది. అయితే, మధ్యాహ్నం నుంచే సీమా పోలీసుల కస్టడీలో ఉంది కాబట్టి ఈ అబద్ధాలకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఇవ్వగల అవకాశమే లేదు. 2010 ఫిబ్రవరి 6 నాటి ఫోన్‌కాల్ వివరాలు ఆమె ఎక్కడ ఉందో నిర్ధారించేవి. అయితే, ఆసక్తికరంగా ఆ వివరాలను వెల్లడించలేదు.

3. దేశ చట్టాలకు విరుద్ధంగా సీమా ఆజాద్, విశ్వవిజయ్‌లు పోలీసుల ముందు వెల్లడించింది కోర్టులో సాక్ష్యంగా పరిగణించారు. ఒక తెలివైన, మడత సిద్ధాంతం ద్వారా ఇది చేశారు. అంతకు ముందు నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా ఏవైనా వస్తువులను స్వాధీనం చేసుకుంటే ఆ వాంగ్మూలం సాక్ష్యంగా పరిగణించబడుతుంది. సీమాను

గోరు మాధవరావు

ప్రముఖ విప్లవనేత, విప్లవ కార్యకర్త గోరు మాధవరావు (88) జూలై 18న తన స్వగ్రామం శ్రీకాకుళంలోని జింకిభద్రలో చనిపోయారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు గంటి రాజేశ్వరరావు విప్లవ భావాలతో ప్రేరణ పొంది 1956లో కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. తన ఉద్యమ చైతన్యాన్ని మరింత విస్తృతం చేసుకున్నారు. శ్రీకాకుళ గిరిజనోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉద్యమం సాయుధ దశకు మళ్లిన తర్వాత దళాల్లో పనిచేశారు. కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆ క్రమంలో అనారోగ్యానికి గురై బెంగాల్‌లో గడుపుతున్న మాధవరావును పోలీసులు



అరెస్టు చేశారు. పార్వతీపురం కుట్రకేసులో నిందితునిగా చేర్చారు. కొండపల్లి సీతారామయ్య సహచరునిగా పీపుల్స్‌వార్‌లో పనిచేశారు. 1981 తర్వాత సోంపేట తాలూకా మందస ప్రాంతంలోని కళింగదళ్, డాబర్‌సింఘి సాగునీటి ప్రాజెక్టుల కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. దిక్సూచి ప్రచురణలకు బాధ్యతలు వహించారు. జిల్లాలో ప్రజా ఉద్యమాలకు నాయకునిగా, మార్గదర్శకునిగా నిలిచారు.

పోలీసులు రిమాండులోకి తీసుకున్నప్పుడు ఆమె వాంగ్మూలం ఆధారంగా ఆమె ఇంటినుంచి మొబైల్ ఫోను, మావోయిస్టు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు కాబట్టి ఆమె వాంగ్మూలం కాస్తా చట్టబద్ధ నేరాంగీకారం అవుతుంది.

4. తనని అరెస్టు చేసినప్పుడు తన మొబైల్ ఫోనుని తీసుకున్నారు కాని స్వాధీన జాబితాలో చూపించలేదని, 26 పేజీల మావోయిస్టు పత్రాన్ని ఇంటిని సోదా చేసేటప్పుడు పోలీసులే ఉన్నారని సీమా పేర్కొంది. జైలులో 90 రోజులు గడిపిన తరువాత పోలీసులు రిమాండుకి అడగడానికి లేదు, కాని సీమా రిమాండుకి పోలీసులు తీవ్ర ప్రయత్నం ఎందుకు చేశారో కోర్టు తీర్పే వెల్లడిచేస్తోంది. పోలీసు రిమాండు, ఆ తరువాత ఇంటి సోదా, వస్తువుల స్వాధీనం ద్వారా కోర్టులో నిలవని వాంగ్మూలం కాస్తా చట్టబద్ధంగా మారిపోతుందని ఈ తీర్పు వెల్లడి చేస్తోంది.

5. అరెస్టు, వస్తువుల స్వాధీన సమయంలో ఇతర సాక్షులు ఎవరూ లేకపోవడం అన్నది పోలీసులే బహిరంగ ప్రదేశంలో వీటిని చేపట్టారన్న దాని ప్రాముఖ్యతను తగ్గించదు. పోలీసులు తమ అధికారిక విధులను సక్రమ పద్ధతిలో నిర్వర్తించి ఉంటారని భావించాలని వాదించి తీర్పు దీనిని సమర్థించింది. అరెస్టు అయిన సమయానికి సంబంధించి సీమాకి ఉన్న తీవ్ర అభ్యంతరాలను కోర్టు పట్టించుకోలేదు.

6. ఆ తరువాత సీమా ఇంటినుంచి స్వాధీనం చేసుకున్నారని చెబుతున్న పత్రంలో ఎత్తి చూపిన భాగాలు మావోయిస్టు చర్యలను అర్థం చేసుకోడానికి, సిపిఐ మావోయిస్టు పార్టీతో నిందితుల సంబంధానికి, మావోయిస్టు పత్రంలో పేర్కొన్న చర్యలకు నిందితులు కుట్రపన్నారనడానికి, వాటిని చేపట్టారనడానికి ఆధారంగా మారాయి. నిందితుల్లో ఏ ఒక్కరైనా ఏ ఒక్క హింసాత్మక చర్యకైనా కుట్రపన్నారని కాని, పాల్గొన్నారని కాని పేర్కొనకుండానే కోర్టు ఈ నిర్ధారణకు వచ్చింది.

సీమా ఇంటినుంచి ఈ వస్తువుల స్వాధీనం కూడా ఎటువంటి సాక్షులు లేకుండా జరిగిందని, అన్ని కాగితాలు కాకుండా ఒక కాగితమే ఇచ్చి సంతకం చెయ్యమన్నందువల్ల నిందితులు దాని మీద సంతకం చెయ్యలేదన్న సంగతి గుర్తుంచుకోవాలి. ఈ పత్రంలోని అంశాలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని వాదిస్తూ ఒక పత్రం కలిగి ఉన్నంత మాత్రాన అది నేరం కాబోదన్న సుప్రీం కోర్టు తీర్పును సైతం ఈ తీర్పు పక్కన పెట్టింది. వింత వాదనకు చక్కని ఉదాహరణ ఇది.

7. సీమాని, ఆమె భర్తను అరెస్టు చేసినప్పుడు వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను సీల్ చేసి పోలీసు స్టేషనులో ఉంచారు. అయితే, కోర్టు లేదా మెజిస్ట్రేటు అనుమతి లేకుండా వాటిని పరిశీలించే మిషతో పోలీసులు సీలు తొలగించి మళ్లీ వేశారు. నియమాలను ఇంత దౌర్జన్యంగా ఉల్లంఘించినందుకు పోలీసులను కోర్టు తీవ్రంగా గర్హించి, అందులోని వస్తువుల విశ్వసనీయతను ప్రశ్నించి ఉండవలసింది. ఈ తీర్పు ఈ ఉల్లంఘనని ఏమాత్రం పట్టించుకోలేదు.

8. మావోయిస్టు సంబంధాలున్నాయన్న ఆరోపణలతో ఢిల్లీలో జుడీషియల్ కస్టడీలో ఉన్న కాంచన్ అనబడే అను సీమాకి రాసిన ఉత్తరాన్ని మావోయిస్టు పార్టీతో ఆమెకు సంబంధాలున్నాయనడానికి తిరుగులేని సాక్ష్యంగా ఈ తీర్పు పేర్కొంది. గతంలో సీమా ఇంట్లో ఉన్నానని అను పేర్కొనడం మరో పకడ్బందీ సాక్ష్యంగా ఈ తీర్పు పేర్కొంది. అయితే, ఢిల్లీ కోర్టు అనూని బెయిలుపై విడుదల చేసింది.

కోర్టు ఇటువంటి నిర్ధారణకు ఎలా వచ్చింది? నిందితులు అమాయకులు అని భావించడానికి కోర్టు నిరాకరించిందన్న వివరణ మినహాయించి ఇంకేమీ లేదు. వాస్తవానికి సాక్ష్యాలన్నీ వారి అమాయకతనే సూచిస్తున్నాయి.

భారతీయ శిక్షా స్మృతిలో ప్రభుత్వ వ్యతిరేక నేరాలను పేర్కొనే సెక్షన్లలో, యుఎపిఎ దొంతరలలో న్యాయవ్యవస్థ దారి తప్పడానికి కారణం ఏమిటి? చట్ట పుస్తకాలలో ఈ నేరాలు సరిగా నిర్వచించబడక పోవడం, ఇవి అత్యంత దుర్మార్గమైన నేరాలుగా పేర్కొనబడడంవల్ల ఇలా జరుగుతోంది.

ఈ నేరాలు ప్రధానంగా చర్యలకు సంబంధించినవి కాకుండా ఉద్దేశాలకు సంబంధించినవి అయినందువల్ల పోలీసుల కథనం నమ్మక పోవడం అంటే దేశం పట్ల వ్యతిరేకతగా భావించబడుతుంది. అంతే కాకుండా రూఢి అయిన విధానాలను యుఎపిఎ గందరగోళపరచి అమాయకత, నేరం అన్నవి సాపేక్షికమనిపించేలా చేస్తుంది. దీంతో అప్పటి ప్రభుత్వం, జడ్జి చూసే కోణాన్ని బట్టి అదే వ్యక్తి దోషి కావచ్చు, లేదా నిర్దోషి కావచ్చు.

క్లుప్తంగా చెప్పాలంటే సీమా ఆజాద్, విశ్వ విజయ్‌ల కేసులో అలహాబాదు సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పు అనేక అర్ధ సత్యాలు, చెల్లుబాటుకాని సాక్ష్యాలు, విధానాల ఉల్లంఘన, ఒక అభ్యంతరకరమైన చట్టం కలసి ఒక స్వేచ్ఛా పౌరురాలిని దేశ భద్రతకు ముప్పుగా ఎలా మారుస్తాయో చక్కని ఉదాహరణ.

(తెలుగు సేత: కె. సురేష్, మంచి పుస్తకం వ్యవస్థాపకులు) వీ

మానేసర్ కార్మికుల పోరాటంపై తప్పుడు ప్రచారం

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కార్మికుల కష్టాలూ, కడగండ్లే మానేసర్ ఘటనలకు నేపథ్యమనీ, దీనిపై యాజమాన్యానికి అనుకూలమైన కథనాలే వెలువడుతున్నాయనీ అంటున్నారు పి.వి. రమణ

హర్యానా రాష్ట్రంలో గుర్‌గావ్‌కు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న మానేసర్‌లో మారుతి సుజుకి కార్ల తయారీ కంపెనీలో జూలై 18న జరిగిన ఘర్షణలో ఫ్యాక్టరీ తగలబడింది. ఆ మంటలలో కంపెనీ అధికారి కాలిపోయి చనిపోయాడు. వంద మంది అధికార్లకు గాయాలయ్యాయి.

జూలై 18న ఉదయం జియాలాల్ అనే పర్మినెంట్ కార్మికుణ్ని సూపర్‌వైజర్ కులం పేరుతో దూషించడం వలన అతను సూపర్‌వైజర్‌ను కొట్టాడని అంటున్నారు. వెంటనే మేనేజ్‌మెంట్ జియాలాల్‌ను సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఎత్తివేత గురించి కార్మిక సంఘ నాయకులు మేనేజ్‌మెంట్‌తో చర్చిస్తుండగానే కార్మికులు దాడి చేసి, అధికార్లను కొట్టడంతో పాటు ప్లాంటుకు నిప్పు పెట్టడంతో ఆ మంటలలో అశ్విన్ కుమార్ దేవ్ అనే జనరల్ మేనేజర్ (హ్యూమన్ రిసోర్సెస్) కాలి చనిపోయాడు. ఈ దాడిలో వంద మంది అధికార్లకు కూడా దెబ్బలు తగిలాయి. వారినందరినీ గుర్‌గావ్ సివిల్ హాస్పిటల్‌తో సహా ఇతర హాస్పిటళ్లలో చికిత్సకు తరలించారు. వీరిలో ముగ్గురు జపాన్ అధికారులు కూడా ఉన్నారు. ఇదంతా పత్రికల్లో వచ్చిన కథనం.

గుర్‌గావ్ డిఎస్‌పి మహేశ్వర్ దయాళ్ ప్రకారం 'కార్మికులు ప్రధాన మార్గాలన్నీ మూసివేసి అధికార్లను బయటకు వెళ్లనివ్వలేదు. గేటు నెం.2 వద్దకు మూడు వేల మంది గుంపుగా వచ్చి సాయంత్రం 6.30 గంటలకు ప్లాంట్‌లో ఆఫీసులకు నిప్పు పెట్టారు. గుర్‌గావ్ నుంచి వచ్చిన ఇరవై ఐదు ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పడంలో పాల్గొన్నాయి.'

హర్యానా చీఫ్ సెక్రటరీ పి.కె. చౌదరి 'ప్రభుత్వం దీన్ని చాలా సీరియస్‌గా తీసుకొంటుందని, హింసాకాండకు పాల్పడ్డవారినెవ్వరినీ వదిలేది లేదని' అన్నారు.

'ఇది యాదృచ్ఛికంగా జరిగిన దాడి కాదు. ప్లాను ప్రకారం జరిగింది. వాళ్లు మొదట సిసిటివి కెమెరాలను ధ్వంసం చేసి తర్వాత సీనియర్ అధికారుల్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. కంపెనీ అంతర్గత విచారణ జరిపి జరిగిన నష్టం ఎంతో, కారకులెవరో తెలుసుకొన్న తర్వాతే ఉత్పత్తి ప్రారంభిస్తాం' అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ షింజో నఖనిషి అన్నారు. కంపెనీని గుజరాత్‌కు తరలిస్తామని వచ్చిన పుకార్లలో నిజం లేదనీ, గతంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం 2015-16లో అక్కడ వేరే కొత్త ప్లాంట్ నిర్మిస్తామని కూడా అన్నారు.

కంపెనీ చైర్మన్ ఆర్.సి. భార్గవ జూలై 21న కంపెనీ లాకౌట్‌ను ప్రకటిస్తూ 'మా అధికార్లు, ఉద్యోగులు, కార్మికుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులకు మేం ఒప్పుకోం. హర్యానా ప్రభుత్వం మొత్తం సంఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక ఇచ్చిన తర్వాతే కంపెనీ తెరవడం గురించి ఆలోచిస్తాం. కంపెనీని మూసేయలేదు. ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించేందుకు ఆరు నెలలకు పైగా వ్యవధి తీసుకొంటే మేం చేతగాని వాళ్లమవుతాం' అన్నారు. జపాన్ తరహా కఠిన నిబంధనలే ఘర్షణకు కారణమయ్యాయా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు 'ఆ ఆరోపణల్లో నిజం లేదు' అన్నారు.

హర్యానా పారిశ్రామిక శాంతిని దెబ్బతీయడానికి పక్కా ప్రణాళికతోనే ప్లాంట్‌లో హింస జరిగిందని, హర్యానా పరిశ్రమల మంత్రి రణదీప్‌సింగ్ సూర్జేవాలా అన్నారు. 'కార్మికుల్ని బయటి శక్తులు ప్రభావితం చేశాయని, లాకౌట్‌ను సమర్థిస్తున్నా'నని రాష్ట్ర కార్మిక ఉపాధి మంత్రి శివచరణ్‌లాల్ అన్నారు. 'ఈ హింస హర్యానాలోని పారిశ్రామిక సానుకూల వాతావరణంపై ప్రపంచానికి తప్పుడు సంకేతాలిస్తాయని' కార్పొరేట్ మంత్రి వీరప్ప మొయిలీ అన్నారు.

మొత్తం మీద కంపెనీ చుట్టు పక్కల గ్రామాలన్నిటిలో నాలుగు వేల మంది పోలీసు బలగాలు దాడులు చేసి 99 మంది కార్మికుల్ని అరెస్టు చేశారు. వీరిలో మారుతి సుజుకి వర్కర్స్ యూనియన్‌కు చెందిన నాయకులు, ఖుర్కి గ్రామానికి చెందిన ప్రెసిడెంట్ సోహన్‌లాల్, జబ్బార్ గ్రామానికి చెందిన సెక్రటరీ యోగేష్‌కుమార్‌లు ఉన్నారు.

అసలేం జరిగింది

గత సంవత్సరం జూన్‌లో పద్నాలుగు రోజుల సమ్మె, ఆగస్టులో కంపెనీ ప్రకటించిన 33 రోజుల లాకౌట్ అనంతరం కూడా మారుతి యాజమాన్యం కార్మికులపై అనేక రూపాల్లో అణచివేత కొనసాగించింది. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల మధ్య బలమైన ఐక్యత కొనసాగిస్తున్న యూనియన్‌ను విడగొట్టాలనే వివిధ ప్రయత్నాలు కూడా సాగిస్తూనే ఉంది.

కంపెనీలో 365 రోజులు అసెంబ్లీ లైన్ నడుస్తూనే ఉంటుంది. అందుకే గత సంవత్సరం నాలుగేళ్లుగా అసెంబ్లీ లైన్ ఏనాడూ నిలిచి పోలేదని యజమాన్యం సగర్వంగా ప్రకటించింది. గడచిన పదహారు సంవత్సరాలలో కంపెనీలో 16 సమ్మెలు జరిగాయి. బలవంతంగా ఓవర్ టైమ్ చేయించడం, అమానుషమైన పనిభారం, విపరీతమైన వేతన కోతలు, రెగ్యులర్ పనులన్నీ కాంట్రాక్టుకివ్వడం, ట్రేడ్ యూనియన్ హక్కుల ఉల్లంఘనలతో నడుస్తున్న, చేసిన వ్యవస్థల గురించి కార్మికులు ఎన్నోసార్లు మొరపెట్టుకొన్నా, యాజమాన్యంతో లాలూచీపడిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, కార్మికశాఖ, పోలీసు శాఖలు మేనేజ్‌మెంట్‌కే వత్తాసు పలికాయి.

గత మూడు సంవత్సరాలుగా కంపెనీ ఉత్పత్తి విధానాన్ని పూర్తిగా మార్చివేసింది. లాభాల కోసం, ఎక్కువ కార్లు ఉత్పత్తి చేయడానికి ఎక్కువ యంత్రాలను తెచ్చి పెట్టింది. ఈ కంపెనీకి చెందిన గుర్‌గావ్ ప్లాంట్‌లో 17 శాతం ఉత్పత్తి పెరిగితే మానేసర్ ప్లాంట్‌లో 40 శాతం పెరిగింది. దీన్ని బట్టి కార్మికులపై ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. కార్మికుల ఎనిమిది గంటల పని సమయంలో ఇచ్చే విరామ సమయాన్ని బాగా తగ్గించారు. ఈ ప్లాంట్‌లో దేశంలో అత్యధికంగా అమ్ముడుపోయే మారుతి స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, ఎస్×4 సెడాన్, ఎస్టార్ హాచ్‌బాక్ బ్రాండు కార్లు తయారవుతాయి. సంవత్సరానికి 5,50,000 కార్లు తయారు చేసే సామర్థ్యం ఉన్న ప్లాంట్‌లో చేసిన మోడళ్లలో 180 మారుతి కార్లు తయారవుతాయి. ఒక కారు పూర్తి అయిన వెంటనే మరో కారు తయారవుతుంది. సీట్లు, చక్రాల విడిభాగాలు, వైర్లు, ఎసి, ట్యూబులు, స్టీరింగ్‌లు, డాష్‌బోర్డు, ట్రిమ్స్, గేర్‌బాక్స్‌లు, స్విచ్‌లు, డోర్ లాక్‌లు సగటున 50 సెకన్లలో అమర్చాలి. వీటిని రాక్స్ మీద నిలబడి అమర్చాలి. అలారం మోగక ముందే పరికరాలతో సిద్ధంగా ఉండాలి. వేగంగా రాలేకపోతే అసెంబ్లీ లైన్ ఆగిపోతుంది. దానితో ఎక్కడ ఆగింది, ఎంత సేపు ఆగింది, దానివల్ల ఆ రోజు ఉత్పత్తి ఎంత నష్టం అయిందీ సైను బోర్డులో దర్శనమిస్తుంది. అంటే కార్మికుల వర్క్‌షీట్‌లో రెడ్ మార్కు ఖాయం. కార్మికులు వారిలో వారు మాట్లాడుకోవడం నిషిద్ధం. టాయ్‌లెట్‌కు వెళ్లి సమయం దాటితే రిమార్క్. ఈ విధమైన దుర్మార్గమైన పని ఒత్తిడితో అక్కడ కార్మికులు పనిచేస్తున్నారు.

వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, ఇన్సెంటివ్ లాంటి ఇతర సమస్యలతోపాటు జీతాల పెంపు కోసం ఈ సంవత్సరం ఏప్రిల్‌లో యూనియన్, మేనేజ్‌మెంట్‌కి కోర్కెల పత్రం సమర్పించింది. రెండు నెలలుగా చర్చలు కొనసాగుతున్నాయి. జూలై 16న మేనేజ్‌మెంట్ జీతాన్ని 10,500 రూపాయలకు పెంచుతామని అంగీకరించింది. కాని నిజానికి అది ఒకేసారి కాకుండా మొదటి సంవత్సరం రు. 6000, రెండవ సంవత్సరం రు. 2500, మూడవ సంవత్సరం రు. 2000 పెంచుతామని మాట మార్చడంతో కార్మికులు ప్రతిరోజూ మేనేజ్‌మెంట్ నిర్వహించే 'ఉదయపు సమావేశాన్ని' బహిష్కరించారు. ఆ రోజు నుండి కార్మికులు నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. జూలై 18న జియాలాల్‌ను సస్పెండ్ చేసిన సంఘటన జరిగింది. ఆఫీసు లోపల సస్పెన్షన్ ఎత్తివేయాలని యూనియన్ నాయకులు సంభాషిస్తుండగానే యాజమాన్యం పిలిపించిన వందలాదిమంది గూండాలు ప్లాంటు ద్వారాలన్నింటినీ మూసివేసి కార్మికులపై పదునైన ఆయుధాలతో దాడిచేసి కొట్టారు. వాళ్లే కంపెనీ ఆస్తిని ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అనేక మంది కార్మికులు హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్నారు. జరిగిన హింసాకాండ అంతా ఒక ప్లాన్ ప్రకారం నేరాన్ని కార్మికులపై నెట్టడానికి జరిగిన పెద్ద కుట్ర. కార్మికుల్ని దౌర్జన్యకారులుగా, హింసావాదులుగా ముద్రవేయడానికి మారుతి యాజమాన్యం ఏర్పాటు చేసిన మహా పంచాయతీ కూడా ఈ కుట్రలో భాగమే.

మహా పంచాయతీ

మానేసర్ చుట్టు పక్కల ఉన్న గ్రామ సంఘాల నాయకులతో ధాండా గ్రామం, షహీద్ పార్క్‌లో మహా పంచాయతీ జరిగింది. వంద గ్రామాలకు చెందిన 150 మంది 'ఎర్రజెండా యూనియన్‌ను తరిమేయండి' అని పిలుపిచ్చారు. మారుతి కంపెనీని వేరే చోటకు మార్చవద్దని, దానివల్ల తాము ఎన్నో లాభాలు పొందామని, జరిగిన హింసాకాండపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వీరిలో చాలామంది మారుతి కంపెనీ కాంట్రాక్టర్లు. ఆ ప్రాంత భూములు ధర ఎకరానికి రు. 2.5 లక్షలుంటే బ్రోకర్ల ద్వారా ప్రచారం చేసి ధరలు పెంచేసి ఎకరాకు రు. 20 లక్షలు వరకు సంపాదించి, రాత్రికి రాత్రే కోటీశ్వరులయిన వారు ఉన్నారు. వాళ్లు ఆ ప్రాంతాల్లో అనేక బహుళ అంతస్తుల మేడలతో కాలనీలు నిర్మించి, ఫ్యాక్టరీ కార్మికులకు అద్దెకిస్తూ, బ్రహ్మాండంగా గడిస్తున్నారు. కంపెనీ దోపిడీలో భాగస్వాములయిన శక్తులన్నీ ఈ మహా పంచాయతీ నిర్వహించాయి.

'చిన్న పెట్టుబడిదార్లు, కాంటీన్, రవాణా, ఇతర కాంట్రాక్టులు పొందిన చుట్టుపక్కల గ్రామాల ప్రజల్ని మారుతీ కంపెనీ తనకు అనుకూలంగా మలుచుకొంది. వారే ఈ మహాసభకు నాయకులు, మారుతి యజమాన్యం, పత్రికా ప్రపంచం వారి అభిప్రాయాల్ని మొత్తం ఆ ప్రాంత గ్రామాలన్నింటి అభిప్రాయంగా ప్రచారం చేస్తున్నార'ని కాంట్రాక్టు కార్మికుల 'హీరో హోండా ఠేకా మజ్దూర్ సంఘటన్' ఉపాధ్యక్షురాలు రాఖి సెహగల్ అన్నారు. నిజానికి కార్మికుల పోరాటాలకి ఆ ప్రాంత ప్రజలు ఎంతో సహకారాన్ని అందిస్తున్నారు. గతంలో మారుతి కార్మికుల సమ్మె కాలంలో 'కమ్యూనిటీ కిచెన్' ఏర్పాటు చేసి ఆదుకున్నారని కూడా అన్నారు.

ఎకనమిక్ టైమ్స్‌లో వ్యాసాలు

టీమ్ లీజ్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మునిష్ సభర్వాల్ 'అశ్విన్ కుమార్ దేవ్‌ది హత్యే. గతంలో హ్యూమన్ రిసోర్సెస్ అధికార్లు ప్రికోల్ కంపెనీలో రామ్‌జార్జి గ్రాజియానా ట్రాన్స్‌మిసియాలో లలిత్ కుమార్ చౌధరిల విషయంలో జరిగిందే ఇక్కడ కూడా జరిగింది. కార్మిక సంఘాలు యజమానులు లేకుండా కార్మికులుండరని మరిచిపోతున్నాయి. కార్మిక సంఘాలు రాజకీయపరంగా మారడం, రాజకీయాలు నేరపూరితం కావడం, ఈ రెండింటి అపవిత్ర కలయిక పర్యవసానమే నేటి పరిస్థితికి కారణం. అధిక శాతం కార్మిక సంఘాల నాయకులు కంపెనీ యజమాన్యాల్ని భవిష్య దృష్టిలేని రక్త పిశాచులుగా, లాభం తప్ప దేన్నీ పట్టించుకోనివారు అనే హాస్యాస్పదమైన అభిప్రాయంతో ఉన్నారు. కార్మిక సంఘాలు మారాలి. కార్మిక సంఘ చట్టాన్ని మార్పుచేసి సంస్థలో పనిచేసే కార్మికులనే నాయకత్వం ఉండేలా చేయాలి. పై నుండి నాయకత్వం రావడం వల్లనే ఈ విధమైన హింసాపూరితమైన ధోరణులు, హత్యలు జరుగుతున్నాయ'ని, 'ఒక యజమానిని చంపడం అనేక ఉద్యోగాలను చంపుకోవడమే' అన్న తన వ్యాసంలో రాశారు.

'మారుతిలో జరిగిన హింసాకాండకు నాలుగు కారణాలు' అన్న తన వ్యాసంలో మాలినీ గోయల్ చెప్పిన విషయాలు. 1) కంపెనీలో భారతీయ అధికార్లు చాలామంది ఉన్నా జపాన్ అధికారుల మాటే చెల్లుబాటవడం. జపాన్, భారత దేశాల మధ్య సాంస్కృతికంగా చాలా తేడాలున్నాయి. క్రమశిక్షణ, సమయ పాలన లాంటి విషయాలలో అవి కనపడతాయి. 2) మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో అనేక సవాళ్లు ఎదురవుతాయి. వస్తువుల ధరలు, ఉద్యోగుల జీతాలు పెరిగిపోతున్నాయి.

కాని అమ్మకాలు దైవాధీనంగా నిరాశను కలిగిస్తున్నాయి. వ్యాపారం చెయ్యడమే కష్టంగా ఉంది. ప్రతి కంపెనీ ఖర్చు తగ్గించడానికి, ఉత్పత్తి పెంచడానికి మార్గాలు వెతుకుతున్నాయి. అందులో కాంట్రాక్టు కార్మికుల్ని నియమించడం ప్రధానమైంది. మారుతి కంపెనీలో 40 శాతం కాంట్రాక్టు కార్మికులే. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడానికి మరింత ఉత్పత్తి పెంచాల్సి వస్తుంది. దానికోసం తీవ్రమైన ఒత్తిడి అమలు జరుగుతుంది. ఇది మారుతిలో చాలా ఎక్కువగా ఉంది. 3) ఈనాటి ఫ్యాక్టరీ కార్మికులు తమ చుట్టూ జరుగుతున్న మార్పులు గమనిస్తున్నారు. గుర్‌గావ్ చుట్టూ భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రికి రాత్రే చాలా మంది ధనవంతులయ్యారు. వారి జీవన విధానంలో విపరీతమైన మార్పులు వచ్చాయి. చుట్టూ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటన్నిటి మధ్య జీవిస్తున్న గ్రామీణ యువత కోర్కెల్లో మార్పులు వచ్చాయి. పెరుగుతున్న ధరలు, తక్కువ జీతాలు వారిలో అసహనాన్ని, మిలిటెన్సీని పెంచుతున్నాయి. 4) దేశంలో పనిచేస్తున్న వారిలో 90 శాతం అసంఘటిత కార్మికులే. వారిలో కార్మిక సంఘాలు పెట్టడానికి జాతీయ కమ్యూనిస్టు కార్మిక సంఘం ప్రయత్నిస్తోంది.

పై రెండు వ్యాసాలు పూర్తిగా యాజమాన్యాలకు మద్దతుగా రాసినట్టు సులువుగా అర్థమవుతుంది. అయినా కంపెనీలో ఉత్పత్తి పెంచడానికి కాంట్రాక్టు కార్మికుల్ని నియమించడం, విపరీతమైన ఒత్తిడి పెంచడం, జీతాలు చాలని యువతలో పెరుగుతున్న అసహనం, మిలిటెన్సీలు, దేశవ్యాప్తంగా 90 శాతం అసంఘటిత కార్మికవర్గం లాంటి నిజాల్ని కూడా చెప్పాల్సి వచ్చింది.

మహీంద్రా గ్రూప్ హ్యూమన్ రిసోర్సెస్ హెడ్, ఎంప్లాయర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ అయిన రాజీవ్ దూబే ఈ సంఘటనపై ప్రతిస్పందిస్తూ 'కాంట్రాక్టు కార్మికుల దుర్భర పరిస్థితులే సమస్యలకు మూల కారణం. వారికి న్యాయమైన జీతాలు చెల్లించడం లేదు. వారి పని పరిస్థితులలో మార్పులు తేవాలి' అన్నారు.

మారుతి మేనేజ్‌మెంట్ దుర్మార్గ విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నా ఫ్యాక్టరీలో జరిగిన హింసాకాండ వెనకాల మావోయిస్టుల హస్తముందని భావిస్తున్నామని ఇంటిలిజెన్స్ అధికారులు ప్రకటించడం భవిష్యత్‌లో జరగబోయే కార్మిక పోరాటాన్ని మావోయిస్టుల పేరుతో అణచివేయడానికి వేస్తున్న పన్నాగంలో భాగమే. కార్మిక సంఘాల్లో పనిచేయాలని మావోయిస్టు డాక్యుమెంట్లలో వివరంగా ఉందని, పట్టణ ప్రాంతాల కార్మిక సంఘాల్లో చొరబడి, ఢిల్లీ చుట్టూ ఉన్న పారిశ్రామిక ప్రాంతాలలో, ముంబాయి – పూనే పారిశ్రామిక కారిడార్‌లలో అలజడుల్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తమకు సమాచారం ఉందని అంటున్నారు. మారుతి ఘటనలో మావోయిస్టులకు సంబంధ ముందని విచారణలో తేలితే, చర్యలకు పాల్పడిన వారిపై టెర్రరిస్టు వ్యతిరేక చట్టం ప్రయోగిస్తామని ఒక ఇంటిలిజెన్స్ అధికారి అన్నారు.

మారుతి కంపెనీ కార్మికులకు సంఘీభావం

మానేసర్, మారుతి సుజికీ కంపెనీ కార్మికులపై జరుగుతున్న అణచివేత చర్యలకు వ్యతిరేకంగా అనేక కార్మిక, ప్రజాసంఘాలు జూలై 21న ఢిల్లీలో హర్యానా భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన జరిపాయి. వీటిలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (న్యూ), బైగుల్ మజ్దూర్ దస్తా, ఇంక్విలాబ్ మజ్దూర్ కేంద్ర, క్రాంతికారీ నౌజవాన్ సభ, క్రాంతికారీ యువ సంఘటన్, మజ్దూర్ పత్రికా, మెహ్నత్‌కష్ మజ్దూర్ మోర్చా, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్స్, పియుడిఆర్, పీపుల్స్ ఫ్రంట్, పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, ప్రగతిశీల మెహ్నత్‌కష్ మజ్దూర్ మోర్చా, ప్రగతిశీల మహిళా ఏక్తా కేంద్ర, క్రాంతికారీ లోకాధికార్ సంఘటన్, రాడికల్ నోట్స్, స్టూడెంట్స్ ఫర్ రెసిస్టెన్స్, మిషన్ భారతీయం, సన్‌హతి, ఢిల్లీ శ్రామిక్ దునియా, విద్యార్థి యువజనసభ, మజ్దూర్ ఏకతా కమిటీ శ్రామిక్ సంగ్రామ్ కమిటీలు ఉన్నాయి. మారుతి కార్మికుల అరెస్టులను ఖండించాయి. హర్యానా ముఖ్యమంత్రి, మారుతి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. గూండాలను తీసుకువచ్చి హింసకు పాల్పడింది మేనేజ్‌మెంటేననీ, స్వతంత్ర సంస్థతో నిష్పక్షపాతమైన విచారణ జరిపితే నిజాలు బయటపడతాయని వక్తలందరూ మాట్లాడారు.

ఢిల్లీ పరిసరాల్లో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలతో పాటు, గుర్‌గావ్‌ను, పెట్టుబడిదారుల స్వర్గంగా, దేశాభివృద్ధికి గొప్ప గుర్తుగా ప్రచారం సాగిస్తున్నారు. ఆ ప్రాంతాలు ఆకాశాన్నంటే మేడలు, ఆఫీసులు, షాపింగ్ మాల్స్, పెద్ద స్టార్ హోటల్స్‌తో మెరిసిపోతుంటాయి. ఇదంతా పైకి కనపడే ముఖం, ముసుగు తీసేస్తే వందలాది ఫ్యాక్టరీల్లో కార్లు, స్కూటర్లు, ఇతర పరికరాల తయారీలో తమ రక్తాన్ని ధారపోసే వేలాది మంది కార్మికులు పరుగులు పెడుతుంటారు. శ్రామిక వర్గంలోకి చేరిపోయిన వేలాది విద్యావంతులైన యువకులు భవిష్యత్ కోసం కన్న కలలన్నింటినీ పక్కనపెట్టి తమ శక్తినంతటినీ కంపెనీల లాభాల కోసం ధారపోస్తున్నారు.

కనీస సౌకర్యాల కోసం, గౌరవప్రదంగా బతకడానికి అవసరమైన జీతాల కోసం, ఆత్మగౌరవంతో బతకడానికి కనీస హక్కులు అడుగుతున్న నేరానికి, సామ్రాజ్యవాద శక్తులు, పెట్టుబడిదారీ శక్తులు సాగిస్తున్న మారణకాండకు యానాం రీజెన్సీ సిరామిక్స్‌లో మురళీమోహన్ హత్యతో పాటు నేటి మారుతి కంపెనీలో హింసాకాండలు నిదర్శనం.

భవిష్యత్ కార్మిక పోరాటాల మీద మావోయిస్టు ముద్రవేసి దారుణంగా అణచివేయడానికి పన్నుతున్న పాలకవర్గాల కుట్రను కార్మికులతోపాటు ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

త్వరలో వీక్షణం పత్రికను వెబ్ పేజీల్లో కూడా చూడవచ్చు!

www.veekshanam.wordpress.com

మీ అభిప్రాయాలను, సూచనలను ఎప్పటికప్పుడు మాకు తెలియజేయండి!

తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న అన్వేషణలో మీరూ పాలుపంచుకోండి!

Email : veekshanam2003@gmail.com

పన్నుల ఎగవేత, నల్లధనం సమస్య - 2

అక్రమంగా ఆస్తులు సంపాదించి, ఆస్తులను దేశ సరిహద్దులు దాటించడంతో ఆర్థిక వ్యవస్థ ఎలా కుదేలవుతుందో వివరిస్తున్నారు **డి. నరసింహారెడ్డి**

(గత సంచిక తరువాయి..)

పన్ను రహిత స్థావరంగా మారిషస్

మారిషస్ ఒక పన్ను రహిత స్థావరమనీ, అక్కడ ఎన్నో రకాల పన్ను మినహాయింపులు, ఇతర రాయితీలు ఉన్నాయనీ అందరికి తెలుసు. అక్కడి పాలనా విధానాలు ఎంత సులువైనవంటే, నలభై ఎనిమిది గంటల లోపల ఎవరైనా ఒక కంపెనీని తెరిచి దానికి సంబంధించిన పనులన్నీ పూర్తి చేసుకోవచ్చు. మరోవైపు నుంచి చూస్తే ఇది చాలా సమర్థమైన పాలనగా కూడా కనబడుతుంది. మదుపు లాభాలపై పన్ను లేదు. వారసత్వ ఆస్తిపై పన్ను లేదు. రాయల్టీలపై పన్ను లేదు. అంతేకాదు, విదేశస్తులు మారిషస్ నుంచి తమ మాతృదేశాలకు నిధులు బదలాయించుకుంటే తన దగ్గర ఆ నిధులు ఉన్నంత కాలానికి కూడా పన్ను (విత్‌హోల్డింగ్ టాక్స్) లేదు. కార్పొరేషన్ పన్ను అత్యంత స్వల్పంగా 3 శాతంగా ఉంది. కార్పొరేషన్‌లు, విదేశీయులు మరిన్ని రాయితీల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు, పొందవచ్చు కూడా. ఒక్క మాటలో చెప్పాలంటే, మారిషస్ శూన్య పన్నుల ప్రాంతం.

సాధారణంగా రెండు దేశాల మధ్య రెండు దేశాలూ పన్ను విధించకుండా మినహాయించే ఒప్పందాలు ఉంటాయి. ఇటువంటి ఒప్పందాలు ఆ రెండూ సార్వభౌమాధికార దేశాలై, ఒక దేశంలో ఆ ఆదాయం మీద పన్ను విధించిన తరువాత మరో దేశంలో అదే ఆదాయం మీద పన్ను విధించడం అదనపు భారం అవుతుందనే భావన నుంచి ఏర్పడ్డాయి. ఇంత న్యాయమైన వాదన మీద రూపొందే ఒప్పందాలు వాస్తవంగా అక్రమ లావాదేవీలకు దారితీస్తున్నాయి. ఇలా ఒప్పందంలోకి వచ్చిన రెండు దేశాల మధ్య పన్నుల పరిమాణంలో తీవ్రమైన తేడాలున్నప్పుడు సంపన్నులు అక్రమానికి పాల్పడే అవకాశం ఉంది. భారత్, మారిషస్ మధ్య ఒప్పందానికి ఇదే పరిస్థితి ఎదురైంది. భారత్‌లో మారిషస్‌తో పోలిస్తే పన్నులు ఎక్కువగానే ఉన్నాయి. పన్ను నియంత్రణా వ్యవస్థ సుస్థిరంగా ఉంది. మరోవైపు మారిషస్‌లో ప్రత్యక్ష పన్నులు దాదాపుగా లేవు. పన్ను నియంత్రణా, పన్ను వసులూ యంత్రాంగం అనబడేది లేదు.

భారత్ మారిషస్ ఒప్పందం 1983 డిసెంబర్‌లో కుదిరింది. వ్యాపారం, మదుపు రంగాలలో పరస్పర ప్రోత్సాహం కొరకు రెండు చోట్లా పన్ను విధింపును తప్పించడానికి ఈ ఒప్పందం కుదిరింది. భారత్, మారిషస్‌ల మధ్య వ్యాపార, ద్రవ్య లావాదేవీలు అతి స్వల్పంగా ఉండేవి కనుక చాలా రోజుల పాటు ఈ ఒప్పందానికి గుర్తింపు కూడా లేదు. కానీ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు మొదలైన తరువాత భారత్‌కు ఇంకా ఎక్కువ మదుపును ఆకర్షించే లక్ష్యంతో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు 1994లో మారిషస్ నుంచి భారతదేశానికి మదుపులను ఆహ్వానిస్తూ వాటి మీద పెట్టుబడి పన్ను గానీ, ఆ దేశంలో ఉంచుకున్న సమయానికి పన్ను గానీ ఉండబోవని ఉత్తర్వులు ఇచ్చింది. ఇక దానితో తలుపులు బార్లా తెరిచినట్టుగా భారత్, మారిషస్ ఒప్పందంలోని లొసుగులను వాడుకుంటూ పన్ను రహిత ద్రవ్య ప్రవాహాలు మొదలయ్యాయి.

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 2007లో ప్రకటించిన పోర్ట్‌ఫోలియో మదుపు సర్వే ప్రకారం మారిషస్ మొత్తం పోర్ట్‌ఫోలియో మదుపు 184 బిలియన్ డాలర్లు కాగా, అందులో 72 శాతం భారత్‌లోనే ఉన్నాయి. ఇది ఆరు లక్షల కోట్ల రూపాయలు. అలాగే, భారతదేశంలో విదేశీ మదుపులలో 43 శాతం మారిషస్ ద్వారానే వచ్చాయి. ఈ పెట్టుబడి ప్రవాహం భారత్‌లోకి ఏకముఖంగా మాత్రమే రావడం లేదు. దీనిలో చాలా భాగం మళ్లీ పన్ను రహిత స్థావరాల ద్వారా బయటికి కూడా వెళ్లిపోతోంది. ఆ మదుపులు భారత స్టాక్‌మార్కెట్లలో ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చేసుకొని, భారత్‌లో ఒక్క పైసా కూడా పన్ను కట్టకుండా మళ్లీ విదేశాలకు వెళ్లిపోతాయి. మామూలుగా అయితే ఒప్పందం ప్రకారం ఇలా చుట్టు ప్రయాణం (రౌండ్ రూటింగ్) నిషేధం. కానీ, వీటిని వేరు వేరు పేర్లతో మళ్లిస్తారు. భారతదేశంలోకి ఒక్క మారిషస్ మాత్రమే కాదు ఇతర పన్ను రహిత స్థావరాల నుంచి ఎంత ఎంత పెట్టుబడి ప్రవేశిస్తున్నదో చాలా అంచనాలు ఉన్నాయి. ఒక అంచనా ప్రకారం 2008లో భారత్‌లోకి ప్రవేశించిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిలో 61 శాతం సింగపూర్, మారిషస్, సైప్రస్ వంటి పన్ను రహిత స్థావరాల నుంచే వచ్చింది. ఇందులో గణనీయమైన భాగం మళ్లీ వెనక్కి కూడా వెళ్లిపోయి ఉంటుంది. నార్వేజియన్ కమిషన్ వేసిన అంచనా ప్రకారం 2006-08 మధ్య భారత్‌లోకి వచ్చిన ప్రత్యక్ష పెట్టుబడిలో 38 శాతం మారిషస్ నుంచే వచ్చింది.

విదేశీ మదుపు సంస్థలు భారత స్టాక్‌మార్కెట్లలో ఈ రూపంలో పెట్టుబడులు పెట్టి, సత్వర లాభాలు చేసుకొని, ఆ లాభాల మీద విత్‌హోల్డింగ్ టాక్స్ గానీ, కాపిటల్ గెయిన్స్ టాక్స్ గానీ కట్టకుండానే తమ దేశాలకు మళ్లించుకోవచ్చు. ఈ మార్గం ఒకటైతే, ఈ సంస్థలు ఉపయోగించే మరొక మార్గం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు. వీటిని మొదట అప్పుగా ఇచ్చి, కాలక్రమంలో వాటిని షేర్‌లుగానో, కంపల్‌సరీ కన్వర్టబుల్ డిబెంచర్స్‌గానో మార్చుకోవచ్చునని నిబంధన పెడతారు. ఇవి సాధారణంగా షేర్‌ల ధరలు విపరీతంగా పెరిగిపోయే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఓడ రేవులు, నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ కంపెనీలు వంటి చోట్లనే ఉంటాయి. తొలి రోజుల్లో ఈ పెట్టుబడి మీద వడ్డీ

వస్తుంది. ఆ వడ్డీ మీద పన్నూ ఉంటుంది. కానీ, కంపెనీ పని మొదలుపెట్టి లాభాలు రావడం మొదలుకాగానే పబ్లిక్ ఇష్యూకు వెళ్తారు. అప్పుడు మొదటి పెట్టుబడిని షేర్‌లుగా మార్చేస్తారు. విపరీతంగా పెరిగిపోయిన ధరలతో ఆ షేర్‌లను మార్కెట్లో అమ్మేస్తారు. అలా వచ్చిన ఆదాయం మీద కాపిటల్ గెయిన్స్ పన్ను లేదు గనుక యథాతథంగా వెనక్కి తీసుకుపోతారు. దేశంలోకి ప్రవేశించి, తిరిగి వెళ్లిపోతున్న విదేశీ పెట్టుబడికి ఇది అత్యంత ఆకర్షణీయమైన మార్గం. ఈ మార్గంలో వాళ్లు ఒక్క పైసా పన్ను చెల్లించనక్కర్లేదు. దేశ ఖజానాకు ఒక్క పైసా పన్ను ఆదాయం రాదు. భారత ప్రభుత్వపు పారిశ్రామిక విధాన, ప్రోత్సాహశాఖ అంచనాల ప్రకారం ఏప్రిల్ 2000 నుంచి మార్చ్ 2009 వరకు భారత దేశానికి వచ్చిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 81 బిలియన్ డాలర్లు. ఇందులో 35.18 బిలియన్ డాలర్లు, అంటే 43 శాతం మారిషస్ ద్వారానే వచ్చింది. కాగా, అత్యంత సంపన్న దేశాలైన అమెరికా అతి స్వల్పంగా 7.59 బిలియన్ డాలర్లతో, బ్రిటన్ 7.52 బిలియన్ డాలర్లతో, జర్మనీ 2.14 బిలియన్ డాలర్లతో రెండవ, మూడవ, నాల్గవ స్థానంలో ఉన్నాయి.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం చట్టవ్యతిరేకమైన నిధుల ప్రవాహం ఎక్కడ ముగుస్తుందో, చట్టబద్ధమైన ఎక్కడ మొదలవుతుందో చెప్పలేని స్థితి ఉండడం. భారత కంపెనీలు బహిరంగంగా, చట్టబద్ధంగా విదేశాల నుంచి తెచ్చుకొనే పెట్టుబడులు కూడా సరిగ్గా ఈ చట్టవ్యతిరేక, అక్రమ నిధుల పన్నుల రహిత స్థావరాల నుంచే వస్తున్నాయి. భారత పార్లమెంట్ ముందు 2009 ఆగస్ట్ 7న ఉంచిన ఒక సమాచారంలో ప్రభుత్వమే చెప్పినట్టు 2008-09లో భారత కంపెనీలు తెచ్చుకున్న పెట్టుబడులలో 60 శాతం పన్ను రహిత స్థావరాల నుంచే వచ్చాయి. మొత్తంగా, భారత కంపెనీలు సంపాదించిన 16 బిలియన్ డాలర్ల (72 వేల కోట్ల రూపాయలు)లో 10 బిలియన్ డాలర్లు (45 వేల కోట్ల రూపాయలు) పన్ను రహిత స్థావరాలుగా పేరుపొందిన సింగపూర్, సైప్రస్, మారిషస్, రష్యా, ఐజిల్ ఆఫ్ మాన్, బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్స్, కేమన్ ఐల్యాండ్స్ నుంచి వచ్చాయి. తమ దేశం నుంచి విదేశాలకు వెళ్లే మదుపు గురించి సమాచారం ఇవ్వడంలో, జవాబు చెప్పడంలో ఎంత మాత్రం సహకరించని దేశంగా సింగపూర్‌కు ప్రపంచ ప్రఖ్యాతి ఉంది. సైప్రస్‌లో కార్పొరేట్ పన్ను అతి తక్కువ. షిప్పింగ్ కంపెనీలకు ఎన్నో ప్రత్యేక రాయితీలు ఉన్నాయి. 2008-09లో సైప్రస్ నుంచి భారత్‌కు 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అంతకు ముందు సంవత్సరం అందులో పావు వంతు కూడా రాలేదు. అలాగే, మారిషస్ నుంచి అంతకు ముందు సంవత్సరం 1.4 బిలియన్ డాలర్లు రాగా, 2008-09లో అది 1.8 బిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. ఇలా హఠాత్తుగా పెరిగిపోవడం యాదృచ్ఛికం కాదు. ఇది కేవలం ఆయా దేశాలలో పన్నుల మినహాయింపులు పెరుగుతన్నాయనడానికి సూచన.

ఈ దేశ ప్రజల మీద సాగుతున్న మోసాలలో మరొక పెద్ద మోసం పార్టిసిపేటరీ నోట్స్ అనే ద్రవ్య వ్యవహారం. ద్రవ్య చలామణీ బ్రోకర్లు తయారుచేసిన ఈ పద్ధతి ఈ పార్టిసిపేటరీ నోట్స్‌ను ఎవరు కొంటున్నారో, అమ్ముతున్నారో చెప్పకుండా దాచే పద్ధతి. స్విస్ బ్యాంకులలోనూ, బహమాస్ లాంటి పన్ను రహిత స్థావరాలలోనూ నిలువ చేసిన ధనాన్ని మారిషస్ ద్వారా, పార్టిసిపేటర్ నోట్స్ (పిఎన్) ద్వారా స్టాక్ మార్కెట్‌లలో పెట్టుబడి పెడతారు. దేశం నుంచి బయటికి డబ్బు పంపే మార్గం హవాలా అయితే లోపలికి తెచ్చే మార్గం ఈ పార్టిసిపేటరీ నోట్స్ అని ఒక స్టాక్ మార్కెట్ విశ్లేషకుడు అన్నాడు. 2009 నాటికి మొత్తం విదేశీ మదుపు సంస్థల పెట్టుబడులలో 50 నుంచి 60 శాతం అంటే 85 బిలియన్ డాలర్లు ఈ మార్గంలోనే వచ్చింది. ఇది ఇంకా పెరుగుతూ ఉంది. ఈ పిఎన్‌లు లబ్దిదారు ఎవరో తెలియని అక్రమ లావాదేవీ కనుక, వీటిని నిషేధించక తప్పదని, నిషేధించవలసిందని రిజర్వ్ బ్యాంక్ ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరింది. అయినా పిఎన్‌లు నిషేధించబడలేదంటే కారణం ఈ పిఎన్‌ల అక్రమ నిధుల వెనుక ఉన్న మూడు బృందాలు. 1) వ్యాపారవేత్తలు; 2) రాజకీయవాదులు; 3) అధికారులు.

'భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో ఉన్నదంటే అందుకు కారణం అమెరికా నుంచి మనకు వ్యాపిస్తున్న సంక్షోభం కాదు. లేదా, పరస్పర ఆధారిత ప్రపంచ వ్యాపార వ్యవస్థ కాదు. పార్టిసిపేటరీ నోట్స్ అనబడే మన సొంత మోసపూరిత ద్రవ్య పద్ధతే అందుకు కారణం. మారిషస్‌తో ఈ పద్ధతి కుదుర్చుకొన్న భారత ప్రభుత్వం ఆ దేశంలో ఒక్క డాలర్ పెట్టుబడితో స్థాపించిన కంపెనీలు కూడా భారత స్టాక్ మార్కెట్‌లలో కోట్లాది డాలర్లు పెట్టుబడి పెట్టి, ఒక్క పైసా పన్ను కట్టకుండా వెళ్లిపోవడానికి అనుమతిస్తుంది. స్టాక్‌మార్కెట్‌లలో జరిగే ఏ లావాదేవీ అయినా కొనుగోలుదారు ఎవరో, అమ్మకందారు ఎవరో, నిధుల వనరు ఏమిటో ప్రకటించాలి. కానీ, పిఎన్ మాత్రం ఇవేవీ చేయనక్కర్లేదు. ద్రవ్య సంస్కరణలపై తారాపూర్ కమిటీ పిఎన్‌లను రద్దు చేయమని సిఫారసు చేసింది. పిఎన్‌ల ఏ ప్రమాదాలు ఉన్నాయో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వేణుగోపాల్ రెడ్డి ఎన్నోసార్లు చెప్పారు. ఈ సిఫారసులన్నిటినీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఈ విషయంలో వాళ్లు గట్టిగా, వ్యతిరేకంగా ఉన్నారు గనుకనే దామోదరన్‌ను, రెడ్డిని పదవుల నుంచి తొలగించారు. ఈ విధానాన్ని ఆమోదించారు గనుకనే ఆ తర్వాతి వాళ్లను కీలక పదవుల్లో నియమించారు. జవాబుదారీతనం లేకుండా సాగిపోతున్న ఘరానా మోసం ఇది' అని మాజీ పార్లమెంట్ సభ్యుడు సుబ్రహ్మణ్యం స్వామి రాశాడు. ఆయనే మరొక వ్యాసంలో 'అప్పటి భారత ఆర్థిక మంత్రి పిఎన్‌లు ఎందుకు ప్రవేశపెట్టాడు. స్విస్ బ్యాంకుల్లో ఐజిల్ ఆఫ్ మాన్, కేమన్ ఐల్యాండ్‌లో, మకావోలో నిలువ ఉంచుకున్న తమ ధనం మీద ఆదాయం సంపాదించడానికి లంచగొండి రాజకీయ వేత్తలకు, వ్యాపారస్తులకు సహాయపడడానికే ఈ పిఎన్‌లు మొదలయ్యాయి. పిఎన్‌లు రానంతవరకు ఈ ధనం అంతా అక్కడ రహస్య ఖాతాలలో మూలుగుతూ ఉండేవి. దాని మీద వడ్డీ ఆదాయం రాకపోగా ఆ బ్యాంకులకే వీరు సర్వీస్ ఛార్జీలు కట్టవలసి ఉండేది. ఇప్పుడు ఈ బందిపోట్లు, ఈ ఘరానా దొంగలు తమ అక్రమ ధనాన్ని మారు రూపాలలో మారిషస్ ఒప్పంద సహాయంతో దేశంలోకి తీసుకొచ్చి దాని మీద ఆదాయం సంపాదించి, మళ్లీ పన్ను కట్టకుండా ఉండగలుగు తున్నారు' అని రాశాడు.

పన్ను అతిక్రమణకూ, పన్ను ఎగవేతకూ విభజన రేఖ చాలా సన్ననిది. కానీ, రెండిటి ఫలితం ఒక్కటే. దేశ ఖజానాకు పన్ను ఆదాయంలో కొరత ఏర్పడుతుంది. ఈ రెంటి మధ్య తేడా వాటి చట్టపరమైన నిర్వచనాలలోనే ఉంది. చట్ట వ్యతిరేకంగా, ఖాతాలను తప్పుగా రాసి, పన్ను రాయితీలను పొందడం పన్నుల ఎగవేతగా నిర్వచిస్తున్నారు. ఇది అనుమతించడానికి వీలు లేని నేరంగా గుర్తిస్తున్నారు. ఇందుకు భిన్నంగా పన్ను అతిక్రమణ అంటే, చట్టబద్ధమైన, ఆమోదయోగ్యమైన నిబంధనలకు

మనుషులపై సామ్రాజ్యవాద మాయ

***పాలకులు తమ పాలనను సజావుగా నడిపించుకోవడానికి ఆయా సందర్భాలలో అవసరమైన భావజాలాన్ని ప్రచారం చేస్తారనీ, సమ్మతిని సృష్టించుకుంటారనీ, వ్యతిరేకించిన వారిని అణచివేస్తారనీ అంటున్నారు* లోకసంచారి**

అమెరికాలో నా సహోద్యోగి అయిన ఆ దేశస్తుడు, అమెరికా తరఫున వియత్నాం యుద్ధంలో పాల్గొన్నాడు. ఆయనతో తన వియత్నాం యుద్ధ అనుభవాల గురించి మాట్లాడిన క్రమంలో ఒక విషయం చెప్పాడు. 'వియత్నాం దేశీయుల్లో అమెరికా మిత్రులుంటారు. శత్రువులుంటారు, తటస్థులుంటారు. వీరిని ఎలా గుర్తించడం? ఇంతకు ఎవరిని చంపాలి, ఎవరిని చంపకూడదు?' అని అమెరికా సైనికులు తమ పై ఆఫీసర్లను అడిగితే, ఆ సైనికాధికారులు తమకు వాషింగ్టన్ నుండి వచ్చిన ఆదేశాలు పాటించమని సైనికులకు చెప్పారట. ఆ ఆదేశం ఏంటంటే 'కిల్ దెమ్ ఆల్ అండ్ గాడ్ విల్ సార్ట్ అవుట్' (అందరిని చంపండి. దేవుడు నిర్ణయిస్తాడు ఎవరు మన మిత్రులు, ఎవరు శత్రువులు, ఎవరు తటస్థులని.)

యూరప్ ఖండానికి చెందిన తెల్ల జాతీయులు అమెరికా తూర్పు తీరాన్ని మొదట ఆక్రమించుకొన్న తర్వాత, క్రమ క్రమంగా ఆ దేశ ఆదివాసులైన రెడ్ ఇండియన్ల నుండి భూమిని లాక్కోవడానికి కొన్ని దశాబ్దాల పాటు వారిపై యుద్ధం చేశారు. ఈ యుద్ధాన్ని తెల్ల జాతీయులు 'గ్రీన్‌హంట్'గా పిలిచారట. అమెరికా తూర్పు తీరం నుండి పశ్చిమ తీరం వరకు మూడు వేల మైళ్లు. ఈ మూడు వేల మైళ్ల పొడవున ఉన్న రకరకాల రెడ్ ఇండియన్ తెగల సముదాయాలు యూరప్ దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి, వేలకొద్ది అమరులయ్యారు. అయితే రెడ్ ఇండియన్ తెగలన్ని ఒక రాజకీయ నిర్మాణం కింద విశాల ఐక్య సంఘటన నిర్మించుకోకపోవడం వలన, వారికి అప్పటి పరిస్థితుల ప్రకారం గెరిల్లా యుద్ధ తంత్రాలు తెలవకపోవడం మూలానా రెడ్ ఇండియన్‌లు అంతిమంగా ఓటమి పాలయ్యారు. అయితే, ఈ యుద్ధ క్రమంలో తెల్లజాతీ సైనికులు కొందరు రెడ్ ఇండియన్‌లలో చాలామంది మంచి వ్యక్తులు ఉన్నారని, అలాంటి వారిని చంపడం భావ్యం కాదని తమ పై అధికారులతో అన్నప్పుడు, సైనికాధికారులు ఇలా సమాధానం ఇచ్చారట. 'ది ఓన్లీ గుడ్ ఇండియన్ ఈజ్ ఎ డెడ్ ఇండియన్'. (చనిపోయిన రెడ్ ఇండియనే, మంచి రెడ్ ఇండియన్)

ఈ మధ్య చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నిరాయుధులైన ఆదివాసీలను (చిన్న పిల్లలు, స్త్రీలతో సహా పద్దెనిమిది మందిని) గాంధీని జాతిపితగా (?) ప్రకటించిన ప్రపంచంలోని అతి పెద్ద 'ప్రజాస్వామ్య' దేశమని పిలువబడుతున్న భారత సైనిక, పోలీసు బలగాలు తుపాకులతో

లోబడే పన్ను మినహాయింపుల అవకాశాన్ని వాడుకొని జరిపే లావాదేవీలు. ఇది చట్టబద్ధమైన వ్యవహారమే. చట్ట ప్రకారం నేరం కాదు. కాని, ఈ వ్యవహారం జరుగుతున్న తీరు, విదేశాలతో కుదిరిన ఒప్పందాలను ఇందుకు వాడుకుంటున్న తీరు, ఈ వ్యవహారంలో చేతులు మారుతున్న నిధులు చూస్తే ఇది తప్పకుండా అక్రమమేనని, చట్ట వ్యతిరేకమేనని స్పష్టం అవుతుంది.

ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'నల్లధనంపై శ్వేతపత్రం' ఒక నిరాశాజనకమైన పత్రం. అయినప్పటికీ అవినీతికీ, నల్లధనానికీ వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజా అసంతృప్తి వల్ల గత బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం కొన్ని సాహసికమైన నిర్ణయాలే ప్రకటించింది. ఆదాయపన్ను చట్టం 1961లోని సెక్షన్ 9లో పన్ను అతిక్రమణ గురించి ఉన్న అస్పష్టతను తొలగించడానికి ఒక సవరణ ప్రవేశపెట్టింది. దేశం లోపల ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్‌ను నియంత్రించడానికి చర్యలు ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పన్ను అతిక్రమణ వ్యతిరేక నిబంధనలను అమలు చేస్తానని ప్రకటించింది. అంతేకాదు, ఆర్థికమంత్రి భారతదేశపు పన్నుల విధానం గురించి పార్లమెంట్‌లో ఒక విస్పష్టమైన ప్రకటన చేశారు. 'భారత్ పన్ను లేని దేశం కాదు. స్వల్ప పన్నుల దేశం కాదు. పన్ను రహిత స్థావరం కాదు. దేశంలో నివాసులైనా, విదేశాలలో నివసిస్తున్నవారైనా పన్ను చెల్లింపుదారులందరినీ సమానంగా చూసే దేశం ఇది. అలాగే, మీరు మరొక దేశంలో పన్ను చెల్లిస్తున్నట్టయితే భారతదేశంలో పన్ను చెల్లించనక్కర్లేదు. కానీ, అక్కడా ఇక్కడా కూడా పన్ను చెల్లించకుండా ఉండే పరిస్థితిని అంగీకరించబోం'.

అయితే, భారతదేశానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి చాలా అవసరమనీ, అది రాబట్టడానికి పన్ను చెల్లింపుల అక్రమాలను చూసీ చూడనట్టు పోవాలనీ, పన్ను ఆదాయం తగ్గిపోయినా ఫర్వాలేదనీ ఒక తప్పుడు ప్రచారాన్ని కొన్నివర్గాలు సాగిస్తున్నాయి. ఈ మానసిక స్థితిని అడ్డుకోవలసి ఉంది. 'విదేశీ పెట్టుబడిని ఆకర్షించడం కోసం భారత్‌ను పన్ను రహిత స్థావరం చేయలేం. పెట్టుబడులు లేక ముందు మనమేమీ బల్లులు తిని బతకలేదని గుర్తుపెట్టుకోండి. ఇవ్వాళ్టికి కూడా మన పెట్టుబడులలో గణనీయమైన భాగం దేశంలోని పొదుపు నిధుల నుంచే వస్తోంది. అందువల్ల 120 కోట్ల ప్రజల మహత్తర దేశమైన మనం ఒక కేమన్ ఐల్యాండ్స్, ఒక ఐజిల్ ఆఫ్ మాన్ లాగా, ఒక వర్జిన్ ఐల్యాండ్ లాగా దిక్కులేని స్థితిలో లేం. మనకూ వాటికీ పోలిక లేదు. ఇక్కడ పన్నులు చెల్లించండి. లేదా, మీరు ఏ దేశంలో వ్యాపారం చేస్తున్నారో అక్కడ పన్ను చెల్లించండి' అని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన వాస్తవ రూపం ధరించవలసి ఉంది.

(అయిపోయింది)

(రచయిత అర్థశాస్త్రవేత్త, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్) వీ

విచ్చలవిడిగా కాల్చి, అప్పటికీ చనిపోని వారిని పట్టుకొని కత్తులతో నరికి, బండరాళ్లతో మోది చంపివేసారని అక్కడికి వెళ్లిన నిజ నిర్ధారణ కమిటీకి ఆదివాసులు చెప్పారు.

పాలక వర్గాలతో 'ఎంబెడ్' అవ్వడమే కాదు ఏకంగా 'ఇన్-బెడ్' (మంచం పంచుకోవడం) కూడా అయిన కార్పొరేట్ మీడియా ఈ ఊచకోతను పొరపాటుగా జరిగిన ఎన్‌కౌంటర్‌గానే చిత్రీకరిస్తోంది. ఈ సంఘటనకు కొన్ని రోజుల ముందు సల్వాజుడుంలో పనిచేసి తిరిగి తమ ఊరి ప్రజలతో కలిసి ప్రశాంతంగా బతకడానికి వచ్చిన యువకులు కూడా ఆ ఊరిలో ఉన్నారు. తమకు సేవ చేసిన వారిని చంపే అవకాశం ఉందని తెలిసి కూడా చీకటిలో ఇష్టారాజ్యంగా కాల్పులు జరిపారు. అంటే, గ్రీన్‌హంట్ పదాన్ని కనిపెట్టి, ప్రపంచ వ్యాప్తంగా కోట్ల కొలది ప్రజలను ఊచకోత కోయడంలో అపార అనుభవం సంపాదించిన అమెరికా దేశ పాలకులు తమ సిఐఎ సంస్థ ద్వారా, భారత పాలకులకు ఇచ్చిన శిక్షణ ఫలితమే ఈ రోజు దేశ వ్యాప్తంగా భారత పాలకవర్గాలు జరుపుతున్న ఊచకోతలు. కిల్ దెమ్ ఆల్ అండ్ గాడ్ విల్ సార్ట్ అవుట్ అనేది గ్రీన్‌హంట్ యుద్ధనీతి.

మొత్తం జనాభాలో కేవలం 0.5 శాతంగా మాత్రమే ఉన్న పాలక వర్గాలు 99.5 శాతం ప్రజలను రకరకాల వినూత్న పద్ధతుల ద్వారా దోచుకు తింటూ, తిరిగి ఆ ప్రజలనే అణచివేయడానికి, అదే 99.5 శాతం ప్రజల నుండి పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని పోలీసు, మిలిటరీ బలగాలలోకి తీసుకొని, వారి ద్వారా తమ తోటి ప్రజలనే చంపించడం, అణిచివేయడం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ దేశాల్లో కాని, గొప్ప ప్రజాస్వామ్య దేశాలని పిలువబడుతున్న దేశాల్లో కాని, ఏ మాత్రం తేడా లేకుండా ఇదే జరుగుతోంది.

ప్రపంచంలోని ఏ దేశంలో కూడా శత్రు దేశాల పైకి సైనిక బలగాలను వాడడం కన్నా తమ దేశ ప్రజలపైనే సైనిక బలగాలను వాడుతున్నారు. కాకపోతే, కొన్ని దేశాల్లో ఇది స్పష్టంగా కనబడుతుంది, కొన్ని దేశాల్లో లోతుగా పరిశోధిస్తే కాని అర్థం కాదు. ఇదంతా ఎలా ఉంటుందంటే, మార్క్స్ చెప్పినట్టు, పెట్టుబడిదారులు శ్రామికవర్గాన్ని దోచుకొని, ఆ వచ్చిన లాభాలతో అధునాతన యంత్రాలు (ఇప్పటి పరిస్థితి ప్రకారం కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్లు కూడా) తెచ్చి, తమకు లాభాలు తెచ్చిన శ్రామికవర్గాన్నే ఉద్యోగాల నుండి తీసివేస్తారు. శ్రామికవర్గం అన్యాయాన్ని ప్రశ్నిస్తే, శ్రామికవర్గం నుండే వసూలు చేసిన ట్యాక్స్‌ల ద్వారా, అదే శ్రామిక వర్గానికి చెందిన కొందరిని పోలీసు, మిలిటరీ, ప్రైవేట్ ఆర్మీలోకి తీసుకొని వారి చేత తమ తోటి సోదరులనే చంపించడం, అణచివేయడం చేస్తారు.

ఇకపోతే గత సంవత్సర కాలంగా భారత పెట్టుబడిదారులు పాకిస్తాన్‌తో ఎలాంటి ఆంక్షలు లేని వ్యాపార సంబంధాలు పెంచుకోవాలని, దాంట్లో భాగంగా పాకిస్తాన్‌కు ఎంఎఫ్ఎన్ (మోస్ట్ ఫేవర్డ్ నేషన్ అంటే అత్యంత ఆప్తులైన దేశం) ప్రతిపత్తి ఇచ్చే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఒకవేళ ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదిస్తే, బిజెపి దీన్ని అడ్డం పెట్టుకని 2014 ఎన్నికలలో హిందూ ఓటర్లను తమ వైపు తిప్పుకునే అవకాశాలున్నాయని ఆ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం లేదు. 2014 ఎన్నికల తర్వాత బిజెపితో సహా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ బిల్లును ఆమోదిస్తాయి. అయితే, ఇక్కడ ప్రజలు ఆలోచించవలసింది ఏంటంటే, 1947 నుండి భారత పాలక వర్గాలు పాకిస్తాన్ మన శత్రువనీ, భారత దేశంలో జరిగే అన్ని బాంబు పేలుళ్ల వెనుక, మతకలహాల వెనుక పాకిస్తాన్ ఐఎస్ఐ హస్తం ఉందనీ, పాకిస్తాన్ భారతదేశ విచ్ఛిన్నానికై టెర్రరిస్టులకు ట్రైనింగ్ ఇచ్చి పంపిస్తుందనీ, పాకిస్తాన్‌లో భారత కరెన్సీ దొంగ నోట్లను ముద్రించి మన దేశంలో విచ్చలవిడిగా పంపిణీ చేస్తుందనీ, ఇలా రకరకాలుగా పాకిస్తాన్ వ్యతిరేక ప్రచారం ఇన్-బెడ్ అయిన కార్పొరేట్ మీడియాను వాడుకొని పసిబాలుడి నుండి పండు ముదుసలి వయసు వారి వరకు అందరి మెదళ్లను బ్రెయిన్ వాష్ చేసి, హిప్నటైజ్ చేసి, పాకిస్తాన్ అన్నా, ఆ దేశ ప్రజలన్నా, వారి మతం అన్నా, వారి భాష అన్నా, మనకు అసహ్యం కలిగేట్టుగా మన బిపిలు తారాస్థాయికి పెరిగి నరాలు చిట్లేట్టుగా, మన మెదడు విష రసాయనాలను విచ్చలవిడిగా విడుదల చేసే స్థాయి కోపాన్ని ఆ దేశం పట్ల కలిపించారు. ఇన్నాళ్లు అలా, మన బ్రెయిన్ వాష్ చేసి, ఇప్పుడు ఆ దేశాన్ని అత్యంత ఆప్తులైన దేశంగా పార్లమెంట్ చేత ప్రతిపత్తి ఇవ్వబోతున్నారు. అంటే భారత పాలకవర్గాలు కోరుకున్నప్పుడల్లా మన మెదడులో వారు ముందస్తు ప్రణాళికతో ప్రవేశపెట్టే రకరకాల సాఫ్ట్‌వేర్‌లలో ఒకదాని నుండి ఇంకోదానికి నోరు మూసుకొని మారాలి. వారు ఎవరిని ఇష్టపడమంటే వారిని ఇష్టపడి పక్కలో పడుకోబెట్టుకోవాలి. వారు ఎవరిని అసహ్యించుకోమంటే వారిని మన మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతినే స్థాయిలో విషం కక్కుతూ అసహ్యించుకోవాలి. పాకిస్తాన్ అకస్మాత్తుగా అత్యంత ఆప్తులైన దేశం అయితే, సరిహద్దులో సైన్యం ఎందుకు? లక్షల కోట్ల రక్షణ బడ్జెట్ ఎందుకు?

భారతదేశానికి అత్యంత ప్రమాదం పాకిస్తాన్. ఇది భారత పాలకవర్గాలు మన మెదళ్లలో ఎక్కించిన పాత సాఫ్ట్‌వేర్. పాలక వర్గాలు ఇప్పుడు మన మెదళ్లలో కొత్త సాఫ్ట్‌వేర్ ఎక్కించాయి. అదేంటంటే, భారత దేశానికి అత్యంత ప్రమాదం మావోయిస్టులు. ఈ కొత్త బ్రెయిన్ వాష్ ప్రకారం భారతీయులంతా, గొర్రెల్లా, మెదళ్లు లేని రాబట్‌లలా, ఇప్పటి వరకు అత్యంత పెద్ద శత్రువు అని చెప్పబడిన విదేశీయులను (అంటే పాకిస్తాన్ వారిని) ప్రేమించాలి. మావోయిస్టుల పేరు మీద మన దేశ ప్రజలనే మనం విషం కక్కుతూ అసహ్యించుకోవాలి. దీని సారాంశం ఏంటంటే, పాకిస్తానీయులను ప్రేమించండి, భారతీయులను ద్వేషించండి అని భారత ప్రభుత్వం భారతీయుల మెదళ్లలో ఎక్కించిన సరికొత్త సాఫ్ట్‌వేర్.

ఇప్పుడు దేశభక్తి అంటే శత్రుదేశాలను అసహ్యించుకోవడం కాదు. మన దేశ ప్రజలను మనమే అసహ్యించుకొని, వారిని చంపమని పాలక వర్గాలకు వత్తాసుగా నిలవడం. ఇది పాలక వర్గాలు మనకు నేర్పుతున్న సరికొత్త దేశభక్తి. నీ దేశ ప్రజలను నువ్వు అసహ్యించుకోలేదంటే నువ్వు దేశద్రోహివి. నీ మీద దేశ ద్రోహి నేరం కూడా మోపుతారు. జాగ్రత్త.

ఇది భారత పాలకవర్గాలు మూసుకున్న తలపుల వెనుక, తెరుచుకున్న మార్కెట్ హృదయాలతో వేసుకున్న కొత్త ప్రణాళిక. దాన్ని ఒక సాఫ్ట్‌వేర్‌గా, 21వ శతాబ్దపు నయా గోబెల్స్‌లైన కార్పొరేట్ మీడియా ద్వారా మన

మెదళ్లలోనే ఎక్కిస్తున్నారు. దాంట్లో భాగంగానే విదేశీ శత్రుదాడులను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన సైనిక బలగాలను లక్షల కోట్ల రూపాయలతో కొన్న అత్యంత అధునాతన మానవ హనన ఆయుధాలతో, సాటిలైట్లతో, వాయు సేన హెలికాప్టర్లతో, మానవ రహిత విమానాలతో స్వంత దేశ ప్రజలనే చంపండని పంపిస్తున్నారు. నెలవారి జీతం ఇస్తే ఏ మారణహోమం అయినా చేస్తామని పోలీసులు, సైనికులు తమ ప్రజలను తామే ఊచకోత కోస్తున్నారు. రాజ్యాంగం, చట్టాలు, మానవత్వం, నైతిక విలువల పట్ల నరనరాల్లో అత్యంత అసహ్యాన్ని, అగౌరవాన్ని నింపుకున్న (మొత్తం జనాభాలో కేవలం 0.5 శాతంగా ఉన్న) ఈ భారత 'ప్రజాస్వామ్య' పాలక వర్గాలకు పాకిస్తాన్‌లు, చైనాలు ఎప్పుడూ శత్రువులు కాదు. వీరికి ప్రథమ శత్రువు భారతదేశంలోని 99.5 శాతం ప్రజలు.

పాలకవర్గాలు ప్రజలను శత్రువులుగా చూడకుంటే దేశ ప్రజలను లక్షలాది సమస్యల్లో ముంచి వారి జీవితాలను దుర్భరం చేయకూడదు. అవినీతి, స్కామ్‌లు రాజ్యమేలకూడదు. పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలు ఉండకూడదు. కార్పొరేట్ కంపెనీల కొరకు ప్రజల భూమిని లాక్కోవడం, ఎదిరిస్తే ప్రభుత్వమే ప్రజలను చంపడం, జైలు పాలు చేయడం చేయకూడదు. మైనింగ్ పేరుతో, పారిశ్రామికీకరణ పేరుతో ప్రకృతిని నాశనం చేయకూడదు. ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచుతూ ప్రజలను అప్పుల్లోకి, పేదరికంలోకి నెట్టకూడదు. ప్రజల ఆరోగ్యం సర్వనాశనం చేస్తున్న విష రసాయనాల పంటలను ప్రభుత్వమే ప్రోత్సహించకూడదు. కార్పొరేట్ కంపెనీలు రకరకాల అత్యంత ప్రమాదకర రసాయనలను తిండి పదార్థాలతో, కాస్మోటిక్స్‌లలో కలిపి అమ్ముతూ వేల కోట్ల లాభాలు గడిస్తూ ఉంటే వారికి రకరకాల ట్యాక్స్‌లు తీసివేసి, రకరకాల ప్రోత్సహకాలు ఇస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేయండి, వారిని త్వరగా కాటికి పంపండని ప్రోత్సహించకూడదు. అన్ని రకాల తిండి పదార్థాలలో ఎన్నెన్నో రకాల కల్తీలు ఎవరు చేస్తున్నారో, ఎక్కడ చేస్తున్నారో స్పష్టంగా తెలిసినా చచ్చేది, రోగాల పాలయ్యేది 99.5 శాతం ప్రజలు కదా అని పాలకవర్గాలు పట్టించుకోకుండా ఉండకూడదు. (వారు ఎలాగూ విదేశాల నుండి దిగుమతి చేసుకున్న లేదా అత్యంత ఖరీదైన కల్తీ లేని ఆహార పదార్థాలను తింటారు.) కార్పొరేట్ రంగానికి వ్యవసాయాన్ని అంటగట్టే దీర్ఘకాలిక కుట్రలో భాగంగా వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల జీవితాలను రకరకాల పద్ధతులతో సర్వనాశనం చేయకూడదు. వారు ఆత్మహత్యలు చేసుకుంటుంటే చూస్తూ ఉండకూడదు. విద్యా రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తూ 90 శాతం జనాభాకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మార్చకూడదు. దళితులపై, మహిళలపై, మైనారిటీలపై, ఆదివాసులపై నిత్యం ఊచకోతలు, అత్యాచారాలు జరగకూడదు. ప్రజలపై పోలీసుల, సైనిక బలగాల హింస, అత్యాచారాలు, దౌర్జన్యాలు ఉండకూడదు. పోలీసు స్టేషన్‌కు కంప్లైంట్ చేయడానికి కూడా వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండకూడదు.

కార్పొరేట్ కంపెనీల కాలుష్యం వలన భూములు, వాతావరణం కలుషితమై, సాంప్రదాయ జీవన వనరులు దెబ్బతిని ప్రజలు పేదలుగా, నిర్వాసితులుగా మారకూడదు. ఆ కాలుష్యపు గాలి పీల్చుకొని, నీరు తాగి, ఆహారం తిని రకరకాల శారీరక, మానసిక తీవ్ర రోగాలతో అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడం, చనిపోవడం లేదా జీవచ్ఛవాల్లా ప్రజలు బతుకు ఈడ్చడం జరగకూడదు. హత్యలు, దోపిడీలు, గూండాయిజం, మాఫియా, బ్లాక్ మార్కెట్‌లను పాలకవర్గాలు పెంచి పోషించకూడదు. సెక్స్ ట్రాఫికింగ్, ఆర్గాన్ ట్రేడింగ్, వెట్టి చాకిరీ లాంటి అమానవీయ వ్యాపారాలను పాలకవర్గాలు ప్రోత్సహించకూడదు. మత్తు పదార్థాలు, జూదం, రేసింగ్, ఆల్కహాల్ లాంటి రకరకాల వ్యసనాలకు ప్రజలు బానిసలై సంపాదనంతా వాటి గురించి ఖర్చు చేసేట్టుగా పాలకవర్గాలు వాటిని ప్రోత్సహించకూడదు.

పిల్లలపై అత్యాచారాలు జరగకూడదు. టివి, సినిమాలు, సెల్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ ద్వారా అశ్లీల సాహిత్యాన్ని, హింసను, అమానవీయ సంస్కృతిని పిల్లలు, యువత మెదళ్లలో ఎక్కించి వారి మెదళ్లను కలుషితం చేయకూడదు. వ్యాపార సంస్థలు ప్రజలను అన్ని రంగాలలో చట్టపరంగా, చట్ట వ్యతిరేకంగా మోసం చేస్తూ, లక్షల కోట్లు గడిస్తూ ఉంటే ఈ దోపిడీని ప్రోత్సహించకూడదు. ఈ అన్యాయాలు, అక్రమాలు భరించలేక ప్రశ్నించే వారినే జైళ్లపాలు చేయడం, చంపడం చేయకూడదు. ఇలా చెప్పుకుంటూపోతే, రామాయణం, బైబిల్, ఖురాన్‌లు కలిపితే ఎంత లావు పుస్తకం అవుతుందో అన్ని రకాలుగా పాలకవర్గాలు ప్రజలను ఆర్థికంగా దోచుకుంటూ, మానసికంగా, శారీరకంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా హింసిస్తూ, అణచివేస్తూ, ఊచకోతలు కోస్తున్నారు. ఇదంతా గ్రీన్‌హంట్. అందుకే, పాలక వర్గాలకు ప్రజలే ప్రథమ శత్రువులు. ఈ సత్యం ప్రజలకు అర్థం కాకుండా ఉండడానికే పాలకవర్గాలు ప్రజల మైండ్ కంట్రోల్ చేస్తారు. ఎప్పటికప్పుడు రకరకాల వినూత్న పద్ధతులతో మన బ్రెయిన్ వాష్ చేసే, మనల్ని హిప్నటైజ్ చేసే అన్నిరకాల సాఫ్ట్‌వేర్‌లు వారు సిద్ధంగా ఉంచుకుంటారు. ఎప్పుడు ఏది అవసరమనుకుంటే ఆ సాఫ్ట్‌వేర్ మన మెదళ్లలో ఎక్కిస్తారు. మనం మెదళ్లు లేని రాబట్‌లలా, జవసత్వాలు ఉడిగిపోయిన మనుషుల్లా, కుక్కిన పేనుల్లా పడి ఉండాలి. వారు ఇంకా ఇంకా ధనవంతులు కావడానికి మన మానసిక, శారీరక ఆరోగ్యం సర్వనాశనం చేసుకుంటూ వారి అభ్యున్నతికి ఊడిగం చేస్తూ అత్యంత త్యాగ నిరతితో మన దేశభక్తి ప్రదర్శించాలి.

పాలకవర్గాలు మన మెదళ్లు పని చేయవద్దు అన్నప్పుడు గొర్రెల్లా మన మెదళ్ల స్విచ్చు ఆఫ్ చేయాలి. ఏ రకంగా మన మెదడు పని చేయాలని వారు కోరుకుంటే వారు ఇచ్చిన ఆ రకమైన సాఫ్ట్‌వేర్‌తో మనం ఆలోచించాలి. ఇదే గ్రీన్‌హంట్. ప్రశ్నించినా, ప్రశ్నించక కుక్కిన పేనులా మనం పడి ఉన్నా మన మీద గ్రీన్‌హంట్ తప్పదు. ఎదిరించినా, ఎదిరించకపోయినా 99.5 శాతం జనాలందరు ఈ గ్రీన్‌హంట్‌కు బలి కావాల్సిందే. కాకపోతే కొంచెం వెనుకా ముందు. అటు నుంచి ముందు నరుక్కు రండి అని మీరు తెలివిగా అర్జి పెట్టుకుంటే పాలకవర్గాలు కరుణించి వదిలి పెడతారని ఆశపడడానికి ఇది రాజుల కాలం కాదు. ఇది గ్లోబలైజ్డ్ గ్రీన్‌హంట్‌ల కాలం. కులాలు, మతాలు, ప్రాంతాలు, దేశాలు, భాషలు, చర్మం రంగులకు అతీతంగా ప్రపంచంలోని 99.5 శాతం జనాలపై 0.5 శాతం పరాన్న భుక్కు దోపిడదారులు జరుపుతున్న ఈ 21 శతాబ్దపు గ్రీన్‌హంట్‌కు అందరూ బలి కావల్సిందే. ఇప్పటికే అవుతున్నారు కూడా. నేను, నా కుటుంబం బలికావడం లేదు అని

మీరు అనుకుంటే పాలక వర్గాలు మీ మెదళ్లలో ఎక్కించిన సాఫ్ట్‌వేర్‌తో మీకు జరిగిన బ్రెయిన్ వాష్ మీ భ్రమలకు కారణం. మనం ఈ భ్రమల్లో ఉన్నా, కుక్కిన పేనులా పడి ఉన్నా పాలకవర్గాలు మనల్ని కరుణించవు లేదా ప్రేమించవు. పాలకవర్గాలు అంత మానవతా వాదులు అయితే కుక్కిన పేనుల్లా పడి ఉన్న ప్రజలకు, తమ దోపిడీకి కాపలా కాస్తున్న పోలీసు, సైనిక బలగాలకు ఏ రకమైన సమస్యలు లేకుండా అత్యంత ప్రేమభావంతో చూసుకోవాలి.

కాని పాలకవర్గాలు వారిపై కూడా మిగతా ప్రజానీకంపై రుద్దిన సర్వరకాల సమస్యలు రుద్దారు. వారిపై కూడా టాక్స్‌లు వేస్తున్నారు. వారు కూడా పాలకవర్గాలు చేస్తున్న అన్ని రకాల అన్యాయాలకు, అక్రమాలకు, దౌర్జన్యాలకు, దోపిడీకి, వివక్షకు గురవుతున్నారు. పాలకవర్గాలకు వత్తాసుగా మేధో వ్యభిచారం చేస్తున్న వివిధ రంగాల మేధావులు, వారి కుటుంబాలు స్వర్గంలో ఏమీ బతకడం లేదు. వారు వారి కుటుంబాలు కూడా పాలకవర్గాలు 99.5 శాతం ప్రజలపై రుద్దుతున్న సర్వరకాల చెడుకు బలి అవుతున్నారు. సమీప భవిష్యత్‌లో తప్పక జరగబోతున్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆరోగ్య, పర్యావరణ వినాశనంలో పరాన్నభుక్కు దోపిడీ పాలక వర్గాల రక్షకులైన పోలీసులు, సైనికులు, పాలకవర్గాల ఎంగిలి మెతుకులు ఏరుకు తింటున్న మేధావులు, నయా గోబెల్స్‌లైన కార్పొరేట్ మీడియా సేవకులు అందరు కూడా ప్రజలతో సహా బలి కావాల్సిందే. ఎందుకంటే, వీరందరు కూడా 99.5 శాతం ప్రజల్లో భాగమే కాబట్టి.

ఈ కఠోర వాస్తవాలు 99.5 శాతంగా ఉన్న ప్రజలకు అర్థం కాకూడదు. అందుకే ప్రజల మైండ్ కంట్రోల్ చేస్తున్నారు. ప్రజలను బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. వీలైనంత వరకు ప్రజల మెదళ్లు పనిచేయకుండా, ప్రజలు ఆలోచించుకోవడానికి సమయం లేకుండా, రకరకాల వ్యసనాలకు, మత్తులకు, రకరకాల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, పర్యావరణ సమస్యలకు గురి చేస్తున్నారు. ప్రజలు నిత్యం ఒకరిని ఒకరు అసహ్యించుకునేట్టు, అనుమానించుకునేట్టు పరిస్థితులు కల్పిస్తున్నారు. ప్రజలు నిత్యం ఒకరిని ఒకరు రకరకాల కారణాలతో తిట్టుకునేట్టు, కొట్టుకునేట్టు, చంపుకునేట్టు చేస్తున్నారు. వస్తు మార్పిడి జీవన విధానంతో ఉన్నంతలో సంతోషంగా బతుకుతున్న ప్రజల జీవితాల్లో డబ్బును ప్రవేశపెట్టి 90 శాతం డబ్బును 0.5 శాతం పాలకవర్గాలు తమ గుప్పిట్లో పెట్టుకొని, మిగతా 10 శాతం డబ్బు కొరకు 99.5 శాతం ప్రజలను ఒకరిపై ఒకరిని పోటీగా పెట్టి, దోచుకున్నవానికి దోచుకున్నంత ఆస్తి అనే వ్యవస్థ ప్రజలమీద రుద్ది, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, పర్యావరణం సర్వనాశనం చేస్తున్నాయి పాలకవర్గాలు.

పన్నులు ఎగవేయకుండా, పర్యావరణం, ఆరోగ్యం నాశనం చేయకుండా, అబద్ధాలు చెప్పకుండా, అన్యాయం చేయకుండా, రాజ్యాంగ వ్యతిరేక పనులు, అనైతిక పనులు చేయకుండా లేదా ఇవన్నీ చేసే సంస్థలకు కాని వ్యక్తులకు కాని పని చేయకుండా లేదా హరిత వ్యాపారం చేయకుండా ఎవరు కూడా మూడు, నాలుగు లక్షలకు మించి సంపాదించలేరు. అలాంటప్పుడు, కోటి రూపాయలు, వంద కోట్లు, వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్న పెట్టుబడిదారులు కాని, ఇతరులు కాని నీతి, నిజాయితీలతో, సమాజానికి ఏ రకమైన నష్టం చేయకుండా సంపాదిస్తున్నారని ఎవరైనా నమ్మితే వారు పరమ మూర్ఖులన్నా కావాలి లేదా పాలకవర్గాల బ్రెయిన్‌వాష్‌కు హిప్నటైజ్ అయి మెదడు పని చేయడం ఆగిపోయిన మనుషులైనా కావాలి. ఇలాంటి అమానవీయమైన, అనైతికమైన వ్యవస్థను చట్టబద్ధం చేస్తే వచ్చేదే నేటి పెట్టుబడిదారీ 'ప్రజాస్వామ్య' వ్యవస్థ. ఈ వ్యవస్థకు 99.5 శాతం ప్రజలు తమకు ఇష్టం ఉన్నా లేకున్నా బలి కావాల్సిందే, అవుతున్నారు కూడా. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, గ్రేహౌండ్స్, కోబ్రాలు, సైనికులు, ప్రభుత్వోద్యోగులు, పాలకవర్గాలకు వత్తాసు పలికే జర్నలిస్టులు, మేధావులు అందరు కూడా ప్రజలతో పాటు ఈ గ్రీన్‌హంట్‌కు బలి అవుతున్నారు.

ఈ వాస్తవాలు 99.5 శాతం ప్రజలకు తెలవకూడదు. అర్థం కాకూడదు. అందుకే వారికి బ్రెయిన్ వాష్ చేయాలి. హిప్నటైజ్ చేయాలి. మెదడు పని చేయకుండా, ఆలోచించడానికి సమయం లేకుండా చేయాలి. ఇదే బ్రెయిన్ హంట్. బ్రెయిన్ హంట్ చేయకుండా గ్రీన్‌హంట్ విజయం సాధించదు.

అయినప్పటికీ, ఎవరి మెదడైనా పని చేసి ఒక మానవీయ, ప్రజాస్వామ్యయుతమైన వ్యవస్థ కోరుకున్నట్లైతే, వారందరిపై పాలకవర్గాలు యుద్ధం చేస్తున్నాయి. అందుకే గ్రీన్‌హంట్, బ్రెయిన్ హంట్‌లు కలిపితే హ్యూమన్ రైట్స్ హంట్ అవుతుంది. మనుషుల్లో మానవత్వం ఉండకూడదు. అంతా వ్యాపారమయం చేయాలి. అప్పుడు మానవ హక్కుల ప్రశ్నే రాదు. అందుకే కేవలం పాలకవర్గాలు మాత్రమే వారి హక్కుల గురించి మాట్లాడుతున్నాయి. పాలకవర్గాల్లో భాగమైన షారుక్‌ఖాన్‌ను అమెరికా విమానాశ్రయంలో మూడు గంటలు ప్రశ్నిస్తే అది కార్పొరేట్ మీడియా దృష్టిలో మానవ హక్కుల ఉల్లంఘన. కాని పాలకవర్గాలు దేశవ్యాప్తంగా ప్రతిరోజూ వందలాది మందిని రకరకాలా లేబుల్స్ వేసి చంపుతుంటే, జైళ్లలో కుక్కుతూ ఉంటే అది మానవ హక్కుల ఉల్లంఘన కాదు. అందుకే పాలకవర్గాలకు వారి హక్కులే అర్థమవుతాయి. 99.5 శాతం ప్రజలు తమ హక్కులు అడిగితే వారిపై హ్యూమన్ రైట్స్ హంట్ చేస్తారు. 0.5 శాతం పరాన్న భుక్కు దోపిడీ పాలకవర్గాలు, 99.5 శాతం జనాలను దోచుకు తినాలంటే, ఆ 99.5 శాతం జనాలను రకరకాల పేర్ల మీద హంట్ (వేట) చేయాలి. లాభాల కోసం, ఆస్తుల కోసం ఎప్పుడూ పాలకవర్గాలు ప్రజలను హంట్ చేస్తుంటాయి. ప్రజలను హంట్ చేస్తేనే వారికి అపారమైన ఆస్తులు వస్తాయి. ఆస్తి ఉంటేనే అధికారం వస్తుంది. అధికారం ఉంటేనే హంట్ చేయడానికి బలం వస్తుంది. ఇన్ని రకాల హంట్‌లు ఆగాలంటే 99.5 శాతం జనాలకు అధికారం రావాలి. ప్రజలకు అధికారం రాకూడదనే పాలకవర్గాలు చేసే గ్రీన్‌హంట్, బ్రెయిన్ హంట్, హ్యూమన్ రైట్స్ హంట్.

తన ప్రజలను తనే చంపే అధికారం ఉన్న వ్యవస్థను 'ప్రజాస్వామ్యం' అంటారు అని రాజ్యాంగానికి కొత్త నిర్వచనం ఇస్తున్నారు. తన తోటి దేశ ప్రజలను అసహ్యించుకునే వాడే నిజమైన దేశభక్తుడు అని పాలకవర్గాలు కొత్త నిర్వచనం ఇస్తున్నాయి. అబ్రహం లింకన్ అన్నాడు 'ప్రజలకు తమ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే హక్కు ఉంది. చివరికి సాయుధ తిరుగుబాటు కూడా.' మాకు అన్యాయం జరుగుతుంది అని శాంతియుతంగా చెప్తే కూడా జైలు పాలు చేయిస్తుంది పాలకవర్గం. కోపంతో ప్రజలు రాళ్లు విసిరితే, పోలీసు, సైనిక బలగాలతో కాల్పులు

జరిపిస్తుంది. 'ప్రజాస్వామ్యా'న్ని నమ్మి న్యాయం కొరకు దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగితే చివరికి సుప్రీంకోర్టు కూడా ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఎన్నో తీర్పులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఎప్పుడైనా కోర్టు పాలక వర్గాలకు వ్యతిరేకమైన తీర్పు ఇచ్చినా, దాన్ని అమలు చేయాల్సింది తిరిగి పాలక వర్గాలే కాబట్టి మళ్లీ కథ మొదటికి వచ్చిన సందర్భాలు కోకొల్లలు. మరి, ప్రజలు అలాంటప్పుడు ఏమి చేయాలి? లింకన్ చెప్పినట్టుగా చేయాలా? నోరు మూసుకొని పడి ఉండాలి అంటుంది పాలకవర్గం. ఎదురు తిరిగితే గ్రీన్‌హంట్. పాలకవర్గాల ఈ 'ప్రజాస్వామ్య' రహస్యం 99.5 శాతం జనాలకు అర్థం కాకుండా చేయడమే బ్రెయిన్‌హంట్.

ఆపరేషన్ చేసే ముందు నొప్పి ఏర్పడకుండా అనెస్థిసియా ఇస్తారు. తర్వాత నొప్పి ఏర్పడకుండా పెయిన కిల్లర్ ట్యాబ్లెట్లు ఇస్తారు. అదే పద్ధతిలో, పాలకవర్గాలు ప్రజలకు కష్టాలు, బాధలు, అక్రమాలు అన్యాయాలు వాటి ద్వారా వచ్చే నొప్పి అర్థం కాకుండా ఉండడానికి రకరకాల పెయిన్ కిల్లర్స్‌ను మన ముందుకు తెచ్చాయి. తెస్తున్నాయి. దాంట్లో భాగంగా 2014 వరకు చట్ట ప్రకారం ఐదు వందల టివి ఛానెళ్లు ఇవ్వబోతున్నారు. 2020 వరకు 2000 ఛానెళ్లు ఇవ్వబోతున్నారు. రకరకాల సినిమాలు, సీరియళ్లు, రియాలిటీ షోలు, ఆటలు, ఆధ్యాత్మికం, పాటలు, వంటకాలు, నేరాలు, ఘోరాలు, మీకు ఏ వైపు ఆసక్తి ఉంటే ఆ ఛానెళ్లు ఉంటాయి. చూడండి, చూసి ఆనందించండి. అంతే, కాని ఆలోచించవద్దు. నిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయవద్దు! రానున్న పది సంవత్సరాలలో సెల్‌ఫోన్ 4జి సర్వీసులను తక్కువ ధరకు అందిరికీ అందుబాటులోకి తీసుకురానున్నారు. అప్పుడు సెల్‌ఫోన్‌లోనే 2000 ఛానెళ్లు చూడవచ్చు. ఏ వయసు వారైనా సెల్‌ఫోన్‌లో ఉంటే ఇంటర్నెట్ ద్వారా లక్షల కొద్దీ నీలి చిత్రాలను, కోట్ల కొద్దీ బూతు బొమ్మలను, వివిధ దేశాల సినిమాలను చూడవచ్చు. వీడియో చాటింగ్, డేటింగ్‌లు చేసుకోవచ్చు. 'ఆకాశమే హద్దు, సెల్‌ఫోనే ముద్దు'. 'జీవితాన్ని ఆస్వాదించండి. అంతే తప్ప ఆలోచించవద్దు. బాధ పడకండి, మన మెదళ్లు పనిచేయకుండా పలకవర్గాలు ఇంకా చాలా స్కీమ్‌లు తెచ్చారు. ప్రపంచీకరణ ప్యాకేజీలో భాగంగా మత్తు మందులు (డ్రగ్స్) దింపారు. ఇంకో పది సంవత్సరాలలో అవి గ్రామస్థాయి యువతకు కూడా అందుబాటులోకి తేబోతున్నారు. కనీసం ఇక్కడైనా 'ఇన్‌క్లూజివ్ గ్రోత్' నిజం కాబోతుంది. ఇక లిక్కర్ దొరకని ఊరు గురించి లిమ్కా బుక్ వారు కూడా వెతుకుతున్నారు. మాల్స్, మల్టీప్లెక్స్‌లు, కాఫీ క్లబ్‌లు, పబ్బులు, క్లబ్బులు, డిస్కోలు దేశమంతటా వెలిసాయి. ఇంకా రాబోతున్నాయి. అయినప్పటికీ, ఎవరైనా ఆలోచించే ప్రమాదం ఉందని మతం మత్తును కీకరణ్యాల్లోకి కూడా తీసుకెళ్తున్నారు. 'కనపడని దేవుడు ముద్దు, కనబడే నిజం వద్దు' అని అనమంటున్నారు. హిందూ మతోన్మాదులుగా పిలవబడే బిజెపి పార్టీ పాలిత రాష్ట్రాల్లో కూడా హిందూ మతేతర సంస్థలు ఇష్టారీతిన మత మార్పిడి కార్యకలాపాలు చేస్తున్నాయి. అయినా ఫర్వాలేదు. ఏదో ఒక మతం. మెదళ్లను మత్తులో ఉంచండి అనేది పాలకవర్గ ఆలోచన. పది మంది మనుషులుంటే చాలు అక్కడ ఏదో ఒక మత ప్రచారం చేసి వాళ్లను ఆ మత్తులో దింపాలి. ఇంకా కావాలా? మంత్రాలు, మహిమలు, వాస్తు, జ్యోతిష్యం. ఏదో ఒకటి, మెదళ్లు పని చేయకూడదు, నిజం తెలువకూడదు. ఎంతైనా మనిషి ప్రాక్టికల్ కదా! అందుకే, పాలకవర్గాలు ప్రాక్టికల్ మత్తులు కూడా అందుబాటులోకి తెచ్చాయి. అది డబ్బు మత్తు. ఒక్కసారి, మల్టీ లెవెల్ మార్కెటింగ్ వాళ్ల సెమినార్‌కు వెళితే తెలుస్తుంది. ఆ హాళ్లన్ని కిక్కిరిసి పోయి ఉంటాయి. స్త్రీలతో సహా అక్కడున్న వారందరూ 'లక్షలు సంపాదించవచ్చు, కోట్లు సంపాదించవచ్చు' అన్న మాటలు విని అలాగే హిప్నటైజ్ అయిపోయి, డైరెక్ట్‌గా స్విట్జర్లాండ్‌లో ఒక డ్రీమ్‌సాంగ్ వేసుకుంటారు. హాల్ నుండి బయటకు వచ్చిన వారికి మీరు వాస్తవం చెప్పండి. అప్పుడు ఏమీ జరుగుతుందో మీకే తెలుస్తుంది. ఏదో ఒకటి, ప్రజలు ఆలోచించవద్దు. మత్తులో ఉండాలి, అది పాలకవర్గాల లక్ష్యం. భారతదేశం అప్పులు తిరిగి కట్టాల్సిన 2020 వరకు ఎన్నెన్నో వినూత్న రకాల మత్తులు తేబోతున్నారు.

అందుకే గ్రీన్‌హంట్ అంటే చంపి మెదడు పని చేయకుండా చేయడం. బ్రెయిన్ హంట్ అంటే బతికి ఉండగానే మెదడు పని చేయకుండా, వాస్తవాలు తెలువకుండా చేయడం. ఈ గ్రీన్‌హంట్, బ్రెయిన్ హంట్, హ్యూమన్ రైట్స్ హంట్‌లను ఒక కాక్‌టైల్‌గా 'ప్రజాస్వామ్యం' పేరు మీద 99.5 శాతం ప్రజల మీద రుద్దుతున్నాయి 0.5 శాతం పరాన్నభుక్కు పాలకవర్గాలు. ఈ కాక్‌టైల్‌కు మనం, మన కుటుంబాలు అనివార్యంగా బలి అవుదామా లేదా 99.5 శాతం ప్రజల ప్రయోజనాలు చూసే మానవీయ వ్యవస్థ కోరుకుందామా? ఇంతకు నేను ఏ పక్షం ఉండాలి? అనేదే అందరూ వేసుకోవాల్సిన ప్రశ్న.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

రాబోయే సంచికలలో...

- **బ్యాంకుల మొండి బాకీలు లక్ష కోట్లు! - వి. హనుమంతరావు**
- **ఆహార (అ)భద్రతా బిల్లు - జి. సూరి**
- **ఎందుకీ మోడల్ స్కూళ్లు? - కె. ప్రభాకర్**
- **వాకపల్లి ఘటనకు ఐదు సంవత్సరాలు - డా. జి. లచ్చయ్య**
- **ఆర్‌టిసి సమస్యలకు కారకులెవరు? - ఎం.ఎస్. సాయి**

బలపడుతున్న ఇసుక మాఫియా

ప్రభుత్వం ఇసుకను ఆదాయ వనరుగా చూడడంలోనే విధాన లోపం ఉందనీ, ఇసుక మాఫియాను నిరోధించకపోతే పర్యావరణానికీ, ప్రజల తాగునీటికీ సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు **ముప్పాళ్ల భార్గవశ్రీ**

సుప్రీంకోర్టు జోక్యంతోనైనా రాష్ట్రంలో ఇసుక మాఫియా సాగిస్తున్న అక్రమాలకు ముక్కుతాడు పడ్తుందనే ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారు. మే 7న సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించిన ముఖ్యమైన నిర్ణయాలు ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 1 నుంచి ఇసుక తవ్వకాలపై నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఇసుక తవ్వకాల విషయంలో తగిన నియమ నిబంధనలు చేపడ్తామని వివరించినప్పటికీ హైకోర్టు ధర్మాసనం సంతృప్తిచెందక మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించడానికి నిర్ణయాన్ని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొందరు ఇసుక కాంట్రాక్టర్లు, బిల్డర్స్ అసోసియేషన్‌ల పేరుతో మొత్తం 15 సంస్థలు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్‌లు (ఎస్‌ఎల్‌పి) వేశారు. ఈ ఎస్‌ఎల్‌పిలను మే 7న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టీస్ కె.ఎస్.రాధాకృష్ణన్, జస్టిస్ చంద్రమౌళీ కుమార్ ప్రసాద్‌తో కూడిన అటవీ, పర్యావరణ వ్యవహారాల ప్రత్యేక ధర్మాసనం పిటీషనర్లు అర్థించినట్లుగా వెంటనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి అంగీకరించలేదు. అయితే ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, దేశంలో ఇసుక మాఫియా వ్యవహారం దారుణంగా ఉందని, రోజు రోజుకు వారి ఆగడాలు పెచ్చుమీరి పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని, చివరికి మధ్యప్రదేశ్‌లో ఐఎఎస్ అధికారిని చంపేవరకు ఎదిగిందని, చేసిన వ్యాఖ్యానాలు ఇసుక మాఫియా నుంచి పెరుగుతున్న ప్రమాద తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అంద్యార్జున చేసిన వాదనల్లో ఒకటి, ఒక ప్రదేశంలో ఇసుక తవ్వకాల్లో అవకతవకలపై ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేస్తే దాన్ని విచారించిన సందర్భంగా మొత్తం రాష్ట్రం అంతటా తవ్వకాలపై నిషేధం విధించడం సబబు కాదని వాదించారు. రాష్ట్ర వ్యాపితంగా ఇసుక మాఫియా సాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను భరిస్తున్న ప్రజానీకం అందరి తరఫున వేసిన వ్యాజ్యంగానే ప్రజలు భావిస్తున్నారు. అలానే ఈ పిల్‌లను కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన వారే కాదు, రాష్ట్రంలోని కొందరు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు కూడా వేశారన్న విషయాన్ని రాష్ట ప్రభుత్వ న్యాయవాది మరుగు పరుస్తున్నారు. అంతేకాక రాష్ట్రహైకోర్టు ధర్మాసనం ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నిర్దిష్ట చర్యల, విధి విధానాల గురించి ప్రశ్నిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ సరైన సమాధానం ఇవ్వనందునే హైకోర్టు ధర్మాసనం ఇసుక తవ్వకాలపై నిషేధం విధిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఖరారు చేసింది. దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది చేసిన ఆరోపణ అర్ధరహితం అని తేలిపోలేదా!

సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపిన అనంతరం, ఐదు హెక్టార్లపైన జరిపే ఇసుక తవ్వకాలకు కేంద్రంలోని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల అనుమతులు తప్పనిసరి అని, అనుమతుల ప్రక్రియకు జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు మూడు వారాల్లోగా పరిష్కరించాలని, అలానే రాష్ట్రంలోని అర్జీదారులందరి తరఫున రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు నిర్వర్తించడానికి కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అంగీకరించారు. అయితే చట్టాలను తమ చుట్టాలుగా చేసుకోగల్గిన ఇసుక మాఫియా సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన నిర్ణయాలను ఎంతవరకు అమలు జరుగనిస్తారనేది ప్రశ్నార్థకమే! అలాగే ఐదు హెక్టార్లపైన ఇసుక తవ్వకాల నిబంధన కూడా ఇసుక జల్లెడలాంటి నియమ నిబంధనల్లో జారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. అంతేకాక ఐదు హెక్టార్లలోపు ఇసుక తవ్వకాలకు ఎవరి అనుమతి కావాలో స్పష్టంగా లేదు. సాధారణంగా రాష్ట్రప్రభుత్వం పరిధిలో వీటికి అనుమతులిస్తే ఇసుక మాఫియాదే రాజ్యం అవుతుందని వేరే చెప్పనవసరం లేదు.

చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందాన రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం రాష్ట్రంలో ఇసుక మాఫియా సాగిస్తున్న అక్రమాలను అరికట్టలేకపోగా చోద్యంగా చూడడమే కాక వారి 'చేతి'లో పావుగా మారిపోయినందున, వారి ఆగడాలకు ముక్కు తాడువేసే నాథుడే కరువైనందున, ఇసుక మాఫియా బాధితులు హైకోర్టుని ఆశ్రయించాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూలేని విధంగా హైకోర్టు ధర్మాసనం ఇసుక మాఫియా ఆగడాలపై ధర్మాగ్రహం వ్యక్తం చేసిన ఫలితంగా, అసలు మూలకారణాల్లోకి వెళ్లి ఏప్రిల్ 1 నుంచి ఇసుక తవ్వకాలపై, వేలం పాటలపై నిషేధాన్ని విధిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం సరైన మైనింగ్ నిబంధనలను రూపొందించి హైకోర్టుకు నివేదించే వరకు మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. హైకోర్టు ధర్మాగ్రహ తీవ్రతను గమనించి అయినా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాల్సింది పోయి, ఏప్రిల్ నెలలో దాదాపు వారం వారం వ్యవధిలో హైకోర్టు ధర్మాసనం జరిపిన విచారణల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున విచారణల్లో పాల్గొన్న అటార్నీ జనరల్ వైపు నుంచి వివరించిన సమాధానాలు ఏ ఒక్కటీ హైకోర్టు న్యాయమూర్తులను సమాధానం పరచకపోవడంతో ఏప్రిల్ 27న హైకోర్టు ధర్మాసనం ఇసుక తవ్వకాలపై నిషేధాన్ని విధిస్తూ చేసిన మధ్యంతర ఉత్తర్వులను ఖరారు చేస్తూ గనుల తవ్వకాలపై యథేచ్ఛ దోపిడీని నిరోధించేందుకే సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు లోబడే 36 పేజీల తీర్పును ప్రకటించింది.

ఏప్రిల్ 1 నుంచి ఇసుక తవ్వకాలపై నిషేధం కొనసాగడంతో,

ఏప్రిల్, మే నెలలు అటు ప్రభుత్వ పథకాల కింద సాగే నిర్మాణాలు, ఇటు ప్రైవేట్ రంగంలో గతంలో కంటే ఉధృతంగా సాగుతున్న భవన సముదాయుల నిర్మాణాలు సాగడం కనాకష్టం కావడంతో, అలానే ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలపై ఆధారపడ్డ లక్షలాది అసంఘటిత భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తీవ్ర సంక్షోభ పరిస్థితులపై రాష్ట్రంలోని బిల్డర్ల అసోసియేషన్‌లు, భవన నిర్మాణ కార్మిక సంఘాలు, ఇసుక తవ్వకాలపై వెంటనే నిషేధం ఎత్తివేయాలని, ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని అనూహ్యంగా పెరుగుతున్న ఇసుక ధరలతో పాటు, సిమెంట్ ఇనుము తదితర భవన నిర్మాణ సామాగ్రి ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ స్థితిలోనైనా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక మాఫియాపై వెల్లువెత్తుతున్న విమర్శలను పరిగణనలోకి తీసుకొని సరైన మైనింగ్ విధానాలను రూపొందించడానికి యుద్ధప్రాతిపదికపై కృషిచేయాల్సింది పోయి రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం ఇసుక తవ్వకాలను నిషేధిస్తూ విధించిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరుతూ మే నెల మొదటి వారంలో సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పిని తాను వేయడమే గాక, రాష్ట్రంలోని బిల్డర్స్ అసోసియేషన్ల చేతకూడా తనకి ఊతంగా ఎస్ఎల్‌పిలు వేయించింది. దీనినే కొరివితో తలగోక్కోవడం అంటారు. సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం మే 7న ఎస్ఎల్‌పిలపై విచారణ జరిపి హైకోర్టు విధించిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వకపోగా రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంపై గట్టి మొట్టికాయలు వేసింది. కేంద్ర పర్యావరణ అటవీ శాఖలు మూడు వారాలలోపు ఇసుక తవ్వకాలపై సరైన విధి విధానాలు రూపొందించి సమాధానం చెప్పాలని ఆదేశించింది.

ఐదు హెక్టార్లలోపు ఇసుక తవ్వకాలను కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలు మూడు వారాలలోపు పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఆసరా చేసుకొని రాష్ట్రంలో ఇసుకరీచ్‌లను ప్రారంభించడానికి కృషి చేస్తున్నట్లు గనులశాఖా నుంచి గల్లా అరుణకుమారి ప్రకటించారు. ఇసుకరీచ్‌ల అనుమతి కోసం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అయితే ఈలోపు ప్రభుత్వ పనులకు, బిల్డర్ల అవసరాలను తీర్చడానికి హైకోర్టు నిషేధ పరిధిలో లేని నదులు, వాగుల్లో వరద సందర్భంగా రైతుల పట్టా భూముల్లో, నదులపై ఉన్న డ్యామ్‌ల వద్ద ఉన్న రిజర్వాయర్లలో మేటవేసిన ఇసుకను తవ్వి సరఫరా చేయాలని ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు, ఈ ప్రతిపాదనలను అనేక పర్యాయాలు చర్చించిన మీదట ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ, మైన్స్, జియాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆమోదించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు మే 13న ప్రకటించారు. అయితే ఈ ప్రతిపాదనల అమలు స్థానిక అధికారులను, ఇసుక మేట వేసిన పొలాల రైతుల అనుమతులు తీసుకొని త్వరగా ఇసుక తవ్వకాలు సాగిస్తామని ప్రధాన కార్యదర్శి చెప్పారు. వివిధ డ్యామ్‌ల వద్ద గల రిజర్వాయర్లలో ఇసుక మేటలు వేసిన విషయం రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఇప్పుడు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉంది. సంవత్సరాల తరబడి ఇసుక మేటలను రిజర్వాయర్లలో తొలగించినందున నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి ఎక్కువ నీటిని వృథాగా కిందికి వదలాల్సి వస్తున్నది. 2003లో ప్రభుత్వం ప్రకారం బ్యారేజీ భద్రతపై నియమించిన కమిటీ హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించి, బ్యారేజీ ఎగువభాగంలో ఇబ్రహీంపట్నం వరకు ఇసుక భారిగా మేటలు వేసిందని నిర్ధారించారు. దీనివలన 3.32 టిఎంసిల నిల్వ సామర్థ్యం నుంచి ఇసుక మేటల వలన 1.83 టిఎంసిలకు పడిపోయిందని కమిటీ తన సర్వేలో వెల్లడి చేసింది. 2009లో భారీగా వచ్చిన వరదల్లో ఇసుక మేటలు వేసినందున శ్రీశైలం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ఈనాటికి ఆ పనులు చేపట్ట లేదంటే నీటి నిల్వల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతగా ఉందో తేటతెల్లం అవుతుంది. అలానే వరదలో కొట్టుకొచ్చి ఇసుక మేటవేసిన పట్టా భూముల్లో ఇసుకను తవ్వుకొనే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిది. ఎప్పుడో వచ్చిన వరదలకు మేట వేసిన ఇసుకను సంవత్సరాల తరబడి ఏ రైతూ పొలంలో ఉంచుకోడు. ఒక వేళ ఇంకా ఉంటే ఆ రైతు నిర్ణయించుకొన్న ధరకు అమ్ముకొనే హక్కు కల్గి ఉంటాడు. రైతుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది.

ఇసుక కొరతను తీర్చడానికి ఎపి మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆచరణ సాధ్యం కాని మరొక ప్రతిపాదనను బైట పెట్టింది. దీని ప్రకారం మైనింగ్ కార్పొరేషనే ఇసుక కేంద్రాలను నిర్వహించి ఇసుకను సరఫరా చేస్తుందట. ఉట్టికెక్కలేనమ్మ తాడి చెట్టు ఎక్కినట్లు రాష్ట్రంలో ఇసుక మాఫియా సాగిస్తున్న అక్రమాలను అరికట్టడంలో ఘోరంగా విఫలం కావటంతో కార్పొరేషన్‌లో అవినీతి చక్రవర్తుల హవా సాగటంతో పాటు ఇసుక కేంద్రాల నిర్వహణకు అవసరమైన యంత్రాలు సమకూర్చు కోవడంతో పాటు ఎంతో కాలంగా సిబ్బంది కొరతతో కాలక్షేపం చేస్తున్న కార్పోరేషన్‌కి ఈ బాధ్యత నిర్వహణ సాధ్యమా!

హైకోర్టు ధర్మాసనం ఇసుక తవ్వకాలపై నిషేధం విధిస్తూ ప్రకటించిన మధ్యంతర ఉత్తర్వులను వెనక్కి తీసుకోక పోయినా, రాష్ట్ర ప్రభుత్వం, బిల్డర్లు వేసిన ఎస్ఎల్‌పిలపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం హైకోర్టు విధించిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకారించడమేగాక ఇసుక మాఫియా సాగిస్తున్న అక్రమాలపై తీవ్ర వ్యాఖ్యానాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర మైనింగ్ విధానాన్ని రూపొందించడానికి బదులు ఇసుక తవ్వకాలపై నిషేధం ఫలితంగా ఏర్పడిన ఇసుక కొరతను ఆధారం చేసుకొని తిరిగి ఇసుక మాఫియా కోర్కెలను తీర్చడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని ఐదు హెక్టార్లపైన ఇసుక తవ్వకాలకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖల అనుమతుల కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. మరోవైపు రాష్ట్రంలోని మైనింగ్ శాఖ ఇసుక కేంద్రాలను నిర్వహించాలని, పట్టా భూముల్లో, ప్రాజెక్టుల రిజర్వాయర్‌లలో మేట వేసిన ఇసుకను తరలించి ఇసుక కొరతను తీరుస్తామనే డొంక తిరుగుడు ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నది తప్పితే సమగ్ర మైనింగ్ విధానాన్ని ప్రకటించడానికి మీనమేషాలు లెక్కిస్తూ ఉండడం విడ్డూరంగా ఉంది.

ఎప్పుడైతే రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఆదాయవనరుగా చూసి వేలం పాటల విధానాన్ని ప్రవేశపెట్టిందో, అప్పటి నుంచి ఇసుక మాఫియా రాష్ట్ర ప్రభుత్వాన్ని తన 'చేతి' లో పెట్టుకొని వేలంపాటలపై ఇసుక తవ్వకాలపై మైనింగ్ కార్పొరేషన్ విధి విధానాలను రూపొందించినా, ఎపివాల్టా చట్టం ఉన్నా, అక్రమ ఇసుక తవ్వకాలలో వస్తున్న కళ్లు తిరిగే ఆదాయాలతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులను తమ వ్యాపారంలో భాగస్వాములుగా ఉన్న మంత్రులు, ఎంఎల్ఎల అండతో మచ్చిక చేసుకొని యథేచ్ఛగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ఇసుక తవ్వకాలకు పెట్టిన నియమ నిబంధనలను తుంగలో తొక్కి ఇసుకను తరలించడం వలన ప్రధానంగా భూగర్భజలాలు నిల్వ సామర్థ్యం

అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గిన భారత్

అణు ఒప్పందం, చమురు, విద్యారంగం, రిటైల్ వ్యాపారం ఇలా అన్ని రంగాలలో అమెరికా బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చే భారత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తున్నారు **ఎ. నర్సింంహారెడ్డి**

భారత్ – అమెరికా దేశాల మధ్య 2005లో కుదిరిన 'వ్యూహాత్మక ఒప్పందం', 2008లో కుదిరిన 'అణు ఒప్పందం' ద్వారా అమెరికా భౌగోళిక రాజకీయ వ్యూహంలో భారత్ భాగస్వామిగా చేరింది. అయితే మారుతున్న ప్రపంచ పరిస్థితులు, పలు దేశాల మధ్య నిరంతరం మారుతున్న సమీకరణల దృష్ట్యా భారత విదేశాంగ విధానం అనేక సవాళ్లను కూడ ఎదుర్కొంటుంది. అమెరికాతో అణు ఒప్పందం తర్వాత భారత్ అమెరికాలు అతి పెద్ద ప్రజాస్వామ్యాలుగా 'సహజ మిత్ర దేశాలనీ", 21 శతాబ్దంలో అమెరికా ఆసియా విధానంలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందనీ కొన్ని వర్గాలు పేర్కొంటున్నా ఇందులో అనేక వాదనలున్నాయి. ప్రధానంగా ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించడానికే అమెరికా భారత్‌ను చేరదీస్తోందనేది మొదటి వాదన. కాగా, అమెరికా ప్రపంచాధిపత్యం తమదేననే ధోరణితో చైనా బలాన్ని ఎదుర్కొనేందుకు రూపొందిన సైనిక ప్రణాళికనే అమెరికా 'ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో పునఃసమతుల్య స్థాపన' అన్నది రెండో వాదన. అందుకే పసిఫిక్, హిందూ మహాసముద్రాలనూ, వీటి తీరాన ఉన్న ఆసియా పసిఫిక్ దేశాలనూ వ్యూహాత్మకంగా కీలకమైనవిగా అమెరికా పరిగణిస్తున్నది. దానికున్న 11 అణుచోదిత యుద్ధవిమాన వాహక నౌకలలో ఆరు ఈ ప్రాంతంలోనే నిలిపి ఉంచింది. వీటిలో మొత్తం 100 యుద్ధనౌకలున్నాయి. వీటిని 110కి పెంచబోతున్నది. అయితే ఇవి తమ స్వదేశానికి చాలాదూరంగా పనిచేస్తున్నాయి.. కాగా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనాకు 86 యుద్ధ నౌకలున్నాయి. 2020 నాటికి వాటిని 106కు పెంచబోతున్నది. ఇవి స్వదేశానికి దగ్గరగా ఉన్నందున త్వరితంగా కదలగలుగుతాయి. ఈ కారణం రీత్యానే ఈ ప్రాంత దేశాలు అమెరికాకు అనుకూలంగా ఉన్నా చైనాకు కోపం తెప్పించేందుకు సిద్ధంగా లేవు.

మరో అంశం – అఫ్ఘనిస్తాన్ ఉగ్రవాదాన్ని అరికట్టాలని అఫ్ఘనిస్తాన్‌లో అడుగుపెట్టిన అమెరికా–నాటో దళాలు బిన్‌లాడెన్ మృతి తర్వాత అక్కడి నుండి క్రమంగా వైదొలుగుతున్నాయి. తర్వాత మళ్లీ అఫ్ఘన్‌లో తాలిబన్లు, ఇతర ఉగ్రవాద బృందాలు చెలరేగకుండా, స్థిరత్వం ఏర్పడాలని భారత్ ఆశిస్తోంది. మధ్య ఆసియాలో భారత రాజకీయ ఆర్థిక వ్యూహాత్మక విధానానికి అఫ్ఘనిస్తాన్‌లో సుస్థిరత అత్యవసరమైన అంశం. ఇప్పటికే భారత్ అఫ్ఘన్‌లో వివిధ మౌళిక వసతుల ప్రాజెక్టుల్లో కోట్ల కొద్ది రూపాయలు (2 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టింది. ప్రాంతీయంగా భారత భవిష్యత్తుకు ఇరాన్ మరో మూల స్తంభం వంటిది. దీనిపై అమెరికా శత్రువైఖరి వల్ల ప్రాంతీయ అస్థిరత ఏర్పడడమే కాకుండా అటు ఇరాన్ నుండి ఇటు అఫ్ఘన్ ద్వారా ముస్లిం చాందసవాద వర్గాలు చెలరేగే అవకాశాలున్నాయి. మరోవైపు భారత్‌కు ఆందోళన పెంచుతున్న అంశం. పాకిస్తాన్ మన దేశంలో జరుగుతున్న ఉగ్రవాద దాడుల పట్ల ఉదాసీనంగా ఉంటుందన్న భావన. తాలిబన్ ఉగ్రవాదులకు పాకిస్థాన్ ప్రోత్సహిస్తుందని అమెరికా అనుమానం.

భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్‌లో ఉగ్రవాదం చెలరేగుతోందని తెలిసీ పాక్‌కు అమెరికా ఇప్పటి దాక సంపూర్ణ మద్దతునిచ్చింది. మరో పక్క భారత్ చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో ముఖ్యమైన ఇరాన్‌ను అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అణు కార్యక్రమాలు చేపడుతుందన్న సాకుతో దాన్ని ఆంక్షలతో వెలివేస్తూ, తనను సమర్థించాలని భారత్ మీద ఒత్తిడి తెస్తోంది. భారత్ నుంచి ఐటీ నిపుణులు అత్యధికంగా అమెరికాకు వలస పోతున్నారు. వారిమీద, అవుట్ సోర్సింగ్ మీద నియంత్రణలు విధించడం ద్వారా ఆర్థిక రంగంలో కూడా భారత్‌కు నష్టం కలిగే వైఖరి అమెరికా అవలంబిస్తోంది. ఈ సమస్యలన్నింటిపై సామరస్యం కుదరకపోతే ముందు ముందు

తగ్గిపోతుంది. దీని ఫలితంగా ఇప్పటికే త్రాగు, సాగు నీటికి ఎద్దడి పెరుగుతూ ఉంది. భవిష్యత్‌లో దీని ప్రమాదం మరింత తీవ్రంగా ఉంటుంది. ఆ తర్వాత భారీ ఎత్తున జరుగుతున్న ఇసుక రవాణా వలన గ్రామీణ ప్రాంతాల రోడ్లు విధ్వంసం కావడమే గాక, లారీల నుంచి వెలువడే భీకరశబ్ద కాలుష్యంతో, లారీలు లేపే దుమ్ముతో ప్రజలు కంటిమీద కునుకులేక, తీవ్ర అనారోగ్యాలతో బాధలు అనుభవిస్తున్నారు. ఇసుక లారీల డ్రైవర్ల అడ్డూ అదుపూ లేని డ్రైవింగ్‌తో ఎందరో అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకొంటున్నారు.

కావున పాలకులు మానవ మనుగడకు ముఖ్యమైన ప్రకృతి సంపద అయిన జల వనరులను కాపాడుకొనే ప్రధాన లక్ష్యంతో సమగ్ర మైనింగ్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించటం అవసరం. ఇందుకు ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఆదాయ వనరుగా చూడటం మాని, జల వనరులను కాపాడుకొనే విధంగా ఇసుకపై అధికారాన్ని గతంలో లాగా స్థానిక సంస్థలకు (పంచాయితీలు) అధికారాలు ఇచ్చి, తవ్వకాలు, ధరల నిర్ణయాలను స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు, మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కూడిన ప్రజాకమిటీలకు అధికారులు ఇవ్వాలి. అప్పుడే ప్రజలకు ప్రాణాధారమైన జలవనరులను కాపాడుకోగలం. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టగలం.

(రచయిత సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

భారత్-అమెరికా సంబంధాలు భారత్‌కు నష్టదాయకంగా, ప్రమాద కరంగా మారవచ్చు. బిన్‌లాడెన్ హత్య తర్వాత అమెరికా- పాకిస్తాన్‌ల మధ్య సంబంధాలు చెడిపోతున్నాయి. పాకిస్తాన్ ఉగ్రవాదుల నిలయంగా ఉందని అమెరికా భావిస్తుంది. ఈ నేపథ్యంలోనే అఫ్ఘన్ పునఃనిర్మాణంపై అమెరికా జరిపే చర్చల్లో పాకిస్తాన్‌కు పోటీగా భారత్‌ను చేర్చింది. ఇది భారత్‌ను బుజ్జగించే చర్య.

ఇరాన్‌పై రకరకాల ఆరోపణలు చేసి, ఆ దేశాన్ని ఏకాకిని చేసే ప్రయత్నాలను అమెరికా 2006 నుంచి తీవ్రతరం చేసింది. మధ్య ఆసియా, దక్షిణ కాకసస్ ప్రాంతంలోని ఆర్థిక రాజకీయ మార్పుల కోసం అమెరికా 'సిల్క్ రోడ్ స్ట్రాటజీ యాక్ట్'ను 1999లో రూపొందించింది. 2006లో అమెరికా ఈ చట్టాన్ని సవరించి దక్షిణాసియా, మధ్య ఆసియా, యూరేసియా, మధ్య ప్రాచ్యం తదితర ప్రాంతాలకు విస్తరింపజేసింది. ఆ ప్రాంతాలలోని సహజ వనరుల రీత్యా సంబంధిత దేశాలలో ఉదారవాద విధానాల అడ్డంకులను, అధికారస్వామ్య పద్ధతులను తొలగించి, రవాణా ఇంధన మౌలిక సదుపాయలను అభివృద్ధి పరచాలని అమెరికా భావిస్తోంది. విశాలమైన ఆర్థిక, వాణిజ్య సామ్రాజ్యాన్ని రూపొందించేందుకు అందుకు సహకరించే రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల ఏర్పాటు కోసం అమెరికా నిర్విరామంగా కృషి చేస్తోంది. 2007-08 ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి భయట పడడం కోసం 'న్యూ సిల్క్ రోడ్ స్ట్రాటజీ'ని అమలులోకి తెప్పించేందుకు అమెరికా విశ్వ ప్రయత్నం చేస్తోంది. అందుకోసం భారత్‌ను తన విధానాలకు అనుగుణంగా మచ్చిక చేసుకోవడం అవసరం. ఆ పథకంలో భాగంగా బంగాళాఖాతాన్ని ఆసియా పసిఫిక్‌లను కలిపేందుకు మమతా బెనర్జీతో భేటీకి హిల్లరీ ప్రథమ ప్రాముఖ్యం ఇచ్చారు. తీస్తానది జలాల వివాదం, రిటైల్ వ్యాపారంలో ఎఫ్‌డిఐల చొరబాటుకు మమత అంగీకారం తదితర విషయాల కంటే న్యూ సిల్క్ రూట్ వ్యూహంలో కోల్‌కతాను కీలక కేంద్రంగా మలుచుకోవాలన్న అమెరికా లక్ష్యం ప్రధానంగా కన్పిస్తుంది. ఈ నేపథ్యంలోనే గత మే నెలలో భారత పర్యటనకు అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ వచ్చింది.

2010లో అఫ్ఘనిస్తాన్‌లో ఒక లక్ష కోట్ల డాలర్ల విలువ చేసే బంగారం, కోబాల్ట్, ఇనుము, రాగి, రేర్ ఎర్త్ మెటల్స్ తదితర ఖనిజ సంపదను అమెరికా కనుగొనింది. అందుకోసం తాలిబన్‌లతో శాంతి చర్చలు ప్రారంభించింది. న్యూసిల్క్ రోడ్ ప్రాంత దేశాల మధ్య రగులుతున్న రాజకీయ ప్రాంతీయ విభేదాలను పరిష్కరించేందుకు అమెరికా కృషి చేస్తోంది. అంతర్జాతీయంగా చైనా, యూరోపియన్ యూనియన్ కూటమితో ఆర్థిక రాజకీయ పోటీని ఎదుర్కొనే ప్రయత్నంలో భాగంగా హిల్లరీ మూడు రోజుల భారత పర్యటన విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ఆసియా వైపు దృష్టి సారించడం అన్న భౌగోళిక వ్యూహంలో భాగంగా అమెరికా పావులు కదుపుతోంది. భారత్-అమెరికా సంబంధాలను దృఢతరం చేసే లక్ష్యంలో భాగంగా ప్రతివారం సగటున ముగ్గురు అమెరికా అధికారులు భారత్‌ను సందర్శిస్తున్నారు. అమెరికా విదేశాంగమంత్రి ఎప్పుడు ఏ దేశ పర్యటనకు వెళ్లినా అది తమ వ్యూహాత్మక లక్ష్యాలు నెరవేర్చుకోవడానికేనని తెలిసిందే.

ఢిల్లీలో ప్రధానమంత్రితో హిల్లరీ క్లింటన్ చర్చల లక్ష్యం ఇరాన్ నుండి ఆయిల్ కొనుగోలును పూర్తిగా నిలుపు చేసేటట్లు నచ్చచెప్పడం. టెర్రరిజంపై పోరాటం, పాకిస్థాన్‌పై విమర్శలు వట్టి సన్నాయి నొక్కులే. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను పాటించాలని భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. దానికి తలవంచిన భారత ప్రభుత్వం ఇరాన్ నుండి చమురు దిగుమతులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. గతంలో ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ అమెరికా సందర్శించిన సందర్భంగా ఇరాన్ నుండి చమురు దిగుమతులను తగ్గించుకోవడం సాధ్యం కాదని ప్రకటించారు. అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. 2008-09లో భారత్ 2.18 కోట్ల టన్నుల చమురు దిగుమతి చేసుకుంది. ఇది 2010-11లో 1.85 కోట్ల టన్నులకు తగ్గిపోయింది. 2011-12లో మరింతగా తగ్గి 1.4 కోట్ల టన్నులకు పడిపోయింది. ఇరాన్ నుండి భారత్, చైనా, జపాన్, యురోపియన్ దేశాలు ప్రధాన ఆయిలు దిగుమతి దారులుగా ఉన్నాయి. భారత్‌ను ఇరాన్‌తో ఆయిల్ వ్యాపారం నుండి వెనక్కిలాగేందుకు తొలుత డాలర్లలో చెల్లింపులను నిషేధించింది. అయినా తన ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు భారత్ ఇతర మార్గాలను అన్వేషించింది. అయినా అమెరికా ఒత్తిడి తట్టుకోలేక తన దిగుమతులు తగ్గించింది. మొత్తంగా నిలుపు చేయాలని ఒత్తిడి పెంచడానికి హిల్లరీ క్లింటన్ ఢిల్లీ వచ్చారు.

పర్యటన చివర్లో ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు చేస్తామని హిల్లరీ, ఎస్ఎం కృష్ణ షరామామూలుగా చెప్పేశారు. ఇరాన్, అఫ్ఘనిస్తాన్, లిబియాలపై దాడి చేసి హత్యాకాండకు పాల్పడ్డ అమెరికా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఫోజుపెడుతోంది. వాస్తవానికి ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్నది అమెరికా. కానీ అమెరికాకు దాసోహమంటున్న మన పాలకులు దూడూ బసవన్నల్లా తలాడిస్తున్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా సమస్య, శాస్త్ర-సాంకేతిక రంగం, సైబర్ భద్రత, టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో సహకారం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఇక్కడ మొత్తంగా 23 అంశాలు చర్చించారు. వీటిని గురించి మాట్లాడడం మాత్రమే సరిపోదని, 'ద్వైపాక్షిక పెట్టుబడులు ఒప్పందంపై ముందుకు సాగాలనీ, రిటైల్ వ్యాపారంలో వాణిజ్య పెట్టుబడులకున్న అడ్డంకులను మరింత తగ్గించడానికీ, మా ప్రతి ఒక్క కంపెనీ వ్యాపారం చేయడానికి ఆతిథ్య వాతావరణం ఏర్పాటుకూ కృషి చేయాలని' హిల్లరీ క్లింటన్ కోరింది. ఆమె నిర్ణయించిన అజండానే సమావేశం చర్చించింది. ఈ సంభాషణల్లో నిర్ణయాలేమీ జరగలేదు గానీ చేయాల్సిన నిర్ణయాల స్వరూప స్వభావాలెలా ఉండాలో చర్చించి అంగీకారానికి వచ్చారు. భారత్‌పై అమెరికా పట్టునూ, దోపిడీని పెంచే ఈ నిర్ణయాల తీవ్రత విస్మరించరానిది. తిరిగి వెళ్లిన వెంటనే క్లింటన్ భారత్‌పై అమెరికా ఆంక్షల విధింపును 180 రోజుల పాటు వాయిదా వేసింది.

ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు, మహిళల సాధికారతను సమర్థించడం గురించి మాట్లాడడం మాత్రమే సరిపోదని హిల్లరీ క్లింటన్ తన ప్రారంభ ప్రసంగంలో స్పష్టం చేశారు. "ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై సంప్రదింపులను ముందుకు తీసుకువెళ్లడానికి పనిచేయడం పైన, బహుళ వస్తువుల రిటైల్ వ్యాపారం వంటి రంగాల్లో వాణిజ్య, పెట్టుబడుల అడ్డంకులను మరింత తగ్గించడానికి 'ఆతిథ్య వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి మేము చూస్తున్నాం' అని ఆమె చెప్పారు. ఆమె మాటలు చూస్తే, సూచన చేసినట్లుగా కన్నా, ఒక నియంత మాదిరిగా

శాసిస్తున్నట్లుగా అనిపించక మానదు. పార్టీ అనుబంధాలతో నిమిత్తం లేకుండా, అమెరికా ప్రభుత్వం భారత్‌ను ఒత్తిడి చేస్తున్న ఆర్థిక ఎజెండా ఇది. మోసపూరితమైన పద్ధతుల ద్వారా భారత్ – అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకున్న తరువాత సైతం, అణు విపత్తు జరిగినట్లయితే, యంత్రాలను సరఫరా చేసిన వారికి బాధ్యత లేకుండా చేయాలని అమెరికన్‌లు డిమాండ్ చేస్తున్నారు. అటువంటి సవరణ భారతీయ నష్టపరిహార చట్టాలలో పొందుపర్చే వరకు ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సరఫరా చేయడానికి అమెరికా కంపెనీలు తిరస్కరించాయి. 2008లో అమెరికాతో అణు ఒప్పందం కుదిరినా, భారత్ చేసిన అణు నష్ట పరిహార బిల్లు పట్ల అమెరికా అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో అణు విద్యుదుత్పత్తి రంగం సమస్య భారత పాలకులకు కొరకరాని కొయ్యగా మారింది. అమెరికా కోరిన విధంగా చేయాలని భారత ప్రభుత్వం చూస్తుండగా, ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. అణు విద్యుత్తు ప్లాంట్లల్లో ప్రమాదం జరిగితే నష్టపరిహార బాధ్యత అమెరికా కంపెనీలకు ఏమాత్రం ఉండరాదని అమెరికా పట్టుపడు తుండగా, తప్పని సరై కొంత బాధ్యత వహించాలని భారత ప్రభుత్వ వాదన. ఈ అంశం తేలే వరకూ అణుప్లాంటుల నిర్మాణం ప్రారంభించ లేమని అమెరికా బిగబట్టింది. ఇటీవల, ప్రభుత్వం ఈ డిమాండ్‌కు అంగీకరించింది. ఈ నేపథ్యంలో గుజరాతులో నిర్మించే అణుప్లాంటుపై భారత అణు విద్యుత్తు సంస్థకూ, అమెరికా కంపెనీ వెస్టింగ్ హౌస్‌కూ మధ్య కుదరాల్సిన ఒప్పందంపై నిర్దిష్టంగా చర్చలు జరిగి కొంత పురోగతి సాధించినట్లు పత్రికా వార్తలు తెలుపుతున్నాయి. ఇక్కడ పురోగతి అంటే అమెరికాకు ఎంతో కొంత రాయితీ ఇవ్వడమే.

అదేవిధంగా, దేశ సహజ వనరులు మాత్రమేగాక, వాణిజ్యాన్ని, ప్రత్యేకించి రిటైల్ వ్యాపారంపై గుత్తాధిపత్యం సాధించి అమెరికన్ కార్పొరేట్ సంస్థలు దోచుకునేందుకు వీలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా సరళీకరించాలని అమెరికా కోరుకుంటున్నది. రిటైల్ వాణిజ్యం ద్వారా వారు ధరలను నిర్ణయించడం మాత్రమే కాకుండా, వినియోగదారులను, ఉత్పత్తిదార్లను కూడా వారు దోచుకుంటారు. వాల్‌మార్ట్ తన మాల్స్‌ను ప్రారంభించడానికి భారత ప్రభుత్వ అనుమతిని కోరినప్పుడు జార్జిబుష్ ఎంతో కఠినంగా ఉండగా, హిల్లరీ క్లింటన్ మాత్రం ఎంతో కుటిలంగా వ్యవహరించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు బహుళ వస్తు రిటైల్ రంగం ద్వారాలు తెరవాలని తన ప్రారంభ ప్రసంగంలో హిల్లరీ డిమాండ్ చేసింది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం గత ఏడాదే ఈ డిమాండ్‌ను అంగీరించింది. ఈ చర్యకు విస్తృత వ్యతిరేకత వ్యక్తం కావడంతో దాన్ని తాత్కాలికంగా నిలిపివేయక తప్పలేదు.

దేశ చమురు అవసరాల్లో 70 నుండి 75 శాతం వరకూ విదేశాల నుండి భారత్ దిగుమతి చేసుకుంటున్నది. భారత్‌కు చమురు సరఫరా చేస్తున్న దేశాలలో సౌదీ అరేబియా తర్వాత రెండవ స్థానంలో ఇరాన్ ఉంది. ఇంతేకాక చమురు మార్కెట్టు ధరతో సంబంధం లేకుండా ఒప్పందంలో అంగీకరించిన ధరకే ఇరాన్ చమురు సరఫరా చేస్తున్నది. అలాగే ఇరాన్ నుండి సహజ వాయువు దిగుమతి చేసుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేసింది. ఇరాన్ నుండి అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌ల ద్వారా పైపులైను నిర్మించి ఒక యూనిటు గ్యాసును 3 డాలర్లకు అందజేస్తానని (రవాణా చార్జీలు అదనం) ఇరాన్ చెప్పింది. భారత ప్రభుత్వం చాలా కాలం పాటు నాన్చి చివరకు అమెరికా ఒత్తిడితో తిరస్కరించింది. ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్టులో సహజ వాయువు ధర యూనిట్‌కు 12 డాలర్లుంది. ఇరాన్ నుండి చమురు దిగుమతులను ఆపివేస్తే, భారత చమురు అవసరాలను సౌదీ అరేబియా, ఇరాక్‌లు తీర్చగలవని అమెరికా నమ్మబలుకుతున్నది. తక్కువ ధరకమ్ముతున్న ఇరాన్‌ను వదిలిపెట్టి ఎక్కువ ధరకమ్మే వారి నుండి కొనమంటున్నది. ఇంతేకాక చమురు అవసరాలకు సౌదీ అరేబియా సరఫరాలపైనే భారత్ ఆధారపడాల్సి వస్తుంది.

ఇరాన్ నుండి ఇంధన సేకరణపై తన ఆదేశాలకు తలొగ్గినందుకు మూడవ దఫా వ్యూహాత్మక చర్చలు ప్రారంభానికి ఒక రోజు ముందు అమెరికా ప్రభుత్వం భారత్‌కు ఒక సర్టిఫికేటును జారీ చేసింది. ఇరాన్ నుండి సహజ వాయువు కొరకు పైపులైను ప్రతిపాదనను తిరస్కరించినందుకు ప్రతిగా తుర్కుమెనిస్తాన్ నుండి అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లు ద్వారా పైపులైనుతో సరఫరాను అమెరికా రంగం మీదకు తెచ్చింది. ఇరాన్ ఇస్తానన్న ధరకు నాలుగురెట్లు ఎక్కువ పెట్టి తుర్కమెనిస్తాన్ నుండి కొనుగోలు చేయాలి. ఇకమీదట ప్రత్యక్షంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు మరింతగా పెరుగుతాయి. అంతిమంగా చమురు అవసరాలకు భారత్ అమెరికా చమురు కంపెనీలపైనే ఆధారపడాల్సి వస్తుంది. తుర్క్‌మెనిస్తాన్ చమురు క్షేత్రాల యాజమాన్యాన్ని కలిగి ఉన్న అమెరికా బహుళజాతి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే తుర్క్‌మెనిస్తాన్ – అఫ్ఘనిస్తాన్ – పాకిస్తాన్ – ఇండియా ప్రాజెక్టును విధించినట్లు అమెరికా గర్వంగా చెప్పుకుంటున్నది. భారత్ ఇప్పటికే ఇరాన్ నుండి చమురు సేకరణను గణనీయంగా తగ్గించినందున అమెరికా ఆంక్షల నుండి కొన్ని ఇతర దేశాలతో పాటు భారత్‌ను మినహాయించినట్లు ఇప్పుడు అమెరికా ప్రకటిస్తున్నది. ఇరాన్‌కు సంబంధించి అమెరికా అన్ని డిమాండ్లను క్రమంగా భారత్ అంగీకరిస్తున్నది. ఐఎఇఎలో ఇరాన్‌కి వ్యతిరేకంగా రెండుసార్లు ఓటు చేసింది. దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తూ ఇరాన్ నుండి క్రమంగా చమురు సేకరణను తగ్గించింది.

2012 జూన్ 5న అమెరికా రక్షణమంత్రి లియోన్ పనెట్టా ఢిల్లీ వచ్చారు. భారత ప్రభుత్వంతో చర్చించారు. అమెరికాతో కేవలం అమ్మకం – కొనుగోలు లావాదేవీలకు అతీతంగా టెక్నాలజీ బదిలీ, దేశీయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అమెరికా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని పనెట్టా భారత్‌కు హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్తాన్ భద్రతా దళాలకు శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామనీ, అఫ్ఘనిస్తాన్‌కు యుద్ధట్యాంకులు, సాయుధ శకటాలను సరఫరా చేస్తామనీ, అఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణ కార్యక్రమమనే దానికి నిధుల కేటాయింపు పెంచుతామనీ భారత రక్షణ మంత్రి ఎ.కె. ఆంటోనితో చర్చల్లో తెలిపాడు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో పునఃసమతుల్యత స్థాపనలో భారత్‌కు కీలక పాత్ర ఉంటుందని ప్రకటించి వెళ్లాడు. ఇది జరిగిన మరో వారానికి భారత విదేశాంగమంత్రి ఎస్ఎం కృష్ణ అమెరికా వెళ్లాడు. అక్కడ మూడవ దఫా భారత్ – అమెరికా వ్యూహాత్మక చర్చలు జూన్ 13న వాషింగ్టన్‌లో

జరిగాయి. ఈ చర్చలు భారత్‌ను మరింతగా అమెరికా ధృతరాష్ట్ర కౌగిలిలోకి నెట్టివేశాయి. భారత విదేశాంగమంత్రి ఎస్.ఎం కృష్ణ నాయకత్వంలోని భారత ప్రతినిధి వర్గంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి కపిల్ సిబాల్, ప్రధాన మంత్రి సలహాదారు శామ్ పిత్రోడా తదితరులున్నారు. ఉన్నత విద్యారంగంలో విదేశీయులకు ద్వారాలను బాహాటంగా తెరవడం వారి ఎజెండా. అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ మే రెండవ వారంలో న్యూఢిల్లీ పర్యటనకు వచ్చినప్పుడే అమెరికా ఆర్థిక రాజకీయ డిమాండ్లను అంగీకరించాలని భారత ప్రతినిధి వర్గంపై ఒత్తిడి తెచ్చి, అందుకు ఒక ఎజెండాను కూడా రూపొందించినట్లు తొలి వార్తలను బట్టి వెల్లడైంది.

విద్యారంగంలో అమెరికా విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ దుకాణాలు తెరవడానికి ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని ముందుకు తీసుకుపోయేందుకూ, రిటైల్ వ్యాపారంలోకి అమెరికా కంపెనీల ప్రవేశాన్ని త్వరితం చేసే చర్యల గురించీ ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. దొడ్డిదారి ప్రవేశాలు కాక, పూర్తి ప్రవేశాలతో రిటైల్ రంగాన్ని అప్పగించాలని అమెరికా భారత్‌ను కోరుతున్నది. ఆర్థిక రంగంలో, ఇప్పటికే పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దాని మిత్రదేశాలు ఆ భారాన్ని భారత్‌కు బదిలీ చేసేందుకు, వారి డిమాండ్లకు యుపిఏ-2 ప్రభుత్వం తలొగ్గేటట్లు చేయడానికి అమెరికా సామ్రాజ్యవాదులు సామ, దాన, భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. అందు కొరకు యువ భారతీయుల మనస్సులను కూడా హస్తగతం చేసుకోవడానికి వారు ప్రయత్నిస్తున్నారు. భారత్‌లో తమ దుకాణాలను ప్రారంభించడానికి అమెరికా ఎడ్యుకేషన్ మాఫియాలను అనుమతించడానికి ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి కపిల్‌సిబల్, శ్యామ్ పిత్రోడాలు చర్చల్లో పాల్గొన్నారు. ఇది తీవ్రమైన పరిణామమన్న విషయాన్ని ఎవరూ విస్మరించరాదు.

గతంలో జరిగిన చర్చల్లో వ్యూహాత్మక విషయాలు చర్చకు రాలేదనీ, ఈసారి గుట్టుగా వ్యూహాత్మక అంశాలు చర్చించినట్లు ఒక అమెరికా రాజకీయ వ్యాఖ్యాత పేర్కొన్నారు. ఈ ప్రణాళికలోకి భారత నౌకాదళాన్ని లాగాలన్నదే అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయత్నం, తక్కువ సంఖ్యలో సైనికులు, చురుకు కదలిక, అత్యాధునిక ఆయుధ పరిజ్ఞానంతో అగ్రగామిగా ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేయగలిగే స్థితిని పొందడం ఈ ప్రణాళిక లక్ష్యమని అమెరికా చెప్పింది. హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న అమెరికా వాణిజ్య నౌకలకు భారత నావికాదళం రక్షణ కల్పిస్తుందని ఇప్పటికే భారత ప్రభుత్వం అంగీకరించింది. మరింత భారత్‌ను ఆకర్షించేందుకు అత్యాధునిక యుద్ధ విమానాలు అందజేస్తామనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇస్తామనీ ఆశలు పెడుతున్నది. రానున్న కాలంలో భారత్‌కు 8 బిలియన్ డాలర్ల విలువ గల సైనిక సామాగ్రిని అమెరికా విక్రయించనుంది. సముద్ర జలాలపై కన్నువేసి ఉంచే విమానాలైన పి8-ఐ లను వినియోగిస్తున్నది అమెరికా భారత్‌లేనని, కనుక తాము చూపుతున్న ఆశలు వట్టిమాటలు కాదనీ చెబుతున్నది. తన సైనిక వ్యూహంలో భారత్‌ను కీలకం చేయాలన్న దిశగా అమెరికా ప్రయత్నాలు సాగుతున్నాయి. అమెరికా భౌగోళిక రాజకీయాధిపత్యం కొరకు పన్నిన సైనిక వ్యూహంలో భారత్ ఇరుక్కుంది. దీంతో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతాయి. భారత్ అమెరికా లాగా యుద్ధ ఆర్థిక విధానాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా ప్రజలపై మరింత పన్నుల భారం పడుతుంది. అమెరికా తోక పట్టుకుని ప్రయాణించే భారత పాలకుల వైఖరి, భారత ప్రజల ప్రయోజనాలను బలిపెట్టింది.

గత ఆరున్నర దశాబ్దాలుగా పాలకులు సామ్రాజ్యవాద అనుకూల విధానాలనే అమలు చేస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భారత్ పునర్ వలసగా మారింది. పెట్టుబడికి ఊడిగం చేయడమే పాలకుల ధ్యేయంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై, ప్రజాతంత్ర హక్కులపై ఉక్కు పాదం మోపుతున్నాయి. ప్రకృతి వనరులు, ప్రజా జీవనాధారాలను బహుళ జాతి సంస్థలకు దోచిపెట్టడానికి కంకణం కట్టుకున్నాయి. అమెరికా సామ్రాజ్యవాద ప్రపంచాధిపత్య వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా భారత్ చేరింది. ఇరాన్ విషయంలో అమెరికా ఒత్తిడికి యుపిఎ ప్రభుత్వం లొంగిపోవడం కొత్తేమీ కాదు. జార్జ్‌బుష్, మన్మోహన్‌సింగ్ 2005 జూలైలో విడుదల చేసిన సంయుక్త ప్రకటన అనంతరం అమెరికాకు అనుకూలంగా తన విదేశాంగ విధానాన్ని మార్చుకునే ప్రక్రియకు భారత్ శ్రీకారం చుట్టింది. ఆ ఏడాది సెప్టెంబర్‌లో ఐఎఇఎలో ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ మొట్టమొదటిసారి ఓటు వేసింది. అమెరికా కాంగ్రెస్ చేసిన హైడ్ చట్టం ఇరాన్‌ను ఒంటరిపాలు చేసేందుకు అమెరికాతో సహకరించక తప్పని పరిస్థితుల్లోకి భారత్‌ను నెట్టింది. అమెరికా ఒత్తిడి కారణంగానే ఇరాన్-పాకిస్తాన్-భారత్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టుకు భారత్ స్వస్తి చెప్పింది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కీలకమైన దేశ ప్రయోజనాలను పణంగా పెట్టడం అత్యంత విషాదకరం. దేశ సార్వభౌమత్వానికి, ప్రతిష్టకు తీరని విఘాతం కల్గిస్తున్న తీరు గర్హనీయం. భారత ప్రభుత్వం అంచెలంచెలుగా అమెరికా ఒత్తిడికి లొంగి పోతోంది. ఆంక్షలకు తలవొగ్గుతోంది. అమెరికా ప్రయోజనమే భారత్ ప్రయోజనంగా ప్రజలను నమ్మమంటుంది. కనుక ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులు భారత ప్రభుత్వ యుద్ధోన్మాద విధానాలను, పాలక వర్గాల దోపిడి విధానాలను వ్యతిరేకించాలి. పొరుగుదేశాలతో శాంతి సామరస్యం నెలకొనే స్వతంత్ర విదేశీ విధానాలను అనుసరించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలి. ప్రజాతంత్ర వ్యవస్థను రూపొందించు కోవడానికి సంఘటిత ఉద్యమాలకు సన్నద్ధం కావాల్సిన సందర్భం ఇది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

వీక్షణం పత్రికను ప్రతి నెల 29-30 తేదీల్లో పోస్టు చేస్తాం. పత్రిక 7వ తేదీలోగా అందకపోతే ఆ నెలలోపు ఫోన్ చేసి మాకు తెలియపర్చండి. నెల దాటిన తర్వాత పాత పత్రికలు పంపబడవు. చందా రెన్యువల్ చేసుకున్న వారికే పత్రికను పంపించడం జరుగుతుంది.

గ్రామ అధ్యయనం - మార్క్సిస్టు పద్ధతులు

గ్రామాలను అధ్యయనం చేసే వివిధ పద్ధతులను వివరించే క్రమంలో సామాజిక శాస్త్ర పద్ధతుల గురించి చెపుతున్నారు **ఎన్. వేణుగోపాల్**

ఇప్పటిదాకా విభిన్న దృక్పథాలకు చెందిన పరిశీలకులు గ్రామాన్ని అధ్యయనం చేయడానికి ఏయే పద్ధతులను, పరికరాలను రూపొందించారో, అభివృద్ధి చేశారో చూశాం. ఆ పద్ధతులలో, పరికరాలలో కొన్ని ఉపయోగకరమైనవీ, ఆమోదించి, అనుసరించదగినవీ అయినప్పటికీ, మార్క్సిస్టు దృక్పథం నుంచి చూసినప్పుడు వాటిలో అసమగ్రత, లోపాలు కనబడతాయి. వాటి పట్ల అవగాహన కలిగించే నేపథ్యమంతా కూడ గ్రామాన్ని, సమాజాన్ని మార్క్సిస్టులు చూసే పద్ధతి గురించి తెలుసుకోవడం కోసమే. మార్క్సిస్టు పద్ధతి మిగిలిన అన్ని పద్ధతులకన్న సరైనదీ, సమగ్రమైనదీ, శాస్త్రీయమైనదీ అని చూపడం కోసమే.

మార్క్సిస్టు అధ్యయన, పరిశీలనా, విశ్లేషణా పద్ధతి కేవలం కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ లు రూపొందించినది మాత్రమే కాదు. గతితార్కిక, చారిత్రక భౌతికవాద పద్ధతిగా పేరు పొందిన ఆ పద్ధతి మొదటిసారి మార్క్స్, ఎంగెల్స్ ల రచనలలో, సామాజిక పరిశీలనలలో వ్యక్తమయింది. ఆ తర్వాత ఆ పద్ధతిని ఆయా కాలాలలో మార్క్సిస్టు ఆచరణవాదులు అభివృద్ధి చేస్తూ వచ్చారు. ప్రత్యేకంగా రష్యా విప్లవ నేత వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్, చైనా విప్లవ నేత మావో సే టుంగ్ లు ఈ పరిశీలనా పద్ధతిని సుసంపన్నం చేశారు. అలాగే మార్క్స్ నాటి నుంచి ఈనాటివరకూ ఎంతో మంది మార్క్సిస్టు ఆలోచనాపరులు, సామాజిక శాస్త్రవేత్తలు ఈ పద్ధతికి మార్పులు, చేర్పులు సూచిస్తూ, ఈ పద్ధతిని అభివృద్ధి చేస్తూ వచ్చారు.

అలా నూట డెబ్బై సంవత్సరాల చరిత్ర కలిగిన మార్క్సిస్టు సంవిధానం మీద ఇంగ్లిషులో డజన్లకొద్దీ పుస్తకాలు వచ్చాయి. ఆ చర్చను చూస్తే మార్క్సిస్టు పరిశోధనా పద్ధతిని వేరువేరు వ్యాఖ్యాతలు వేరువేరుగా చూసినట్టు, అర్థం చేసుకున్నట్టు కనబడుతుంది. 'మార్క్సిజం – పరిశోధనా పద్ధతి' అనే వ్యాసంలో తత్వశాస్త్రవేత్త డానియెల్ లిటిల్ అన్నట్టు '...మార్క్సిస్టు సామాజిక శాస్త్ర పరిశోధనా పద్ధతి ఏమిటి అనే ప్రశ్నకు ఒకే ఒక్క జవాబు లేదు. అందుకు భిన్నంగా ఇరవయో శతాబ్దిలో మార్క్సిస్టు సామాజిక పరిశోధన అనేది ఎన్నో గళాలు, ఎన్నో ఆలోచనలు కలగలిసిన బృందగానం. అందులో చాలవాటికి ఒకదానితో మరొకదానికి పొంతన కుదరదు. ఇరవయో శతాబ్దిలో మార్క్సిస్టు సామాజిక శాస్త్రం అనేది ఒకే కేంద్రీకృత దృక్పథం ఉన్న, నిర్దిష్టమైన పద్ధతులకూ, సైద్ధాంతిక ప్రాతిపదికలకూ కట్టుబడిన ఒక క్రమబద్ధమైన పరిశోధనా సమూహం కాదు. దానిలో విపరీతమైన వైవిధ్యం ఉంది. ఒక్కొక్కరూ ఒక్కొక్క అంశాన్ని నొక్కి చెప్పారు.

ఆయా గళాల మధ్య, ఆలోచనల మధ్య, పరిశోధనా పద్ధతుల మధ్య ఉన్న తేడాలను, ఛాయాభేదాలను చర్చించడానికి ఇది సమయం కాదు. కాని ఎన్ని వ్యాఖ్యానాలు, తేడాలు, ఛాయాభేదాలు, తదనంతర విస్తరణలు ఉన్నప్పటికీ అవన్నీ గుర్తించదగిన, స్పష్టమైన ఒకే దృక్పథంలో భాగమవుతాయి. అదే మార్క్సిస్టు దృక్పథం. ఆ దృక్పథం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల రచనలలో పూసల్లో దారంలా ఉండడం మాత్రమే కాదు, తమ పరిశీలనా పద్ధతి ఏమిటో ఆ నలుగురూ చాల స్పష్టంగా, నిర్దిష్టంగా కూడ ప్రకటించారు.

'దాస్ కాపిటల్' రచన కోసం తయారు చేసుకున్న బృహత్తర ప్రణాళిక ('గ్రంద్రస్సె' పేరుతో జర్మన్ లో మొదటిసారి కొంతభాగం 1939లో, మొత్తం పుస్తకం 1953లో, ఇంగ్లిషులో 1973లో అచ్చయింది) లో, 1857లో రాసిన ఉపోద్ఘాతం భాగంలో మార్క్స్ 'రాజకీయార్థశాస్త్ర సంవిధానం' అని పది పేజీల వివరణ ఇచ్చాడు. కొంతవరకు సాంద్రంగా, కఠినంగా కనబడే ఈ భాగం శాస్త్రీయ పరిశోధనా పద్ధతి గురించి అద్భుతమైన, భావస్ఫోరకమైన వివరణ ఇస్తుంది.

'మనం ఒక దేశాన్ని రాజకీయార్థిక దృష్టితో పరిశీలించేటప్పుడు దాని జనాభాతో మొదలుపెడతాం. ఆ జనాభా ఏయే వర్గాల కింద విభజితమై ఉన్నదో, పట్టణాలు, గ్రామసీమలు, తీర ప్రాంతాలు, విభిన్న ఉత్పత్తి శాఖలు, ఎగుమతి, దిగుమతులు, వార్షిక ఉత్పత్తి, వినియోగం, సరుకుల ధరలు, వగైరాలతో ప్రారంభిస్తాం. ఇలా వాస్తవంగా ఉన్నదానితో, నిర్దిష్టమైనదానితో, వాస్తవమైన ముందస్తు షరతుతో ప్రారంభించడం సరైనదిగానే కనబడుతుంది. యావత్తు సామాజిక ఉత్పత్తి కార్యాచరణకు పునాదీ విషయమూ అయిన జనాభాతో ప్రారంభించడం అర్థశాస్త్రానికి సరైనదనే అనిపిస్తుంది. కాని, నిశితంగా పరిశీలిస్తే ఇది తప్పుడు ప్రారంభమని రుజువవుతుంది. జనాభాను రూపొందించే అంశాలను, ఉదాహరణకు వర్గాలను, వదిలేసి నేను జనాభాను పరిశీలిస్తే అది ఒక అమూర్తమైన విషయం అయిపోతుంది. అలాగే వేతన శ్రమ, పెట్టుబడి, వగైరా అంశాల గురించి నాకు తెలియకపోతే వాటి మీదనే ఆధారపడిన వర్గాలు అనే మాట శుష్కమైన మాట అయిపోతుంది. మళ్లీ ఆ అంశాలన్నీ వినిమయం, శ్రమవిభజన, ధరలు, వగైరాల మీద ఆధారపడతాయి. ఉదాహరణకు వేతన శ్రమ, విలువ, ద్రవ్యం, ధరలు, వగైరా లేకుండా, పెట్టుబడి అనేమాటకు అర్థం లేదు. అంటే, నేను జనాభా అనేదానితో ప్రారంభించాలంటే, అది ఒక మొత్తం గురించిన గందరగోళపు భావనే అవుతుంది. అందువల్ల, దాన్ని నేను మరింతగా విభజిస్తూ, విశ్లేషిస్తూ మరింత మరింత సులభమైన భావనల దగ్గరికి చేరవలసి ఉంటుంది. అంటే నేను ఊహించిన నిర్దిష్టతల నుంచి మరింత సూక్ష్మమైన అమూర్తీకరణల దగ్గరికి వెళ్లవలసి ఉంటుంది. అలా చిట్టచివరికి నేను అత్యంత సులభమైన అంశం దగ్గరికి చేరుతాను.

అక్కడినుంచి ఒక్కొక్క అడుగూ వెనక్కి తిరుగుప్రయాణం ప్రారంభించి, చిట్టచివరికి జనాభా దగ్గరికి చేరవలసి ఉంటుంది. ఇప్పుడు జనాభా ఒక గందరగోళపు మొత్తం భావనలా కాక, అనేక విభజనల, సంబంధాల సంపన్నమైన సమగ్రతగా గోచరిస్తుంది...' అని ఆ వివరణలో మార్క్స్ అన్నాడు. ఒక విషయాన్ని పరిశీలించడంలో, పరిశోధించడంలో, అధ్యయనం చేయడంలో తాను అనుసరించిన, ఎవరైనా అనుసరించవలసిన మార్గానికి మార్క్స్ ఇచ్చిన దిశానిర్దేశం ఇది.

'మార్క్స్ పరిశీలనా పద్ధతి వాస్తవంగా ఉనికిలో ఉన్న ప్రతి విషయం దగ్గరా ప్రారంభమవుతుంది. అనుభవైకవేద్యమైన వాస్తవికత దగ్గర, రాజకీయార్థికశాస్త్రవేత్తలు, తత్వవేత్తలు, నవలారచయితలు, వగైరా ఎందరో వర్ణించిన వాస్తవికతా అనుభవం దగ్గర మొదలవుతుంది. ఆయన ఈ మొత్తం సమాచారాన్ని అత్యంత తీవ్రమైన విమర్శకు గురి చేశాడు. ఈ వాస్తవికత అనేది నిజంగా ఎలా తయారవుతుందో కళ్లు మిరుమిట్లు గొలిపేలా వివరించగలిగిన, సాధారణమైన, అదే సమయంలో శక్తివంతమైన భావనలను కనిపెట్టాడు. దీన్ని ఆయన అవరోహణా పద్ధతి (మెథడ్ ఆఫ్ డిసెంట్) అంటాడు. అంటే మనం మన చుట్టూ ఉన్న వాస్తవికత దగ్గరే ప్రయాణం మొదలుపెట్టి ఆ వాస్తవికతకు మూలమైన భావనలవైపు లోలోతులకు ప్రయాణిస్తాం. ఒకసారి ఆ మౌలిక భావనలు మన చేతికి అందినతర్వాత మనం మళ్లీ ఆ వాస్తవికత ఉపరితలానికి తిరుగు ప్రయాణం ప్రారంభించవచ్చు. ఇది ఆరోహణ పద్ధతి (మెథడ్ ఆఫ్ అసెంట్). ప్రపంచంలో మనకు కనబడే రూపాలు ఎంత మోసపూరితమైనవో మనం ఈ ప్రయాణంలో కనిపెట్టవచ్చు. ఈ అవరోహణా, ఆరోహణా పద్ధతులు అవలంబిస్తే మనం ఒక సమున్నత స్థానానికి చేరి, అక్కడి నుంచి ప్రపంచాన్ని మౌలికంగా భిన్నమైన తరహాలో వ్యాఖ్యానించగలుగుతాం' అని మార్క్స్ **'కాపిటల్'**లో అవలంబించిన పద్ధతి గురించి డేవిడ్ హార్వే **'ఎ కంపానియన్ టు మార్క్స్ స్ కాపిటల్'** లో రాశాడు.

'గ్రండ్రిస్సె' లో వివరణ 1857లో రాసినది కాగా, 1873లో అచ్చయిన **'దాస్ కాపిటల్'** రెండవ జర్మన్ కూర్పు వెనుకమాటలో, మొదటి కూర్పు మీద వచ్చిన ఒక సమీక్షపై వ్యాఖ్యానిస్తూ మార్క్స్ తన పరిశీలనా పద్ధతి గురించీ, తన వివరణా పద్ధతి గురించీ మరింత స్పష్టంగా చెప్పాడు. '...నా పద్ధతి గురించి, (దాన్ని నేను అన్వయించిన తీరు గురించి) ఇంత కొట్టవచ్చినట్టుగా, ఇంత ఉదారంగా సమీక్షకుడు చిత్రించిన తర్వాత ఆయన గతితార్కిక పద్ధతిని కాక మరి దేన్ని చిత్రిస్తున్నట్టు? నిజమే, పరిశీలనా పద్ధతికీ, వివరణా పద్ధతికీ రూపంలో తేడా ఉండక తప్పదు. పరిశీలనా పద్ధతి పరిశీలిస్తున్న వస్తువును వివరంగా గ్రహించవలసి ఉంటుంది. దాని విభిన్న అభివృద్ధి రూపాలను విశ్లేషించవలసి ఉంటుంది. ఆ విభిన్న రూపాల మధ్య అంతస్సంబంధాన్ని గుర్తించవలసి ఉంటుంది. ఈ పని అంతా చేసిన తర్వాత మాత్రమే, ఆ వాస్తవ చలనాన్ని తగినంతగా వర్ణించడానికి వీలవుతుంది. ఆ పని విజయవంతంగా చేసినట్టయితే, పరిశీలనావస్తువు జీవితాన్ని అద్దంలో ప్రతిబింబించినట్టుగా సక్రమంగా వర్ణించగలిగితే, అది ముందే రూపొందించుకున్న నిర్మాణంలా కనబడుతుంది' అని మార్క్స్ ఈ వెనుకమాటలో రాశాడు.

అంతకు కొద్ది సంవత్సరాల ముందే, 1865లో మార్క్స్ రాసిపెట్టిన, ఎంగెల్స్ సంపాదకత్వంలో 1894లో ప్రచురితమైన, 'కాపిటల్' మూడో సంపుటంలో ఒక వ్యాఖ్య ఉంది: 'పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలోని వాస్తవిక, అంతర్గత సంబంధాల విశ్లేషణ చాల సంక్లిష్టమైన వ్యవహారం. అది చాల సుదీర్ఘమైనది. కంటికి కనబడే, బాహ్య చలనాన్ని వాస్తవ అంతర్గత చలనంగా పరిష్కరించడమే శాస్త్రం చేసే పని. పెట్టుబడిదారీ ఉత్పత్తి నియమాల గురించి పెట్టుబడిదారీ ఉత్పత్తి, పంపిణీ విధాన నిర్వాహకుల మనసులలో ఉండే భావనలు వాస్తవ నియమాల నుంచి సుదూరంగా ఉంటాయని అది తేటతెల్లం చేస్తుంది. వారి భావనలు కేవలం కంటికి కనబడే చలనాల వ్యక్తీకరణలు మాత్రమేనని తేలుతుంది' అని సారానికీ రూపానికీ మధ్య విభజనను వివరించాడు. శాస్త్రం పని రూపంనుంచి సారానికి వెళ్లడమని, బాహ్య చలనం నుంచి సుదూరంగా ఉండే అంతర్గత చలనాన్ని కనిపెట్టడమని వివరించాడు.

అంతకుముందే అనేకసార్లు రూపాన్ని చూసి మోసపోగూడదని, రూపానికీ సారానికీ తేడా ఉంటుందని మార్క్స్ అన్నాడు. మనిషి కనుగుడ్డులో ప్రపంచం తలకిందులుగా కనబడడం, సూర్యుడు భూమి చుట్టూ తిరిగినట్టు కనబడడం, మంటను చల్లార్చే నీటిలో రెండు మండే వాయువులు కలిసి ఉండడం వంటి అనేక ప్రకృతి ఉదాహరణలను రాజకీయార్థిక శాస్త్రానికి కూడ అన్వయించి మార్క్స్ ఈ రూప – సారాల చర్చ చేశాడు. ఒక వస్తువును అధ్యయనం చేయడమంటే రూపాన్ని చూసి నిర్ధారణలకు రావడం కాదని, సారాన్ని గుర్తించడమని, అదే శాస్త్రీయ అధ్యయన పద్ధతి అని మార్క్స్ రచనల్లోనూ చెప్పాడు, ఆచరణలోనూ చూపాడు.

పరిశీలనా పద్ధతి గురించి మార్క్స్ చాలసార్లే ప్రస్తావించాడు గాని, 'అమూర్తీకరణ పద్ధతి' (ఫోర్స్ ఆఫ్ ఆబ్‌స్ట్రాక్షన్) మినహా ఇతర పరిశోధనా పరికరాల గురించి అంతగా రాయలేదు. కొంతవరకు తనకంటె ముందు సామాజికశాస్త్రాలు అభివృద్ధి చేసిన పరికరాలనే వాడుకున్నాడు. అయితే 1880లో ఫ్రెంచ్ వర్కర్స్ పార్టీ కోరికపై ఆయన తయారు చేసిన 'కార్మికుడికి వంద ప్రశ్నలు' కార్మికుల వ్యక్తిగత జీవితాన్ని, ఉత్పత్తి కార్యాచరణను, సామాజిక జీవితాన్ని అధ్యయనం చేసే పరికరాలుగా ఇవాళ్టికీ పనికివస్తాయి.

మార్క్స్‌తో పరిచయం కన్న ముందే బర్మింగ్ హామ్ లో కార్మికుల మధ్య ఉండి సంపాదించిన పరిజ్ఞానంతో, విశ్లేషణతో ఎంగెల్స్ 1845లో జర్మన్‌లో **'ది కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్'** ప్రచురించాడు. దాని ముందుమాటలో ఎంగెల్స్ తన పరిశీలనా పద్ధతి గురించి రాశాడు. 'సోషలిస్టు సిద్ధాంతాలకు బలమైన పునాది కల్పించాలంటే కార్మికవర్గ స్థితిగతుల గురించి పరిజ్ఞానం చాల అవసరం.... ఇంగ్లిష్ కార్మికవర్గం గురించి, దాని ప్రయత్నాల గురించి, దాని ఆనంద విషాదాల గురించి తెలుసుకోవడానికి, దగ్గరినుంచి, వ్యక్తిగత పరిశీలన నుంచి, వ్యక్తిగత సంబంధం నుంచి చూడడానికి, అదే సమయంలో నా పరిశీలనలను అవసరమైన ప్రామాణిక వనరులతో సరిచూసుకోవడానికి నాకు ఇరవై ఒక్క నెలలు వారితో ఉండే అవకాశం దొరికింది. నేను చూసినదీ, విన్నదీ, చదివినదీ ఈ పుస్తకంలో ఒక్కచోట చేర్చాను' అని క్షేత్ర పరిశోధన, పరిశీలన, అధ్యయనాల ప్రాముఖ్యతను చెప్పాడు.

ఇక మార్క్సిస్టు పరిశీలనా పద్ధతి గురించి లెనిన్ అనేకసార్లు వివరించాడు. 'మార్క్స్ వాస్తవిక క్రమాలను మాత్రమే అధ్యయనం చేశాడు, పరిశోధించాడు... వాస్తవికతతో సమన్వయంలో ఉండడమే సిద్ధాంతానికి ఏకైక గీటురాయి అని భావించాడు... మార్క్స్ ఎంగెల్స్‌లు అధిభౌతిక పద్ధతికి వ్యతిరేకంగా గతితార్కిక పద్ధతి అని చెప్పినది సమాజ శాస్త్రంలో శాస్త్రీయ పద్ధతి తప్ప మరేమీ కాదు. అది సమాజాన్ని నిరంతర చలనంలో ఉన్న సజీవ నిర్మాణంగా చూడడమే' అని లెనిన్ రాశాడు. 'మొత్తంమీద గతితార్కిక దృక్పథమంటే ప్రస్తుతం ఉనికిలో ఉన్న స్థితి పట్ల సమగ్రమైన అవగాహన, ఆ స్థితి అనివార్యంగా అభివృద్ధి చెందుతుందనే అవగాహన' అని 'కాపిటల్' ముందుమాటలో గతితార్కిక పద్ధతికి మార్క్స్ ఇచ్చిన నిర్వచనాన్ని లెనిన్ ఉటంకించాడు.

లెనిన్ స్వయంగా కూడ పరిశోధనా పద్ధతి గురించి రాశాడు. 'ఒక వస్తువు గురించి వాస్తవిక పరిజ్ఞానం కలగాలని మనం అనుకుంటే మొట్టమొదట దానిలోని అన్ని కోణాలనూ, అన్ని సంబంధాలనూ, అన్ని 'మధ్యవర్తిత్వాలనూ' మనం చూడవలసి ఉంటుంది. పరీక్షించవలసి ఉంటుంది. నిజానికి ఇది ఎప్పటికయినా సంపూర్ణంగా సాధించగలుగుతామని ఆశించలేము. కాని ఇలా సమగ్రంగా పరిశీలించాలనే సూత్రం పెట్టుకుంటే కనీసం మనం పొరపాటు పడకుండా, సంకుచితంగా ఉండకుండా జాగ్రత్త పడవచ్చు. రెండవది, ఒక వస్తువును పరిశీలించేటప్పుడు దాన్ని అభివృద్ధి చెందుతున్నదిగా, మార్పు చెందుతున్నదిగా, 'స్వయంచలనం'లో ఉన్నదిగా గుర్తించాలని గతితార్కిక పరిశీలనా పద్ధతి కోరుతుంది.... మూడవది, ఒక వస్తువు గురించి పూర్తి 'నిర్వచనం' అనేదానిలో సమస్త మానవ అనుభవం సమ్మిళితం కావాలి. అది సత్యానికి గీటురాయిగానూ ఉండాలి, మానవ అవసరాలకు సంబంధించిన ఆచరణాత్మక సూచనగానూ ఉండాలి. నాలుగవది, 'సత్యం ఎల్లవేళలా నిర్దిష్టమైనదే, ఎప్పుడూ అమూర్తమైనది కాదు' అని గతితార్కిక పరిశీలనా పద్ధతి భావిస్తుంది' అని లెనిన్ రాశాడు.

మావో పరిశీలనా పద్ధతి మీద చాల కృషి చేశాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ మీద 1927లో భయంకరమైన నిర్బంధం అమలై, దాదాపుగా పార్టీ తుడిచిపెట్టుకుపోయిన తర్వాత సమాజాన్ని అధ్యయనం చేయకుండా ఆ సమాజాన్ని మార్చే కార్యాచరణకు అర్థం లేదని ఆయన గ్రహించాడు. అప్పటికే ఆయన తన గ్రామీణ పరిశోధనా ఫలితాలుగా **చైనా సమాజంలో వర్గ విశ్లేషణ** (1926), **'హునాన్ రైతాంగ ఉద్యమ పరిశీలనా నివేదిక'** (1927) రాసి ఉన్నాడు. అలా రెండు సంవత్సరాల ముందునుంచే తాను సాగిస్తున్న గ్రామీణ ప్రాంతాల అధ్యయనాలను 1927 వెనుకంజ తర్వాత సైద్ధాంతీకరించడం ప్రారంభించాడు. ఆ నేపథ్యం నుంచే 1930లో ఆయన **క్సున్ వు ప్రాంత నివేదిక, పుస్తకపూజను వ్యతిరేకించండి** అనే రెండు రచనలు చేశాడు.

వీటిలో మొదటిది 1937లో ప్రచురించాలని అనుకున్నప్పటికీ దొరకకుండా పోవడం వల్ల అచ్చు కాలేదు. 1941లో ప్రచురించిన **గ్రామీణ అధ్యయనాలు** పుస్తకం ముందుమాటలో ఈ రచన తప్పిపోవడం గురించి ప్రస్తావించాడు. ఈ తప్పిపోయిన రచన యాభై సంవత్సరాల తర్వాత దొరికి చైనీస్ భాషలో 1982లో మొదటిసారి అచ్చయి, 1993లో ఇంగ్లిష్ అనువాదం వెలువడింది. 'క్సున్ వు ప్రాంత నివేదిక ఆ ప్రాంతపు సమాజానికి, ఆర్థికవ్యవస్థకు, రాజకీయాలకు, చరిత్రకు సంబంధించిన సమాచారపు గని' అని ఇంగ్లిష్ అనువాదానికి ముందుమాట రాసిన రోగర్ ఆర్ థాంప్సన్ అన్నాడు. అలాగే రెండవవ్యాసం ముప్పై ఏళ్లపాటు అచ్చు కాకుండానే ఉండిపోయి కేంద్ర విప్లవ మ్యూజియంలో తనకు అనుకోకుండా 1961లో దొరికిందని మావో రాసిన వ్యాఖ్యతో మొదటిసారి 1964లో వెలువడింది. ఈ వ్యాసం 'ఒక విషయం గురించి పరిశోధన చేయకుండా దాని గురించి మాట్లాడే హక్కు లేదు' అనే వాక్యంతో ప్రారంభమవుతుందంటే 1930 నాటికే పరిశోధన గురించి మావోకు ఉండిన శ్రద్ధాసక్తులు తెలుస్తాయి.

'కొందరు వ్యక్తులు ఒక కార్యాలయంలో కూచుని కమ్యూనిస్టు పార్టీకి చెందిన సరైన, స్థిరమైన పోరాట ఎత్తుగడలను ఎట్టి పరిస్థితులలోనూ తయారు చేయలేరు. ఆ ఎత్తుగడలు ప్రజా పోరాటాల క్రమంలోనే, అంటే వాస్తవ అనుభవం నుంచే రూపొందుతాయి. అందువల్ల, మనం అన్నివేళలా సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయవలసిందే. ఆచరణాత్మక పరిశోధనలు సాగించవలసిందే' అని మావో ఆ వ్యాసంలో అన్నాడు.

ఏడు భాగాలుగా ఉన్న ఈ వ్యాసంలో చివరి భాగం 'పరిశోధనా పద్ధతి'ని వివరిస్తుంది. 1. నిజనిర్ధారణ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చల ద్వారా పరిశోధన సాగించాలి. 2. ఆ సమావేశాలను గ్రామపు సామాజిక ఆర్థిక పరిస్థితుల పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవాళ్లతో జరపాలి. 3. చిన్న సమావేశాలు మంచివా, పెద్ద సమావేశాలు మంచివా అనేది ఆయా స్థలకాలాల మీద నిర్ణయమవుతుంది గాని, సమావేశంలో కనీసం ముగ్గురు ఉండాలి. 4. పరిశోధనకు ముందే వివరమైన ప్రణాళిక తయారు చేసుకోవాలి. 5. పరిశోధకులు ఇతరుల మీద ఆధారపడడం కాకుండా స్వయంగా పాల్గొనాలి. 6. వీలయినంత లోతయిన సమాచార సేకరణ జరపాలి. 7. ఎప్పటికప్పుడు చర్చల గురించి వివరాలు, వ్యాఖ్యలు, ఫలితాలు రాసిపెట్టుకోవాలి అని మావో చాల చిన్న చిన్న వివరాలతో సహా గ్రామ పరిశోధన ఎలా జరపాలో సూచించాడు.

అలా 1930ల నుంచి ఆతర్వాత మూడు దశాబ్దాలలో గ్రామీణ అధ్యయనాల అవసరాన్ని గురించి మాత్రమే కాక పరిశోధనా పద్ధతుల గురించి కూడ ఆయన ఎన్నోసార్లు నొక్కిచెప్పాడు. పైన చెప్పిన రచనలతో పాటు **గ్రామీణ ప్రాంతాలలో వర్గాలను ఎలా వేరు చేసి చూడాలి** (1933), **గ్రామీణ సర్వేలకు ముందుమాట, వెనుకమాట** (1941), **ది సోషలిస్ట్ అప్ సర్జ్ ఇన్ చైనాస్ కంట్రీసైడ్ కు పరిచయ వ్యాఖ్యలు** (1955) వంటి అనేక రచనలలో ఆయన పరిశోధనా పద్ధతుల గురించి వివరించాడు.

భారతదేశంలో మార్క్సిస్టు ఆచరణలో ఉన్నవారిలో ఇఎంఎస్ నంబూద్రిపాద్, చండ్ర రాజేశ్వర రావు, పుచ్చలపల్లి సుందరయ్య, చారు మజుందార్, కొండపల్లి సీతారామయ్య వంటి అతి తక్కువమంది మాత్రమే గ్రామ, రైతాంగ అధ్యయనాల మీద దృష్టి పెట్టారు గాని వారు కూడ స్వతంత్ర పరిశోధనా పద్ధతులను అభివృద్ధి చేయలేదు. మార్క్సిజాన్ని ఆమోదించే భారత సామాజిక శాస్త్రవేత్తలు కొందరు పరిశోధనా పద్ధతుల మీద ఎక్కువ కృషి చేశారు. డిడి కోశాంబి, కృష్ణా భరద్వాజ్, ప్రణబ్ బర్ధన్, డి ఎన్ ధనగరె, ఆర్ ఎస్ రావు, ప్రధాన్

ఎచ్ ప్రసాద్, అమిత్ భాదురి, పి కె బోస్, యాన్ బ్రెమెన్, నిర్మల్ కుమార్ చంద్ర, అరవింద్ నారాయణ్ దాస్, ఉత్సా పట్నాయక్, ముదునూరి భారతి వంటి వారి రచనలలో ఈ పరిశోధనా సంవిధానపు ఆలోచనలు కనబడతాయి.

'...సామాజిక సంబంధాలను ఉన్నవి ఉన్నట్టుగానూ, చారిత్రకంగా పరిణామం చెందుతూ వచ్చిన క్రమంలోనూ అర్థం చేసుకోవాలి. వర్గాల స్వభావాన్ని, వాటి మధ్య సంబంధాలను అర్థం చేసుకోవాలి. సమాజంలోని వైరుధ్యాలను అర్థం చేసుకోవాలి. వర్తమానంలో ప్రాబల్యం వహిస్తూ ఉన్న ప్రధాన వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలి. వైరుధ్యాలు వ్యక్తీకరణ పొందే రూపాలన్నిటినీ అర్థం చేసుకోవాలి. ఆ వైరుధ్యాలు అభివృద్ధి చెందగల అవకాశాల క్రమాన్ని అర్థం చేసుకోవాలి. రాజ్యాంగ యంత్రపు స్వభావాన్నీ, రాజ్యవిధానపు సాధనాలనూ అర్థం చేసుకోవాలి. వర్గపోరాటపు ప్రస్తుత స్థితినీ, రూపాన్నీ, భవిష్యత్తులో అది ధరించబోయే రూపాన్నీ అర్థం చేసుకోవాలి. భావజాలం మీద, చైతన్యం మీద ఉపరితల ప్రభావాన్నీ, దాని పాత్రనూ, అది వర్గపోరాటాన్ని రూపొందించే తీరునూ అర్థం చేసుకోవాలి' అని సామాజిక అధ్యయనపు పద్ధతి గురించి వివరిస్తూ **అన్ సమ్ ఇష్యూస్ ఆఫ్ మెథడ్ ఇన్ ది అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఛేంజ్** వ్యాసంలో కృష్ణా భరద్వాజ్ అన్నారు.

ది ప్రాబ్లమాటిక్ ఆఫ్ కన్ స్ట్రక్టింగ్ సోషల్ రియాలిటీ: సమ్ మెథడలాజికల్ ఇష్యూస్ అనే అద్భుతమైన వ్యాసంలో ముదునూరి భారతి పరిశోధన లక్ష్యాల గురించి, పరిశోధనా ప్రక్రియ గురించి, పరిశోధనా పరికరాల గురించి చర్చించడం మాత్రమే కాదు, నిర్వాసితుల మీద స్వయంగా పరిశోధన జరిపి తన సిద్ధాంతపు అన్వయం కూడ చూపారు. 'పరిశోధనా కృషి అనేదంతా తెలియనిదాన్ని, లేదా ఇప్పటిదాకా తెలియనిదాన్ని తెలుసుకునే క్రమమే' అంటూ ఈ క్రమంలో పరిశోధకులకు మూడు రకాల జ్ఞానవనరులు – ఇప్పటికే వ్యవస్థీకృతమైన జ్ఞానం, సిద్ధాంతం, నమూనా; ఆ నమూనా నుంచి పక్కకు తొలగినప్పటికీ ఆ నమూనాలో భాగమైపోయిన భిన్నాంశాలు; ఆ నమూనా నుంచి ప్రస్తుతం భిన్నంగా కనబడే అంశాలు – ఉంటాయని అన్నారు. పరిశోధకులు తమ లక్ష్యాలను బట్టి, వనరులను బట్టి భిన్నమైన కాలాలలో భిన్నమైన నమూనాలు తయారు చేయవచ్చునని, లేదా ఒకే సమయంలో ఒకే వస్తువును వేరువేరు పరిశోధకులు వేరువేరుగా వర్ణించవచ్చునని అన్నారు.

ఉన్నదాన్ని అధ్యయనం చేసే పనిగా కాకుండా, ఆ ఉన్నదానిలోంచి మార్పు చెందుతూ అభివృద్ధి చెందుతున్నదేమిటో గుర్తించే పనిగా సామాజిక అధ్యయనం జరగాలని ఆర్ ఎస్ రావు అన్నారు.

ఈ చర్చ అంతటి నుంచీ గ్రహించవలసిన ముఖ్యమైన మార్క్సిస్టు అధ్యయన పద్ధతులు, గ్రామ అధ్యయనాలలో, సమాజ అధ్యయనాలలో తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి: 1. ప్రతి వస్తువూ చలనంలో ఉంటుందని, మార్పుకు లోనవుతుందని గుర్తించాలి. 2. రూపమూ సారమూ ఎప్పుడూ ఒకటి కావని, రూపంలో భిన్న కోణాలు ఉండవచ్చునని, రూపాన్ని దాటి సారాన్ని గ్రహించగలగడమే అధ్యయన లక్ష్యమని గుర్తించాలి. 3. పరిశోధకుల కంటికి కనబడేది మొత్తంలోని ఒక భాగం మాత్రమేననే స్పృహ ఉండాలి. 4. కంటికి కనబడే నిర్దిష్ట, ప్రత్యేక, విశిష్ట అంశానికి వెనుక అమూర్త, సాధారణ, సార్వత్రిక లక్షణాలను గుర్తించాలి. 5. ఘటనకూ పరిణామానికీ మధ్య తేడాను మాత్రమే కాదు, ప్రతి ఘటనా పరిణామంలో భాగమేనని గుర్తించాలి. 6. ఘటనల మధ్య, పరిణామాల మధ్య కార్యకారణ సంబంధాలు ఏకముఖంగా కాక బహుముఖంగా ఉంటాయని గుర్తించాలి. 7. ప్రతి సందర్భమూ ఒక విశాల నేపథ్యంలో సాపేక్షికంగా మాత్రమే ఉంటుందని, చలనం, మార్పు తప్ప మరేదీ పరమమైనది కాదని గుర్తించాలి. 8. ప్రతి వస్తువులోనూ విరుద్ధాంశాల ఐక్యత, ఘర్షణ ఉంటాయని, ఆ ఘర్షణ వల్లనే చలనం వీలవుతుందని, అభివృద్ధి జరుగుతుందని గుర్తించాలి.

గ్రామాన్ని చూసినా, పట్టణాన్ని చూసినా, ఒక మానవ సమూహాన్ని చూసినా ఈ తాత్విక దృక్పథంతో రాజకీయార్థిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక అంశాలను పరిశీలించడమే శాస్త్రీయ అధ్యయన సంవిధానం. ఈ సంవిధానంలో విశ్లేషణా సాధనాలుగా ఉపయోగపడేవి ఉత్పత్తి శక్తులు, ఆస్తి సంబంధాలు, ఉపరితలాంశాలు. మరో మాటల్లో చెప్పాలంటే వర్గ విశ్లేషణ, చారిత్రక పరిశీలన. రాజకీయ, మత, నైతిక, సాంస్కృతిక భావనల పరిశీలన.

సమాజంలోని వైరుధ్యాలను పరిశీలించడమంటే వర్గాలను పరిశీలించడమే. సమాజంలోని మరెన్నో అంశాల మధ్య వైరుధ్యాలు, విభేదాలు, తగాదాలు, ఘర్షణలు ఉండవచ్చు, ఉన్నట్టు కనబడవచ్చు గాని వాటన్నిటికీ మూలం వర్గ వైరుధ్యమే. వర్గం ఉత్పత్తి విధానం మీద, ఉత్పత్తి సాధనాల మీద, ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడినది గనుక, మిగిలిన విభజనలన్నిటికంటె అది మౌలికమైనదీ, ప్రధానమైనదీ అవుతుంది. మానవ మనుగడకు ఉత్పత్తే మూలం, కీలకం. ఆలోచనలు చేయాలన్నా, పని చేయాలన్నా, సంఘర్షించాలన్నా మొట్టమొదట మనుషులు బతికి ఉండాలి. అంటే జీవితం గడవడానికి అవసరమైన వస్తువులు ఉత్పత్తి చేయాలి. ఉత్పత్తి జరగాలంటే భూమి, ఖనిజాలు, నీరు వంటి ప్రకృతి వనరుల మీద, శ్రమ లక్ష్యాల మీద మనుషులు తమ శ్రమను వెచ్చించాలి. ఉత్పత్తి సాగాలంటే ఆ ఉత్పత్తి చేసే మనుషులతో పాటు శ్రమసాధనాలు (మీన్స్ ఆఫ్ లేబర్) కూడ కావాలి. మనుషులను, ఉత్పత్తి సాధనాలను, శ్రమ లక్ష్యాలను (ఆబ్జెక్ట్స్ ఆఫ్ లేబర్) కలిపి ఉత్పత్తి శక్తులు (ఫోర్సెస్ ఆఫ్ ప్రొడక్షన్) అంటారు. ఆ ఉత్పత్తి ఒంటరిగా సాధ్యం కాదు గనుక, సామాజికంగానే సాగుతుంది గనుక, ఉత్పత్తి క్రమంలో మనుషుల మధ్య సంబంధాలు ఏర్పడడం కూడ అనివార్యం. అలా మనుషుల నిత్యజీవిత మనుగడకు అవసరమైన ఉత్పత్తిలో ఏర్పడే మౌలిక సంబంధాలు ఉత్పత్తి సంబంధాలు (రిలేషన్స్ ఆఫ్ ప్రొడక్షన్). ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పాల్గొనని మనుషుల మధ్య రూపొందే సామాజిక సంబంధాలకు కూడ ఉత్పత్తి సంబంధాలే మూలం. ఆ ఉత్పత్తి సంబంధాలను నిర్దేశించే పాలనా వ్యవస్థ మిగిలిన సామాజిక సంబంధాలను అందుకు అనువుగా తయారుచేస్తుంది. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తిలో మిగులు వ్యక్తిగత ఆస్తిగా మారిన తర్వాత ఉత్పత్తి సంబంధాలు ఆస్తి సంబంధాల రూపం పొందుతాయి. ఉత్పత్తి సాధనాల మీద అత్యల్ప సంఖ్యాకులకు వ్యక్తిగత యాజమాన్యం, అదుపు వస్తుంది. కోట్లాది మందికి తమ శ్రమ అమ్ముకుని రోజు గడుపుకోవడం తప్ప గత్యంతరం లేని స్థితి వస్తుంది. ఇవే వర్గాలు. ఇదే వర్గ సమాజం. ఈ వర్గ సమాజం తనను తాను కాపాడుకోవడానికి ఉత్పత్తి సంబంధాల పునాదికి సాధికారతను కల్పించే, కాపాడే ఉపరితలాన్ని సృష్టిస్తుంది, పెంచి

పోషిస్తుంది. రాజకీయ, మత, నైతిక, కళా, సాహిత్య, సాంస్కృతిక, భావజాల రూపాలన్నీ ఈ ఉపరితలం లోనివే. అందువల్ల సమాజాన్ని పరిశీలించడమంటే, పరిశోధించడమంటే, అధ్యయనం చేయడమంటే ఆ సమాజపు ఉత్పత్తి శక్తులను, ఆస్తి సంబంధాలను, ఉపరితలాన్ని అధ్యయనం చేయడమే.

సమాజాన్ని పరిశీలించే సంవిధానాన్ని నేల మీదికి దించి, నిర్దిష్టం చేసిన శాస్త్రవేత్త మార్క్స్ అంటూ, ముదునూరి భారతి, ఆ సంవిధానం 'పరిశోధకులకూ, పరిశోధనా వస్తువుకూ మధ్య సంబంధాన్ని భౌతిక గతితర్కం ద్వారా చారిత్రక నేపథ్యంలో పరిశీలించడానికి కొత్త అవకాశాలు కల్పించింది. అంతే కాదు. ఈ చలన సూత్రాలు ఉత్పత్తి అవసరాల మార్పులో భాగంగా ఉంటాయని చూపడానికి మార్క్స్ ప్రయత్నించాడు. అందువల్ల పరిశోధకులు ఉత్పత్తి విధానాన్ని గ్రహించగలిగితే, మానవ సమాజం గురించి ఆ పరిశోధకుల అవగాహన ప్రకృతి గురించి భౌతిక శాస్త్రవేత్త అవగాహన ఉన్నంత కచ్చితంగా ఉంటుందని మార్క్స్ అన్నాడు. ఈ లక్ష్యం కోసం ఉత్పత్తి శక్తులు, ఆస్తి సంబంధాలు, ఉపరితలం మూడూ విశ్లేషణా పరికరాలుగా పనికొస్తాయని ఆయన ప్రతిపాదించాడు' అన్నారు. దీన్నే మరో మాటల్లో చెప్పాలంటే సామాజిక నిర్మితిని అర్థం చేసుకోవాలంటే ఆర్థిక, రాజకీయ, భావజాల అంశాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఉత్పత్తి శక్తులను, ఆస్తి సంబంధాలను అధ్యయనం చేయడానికి మరో పేరు వర్గ విశ్లేషణ. వర్గాన్ని గుర్తించడానికి, అర్థం చేసుకోవడానికి రెండు ప్రాతిపదికలు ఉన్నాయి. ఒకటి, ఒక మనిషికి ఉత్పత్తి సాధనాల మీద ఉండే యాజమాన్యాన్ని బట్టి, అదుపును బట్టి ఆ మనిషి ఏ వర్గానికి చెందుతాడో చూడవచ్చు. రెండు, ఆ మనిషి ఇతరుల శ్రమను దోపిడీ చేసే అవకాశంతో ఉన్నాడా, ఇతరులకు శ్రమను అమ్ముకోవలసిన స్థితిలో ఉన్నాడా అనేదాన్ని బట్టి వర్గ స్థాయిని అంచనా కట్టవచ్చు.

'సామాజిక ఉత్పత్తి చారిత్రకంగా నిర్దేశితమవుతుంది. ఆ సామాజిక ఉత్పత్తిలో ఏ స్థానంలో ఉన్నారనేదాన్ని బట్టి పరస్పరం భిన్నంగా ఉండే విశాల ప్రజా సమూహాలే వర్గాలు. చాల సందర్భాలలో ఉత్పత్తి సాధనాలతో వారి సంబంధం చట్టం చేత రూపొందించబడి, నిర్ధారించబడి వేరువేరుగా ఉంటుంది. శ్రమకు సంబంధించిన సామాజిక నిర్మాణంలో వారి పాత్ర భిన్నంగా ఉంటుంది. తత్ఫలితంగా సామాజిక సంపదలో వారు ఖర్చుపెట్టగలిగిన, సంపాదించగలిగిన వాటా పరిమాణం భిన్నంగా ఉంటుంది. సామాజిక ఆర్థిక వ్యవస్థలో వారు నిలిచి ఉన్న భిన్నమైన నిర్దిష్ట స్థానాల వల్ల ఒకరి శ్రమను మరొకరు స్వాధీనం చేసుకోగలిగిన ప్రజా సమూహాలే వర్గాలు' అని లెనిన్ నిర్వచించాడు.

రష్యా సమాజాన్ని అధ్యయనం చేయడానికి, రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిని అధ్యయనం చేయడానికి లెనిన్ వర్గ పరిశీలన పరికరాలను రూపొందించాడు. మొదటి కూర్పు 1899లోనూ, రెండో కూర్పు 1908లోనూ ప్రచురితమైన **డెవలప్‌మెంట్ ఆఫ్ కాపిటలిజం ఇన్ రష్యాలో** ఆయన ప్రధానంగా జార్ ప్రభుత్వ గణాంకాలనే వాడుకుని విశ్లేషించినప్పటికీ వర్గ విశ్లేషణ ద్వారానే సరైన సమాజ అధ్యయనం సాధ్యమవుతుందని రుజువు చేశాడు. ఆ తర్వాత కూడ ఆయన ఈ వర్గ విశ్లేషణను కొనసాగించి 1920లో రాసిన **వ్యవసాయ సమస్యపై ప్రాథమిక ముసాయిదా సిద్ధాంతపత్రంలో** రష్యాలోనూ, మొత్తం యూరప్ లోనూ గ్రామీణ ప్రజానీకంలో 1. వ్యవసాయ కార్మికులు లేదా వేతన కార్మికులు, 2. అర్ధకార్మికులు లేదా నిరుపేద రైతులు, 3. చిన్న రైతులు, 4. మధ్యతరగతి రైతులు, 5. పెద్ద రైతులు, 6. పెద్ద భూస్వాములు అనే ఆరు వర్గాలు ఉన్నాయని అన్నాడు. ప్రతి వర్గాన్నీ వివరంగా నిర్వచించాడు.

యూరప్ కన్న భిన్నమైన వ్యవసాయ సమాజంగా ఎదిగిన చైనా సమాజానికి లెనిన్ సూత్రీకరణ యథాతథంగా సరిపోదని గుర్తించిన మావో 1933లోనే చైనా సమాజంలో వర్గాలను ఎలా విభజించాలో సూత్రీకరించాడు. అందులో ఆయన 1. భూస్వామి, 2. ధనిక రైతు, 3. మధ్యతరగతి రైతు, 4. పేద రైతు, 5. కార్మికుడు అనే ఐదు వర్గాల విభజన చేశాడు. నిజానికి ఆయనే 1926లో చేసిన విభజన (1. భూస్వామ్య వర్గం – దళారీ వర్గం, 2. మధ్యతరగతి బూర్జువావర్గం, 3. పెటీబూర్జువా వర్గం, 4. అర్ధ కార్మికులు, 5. కార్మికులు) కన్న ఇది కాస్త భిన్నమైనది. ఈ రెండు విభజనలకు మధ్య 1930లో 'పుస్తకపూజను వ్యతిరేకించండి'లో ఆయనే '1. పారిశ్రామిక కార్మికవర్గం, 2. చేతివృత్తుల శ్రామికులు, 3. వ్యవసాయ కూలీలు, 4. పేద రైతులు, 5. పట్టణ పేదలు, 6. లంపెన్ కార్మికులు, 7. చేతివృత్తుల యజమానులు, 8. చిన్న వ్యాపారస్తులు, 9. మధ్యతరగతి రైతులు, 10. ధనిక రైతులు, 11. భూస్వాములు, 12. వాణిజ్య బూర్జువావర్గం, 13. పారిశ్రామిక బూర్జువావర్గం' అనే పదమూడు 'సామాజిక వర్గాల'ను గుర్తించి తాము పనిచేస్తున్న ప్రాంతాలలో పారిశ్రామిక కార్మికులు, పారిశ్రామిక బూర్జువాలు లేరని అన్నాడు.

లెనిన్, మావో ఇద్దరూ కూడ శ్రమ దోపిడీ ప్రాతిపదిక పైనే వర్గ విభజన సాగించారు. ఇది సమగ్రం కాదని, ఉత్పత్తి సాధనాల యాజమాన్యం, ముఖ్యంగా భూయాజమాన్యం ఆధారంగానే విభజన సాగించాలని చెప్పేవారు, రెండు ప్రాతిపదికలూ గుర్తించవలసినవే అనేవారు కూడ ఉన్నారు. గ్రామాన్ని అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి భూయాజమాన్య ప్రాతిపదిక, శ్రమ దోపిడీ ప్రాతిపదిక మాత్రమే కూడ సరిపోవు. 'రైతులు ఏ వర్గానికి చెందుతారని విశ్లేషించడంలో చాల తరచుగా జరిగే తప్పు ఏమంటే వారికి ఎంత భూమి మీద పట్టాహక్కు ఉన్నదనేదే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇది చాల ప్రమాదకరమైన పొరపాటు. వారి ఆదాయం, జీవనస్థాయి ఆధారంగా వారి వర్గ స్థితిని విశ్లేషించాలి' అని 1965లో రాసిన చారు మజుందార్ ఆదాయం, జీవన స్థాయి అనే అంశాలను చేర్చాడు. అప్పటికీ ఉత్పత్తి శక్తులు, ఆస్తిసంబంధాలు, ఉపరితలం అనే మూడు ప్రాతిపదికలూ అమలు కాలేదు. ఆర్థిక, రాజకీయ, భావజాల స్థితి అనే మూడు ప్రాతిపదికలూ అమలు కాలేదు.

అందువల్ల సమగ్రమైన అర్థంలో మార్క్సిస్టు అధ్యయన పద్ధతులలో గ్రామ అధ్యయనం జరపాలంటే ఈ అన్ని అంశాలనూ సమ్మిళితం చేసిన, సామాజిక శాస్త్ర పద్ధతులలో ఉపయోగకరమైనవాటిని సృజనాత్మకంగా సంలీనం చేసుకున్న విశాల సంవిధానం కావాలి.

(మిగతా వచ్చే సంచికలో)

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

రాజకీయ ఖైదీలు అడుగుతున్నదేమిటి?

ఏళ్ల తరబడి కేసుల విచారణ సక్రమంగా జరపకుండా, శిక్ష పూర్తయి విడుదలైనా కొత్త కేసులు పెడుతూ, అనేక రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజకీయ ఖైదీలను, సాధారణ ఖైదీలను వేధిస్తున్న పోలీసు వ్యవస్థ తీరు తెన్నులను, న్యాయ వ్యవస్థ నిర్లక్ష్యాన్ని తెలుపుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు రాజకీయ ఖైదీలు రాసిన పిటిషన్‌కు అనువాదం. - సం

రాజకీయ ఖైదీలను చట్టవ్యతిరేకంగానూ, అప్రజాస్వామికంగానూ సుదీర్ఘకాలం జైళ్లలో నిర్బంధించడానికి వ్యతిరేకంగా జూన్ 26 నుండి వారం పాటు రాజకీయ ఖైదీల సామూహిక, రిలే నిరాహార దీక్షలు.

ఎమర్జెన్సీని విధించి రాజకీయ, ప్రజాస్వామిక హక్కులన్నిటినీ హరించిన 1975 నాటి జూన్ 26న భారతీయ ప్రజాస్వామ్యంలో ఒక చీకటి రోజు. ఆ సమయంలో పార్లమెంటరీ పార్టీల నాయకులతో సహా రాజకీయ నాయకులందరినీ కటకటాల వెనక్కినెట్టారు. మీసా, నాసా వంటి ఎన్నో అక్రమ చట్టాలను విచ్చలవిడిగా ప్రయోగించారు.

ఎమర్జెన్సీని ఎత్తివేశాక మళ్లీ దానిని విధించలేదు. కానీ పోరాడే ప్రజలకు, కార్యకర్తలకు సంబంధించినంత వరకూ అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతూనే ఉంది. గత దశాబ్దకాలంలో ఈ స్థితి పెచ్చరిల్లి పోయింది. మీసా, నాసాలను, రౌలట్ చట్టాన్ని సైతం మించిన టాడా, పోటా, ప్రస్తుతకాలంలో భయంకరమైన యుఎపిఎ (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) ఇంకా 17 సిఎల్ఎ, సిసిఎ (జార్ఖండ్‌లో కంట్రోల్ యాక్ట్), మొకోకా (మహారాష్ట్రలో) అటువంటివే మరికొన్ని చత్తీస్‌గడ్, ఇతర రాష్ట్రాలలో అమలవుతున్నాయి.

ఈ చట్టాలు, యాక్ట్‌ల కింద వేలాది మంది పేద రైతులు, శ్రామికులు ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, వెనుకబడిన కులాలకు చెందినవారు, రాజకీయ, ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలు, విప్లవకారులు ఏళ్లతరబడి విచారణ లేకుండా జైళ్లో మగ్గుతున్నారు.

కనీసం 95 శాతం కేసుల్లో చట్టాన్ని అతిక్రమించి విచారణ లేకుండానే నిర్బంధాన్ని పొడిగించడానికి వివిధ రకాలైన ఎత్తుగడలనీ రాజ్యం అవలంబిస్తోంది. శిక్షలు పడిన కేసుల్లో సైతం కేవలం అతి బలహీనమైన కారణాలతోనే, న్యాయవ్యవస్థ, అధికార గణాలతో కుమ్మక్కై శిక్షలు వేసేస్తోంది. ముఖ్యంగా కిందిస్థాయి న్యాయవ్యవస్థలు ఈ కుమ్మక్కును జీతన్ మరాండీ తదితరులకు వేసిన ఉరిశిక్ష, అమితాబ్ బాగ్చీ తదితరులకి వేసిన యావజ్జీవ కారాగారవాసం, ఇటీవలనే తాజాగా సీమా ఆజాద్, ఆమె సహచరుడు విశ్వ విజయ్‌లకు వేసిన యావజ్జీవ కారాగారవాసం నిరూపిస్తాయి. ఇక బినాయక్‌సేన్, నారాయణ్ సన్యాల్ లకు వేసిన శిక్ష గురించి చెప్పనే అక్కర్లేదు.

'శాంతి భద్రతలను కాపాడడం' అనే పరిహాస పూర్వకమైన నెపంతో చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించిన, అలాంటి కొన్ని కొట్టొచ్చిన ఘటనలను మీ దృష్టికి తేదల్చుకున్నాం.

1. అరెస్ట్ చేసిన తరువాత సహేతుకమైన సమయం లోపల మొత్తం కేసులను పెట్టకపోవడం.

ఖైదీలను అనంతకాలం– జైళ్లలో నిర్బంధించి ఉంచడానికి పోలీసులు అవలంభించే అతి ఇష్టమైన పద్ధతి. చారిత్రకమైన డి.కె. బసు సుప్రీంకోర్టు తీర్పులో అరెస్ట్‌కి ముందు, తర్వాత అవలంభించాల్సిన పద్ధతులకు సంబంధించి కొన్ని నియమాలను రూపొందించిన చట్టాలను ఉల్లంఘించ డానికే వాటిని పోలీసులు ఉపయోగిస్తుంటారు. ముద్దాయికి వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న కేసులన్నిటినీ కొత్తగా ఏదైనా సాక్ష్యం దొరికితే తప్ప అరెస్ట్ అయిన కొద్ది నెలల కాలంలోనే ఫైల్ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారుల గైడెన్స్‌లో పోలీసులు సుదీర్ఘమైన సమయావధి లో, అప్పుడప్పుడూ ఎనిమిది, తొమ్మిదిఏళ్ల తర్వాత కూడా పెడుతుంటారు. ఉదాహరణకు సోహన్ భుకియ్యా హజారీబాగ్ జైల్లో అక్టోబర్ 2004 నుండి ఉన్నాడు. ఆయనను 22 కేసులలో ఇరికించారు. ఎనిమిదేళ్ల కాలంలో అనేక కేసుల నుంచి విడుదల కావడమో, బెయిల్ రావడమో జరిగింది. 2012 మే నెలలో విడుదల కావలసి ఉంది. అకస్మాత్తుగా ఆకాశంలోంచి ఊడిపడ్డట్టుగా 2003 నాటి బొకారో జిల్లా, తేనూఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసు ఒకటి పెట్టారు. 2004 నాటి నుంచీ తేనూఘాట్ పోలీసులకి ఆయన జైల్లో ఉన్నట్టు తెలియనే తెలియదా?

2. విడుదలయిన వెంటనే జైలు గేట్ల ముందే తిరిగి అరెస్టు చేయడం. కోర్టుల ద్వారా బెయిల్ పైననో, నిర్దోషులుగానో విడుదలైన వారిని తిరిగి అరెస్టు చేస్తున్న సంఘటనలు చాలా పెరుగుతున్నాయి. తాజాగా జరిగిన అటువంటి మూడు ఉదాహరణలు ఇస్తున్నాం.

ఎ) రెండేళ్లు జైల్లో గడిపిన తర్వాత శివచరణ్ మాంఝీ హజారీబాగ్ జైలు నుండి 26 ఏప్రిల్ 2012న విడుదలయ్యారు. విడుదలై గేటు బయట అడుగు పెట్టిన మరుక్షణం అతనిని ఇంటికి తీసుకుపోవడానికి వచ్చిన సోదరుడు, మేనల్లుడులతో సహా పోలీసులు ఎత్తుకుపోయారు. మూడు రోజుల అక్రమ నిర్బంధంలో ఉంచిన తర్వాత అతని మీద జిల్లా సరస్సు దగ్గర ఆయుధాలు, మావోయిస్టు సాహిత్యంతో పట్టుపడ్డాడని ఒక కల్లబొల్లి కేసు పెట్టి తిరిగి జైలుకి పంపారు.

బి) నల్లా భిక్షపతి చైబా జైలు నుండి ఏప్రిల్ 2012లో విడుదలయ్యాడు. వెంటనే జైలు గేటు బయటనే తిరిగి అరెస్టుచేసి మరో కల్లబొల్లి కేసుపెట్టి రెండు, మూడు రోజుల తర్వాత జైలుకి పంపారు.

సి) ప్రస్తుతం హజారీబాగ్ జైలులో ఉన్న నూనె నరసింహారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జైలు నుంచి జనవరి 2011లో విడుదలయిన వెంటనే ఒక రోజు తర్వాత తన న్యాయవాది కార్యాలయం నుంచి మళ్లీ అరెస్టు చేసి వాస్తవంగా తను జైల్లో ఉండగానే బయట జరిగిన ఒక ఘటనకి సంబంధించిన కేసుని ఆయనపై పెట్టారు. ఈ ధోరణి మొత్తంగా భారతదేశంలో చాలా విచ్చలవిడిగా మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, జార్ఖండ్‌లలో కనిపిస్తుంది.

3. విడుదల కానున్న ఖైదీలపై డిటెన్షన్ యాక్ట్‌లు, క్రైం కంట్రోల్ యాక్ట్‌లు విధించడం ద్వారా నిర్బంధాన్ని పొడిగించడం.

సుదీర్ఘకాలం ఖైదీలను జైళ్లలో ఉంచడానికి ఉపయోగిస్తున్న మరొక వంచనాపూర్వక పద్ధతి ఇది. జార్ఖండ్‌లో చాలా పెద్దఎత్తున నిరుపయోగమవుతున్న యాక్ట్ ఇది. ఎమర్జెన్సీ కాలంలో మీసా, నాసా చట్టాలను ప్రయోగించిన పార్టీతో, దానికి గురయిన పార్టీలన్నీ కుమ్మక్కయి అటువంటి చట్టాలే అయిన క్రైం కంట్రోల్ యాక్ట్‌ను జార్ఖండ్‌లో రాజకీయ ఖైదీలకి వ్యతిరేకంగా విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నారు. అలాంటి ఎన్నో సందర్భాలున్నాయి. ఇవి మచ్చుకి కొన్ని.

ఎ) సుశీల్ రాయ్ అలియాస్ వరుణ్(78 ఏళ్లు) 2005 నుంచి జైల్లో ఉన్నారు. ఆయనకి వ్యతిరేకంగా ఎన్నో కేసులు పెట్టారు. అనేక కేసుల్లో విడుదలయ్యారు. కొన్నింటిలో బెయిల్ పొందారు. అగస్టు 2010లో విడుదల కావల్సి ఉండగా ఏడాదిపాటు ఈ యాక్టు కింద నిర్బంధం పొడిగించి చివరికి ఆ కాలం ముగియబోతుండగా మరో రెండు కొత్త కేసులు పెట్టారు. తరుచూ అనారోగ్యానికి గురవుతూ వృద్ధాప్య సమస్యలతో పాటు, వెన్నెముకకి సంబంధించిన సమస్యలు, విరిగిన చెయ్యి సమస్యతో హాస్పిటల్ పాలవుతూ ఇప్పటికీ జైల్లోనే ఉన్నారు

బి) జీతన్ మారాండి విచారణ జరిపిన కోర్టు ఉరిశిక్ష విధించగా హైకోర్టు నిర్దోషిగా విడుదల చేశాక మిగతా అన్ని కేసుల్లోనూ బెయిల్ పొంది 26 ఏప్రిల్ 2012న విడుదల కావల్సి ఉండగా ఒక రోజు ముందు ఆయనపై సి.సి. యాక్టు విధించారు. ఇప్పటికే ఐదేళ్లనుండి జైల్లోనే ఉన్నాడు.

సి) అనురాధని 2009 అక్టోబరు 11న పాట్నాలో అరెస్టు చేసి నాలుగు తప్పుడు కేసుల్లో ఇరికించి హజారీబాగ్‌లో అరెస్టు అయినట్టుగా చూపించారు. హైకోర్టు నుండి మూడు కేసుల్లో బెయిల్ వచ్చి నాలుగో కేసులో 2011 సెప్టెంబర్ 25న తీర్పు చెప్పాల్సి ఉండింది. అయితే ఆమె విడుదలని అడ్డుకోడానికి మరో తప్పుడు కేసు ఆమెపై బనాయించారు. తర్వాత ఏడాది పాటు నిర్బంధాన్ని పొడిగిస్తూ సి.సి. యాక్ట్ విధించారు.

డి) తాజా సంఘటనలో ప్రస్తుతం హజారీబాగ్ జైల్లో ఉన్న సునీల్ గంజుపై సి.సి యాక్టు విధించారు. 2004 నుండి ఈయన విచారణలో ఉన్న ఖైదీ. ఈ ఎనిమిదేళ్ల నాలుగు నెలల కాలంలో ఆయనపై ఉన్న 33 కేసుల్లోని చాలా కేసుల్లో నిర్దోషిగా విడుదలయి, మిగతా వాటిల్లో బెయిల్ పొందాడు. నెల రెండు నెలల్లో రెండు పెండింగ్ కేసుల్లో విడుదలవుతాడు అనుకుంటుండగా 2012 జూన్ 19న సి.సి. యాక్టు కింద ఏడాదిపాటు నిర్బంధాన్ని పొడిగించారు.

ఈ జాబితా సమగ్రమైనదేం కాదు. ఇవి కొన్ని ఉదాహణలు మాత్రమే. (తాజా కలం చయిబాసాలోని నల్లా భిక్షపతిపై కూడా సి.సి. యాక్ట్ పెట్టారు)

4. సెక్యూరిటీ, అడ్మినిస్ట్రేటివ్ కారణాల నెపంతో విచారణలో ఉన్న ఖైదీలను కోర్టులకు దూరంగా ఉన్న జిల్లాలలో పడేసి ఉంచడం, వాళ్లని కోర్టులలో హాజరుపరచకుండా చట్టవ్యతిరేకంగా వారి నిర్బంధ కాలాన్ని పొడిగించడం.

జార్ఖండ్ పోలీసులు, జైలు అధికారులు కలిపి విచారణ లేకుండా నిర్బంధాన్ని పొడిగించే మరో కొత్త విధానం కనుగొన్నారు. సెక్యూరిటీ కారణాలు లేక అడ్మినిస్ట్రేటివ్ కారణాలు చూపి వాళ్లని తమ కేసులున్న చోటు నుంచి దూరంగా ఉండే కేంద్ర కారాగారాలకి బదిలీ చేసేస్తున్నారు. ఆ రకంగా వాళ్లకి తమ కేసులలో విచారణకు హాజరయ్యే అవకాశం లేకుండా చేయడం, అలా దూరంగా ఉన్న ఇతర జైళ్లలో ఉంచిన సందర్భాలలో కనీసం వాళ్లకి తమ తమ కోర్టుకు హాజరు కావల్సిన తేదీలలో హాజరుపరిచేలా చూడడం లేదా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానైనా హాజరు పరచడం చేయాలి. కాని ఈ పద్ధతిలో విచారణ జరిగే సందర్భాలలో తమ తమ న్యాయవాదులను సంప్రదించే అవకాశాన్ని ఉపయోగించుకోలేని ఒక అనుకూలత ఉంటుంది. ఇవేవి జరగకుండా ఏళ్లకి ఏళ్లు విచారణ లేకుండా ముద్దాయిలు జైళ్లలో మగ్గుతున్నారు. కింద ఉటంకించినవి కొన్ని ఉదాహరణలు.

2012 జనవరిలో ఐదుగురు ఖైదీలు రాహుల్ ముండా, సుభాష్ గంజు, అమ్రిత్ హస్దా, బీర్సా, హస్‌పూర్తిలను సెక్యూరిటీ కారణాలు చూపి చాయిబాసా జైలు నుంచి హజారీబాగ్ జైలుకి బదిలీ చేశారు. అదే సంవత్సరం కొందరిని దుమ్కా జైళ్లకి బదిలీ చేశారు. వీళ్లు దాదాపు ఐదేళ్లగా జైళ్లలో ఉన్నారు. కొందరైతే ఏడు ఏండ్ల నుండి ఉన్నారు. ఒక్కొక్కరికీ చాయిబాసాలో ఐదు, పది నుంచి పదిహేను దాక కేసులున్నాయి. అందులో కొన్ని విచారణ జరుగుతున్న కేసులు. ఈ బదిలీవల్ల విచారణకు ఆటంకం కలిగింది. వాళ్ల బదిలీ తర్వాత ఒక్కసారి కూడా కేసు విచారణ తేదీల్లో హాజరుపరచలేదు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కూడా హాజరు పరచడం లేదు.

వీరంతా పేద ఆదివాసీ, దళిత కుటుంబాలకు చెందినవారు. బదిలీ అయిననాటి నుంచీ కుటుంబ సభ్యులెవరు దురాచారాలకి వెరచి వాళ్లని కలవడానికి రాలేకపోతున్నారు. ఇంకా ఎందరిదో ఇదే పరిస్థితి. ఉదాహరణకి లాల్‌మునీ ప్రజాపతిని గరహా నుంచి, ఉదయ్ మహతోను తేనూఘాట్ నుంచి హజారీబాగ్‌కు వాళ్లపై అక్కడ ఏ కేసులేకపోయినప్పటికి తరలించారు. అప్పటి నుంచి గిరిడీలోనూ, తేనూఘాట్‌లోనూ వాళ్ల కేసులు ముందుకు కదలడమే లేదు.

సెక్యూరిటీ కారణం ఒక నెపం మాత్రమే తప్ప అది అసలు కారణం కానేకాదు. జైళ్లలో ఉన్న మావోయిస్టు ఖైదీలను కాపలా కాయలేకపోతే మావోయిస్టులను విజయవంతంగా వెనక్కినెట్టిశామన్న వాళ్ల గొప్పల మాటేమిటి? కాబట్టి ఈ విచక్షణారహిత బదిలీల వెనుక అసలు కారణం విచారణ లేకుండా బందీల నిర్బంధాన్ని పొడిగించడమే.

5. కేసు పెట్టిన తర్వాత ఏళ్లు గడుస్తున్నా ఒక్కసారి కూడా కోర్టులో హాజరు పరచకపోవడం. కొత్త కేసులు పెట్టినప్పుడు బందీలకు ఆ విషయం తెలిస్తేనే న్యాయ సహాయం తీసుకోగలుగుతారు. హజారీబాగ్ జైలు అధికారులయితే, ఆ బందీలు పలుకుబడి కలవారో, లేక వేరే పద్ధతుల్లో వాళ్లకి ఆ కేసుల సమాచారం తెలిసి ఉండడమో లేక ఆయా కోర్టులకి వెళ్లే సమయం వచ్చాకనో తప్ప వెంటనే తెలుపరు. ఈ పద్ధతి వల్ల పిటిషనర్లకు, ముఖ్యంగా ఇతర జిల్లాలలో తమపై పెట్టే కొత్త కేసుల గురించి తెలిసే అవకాశం లేక న్యాయ సహాయం తీసుకోలేక పోతున్నారు. ఇది ఖైదీల హక్కులను ఉల్లంఘించడమే. ఈ సమస్యకున్న మరో కోణం కోర్టులో హాజరుపరచనంతకాలం ఈ రిమాండుకాలం లెక్కలోకి రానేరాదు. కొన్ని కేసులలో నాలుగు, ఐదు ఏండ్ల సమయం ఇలా గడిచిపోయింది.

ఉదాహరణకు ఇదే జైల్లో ఉన్న బాగీరథ్ మహతోను 2007 నుండి ఛతరాలో ఉన్న కేసులలో వేటిలోనూ కోర్టుకు తీసుకుపోలేదు. వారంట్లు

అణువులనేవి ఉన్నాయా?

ఆదిమ యుగం నుంచి అణు విజ్ఞాన దశకు చేరిన మనిషి సృజనాత్మకతనూ, సాధించిన విజయాలనూ వివరిస్తున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

అణు రియాక్టర్లూ, వాటి ఉపయోగాలూ, ప్రయోగాలూ, ప్రమాదాలూ అన్నీ వాస్తవంగా ఉన్నవేకాని అణువుల గురించి మాత్రం ఇప్పటికీ నమ్మలేనివారు కనిపిస్తారు. అణువులు మనకు కనబడనంత చిన్నవి. అందువల్ల అణువుల గురించినది కేవలం ఒక ప్రతిపాదన, లేక ఒక సిద్ధాంతమేనా? అవి నిజంగా ఉన్నాయా అనే అనుమానం కలగడం సహజమే. ఎందుకంటే ఎవరికైనా అణువులను కళ్లారా చూసే అవకాశం కలగడం అరుదే.

చూడడమంటే ఏమిటి? దేన్నైనా మనం చూడాలంటే దానికి కాంతికణాలు తగిలి మన కళ్లకు కనబడాలన్నమాట. అయితే మనం చూడగలిగిన కాంతితరంగాల నిడివికన్నా అణువుల పరిమాణం కొన్ని వేలరెట్లు చిన్నది. వాటిని పోలే ఎక్స్ కిరణాలవంటివి మనకళ్లకు కనబడవు. మామూలు మైక్రోస్కోప్ మనకు పెద్దకణాలను మాత్రమే కనబడేస్థాయిలో చూపగలదు. ఎక్స్‌రేలతో మామూలు మైక్రోస్కోప్ తయారు చెయ్యలేముగాని ఆధునిక టనెలింగ్‌ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ వంటివి ఒకే ఒక్క అణువును కూడా చిత్రీకరిస్తున్నాయి. ఎటొచ్చీ మనకు అప్పుడప్పుడూ సహజంగా రూపొందిన కొన్ని స్ఫటికాలు కనిపిస్తాయి. వీటికి అద్భుతమైన సౌష్టవ ఆకారాలూ, నిర్దుష్టమైన స్వరూపాలూ ఉంటాయి. ఇవి తయారయేందుకు అణువులుగా పేర్కొంటున్న ఒకేరకమైన స్థూలకణాలు ఉపయోగపడ్డాయనే ప్రతిపాదన సమంజసంగా అనిపిస్తుంది.

అలాగే నీటిలో పడ్డ నూనెచుక్కలను చూసినప్పుడు అవి ఒక ఖచ్చితమైన పరిధికి వ్యాపించి తేలుతున్న పద్ధతి అణువుల ఉనికిని సూచిస్తుంది. నూనెపొర అంతకన్నా పలచనయితే చుక్కలుగా వేరుపడిపోతుంది. నూనెపొర పూర్తిగా పరుచుకున్నప్పుడు ఒక్కొక్క అణువు మందాన వ్యాపిస్తుందని అనుకోవచ్చు.


ఇంట్లో తయారుచెయ్యగలిగిన ఉప్పు స్ఫటికం

పంతొమ్మిదోశతాబ్దం మొదట్లో డాల్టన్ రసాయనప్రక్రియల్లో మరో విషయం కనిపెట్టాడు. నీరు రూపొంద డానికి సరిగ్గా ఎనిమిది (లేదా పదహారు) గ్రాముల ఆక్సిజన్ ఒక (లేదా రెండు) గ్రాము హైడ్రోజన్‌తో కలుస్తుంది. ఏది ఏమాత్రం ఎక్కువగాఉన్నా మిగులు ఉండితీరుతుంది. ఒకవేళ అంతకన్నా తక్కువ ఆక్సిజన్ ఖర్చవుతే దాన్నిబట్టి హైడ్రొజన్ అదే నిష్పత్తిలో మిగులుతుంది. ఇలా రసాయనిక పదార్థాలు ప్రతిసారీ సరైన నిష్పత్తిలోనే కలవడానికి అణువులున్నాయనే


వచ్చి ఐదు ఏళ్లు గడిచిపోయాయి. హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కింది కోర్టులు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రిమాండ్ చూపడాన్ని అంగీకరించడం లేదు. అలాగని అటు నేరుగా కోర్టులో హాజరు పరిచేందుకు ఎస్కార్టునీ ఇవ్వడంలేదు. ఫలితం భాగీరథ్ మహతో లాంటి ఎందరో ఖైదీలు ఐదేళ్లు గడిచినా బెయిల్ దాఖలు చేసుకోలేకపోతున్నారు. విచారణలో ఉన్న ఖైదీలను సుదీర్ఘకాలం జైళ్లలో ఉంచడానికి అవలం బిస్తున్న సాధారణ పద్ధతులను మాత్రమే ఇక్కడ పేర్కొన్నాం. సమగ్రమైన అన్ని పద్ధతులను ఇక్కడ పేర్కొనలేదు. మొత్తం ఖైదీల సంఖ్యలో 70 శాతం విచారణలో ఉన్న ఖైదీలే కావడం భారతదేశానికున్న ఒక విచిత్ర రికార్డు. పైన పేర్కొన్న కారణాలే ఆ విచిత్ర పరిస్థితికి కారణం.

ఖైదీల ప్రాథమిక హక్కులని ఇలా హరించవేయడాన్ని నిరసిస్తూ 26 జూన్ నుండి 'నిరసనవారాన్ని' పాటిస్తున్నాం. ఈ నిరసనవారంలో 26 జూన్‌న సాముహికంగా నిరాహారదీక్ష చేపట్టి 27 నుండి జులై 2 వరకూ బ్యాచీల వారిగా రిలే నిరాహార దీక్షలు జరుపుతున్నాం.

మా డిమాండ్లు

1. విడుదలైన వెంటనే జైలు గేటు బయట, లేక అన్యత్రా తిరిగి అరెస్టు చేయడాన్ని నిలిపివేయాలి.
2. ఖైదీలపై, ప్రత్యేకంగా రాజకీయ ఖైదీలపై సి.సి. యాక్టును ప్రయోగించడం నిలిపివేయాలి.
3. విచారణలో ఉన్న ఖైదీలను దూర దూర జైళ్లకి బదిలీ చేసి, తద్వారా వాళ్ల విచారణను అడ్డుకోవడం నిలిపివేయాలి.
4. అరెస్టు అయిన మూడు నెలలలోపు పెండింగ్ ఉన్న కేసులన్నిటినీ పెట్టేయాలి.
5. కొత్త కేసులకి వారంట్లు వచ్చిన వెంటనే వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కానీ, ఎస్కార్ట్ ఇచ్చి పంపడం ద్వారా కానీ ఖైదీలను కోర్టులో హాజరు పరిచేలా చూడాలి.
6. ఇతర జిల్లాలలో ఉండే కేసులలో ఎస్కార్ట్ ఇచ్చి ఖైదీలను క్రమం తప్పకుండా తమ విచారణకు హాజరయ్యేలా చూడాలి.

మా జీవించే హక్కు, స్వేచ్ఛకు సంబంధించిన అత్యంత సముచితమైన ఈ డిమాండ్లను జార్ఖండ్ పోలీసులు, జైలు అధికారులు అమలు చేసేలా చూడాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఉన్నత న్యాయస్థానాలకు విన్నవిస్తున్నాం. వీ



ఎక్స్‌రేల వివర్తన (డిఫ్రాక్షన్)

ప్రతిపాదనతప్ప మరొక వివరణ పనిచెయ్యదు. అలాగే పదార్థాల కలయికనూ, తయారు కాలేని పదార్థాలనూ పరిశీలించినప్పుడు మూల కాలని గుర్తించడం తప్పనిసరి అయింది. కొన్ని మూలకాల అణువులు ఒకటికన్నా ఎక్కువ సంఖ్యలో జతకట్టి బృహదణువులుగా రూపొందు తాయని నైట్రొజన్ వంటి పదార్థాల విషయంలో రుజువయింది.

సన్నని ధూళివంటి బృహదణువులు నీటివంటి ద్రవాలలో నిత్యమూ అలజడికి లోనవుతూ ఉంటాయని పంతొమ్మిదోశతాబ్దం ప్రారంభంలో పరిశీలకులు గుర్తించారు. ఇది గమనించాలంటే చాక్ సుద్దముక్క పొడిని నీటిలో వెయ్యవచ్చు. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో అయిన్‌స్టయిన్ దీనికి సిద్ధాంతపరమైన వివరణనిచ్చాడు. పదార్థాల సూక్ష్మ కణాలు అనియతమైన పద్ధతిలో కదులుతాయని దీనివల్ల రుజువయింది. నిజానికి ఇందులో బృహదణువులు ప్రత్యక్షంగా కనబడవుగాని అవి తమకన్నా పెద్దకణాలను ఢీకొట్టి, వాటిని కదిలించడం కనిపిస్తుంది. బృహదణువులు అన్నీ తమ ఉష్ణోగ్రతనుబట్టి ఉన్న స్థానంలోనే ఎక్కువగానో, తక్కువగానో కంపిస్తూ ఉంటాయని కైనెటిక్ గతిశాస్త్రం నిర్ధారించింది. వాయువుల్లో ఇవి కదిలే స్వేచ్ఛ అన్నిటికన్నా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ కంటికి కనబడనంత సూక్ష్మమైన కణాల గురించిన ప్రతిపాదనలే. మనకెన్నడూ కనబడని మన తల వెనకభాగం గురించి నమ్మినట్టే అణువుల సిద్ధాంతం సరైనదని నమ్ముతాం.

పంతొమ్మిదోశతాబ్దం అంతమయేనాటికి ఎక్స్‌రేల గురించీ, రేడియోధార్మిక పదార్థాల గురించీ తెలిశాక అణువుల గురించిన ఊహలు సరైనవిగా శాస్త్రవేత్తలు రూఢిచేసుకున్నారు. గైగర్ కౌంటర్‌వంటి శోధక పరికరం రేడియోధార్మికతను గుర్తించి కణాన్ని పసిగట్టగానే క్లిక్‌మని చప్పుడు వినిపిస్తుంది. కొన్ని శోధకపరికరాల్లో అణువులకన్నాకూడా చిన్నరేణువులు ప్రయాణించిన జాడ కనిపిస్తుంది. స్ఫటికాలమీద పడే ఎక్స్‌రేలు వివర్తన (డిఫ్రాక్షన్) చెందడం చూస్తే స్ఫటికంలోని చిన్నచిన్న అణువులన్నీ వరసలుగా పేర్చి ఉంటాయని తెలుస్తుంది. ఆ ఎక్స్‌రేల విశ్లేషణ ద్వారా అణువుల మధ్యనున్న ఎడం గురించి కూడా అర్థమవుతుంది. రేడియోధార్మిక పదార్థాలనుంచి ప్రసారమయే ఏ కణాన్ని గురించైనా అర్థంచేసుకోవాలంటే అణువుల గురించి ప్రతిపాదించక తప్పదు.

ఈరోజుల్లో మాటవరసకైనా అణుసిద్ధాంతం పొరబాటనుకుని ఆలోచించడం మొదలుపెడితే గందరగోళం తప్పదు. నీటివంటి పదార్థంలో నీటి అణువులు లేవనుకుంటే? నీటినో, బొగ్గునో అంతకంతకూ చిన్న భాగాలుగా విడగొడుతూపోతే ఏం మిగులుతుంది? బొగ్గు అనే మూలపదార్థం అణువులతో కూడుకున్నదైతే చివరికి విభజించలేనటువంటి అతిచిన్న బొగ్గుకణం మిగులుతుంది. అదే బొగ్గు అణువు. ఆపై దాన్ని విడగొట్ట ప్రయత్నిస్తే దానికి బొగ్గు లక్షణాలేవీ మిగలవు. ఈ రకమైన విశ్లేషణ చేసినప్పుడు అణుప్రాతిపదిక సరైనదేనని తెలుస్తుంది.

ఆదిమయుగంలో మేధోపరిణతిని సాధిస్తున్న తరుణంలో మనుషులు తమ పరిసరాలనూ, ప్రకృతినీ గమనించడం, అవగాహన చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రాచీనకాలంలో మనవాళ్లూ, గ్రీక్ తత్వవేత్తలూ అణువుల గురించి ఊహించుకోవడం అందువల్లనే జరిగింది. ఇదే వారి ప్రగతికి దోహదం చేసింది. సమాజజీవితం మొదలయ్యాక క్రమంగా రోజువారీ వ్యవహారాలకు సంబంధించని ప్రకృతి పరిశీలనమీద మనుషులకు ఆసక్తి తగ్గడం, ఒకవేళ జిజ్ఞాస ఉన్నప్పటికీ తగినంత వ్యవధి లేకపోవడం మొదలైన మార్పులు కలిగాయి. ఇవికాక మనుషుల ఆలోచనా పరిధిని బుద్ధిపూర్వకంగా పరిమితం చేసి, వారిని మానసికంగా ఎదగనివ్వకుండా చూసే పీడకశక్తులుకూడా సమాజంలో తలెత్తాయి. ఈ పోకడను ఎదిరించవలసిన అవసరం నేటికీ చాలా ఉంది.

ఆధునిక అణువిజ్ఞానం అంతులేని సమాచారం సేకరిస్తున్న ఈ రోజుల్లో వైజ్ఞానికఅవగాహన విస్తృతం అయినకొద్దీ మనుషుల దృక్పథం మెరుగుపడి, విశాలతరం అవుతుంది. సూక్ష్మ ప్రపంచం గురించిన ఈ అవగాహనతోబాటు అతివిశాలమైన విశ్వం గురించి తెలిపే రోదసీశాస్త్రం మాటకొస్తే భూమిని దాటి ఇతర గ్రహాలనూ, నక్షత్రాలనూ గురించిన వివరాలను అర్థం చేసుకోవడం వగైరాలవల్ల ప్రత్యక్షలాభాలేవీ కలగకపోయినా విశ్వంలో బుద్ధిజీవులుగా మానవజాతి ఉనికి గురించిన వివేచన పెరుగుతుంది. మన సౌరవ్యవస్థను పరిశీలిస్తున్న రోదసీనౌకలు అనేక గ్రహాలను సమీపించి ఫొటోలనూ, నైసర్గికవివరాలనూ మనకు అందజేస్తున్నాయి. అణువిజ్ఞానం వల్ల విద్యుత్తు తయారీతోబాటు ప్రకృతి రహస్యాలెన్నో తెలుసుకోవడం వీలవుతోంది.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త) వీ

వీక్షణం కృషిలో అందరమూ భాగమవుదాం!

(వీక్షణంకు పది సంవత్సరాలు నిండే సందర్భంగా జనవరి 2013 ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం జూలై 8న ఏర్పాటయిన రచయితల, అభిమానుల సమావేశంలో సంపాదకుడి ప్రసంగపాఠం)

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంటున్న సందర్భంలో ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం జరుగుతున్న ఈ సమావేశంలో పాల్గొంటున్న మీ అందరికీ హృదయపూర్వక స్వాగతం. డిసెంబర్ 2012 సంచికతో వీక్షణంకు పది సంవత్సరాలు నిండుతాయి. రెండో దశాబ్ది లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా జనవరి 2013 సంచికను చిరకాలం దాచుకోదగిన ప్రత్యేక సంచికగా తీసుకురావాలని నిర్వాహకుల తరఫున, సంపాదకవర్గం తరఫున మేం భావిస్తున్నాం. అయితే ఆ ప్రత్యేక సంచిక విశిష్టంగా రూపుదిద్దుకోవాలంటే మా ఆలోచనలు మాత్రమే సరిపోవని, మీవంటి పాఠకులు, రచయితలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఇచ్చే ప్రతిపాదనలను, సలహాలను, సూచనలను కూడ ఆహ్వానించాలని ఈ సమావేశం ఏర్పాటు చేశాం.

ఇది 2013 జనవరి ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం ఏర్పాటయిన సమావేశమే అయినప్పటికీ, ఈ సందర్భంగా మీతో వీక్షణం పది సంవత్సరాల ప్రయాణం గురించి, నిర్వాహకుల సాధకబాధకాల గురించి కూడ పంచుకోదలిచాం.

చరిత్ర

పది సంవత్సరాలకు ముందు, నూతన ఆర్థిక విధానాల గురించీ, ప్రపంచీకరణ గురించీ, విజన్ 2020 గురించీ తెలుగు పత్రికలలో విస్తృతంగా వార్తలు, వ్యాఖ్యలు, విశ్లేషణలు వెలువడుతుండిన సందర్భంలో పూర్తిగా ఈ రాజకీయార్థిక విషయాలకే పరిమితమైన ఒక తెలుగు పత్రిక ఉంటే బాగుండునని వి. హనుమంతరావు గారు, నేను అనుకుంటూ ఉండేవాళ్లం. ఆయన అంతకుముందు కొంతకాలం నడిపిన డాటా ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్ ఇయర్ బుక్, డాటా న్యూస్ ఫీచర్స్ తరఫున విరివిగా రాస్తున్న వ్యాసాలు ఈ పత్రిక ఆలోచనకు పునాది. అప్పటికి నేను ఎకనమిక్ టైమ్స్ పత్రికలో పనిచేస్తుండడం వల్ల, ప్రపంచీకరణ మీద రాస్తుండడం వల్ల, 1999లో 'అమ్మకానికి ఆంధ్రప్రదేశ్' పుస్తకం ప్రచురించినందువల్ల ఈ పత్రికలో ఆయన నా సహకారం కోరారు. ఆ ఆలోచన ఆ తర్వాత మూడు నాలుగేళ్లకు గాని ఆచరణరూపం ధరించలేదు. నేను ఎకనమిక్ టైమ్స్ ఉద్యోగం వదిలి, నిరుద్యోగంలో ఉన్న 2002లో హనుమంతరావు గారు ఈ పత్రిక గురించి మరింత ఒత్తిడి చేశారు. అప్పుడే ప్రజాపక్ష సమీక్ష పేరుతో ఎబికె ప్రసాద్ గౌరవ సంపాదకులుగా, వి.హనుమంతరావు, విద్యాభూషణ్, ఎన్.వేణుగోపాల్, డి.పాపారావు సంపాదకులుగా ఒక నమూనా సంచిక తీసుకువచ్చాం. తీరా పత్రిక కార్యరూపం ధరించే సమయానికి 2003లో నాకు మళ్లీ ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో ఉద్యోగం వచ్చి, నేను తెరవెనుక సహాయం మాత్రమే చేయగలిగాను. పత్రిక బాధ్యత పూర్తిగా హనుమంతరావు గారే తీసుకోవలసి వచ్చింది. ప్రజాపక్ష సమీక్ష పక్షపత్రికగా 2003 జనవరి 1న మొదటి సంచిక ఎబికె ప్రసాద్ గౌరవ సంపాదకులు, వి హనుమంతరావు సంపాదకులుగా వెలువడింది. ఎబికె ప్రసాద్ అధికారభాషా సంఘం అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత, అక్టోబర్ 2007 సంచిక నుంచి గౌరవ సంపాదకత్వం వదులుకున్నారు. ఈలోగా నేను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వదిలి, వీక్షణం జనవరి 2005 సంచిక నుంచి వర్కింగ్ ఎడిటర్ గా పనిచేయడం మొదలుపెట్టాను. వయోభారం వల్ల తాను సంపాదక బాధ్యతలు నిర్వహించలేక పోతున్నానని, హనుమంతరావు గారు 2008 మార్చ్ సంచిక నుంచి నాకు బాధ్యతలు అప్పగించి, 2011 అక్టోబర్ సంచిక వరకు గౌరవ సంపాదకులుగా ఉన్నారు.

ఈ పది సంవత్సరాల ప్రయాణంలో ప్రశాంత్, ఎం విద్యాభూషణ్, ఇప్ప వీరారెడ్డి, కొణతం దిలీప్ వేరువేరు సమయాలలో ఉపసంపాదకులుగా పనిచేయగా, ప్రస్తుతం డి.వి. రామకృష్ణారావు, యాటెల్లి రామచంద్రం వీక్షణం సహాయ, ఉప సంపాదకులుగాను, ఇతర బాధ్యతలలోను పనిచేస్తున్నారు. సి. రాజశేఖర్, ఎస్. వెంకటేష్, ఎ. మల్లేశ్ సాంకేతిక సహాయం అందిస్తున్నారు.

పత్రికకు సలహా మండలిగా వేరువేరు కాలాలలో ఆర్.వి.ఆర్. చంద్రశేఖర రావు, వకుళాభరణం రామకృష్ణ, పి. నారాయణరెడ్డి, డి. పాపారావు, బి సాంబశివరాజు, చక్రధరరావు, కాత్యాయని, ఇప్ప వీరారెడ్డి, ఎన్ వేణుగోపాల్ పనిచేశారు.

సాధించిన విజయాలు, ప్రత్యేకతలు

ఈ పది సంవత్సరాల ప్రయాణంలో వీక్షణం నిస్సందేహమైన విజయాలు కొన్ని సాధించింది. తెలుగు పత్రికారంగ చరిత్రలో, ప్రత్యేకించి ప్రగతిశీల, ప్రత్యామ్నాయ రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికల చరిత్రలో ఇది విశిష్టమైన పత్రికగా రూపొందింది. అపారమైన పాఠకాభిమానాన్ని చూరగొంది. మొదటి సంచిక పక్షపత్రికగా 24 పేజీలతో, 800 కాపీలతో వెలువడగా, ప్రస్తుతం మాసపత్రికగా ప్రతినెలా 68 పేజీలతో, అత్యధికంగా 6,000 కాపీలతో వెలువడుతోంది. అచ్చయిన ప్రతికాపీకి సగటున ఆరుగురు పాఠకులు ఉంటారనే మామూలు పత్రికారంగపు లెక్క ప్రకారం వీక్షణం పాఠకుల సంఖ్య దాదాపు ముప్పైవేలు కావచ్చు. మాసపత్రికగా మారిన ఎనిమిది సంవత్సరాలలో ఒక్క సంచిక కూడ ఆగిపోకుండా, ప్రతినెలా 29/30 తేదీల్లో పోస్ట్ అవుతూ వస్తోంది.

ఈ పది సంవత్సరాలలో వీక్షణం 132 సంచికలలో 2060 వ్యాసాలు వెలువరించింది. ఈ వ్యాసాలను దాదాపు వెయ్యి మంది రచయితలు రాసి ఉంటారు. వీక్షణం రచయితల జాబితాలో లేనివారు తెలుగు వ్యాస రచయితలలో అతి కొద్ది మంది మాత్రమే. కనీసం మూడు వందల మంది రచయితలు వీక్షణం ద్వారానే మొదటిసారి అచ్చయ్యారు. వారిలో కనీసం ఇరవై మంది అయినా ఆతర్వాత ప్రముఖ రచయితలుగా మారి ఇతర పత్రికలలో రాస్తున్నారు. వీక్షణంలో అత్యధికంగా అచ్చయిన వ్యాసాలలో ప్రపంచీకరణ, రాజకీయార్థిక, సామాజిక అంశాలు, హిందూ మతోన్మాదం, ప్రజా ఉద్యమాలు, అంతర్జాతీయ అంశాల అనువాదాలు వంటివి ఉన్నాయి. వీక్షణంకు మాత్రమే ప్రత్యేకమైన అంశాలలో అసహజ మరణాల సూచి, నేర్చుకుందాం శీర్షిక, ఆంధ్రప్రదేశ్ లో రెవెన్యూ పాలన, గ్రామాల అధ్యయనం, పుల్లాపుడకా వంటివి ఉన్నాయి. ఆగస్ట్ 2006 సంచికలో మొదలై డెబ్బై నెలలుగా నిరాటంకంగా వెలువడుతున్న శీర్షిక అసహజ మరణాల సూచి మన సమాజంలో అసహజ మరణాలకు గురవుతున్న వారి సంఖ్య ప్రకటించడం మాత్రమే కాదు, సమాజపు అనారోగ్యానికి సూచికగా, హెచ్చరికగా ఉన్నది. అలాగే దేశదేశాల ప్రజాఉద్యమాల, ఉద్యమ దృక్పథాల సారం రంగరించుకున్న వ్యాసాలను అనువదించి నేర్చుకుందాం శీర్షిక కింద దాదాపు ఇరవై వ్యాసాలు వేశాం. ఆ వ్యాసాలు ఇప్పటికీ చర్చల్లో ప్రస్తావనకు వస్తున్నాయి. అలాగే కేవలం పాఠకురాలిగా, అభిమానిగా ఒక రచయితల సమావేశానికి హాజరయి, వీక్షణం ప్రేరణతో రచయితగా మారిన ప్రభుత్వాధికారి సరళా వందనం గారు ఆంధ్రప్రదేశ్ లో రెవెన్యూ పాలన చరిత్రను వీక్షణంలో సీరియల్ గా రాస్తున్నారు. త్వరలో వెలువడనున్న ఆ పుస్తకం తెలుగులో ఆ విషయం మీద తొలి పుస్తకం అవుతుంది. అలాగే గ్రామాల అధ్యయనం గురించి ప్రస్తుతం వీక్షణంలో నడుస్తున్న సీరియల్ త్వరలో పుస్తకంగా వెలువడనున్నది. అది కూడ ఆ విషయం మీద తెలుగులో తొలి పుస్తకం.

వీక్షణంకు ఉన్న పరిమిత వనరులతో వచ్చిన వ్యాసాలు ప్రచురించడం, లేదా ప్రత్యేక అంశాల మీద రచయితలను కోరి రాయించుకొని ప్రచురించడం మినహా, ఇతర ప్రాంతాలకు వెళ్లి రిపోర్టింగ్ చేయడం సాధ్యంకాదు. అయినా వీక్షణం ఆయా అంశాల ప్రాధాన్యతను బట్టి ఆ బాధ్యత కూడ తీసుకుంది. మొదట హైదరాబాద్ లో ధర్నాచౌక్ కు వెళ్లి నిరసనకారులను కలిసి వారి సమస్యల గురించి రాసే కాలమ్ ప్రారంభించింది. ఆ శీర్షికకు చాల ఆదరణ లభించినప్పటికీ మా వనరుల కొరత వల్ల కొనసాగించలేకపోయాం. అలాగే సోంపేట, కాకరాపల్లి ప్రజాందోళనల మీద, కాల్పుల సందర్భంలో ప్రత్యేకంగా వీక్షణం కార్యాలయం నుంచి వెళ్లి స్థానిక ప్రజలను కలిసి వార్తావ్యాసాలు రాయడం జరిగింది. ప్రస్తుతం లక్షింపేట హత్యాకాండ విషయంలో కూడ సంపాదకవర్గ బృందం అక్కడికి వెళ్తోంది.

వీక్షణం సొంత చొరవతో ప్రారంభించిన వ్యాసరచన తరగతి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రధానంగా వ్యాసప్రక్రియలో పనిచేస్తున్న వీక్షణం మరింతమంది వ్యాసరచయితలను తయారుచేసే, ప్రస్తుతం రాస్తున్న వ్యాసరచయితల నైపుణ్యానికి మెరుగుపెట్టే కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన అధ్యయన తరగతిని ప్రారంభించింది. గత రెండు సంవత్సరాలలో వీక్షణం కార్యాలయంలో కనీసం అరడజను సార్లు జరిగిన ఈ తరగతి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సహాయంతో తెలుగులో వ్యాసప్రక్రియ చరిత్రను, వ్యాసప్రక్రియ లక్షణాలను, వ్యాసరచనలో దొర్లే పొరపాట్లను, అవలంబించవలసిన మెళకువలను చర్చిస్తుంది. ఈ తరగతిని రాష్ట్రవ్యాప్తంగా వీలయినన్నిచోట్ల నిర్వహించాలని మాకోరిక. అలాగే కార్ల్ మార్క్స్ కాపిటల్ అధ్యయనానికి కూడ తరగతులు నిర్వహించాలని వీక్షణం ఆలోచిస్తున్నది.

మారుతున్న వ్యవసాయ సంబంధాలు అనే అంశం మీద ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం 2011 జూలైలో ఒక సదస్సు నిర్వహించదలచినప్పుడు ఆ సదస్సులో

పత్రం సమర్పించమని ఆర్ ఎస్ రావు గారిని కోరారు. ఆయన తన పత్రంతో పాటుగా వీక్షణం బృందం కూడ ఒక పత్రం సమర్పించాలని సూచించారు. ఆ ప్రయత్నంలో భాగంగా వీక్షణం బృందం కరీంనగర్ జిల్లా గౌరవెల్లి, మాణిక్యాపూర్ గ్రామాలలో అధ్యయనం సాగించింది. గతంలో 1980-81లో ఆ గ్రామాలను అధ్యయనం చేసి వెలువడిన 'దున్నేవానికే భూమి దక్కనిదే రైతాంగానికి విముక్తి లేదు' (క్రాంతి ప్రచురణలు, 1982) అనే పుస్తకాన్ని ప్రాతిపదికగా పెట్టుకుని, ఆ తర్వాత సరిగ్గా ముప్పై ఏళ్లకు ఆ గ్రామాలలో ఏం జరిగిందో అధ్యయనం చేసి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ సదస్సులో పత్రం సమర్పించడం జరిగింది.

హైదరాబాద్ కు చాలమంది జాతీయ, అంతర్జాతీయ ప్రజాపక్ష ప్రముఖులు, మేధావులు వస్తుంటారు గనుక వారితో వీక్షణం పాఠకుల, అభిమానుల ఇష్టాగోష్ఠి సమావేశాలు ఏర్పాటు చేయడం కూడ వీక్షణం చేస్తోంది. ఆ సమావేశ సారాంశాన్ని నేరుగా వ్యాస రూపంలోనో, మరొక రూపంలోనో పాఠకులతో పంచుకుంటోంది.

ఈ నిరంతరాయమైన, నిబద్ధమైన కృషి వల్లనే వీక్షణం పత్రిక విస్తృతమైన పాఠకాభిమానాన్ని చూరగొనగలిగింది. ప్రతినెలా ఒకటో తేదీ నుంచే ఇంకా పత్రిక రాలేదేమిటి, వెబ్ సైట్ లో కొత్త సంచిక పెట్టలేదేమిటి అని వచ్చే ఫోన్ కాల్స్ పత్రిక కోసం పాఠకులు ఎంతగా ఎదురుచూస్తున్నారో తెలియజేసి మా బాధ్యతను గుర్తు చేస్తుంటాయి.

ఎంతో మంది రచయితలు తమ రచన వీక్షణంలో రావాలని కోరుకోవడం మాకు మా పని సక్రమంగానే చేస్తున్నామనే విశ్వాసాన్నిస్తుంది. అమరులు ఆర్ఎస్ రావుగారు తాను రాసిన ఏ రచనయినా వీక్షణంలోనే రావాలని కోరుకునేవారు. కన్నబిరాన్ గారు వీక్షణంలో వెయ్యి అని రచనలు పంపేవారు. జి హరగోపాల్, డి నరసింహారెడ్డి, వరవరరావు, కె ఆర్ చౌదరి, ముదునూరి భారతి వంటి ప్రజాపక్ష మేధావులు తమ రచనలను అడగకుండానే వీక్షణంకు పంపుతున్నారు. రాష్ట్రంలోనూ, మధ్యభారత అరణ్యాలలోనూ ప్రజాఉద్యమ నిర్మాణంలో తలమునకలుగా ఉన్న మిత్రులు తమ కృషి గురించి వీక్షణంలో రావాలని కోరుకుంటున్నారు. వీక్షణంకు విరివిగా రచనలు పంపుతున్నారు.

ఏడాదికి ఒకసారయినా తన రచయితలను, అభిమానులను, పాఠకులను ఒకచోట సమావేశపరచి పత్రిక బాగోగుల గురించి వారితో చర్చించాలని, వారి సలహాలు సూచనలు తీసుకోవాలని వీక్షణం ఆరు సంవత్సరాల కింద రచయితల సమావేశం అనే అపూర్వ ప్రయత్నం ప్రారంభించింది. ఈ సమావేశాలు చాల స్ఫూర్తిదాయకంగా సాగుతున్నాయి. ఇవాళ్టి సమావేశం కూడ ఆ వరుసలో భాగమే.

ఇతర ప్రజా ఉద్యమాల కోసం వక్తగా నేను రాష్ట్రమంతా తిరుగుతున్నప్పుడు గత ఏడెనిమిది సంవత్సరాలుగా వీక్షణం సంపాదకుడిగా నాపట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ, వీక్షణంను ప్రశంసించడం, వీక్షణం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వడం నాకు గర్వకారణంగా ఉంటుంది, పత్రిక నాణ్యత పట్ల నా బాధ్యతను పెంచుతుంది.

వీక్షణం పట్ల పాఠకుల, అభిమానుల, రచయితల ఆదరణకు సంబంధించిన ఇటువంటి ఉదాహరణలు డజన్లకొద్దీ చెప్పగలను గాని ఇక్కడ కొన్నయినా ప్రస్తావించాలి. ఎ. నరసింహారెడ్డి, ఎల్. సుబ్బయ్య, జి. సూరి, కె. సుబ్బనాచారి, టి. రమేశ్, డి.ఎస్.ఎన్. రాజు, ఎస్. కిశోర్ కుమార్, జి. వెంకటేశ్వర్లు, ఎల్. సంతోష వంటి అభిమానులు తాము రెగ్యులర్‌గా చదవడం మాత్రమే కాక ఇటువంటి పత్రిక కలకాలం నిలిచి ఉండాలని, మరింత ఎక్కువమంది చదవాలని కోరుకుంటున్నారు. వీరిలో ఎల్. సుబ్బయ్య గారు, సుబ్బనాచారి గారు ఎప్పుడో రిటైరైన వృద్ధులు, ఆరోగ్యం కూడ అంతంత మాత్రమే. ఇక నరసింహారెడ్డి గారు, సూరి గారు కూడ రిటైరైనవారే. కాని వీరందరూ వీక్షణం చందాలు చేర్పించడంలో కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. ఒక్కొక్కరు వంద, ఆ పైన కూడ చందాలు చేర్పించారు. వీరిలో కొందరైతే తామే ముందు చందాలు కట్టి, పత్రికను ఇతరులకు పరిచయం చేస్తున్నారు. నరసింహారెడ్డి, సుబ్బనాచారి, సూరి గార్లు అయితే వీక్షణం రచనల విషయంలో కూడ సహకరిస్తున్నారు. ముంబాయికి వలసవెళ్లిన తెలంగాణ కార్మికులు నలభై కాపీలు తెప్పించుకోవడం మాత్రమే కాక, పత్రిక చదివి, అందులోని విషయాలను చర్చించే బృందాలుగా ఏర్పడ్డారు. పత్రిక ఆర్థికస్థితి ఇబ్బందుల్లో ఉన్నదని, సహకరించమని గత సంవత్సరం ప్రకటించినప్పుడు వి. శివలింగప్రసాద్, వకుళాభరణం వంశీచరణ్, జి. ఉమామహేశ్వర్, జి. సాంబశివారెడ్డి, రమాదేవి చేలూరు వంటి మిత్రులు పెద్దఎత్తున విరాళాలు అందించారు. పత్రిక నిలబడి ఉండాలంటే ఆర్థిక వనరులు కూడ సక్రమంగా అందాలని గుర్తించిన కొందరు అభిమానులు చందాల రూపంలో, విరాళాల రూపంలో, వ్యాపారప్రకటనల రూపంలో, ఇతరంగా తమకు వీలయిన, తోచిన రూపాలలో సహకరిస్తున్నారు. ధ్వన్యనుకరణ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్, ఆయన సతీమణి నేరెళ్ల శోభావతిగార్లు తమ ఇంటిని పత్రిక కార్యాలయం కోసం తక్కువ అద్దెకు ఇచ్చి ఏడు సంవత్సరాలుగా సహకరిస్తున్నారు. ఒక ప్రభుత్వాధికారి వీక్షణం మీద అభిమానంతో గత ఏడు సంవత్సరాలుగా రచయితల సమావేశపు భోజన వ్యయం భరిస్తున్నారు. ఇలా చెపుతూపోతే వందలాది, వేలాది చేతుల సహకారంతోనే వీక్షణం పది సంవత్సరాలుగా వెల్లివిరుస్తున్నది. అటువంటి ప్రతి స్నేహహస్తానికీ అత్యంత హార్దికమైన, కృతజ్ఞతా పూర్వకమైన వందనాలు తెలుపుతున్నాం.

అపజయాలు, సాధించలేకపోయిన విషయాలు

అయితే ఎన్ని విజయాలు, విశిష్టతలు ఉన్నప్పటికీ వీక్షణం పత్రిక గాని, సంపాదకవర్గం గాని ఈ పది సంవత్సరాల ప్రయాణంలో సాధించలేకపోయిన విషయాలు, పొందిన అపజయాలు ఉన్నాయి.

సమాజంలో అత్యంత ప్రభావశీలంగా ఉన్న సినిమా, క్రీడా రంగాల గురించి, కనీసం ఆ రంగాల రాజకీయార్థిక వ్యవహారాల గురించి పత్రికలో విరివిగా వ్యాసాలు రావాలని చాలమంది కోరుతున్నారు. కాని విరివిగా కాదు గదా, కనీసంగా కూడ ఆ రంగాల మీద కేంద్రీకరించలేక పోయాం. క్రీడల మీద ఒకటి రెండు వ్యాసాలు రాగా, సినిమా మీద ఆమాత్రం కూడ లేని స్థితి ఉంది. అలాగే తెలుగులో విపరీతంగా పుస్తకాలు వస్తుండగా, వాటిలో చదవవలసిన పుస్తకాలను పరిచయం చేయడం, ప్రమాదకర పుస్తకాల గురించి హెచ్చరించడం తన బాధ్యతగా వీక్షణం పుస్తక సమీక్ష, పరిచయం శీర్షికను నడిపి ఉండవలసింది. కాని ఆ పని చేయలేకపోయాం. పుస్తక సమీక్షకుల, పరిచయకర్తల బృందాన్ని తయారు చేసుకోలేకపోయాం. అలాగే ప్రభుత్వాలు, ఆధిపత్యశక్తులు ప్రతిరోజూ ప్రజావ్యతిరేక చర్యలకు పూనుకుంటూ ఉండగా, ప్రజాశక్తులు ప్రతిక్షణం వాటిని ప్రతిఘటిస్తూ పోరాడుతూ ఉండగా ఈ దృశ్యాన్ని సమగ్రంగా పాఠకులకు అందించడంలో వీక్షణం ఇంకా ఆశించినంత పని చేయలేకపోతోంది. ప్రతిరోజూ జరిగే డజన్ల కొద్దీ ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ ఘటనలలో, పరిణామాలలో రోజుకు ఒక్కటి తీసుకుని దాని మీద వ్యాఖ్య, విశ్లేషణ అందించదలచినా వీక్షణంలో రాయవలసినవి 30 ఉంటాయి. అందుకు అవసరమైన 30 మంది రచయితలు లేకపోవడం ఒక ఎత్తయితే, ప్రతినెలా గరిష్ఠంగా 18-20 రచనలు మాత్రమే అచ్చువేయగలగడం మరొక ఎత్తు. అలా మొత్తం మీద అనేక ఘటనలు, పరిణామాలు సంపాదకవర్గం దృష్టికి వచ్చి, పాఠకులకు అందజేయాలని అనుకుని కూడ అందజేయడంలో విఫలమవుతున్నాం. ఇది సమకాలీన ఘటనల, పరిణామాల గురించి కాగా, చారిత్రక, సైద్ధాంతిక విషయాలు, విశ్లేషణా చట్రాలను అందించే దృక్పథాల పరిచయం వంటి ఒత్తిడి కూడ ఉంటోంది.

పత్రిక సాంకేతిక అంశాల విషయంలో కూడ కొన్ని నిర్వహణాలోపాలను ఇంకా అధిగమించలేకపోతున్నాం. ఉదాహరణకు ఒక్క అచ్చుతప్పు కూడ లేకుండా పత్రిక తేవాలని, వ్యాసాల నాణ్యతను మెరుగుపరచడానికి మరింత పటిష్ఠమైన ఎడిటింగ్ చేయాలని మా కోరికలు కోరికలుగానే ఉండిపోయాయి.

పత్రిక చాల చోట్లకు, చాల మంది పాఠకులకు సక్రమంగా మొదటి వారంలోనే అందుతున్నప్పటికీ, ప్రతినెలా కొన్ని చోట్ల నుంచి, కొంతమంది పాఠకుల నుంచి అందడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఫిర్యాదు రాగానే మళ్లీ ఒకసారి పత్రిక పంపుతున్నాం కాని ఇది కేవలం వీక్షణం సమస్య మాత్రమే కాదు. ప్రపంచీకరణ క్రమంలో పోస్టల్ శాఖలో క్రమక్రమంగా ఉద్యోగులు తగ్గిపోతుండడంతో ప్రస్తుతం ఏ పోస్టాఫీసులోనూ అవసరమైనంతమంది సార్టర్లు, పోస్ట్‌మెన్ ఉండడం లేదు. ఈ ఉద్యోగుల కొరత ప్రభావం మొట్టమొదట పత్రికల మీదనే పడుతుంది. పత్రికల పార్సిళ్లను సరిగ్గా సార్టింగ్ చేయకపోవడమో, డెలివరీ చేయకపోవడమో జరుగుతోంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా న్యూస్ స్టాళ్ల కోసం పెద్దమొత్తంలో కాపీలను డిస్ట్రిబ్యూటర్లకు అందజేస్తాం. వారు ఏయే ఊరికి ఎన్ని పంపుతున్నారో, తగినన్ని కాపీలు పంపుతున్నారో లేదో పర్యవేక్షించడం సాధ్యం కాదు.

ప్రత్యేక సంచిక తయారీ

పైన చెప్పిన జయాపజయాల నేపథ్యంలో వీక్షణం పది సంవత్సరాల జీవితం పూర్తి చేసుకుని రెండో దశాబ్దంలో ప్రవేశిస్తోంది. పది సంవత్సరాలు నిరాటంకంగా, ఒక్క సంచిక కూడ తప్పకుండా, తప్పనిసరిగా సమయపాలనను పాటిస్తూ పత్రిక వెలువడడం దానికదిగా ఒక విజయమే. ప్రజాసంఘాల పత్రికలు మినహా స్వతంత్ర ప్రత్యామ్నాయ పత్రికలేవీ సాధించలేకపోయిన విజయం ఇది. ఈ విజయం సాధించడానికి కారణం మీవంటి అభిమానుల ఆదరణే.

గతంలో అనేక పత్రికలు వంద సంచికలు, రెండు వందల సంచికలు లేదా పది సంవత్సరాలు, ఇరవై సంవత్సరాలు వంటి మైలురాళ్లకు చేరుకున్నప్పుడు ప్రత్యేక సంచికలు వేసిన సంప్రదాయం ఉంది. పూర్తిగా అంతకు ముందరి సంచికలలో

విలువైన సూచనలు ఇచ్చిన రచయితల సమావేశం

వీక్షణంకు పది సంవత్సరాలు నిండిన సందర్భంగా వెలువడే జనవరి 2013 ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం జూలై 8న జరిగిన వీక్షణం రచయితల, పాఠకుల, అభిమానుల సమావేశం ఆలోచనాస్ఫోరకంగా జరిగింది. దాదాపు అరవై మంది రచయితలు, పాఠకులు, అభిమానులు పాల్గొన్న ఈ సమావేశానికి హైదరాబాదు నుంచి మాత్రమే కాక, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, మహబూబ్ నగర్, కర్నూలు, కడప జిల్లాలనుంచి కూడ మిత్రులు హాజరయ్యారు. హాజరైనవారు : బి.ఎస్. రాజు, ఆర్. సుబ్బారావు, వి. మోహన్ రెడ్డి, విద్యాభూషణ్, కె.ఆర్. చౌదరి, ఎల్. వెంకటరెడ్డి, ఎం.నర్సింహ్మారెడ్డి, కె. బాల్‌రెడ్డి, జి. శంకర్, కె. సురేశ్, జె. మాధవి, ఎన్. శ్రీనివాస్, జి. పద్మకుమారి, ఎస్.శ్వేత, పి. ప్రసాద్, ఎం. తిరుమలేశ్, బి. గణేశ్, బి.కొండల్‌రెడ్డి, కె. సజయ, జి. సూరి, టి. ఆదినారాయణ రావు, బి. మల్లయ్య, ఆర్. సోమయ్య, బి.వి.ఎన్. స్వామి, పి. జగదీశ్వర్ రావు, టి.రమేశ్, ఎల్. రాజ్ పవన్, డి. పద్మ, డి. అనసూయ, జి. సత్యనారాయణరెడ్డి, ఎ. నర్సింహరెడ్డి, ఎన్. సుధాకర్ శర్మ, బి. రామకృష్ణ, వరవరరావు, కుప్పిలిపద్మ, పి. పావని, కృష్ణాబాయి, డా. టి. నళిని, కె.వి. కూర్మనాథ్, డా. కల్యాణ చక్రవర్తి, వి. చలపతి రావు, ఎం. రాఘవా చారి, జి.కె.ఎస్. రాజా, లోచన్, ఎం. వేదకుమార్, టి. రాజేశ్వర్, ఎస్.పి. మోహన్‌రావు, సి. జాన్ బర్నబాస్, ఎన్. భీమార్జున్ రెడ్డి, ఎం.వి.రమణ.

ఉపసంపాదకుడు, సర్క్యులేషన్ మేనేజర్ యాటెల్లి రామచంద్రం సభికులను ఆహ్వానించి, సమావేశ ఉద్దేశాన్ని వివరించారు. ప్రొ. కె ఆర్ చౌదరి సమావేశానికి అధ్యక్షత వహించి నిర్వహించారు.

నాలుగు గంటలకు పైగా జరిగిన సమావేశంలో ఎన్నో విలువైన అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వచ్చాయి. వాటిలో కొన్ని:

- కొన్ని వ్యాసాల ప్రమాణాలు సరిగా ఉండడం లేదు. ప్రచురణకు అర్హం కాని వ్యాసాలను తిరస్కరించవచ్చు. కొన్ని అకడమిక్ పత్రికలు చేస్తున్నట్టుగా ఆ వ్యాసాలు ఎందుకు ప్రచురణకు నోచుకోలేదో చెప్పడానికి ఆ వ్యాసరచయితలకు ఒక వర్క్ షాప్ నిర్వహించవచ్చు.

నుంచి ఎంపిక చేసిన మంచి రచనల సంకలనంగా వచ్చిన ప్రత్యేక సంచికలు ఉన్నాయి. ఆ సందర్భంలో చర్చనీయమైన, కీలకమైన అంశాల మీద ప్రత్యేక వ్యాసాలతో ఒక విలువైన పుస్తకంగా వచ్చిన ప్రత్యేక సంచికలు ఉన్నాయి. ఆ మైలురాయి గురించి ఒకటి రెండు సమీక్షా వ్యాసాలు, గడిచిన కాలం మీద ఒక విహంగావలోకనం మాత్రం వేసి ఇతరంగా మామూలు సంచికగానే వచ్చిన సంచికలు ఉన్నాయి. ఇప్పటికి ఉన్న ఈ నాలుగైదు నమూనాలలో ప్రతిదానికీ విశిష్టతా ఉంది, పరిమితులూ ఉన్నాయి. వీక్షణం ప్రత్యేక సంచిక వీటిలో ఏ నమూనాను అనుసరించాలో సూచించవలసిందీ, సలహాలు ఇవ్వవలసిందీ మీరే. ఈ సమావేశంలోగాని, రానున్న మూడు నెలల్లో గాని మీనుంచి ఈ మేధో భాగస్వామ్యాన్ని వీక్షణం ఆశిస్తున్నది.

వీక్షణం ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న సమస్యలు

వీక్షణం పది సంవత్సరాల జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. మూడో సంవత్సరంలోనే అప్పటి వర్కింగ్ ఎడిటర్ ప్రభుత్వ నిర్బంధానికి గురయి అక్రమ కేసులో ఇరుక్కున్నాడు. చివరికి నిర్దోషిగా విడుదలయినా ఆ కేసుకోసం ఐదు సంవత్సరాలు ఇబ్బంది పడవలసి వచ్చింది. వీక్షణం సంపాదకవర్గానికి పెద్దదిక్కుగా, మార్గదర్శులుగా ఉన్న మిత్రులు నలుగురైదుగురు మరణించారు. ఈ సమస్యలకు తోడు ప్రధానమైనది ఆర్థిక సమస్య. మొదటి సంచిక సంపాదకీయంలో హనుమంతరావు గారు రాసినట్టు 'ఈ పత్రిక వెనుక డబ్బుమూటలు లేవు. నయాపైసా పెట్టుబడి పెట్టలేదు కాబట్టి ప్రతిఫలాన్ని కోరుకోవడం లేదు. ప్రత్యామ్నాయ విధానాలు, ఆచరణే దేశానికి, ప్రజలకు విముక్తి కలిగిస్తాయనే విశ్వాసమే, మా మేధస్సే మా పెట్టుబడి.' అప్పుడు హనుమంతరావు గారి ఇల్లే కార్యాలయంగా, ఒకరిద్దరి కృషితో, రచయితల, చందాదారుల సహకారంతో సాగిన పత్రిక ఎదుగుతున్న కొద్దీ క్రమంగా ఒక కార్యాలయాన్ని, నలుగురైదుగురు సిబ్బందితో పకడ్బందీ వ్యవస్థను రూపొందించుకున్నది. ఈ వ్యవస్థ లేకపోతే పత్రిక ఇంత క్రమబద్ధంగా రావడం కష్టమయ్యేది కూడ. ఈ వ్యవస్థ ఏర్పడడంలో వీక్షణం చందాదారులు, విరాళాలు ఇచ్చిన దాతలు, వ్యాపారప్రకటనలు ఇచ్చిన వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహాయం ఉంది. అలాగే వీక్షణంతో పాటు కొంతకాలం నడిచిన సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్స్ సంస్థ పరిశోధనా రంగంలో చేసిన కృషితో సంపాదించిన వనరులను వీక్షణం మనుగడకోసం ఇచ్చేది. ప్రస్తుతం ఆ వనరులు కూడ లేకపోవడంతో వీక్షణం పూర్తిగా చందాదారులమీద, దాతలమీద, వ్యాపారప్రకటనల మీద ఆధారపడక తప్పని స్థితి వచ్చింది. సాధారణంగానే ప్రపంచవ్యాప్తంగా పత్రికల ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి వ్యయం మొత్తాన్నీ పాఠకులమీద, చందాదారులమీద వేయలేని పరిస్థితి ఉంటుంది. ఉత్పత్తి వ్యయంలో అధికభాగం విరాళాల ద్వారా, వ్యాపార ప్రకటనల ద్వారా రాబట్టుకోవలసి ఉంటుంది. వీక్షణం విషయంలో కూడ ప్రస్తుతం ఒక కాపీ ఉత్పత్తి వ్యయం రు. 20 కాగా దాని వెల రు. 15. చందాదారులనుంచి వీక్షణంకు తిరిగి వచ్చేది రు.14 మాత్రమే. ఏజెంట్ కమిషన్ పోగా విడిప్రతి కొనుగోలుదారుల నుంచి తిరిగివచ్చేది రు. 9 మాత్రమే. ఈ లోటును పూడ్చవలసినది విరాళాలు, వ్యాపారప్రకటనలే.

రెండో దశాబ్దంలో వీక్షణంను మనందరి సమష్టి వేదికగా తీర్చిదిద్దుదాం

ఈ సమావేశంలో పాల్గొంటున్న మీరందరూ వీక్షణంకు మాత్రమే కాక తెలుగునాట ప్రగతిశీలమైన పత్రికలెన్నిటికో కూడ పాఠకులై ఉంటారు. సామాజిక పరివర్తన జరగాలని, ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, వ్యక్తిగత సమస్యలు లేని ఒక కొత్త వ్యవస్థ ఏర్పడాలని ఆకాంక్షించేవాళ్లయి ఉంటారు. ఈ సమసమాజ ఆకాంక్ష సఫలం కావడానికి పాఠకులుగా, రచయితలుగా, బుద్ధిజీవులుగా, సామాజిక కార్యకర్తలుగా మనముందర అనేక బృహత్తర కర్తవ్యాలు ఉన్నాయని తెలిసి వాటిలో కొన్నిటినయినా మీ శక్తిమేరకు నిర్వహిస్తున్నవారయి ఉంటారు. వీక్షణం సాగిస్తున్న కృషిలో కూడ భాగం పంచుకొమ్మని ఆహ్వానించడం మీకు అదనపు భారమే కావచ్చు. కాని మీరు ఈ భారాన్ని ఒక తప్పనిసరి కర్తవ్యంగా సంతోషంగా స్వీకరిస్తారని మా విశ్వాసం. వీక్షణం నిర్వహణలో, మేధోకృషిలో, రచనలో, ప్రచారంలో, బలోపేతం చేయడంలో మీకు వీలైన, మీ వంతు పాత్ర చేపట్టడానికి అనేక మార్గాలున్నాయి.

వీక్షణం చదవండి, చదివించండి, చర్చించండి ఇతరులకు పరిచయం చేయండి; వీక్షణంలో మీకు నచ్చిన, నచ్చని రచనల మీద ఉత్తరాలు, వ్యాసాలు రాయండి; ప్రజలకు తెలియడం అవసరం అని మీరు అనుకునే ఏ విషయం మీదనైనా వ్యాసం రాయండి. కనీసం ఉత్తరం రాయండి. లేదా వ్యాసం వస్తే బాగుంటుందని సంపాదకవర్గానికి సూచించండి; మీ పరిచయస్తులైన రచయితలు వీక్షణంకు రాసేలా ప్రోత్సహించండి; వీక్షణంకు చందాదారులు కండి, చందాదారులను చేర్పించండి, మీ మిత్రులకు కానుకగా చందా చేర్పించండి; మీ గ్రామంలో గ్రంథాలయాలలో, సంస్థలలో, కళాశాలలలో, కార్యాలయాలలో వీక్షణం చందాలు చేర్పించండి; మీ జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయాలు వీక్షణం తెప్పిస్తున్నాయో లేదో కనుక్కుని తెప్పించే ఏర్పాటు చేయండి; మీ గ్రామంలో, పట్టణంలో వీక్షణం విడిప్రతులు అమ్మే న్యూస్ ఏజెంటును ఏర్పాటు చేయండి; మీకు తెలిసిన దాతలకు, ప్రముఖులకు, సంపన్నులకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంకు విరాళాలు ఇచ్చేలా ప్రోత్సహించండి; మీకు తెలిసిన విద్యాసంస్థలకు, ఆస్పత్రులకు, వ్యాపారసంస్థలకు, కార్యాలయాలకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంలో వ్యాపార ప్రకటనలు ఇచ్చేలా చూడండి.

అంతిమంగా వీక్షణం ప్రజల పత్రిక, మీ పత్రిక, మన పత్రిక. మనందరికీ అవసరమైన పత్రిక. తెలుగు సమాజం తనను తాను చూసుకునే అద్దంగా, తనతో తాను చేసుకునే సంభాషణా వేదికగా, తన గురించి తాను తెలుసుకునే విశ్లేషణా పట్టకంగా, తన అవగాహనలను మెరుగుపరచుకునే గీటురాయిగా తయారుచేసే బాధ్యత మనందరిదీ. దీన్ని పదికాలాలపాటు నిలిపి ఉంచవలసిన, అభివృద్ధి చేయవలసిన బాధ్యత మనందరిదీ.

వీ

- పాలకవర్గ రాజకీయాల మీద, చట్టసభల మీద ప్రజలలో భ్రమలు, తెలియనితనం ఉన్నాయి. వాటి దుర్మార్గాన్ని, ప్రజావ్యతిరేకతను బయటపెట్టడం వీక్షణం బాధ్యతగా తీసుకోవాలి.
- ఒకప్పుడు వ్యక్తులను ప్రగతిశీలంగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు/కుటుంబం లేదా చర్చబృందాలు వంటి రెండు మార్గాలు ఉండేవి. ఇప్పుడు ఆ రెండు మార్గాలూ లేవు గనుక పత్రిక బాధ్యత మరింత పెరుగుతున్నది.
- కొత్త పుస్తకాల సమీక్షలు, పరిచయాలు ఉండాలి. పాత పుస్తకాలలో కూడ ఇప్పుడు ఉపయోగకరమైనవి ఎన్నో ఉన్నాయి. వాటిని పరిచయం చేయాలి. ఉదాహరణకు సి కె జాను పుస్తక పరిచయం ద్వారా ఆదివాసుల గురించి, గ్రీన్ హంట్ గురించి ఎన్నో విషయాలు చెప్పవచ్చు.
- జనవరి 2013 సంచిక రెగ్యులర్ సంచికగా ఉండగూడదు. ఒక ప్రత్యేకమైన పుస్తకంగా ఉండాలి.
- వనరుల దోపిడీ, దండకారణ్యంలో ప్రత్యామ్నాయ ప్రయత్నంగా జనతన సర్కార్ లాంటి విషయాల మీద వ్యాసాలు ఉండాలి.
- పత్రిక ఎట్టి పరిస్థితిలోను ఆగిపోగూడదు. అభిమానులమంతా పూనుకుంటే పత్రికకు ఆర్థిక వనరులు సేకరించడం కష్టం కాదు.
- వర్గపోరాట ప్రాధాన్యత, భారత సమాజం అర్ధభూస్వామ్య, అర్ధవలస అనే విశ్లేషణ, అభివృద్ధి మాయాజాలం, సంస్కృతి అనే నాలుగు అంశాల మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.
- వర్గపోరాట దృక్పథంతో నడిచే ప్రజా ఉద్యమాల మీద విమర్శలు, నిందలు, చిన్నచూపు ఫ్రాంటియర్ లాంటి పత్రికలలో కూడ వస్తున్నాయి. వీక్షణంలో వాటికి జవాబులు ఉండాలి.
- వీక్షణం ఆబ్జెక్టివ్ గా ఉంటుందనే పేరు తెచ్చుకున్నది. ప్రజల ప్రత్యామ్నాయ ఆలోచనల వేదికగా తయారు కావాలి.
- జనవరి 2013 సంచిక ప్రత్యేక సంచిక గనుక దానికే ఒక సంపాదకవర్గాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
- తెలంగాణ రైతుల ఆత్మహత్యలు చాల తీవ్రమైన, సంక్లిష్టమైన అంశం. దాని మీద ప్రత్యేక సంచికలో విశ్లేషణ ఉండాలి.
- ఆదివాసుల ఆహారభద్రత, అణుప్రమాదం వంటి అంశాలు ప్రత్యేక సంచికలో ఉండాలి.
- పత్రిక నిలబడడం ముఖ్యం. అందరమూ తలా ఒకచెయ్యి వేసి కాపాడుదాం.
- కొత్త రచయితలకు రచన గురించి చెప్పే వర్క్‌షాపులు నిర్వహించాలి.
- వ్యాపార నీతి, సినిమా, కూల్‌డ్రింక్స్, మినరల్ వాటర్ వంటి అనవసరమైనా అత్యవసరంగా మారిన అంశాలు, గల్ఫ్ లో వలస కార్మికుల దుస్థితి, విద్యారంగం, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, పరిశోధనా రంగం వంటి అంశాల మీద వ్యాసాలు ఉండాలి. పుస్తక సమీక్షలు, విద్యార్థుల వ్యాసాలు ఉండాలి.
- స్త్రీల గురించి వ్యాసాలు, మహిళా రచయితల వ్యాసాలు తక్కువగా ఉన్నాయి. అవి పెంచాలి.
- వీక్షణంలో సాహిత్యానికి కూడ చోటు కల్పించాలి. పేజీల పరిమితి లేకుండా ప్రతి నెలా కనీసం ఒక కథ అయినా వేయాలి.
- సంస్కృతి విధ్వంసం మీద వ్యాసాలు రావాలి.
- విద్యార్థుల దగ్గరికి పత్రికను తీసుకుపోవాలి.
- విద్యావంతులైన మధ్యతరగతి నిరక్షరాస్యులుగా, అజ్ఞానులుగా, భ్రమల్లో మునిగి ఉన్నారు. ఆ భ్రమలను బదాబదలు చేయడానికి వీక్షణం ప్రయత్నించాలి.
- చుట్టూ వ్యాపిస్తున్న సంక్షోభం గురించి అవగాహన పెంచడానికి వీక్షణం కృషి చేయాలి.
- సామ్రాజ్యవాదం మీద పోరాడడమే ఇవాళ ప్రధాన కర్తవ్యం. ఆ బాధ్యతను వీక్షణం చేపట్టాలి.
- పది సంవత్సరాల వీక్షణం సిడి తయారుచేసి అందుబాటులో పెట్టాలి.
- పేదరికం అంటే ఏమిటని ఇంకా గందరగోళం సాగుతున్నది. ప్రత్యేక సంచికలో ఈ విషయం మీద వ్యాసం ఉండాలి.
- వ్యవసాయ సంక్షోభం మీద ప్రత్యేక సంచికలో ఒక వ్యాసం ఉండాలి.
- సంస్కరణల మీద ఒక వ్యాసం ఉండాలి.
- వీక్షణం ఒకరిద్దరి ఆలోచనల వల్ల వచ్చిందని అనిపించవచ్చుగాని అది ఒక చారిత్రక అవసరంగా వచ్చింది. చంద్రబాబు నాయుడు ఆర్థిక విధానాల నేపథ్యంలో సంక్షోభకాలపు అవసరంగా అది వచ్చింది. ఆ అవసరం ఇంకా పెరుగుతున్నది గనుక వీక్షణం ఇంకా బలపడాలి, ఎక్కువకాలం నిలబడాలి.
- వీక్షణం పూర్తిగా గాని, అవసరమైన భాగాలు గాని ఇంగ్లిష్ లో కూడ రావాలి. అచ్చులో కాకపోయినా కనీసం ఇంటర్నెట్ మీద ఆన్ లైన్ రూపంలోనైనా రావాలి. అన్ని విషయాల మీద రెగ్యులర్ గా వ్యాఖ్యలు అప్ డేట్ చేయాలి.
- వ్యాసాల శైలి, ముద్రణ, పేజీల స్వరూపం మరింత ఆకర్షణీయంగా ఉంటే బాగుంటుంది.
- భూమి సమస్య, కులవివక్ష వంటి అంశాల మీద సమగ్రమైన వ్యాసాలు ప్రత్యేక సంచికలో ఉండాలి.
- ప్రతి వ్యాసం చివర సంపాదక వ్యాఖ్య ఉండాలి. ఆ వ్యాసంలో సాంప్రదాయిక, అశాస్త్రీయ, అసమగ్ర భావాలు ఉంటే అక్కడే వివరణ రాయాలి.
- ప్రత్యేక సంచికలో ఒక సీనియర్ మేధావిని గాని, ప్రజారాజకీయాచరణలో ఉన్నవారిని గాని ఇంటర్వ్యూ చేసి వేయాలి.
- మార్క్సిజం అధ్యయనానికి అవసరమైన పుస్తకాలను పరిచయం చేయాలి.
- అసహజ మరణాల సూచిని క్రోడీకరించి, విశ్లేషించాలి.
- ప్రత్యేక సంచిక మొత్తం ఒకే విషయం మీద, ఉదాహరణకు నాలుగు దశాబ్దాల విప్లవోద్యమం, లేదా తెలంగాణ వంటి విషయం మీద, ఉండాలి.
- వ్యవసాయరంగ సంక్షోభం గురించి, మద్దతు ధరలు, గిట్టుబాటు ధరలు వంటి అంశాల గురించి ప్రత్యేక సంచికలో ఉండాలి. జాతీయ వ్యవసాయ, రైతు విధానాల గురించి రాయాలి.
- ప్రత్యేక సంచికలో విద్యావిధాన లోపాల గురించి ఉండాలి.
- ఐ ఎస్ ఎస్ ఎన్ వంటి విలక్షణమైన గుర్తింపు వచ్చిన నేపథ్యంలో వీక్షణం ఒక పరిశోధక బృందాన్ని ఏర్పరచి, అన్ని విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులతో సమన్వయం చేయాలి.
- ప్రతి సంచికలో కనీసం ఒక కార్టూన్ ఉండాలి.
- మామూలు మనుషులకు అవసరమైన విషయాలతో ఆర్థిక వ్యవస్థ మీద విశ్లేషణలు వీక్షణంలో రావాలి.
- తెలంగాణ మీద ఎక్కువ కేంద్రీకరణ ఉండాలి.
- న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఎక్కువగా రాయాలి.
- ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ఉన్నతవర్గాల పత్రిక అయిపోయింది. వీక్షణం అలా మారగూడదు.
- గణాంక వివరాలు, ఆర్థికశాస్త్ర పారిభాషిక పదాలు తగ్గించాలి. భాష సులభం చేయాలి.
- ప్రత్యేక సంచికలో అన్ని కోణాలు సమగ్రంగా ఉండాలి. ఒకే విషయానికి పరిమితం చేయడం మంచిది కాదు.
- గ్రామీణాభివృద్ధి అంశాలు ఎక్కువగా ఉండాలి. అనువాదాలైనా వేయాలి.

అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అన్నిటినీ వినమ్రంగా స్వీకరిస్తున్నామని సంపాదకుడు అన్నాడు. వీటిలో కొన్నిటికి మాత్రం వివరణలు ఇవ్వవలసిన అవసరం ఉందని వివరణలు ఇచ్చాడు. అధ్యక్షుల తుది పలుకులతో, సహాయ సంపాదకుడు డి.వి. రామకృష్ణారావు వందన సమర్పణతో సమావేశం ముగిసింది. వీ

(... 4వ పేజీ తరువాయి)

విద్య నెరుంగనివాడు ఒక మనిషేనా? అని సమాజంలోని విద్యా విధానాల్ని గురించి ప్రశ్నించారు. ఈ రోజు కూడా పాలకవర్గాలు అందించేది విద్యనెరుంగని విద్యార్థుల్నే తయారు చేస్తున్నారనేది నిస్సందేహం. 4) 'ఇథనాల్ పేరుతో మద్యం తయారీ' వ్యాసంలో నీటికి కరువొచ్చినా మద్యానికి కొరత లేకుండా చేస్తున్నారు మన పాలకులు. దాంతోనే కడుపునింపుకొంటున్నారు ప్రజలు. గతంలో బావులు, కుంటలు, కుళాయిలు, బోర్లు ఉన్న రోజుల్లో ఎక్కడబడితే అక్కడ నీళ్లు దొరికి కడుపునింపుకొనేవారు. నేడు మద్యం షాపులు ఎక్కడబడితే అక్కడ అందుబాటులోకొచ్చినాయి. ఇంకొన్ని రోజులకు నేరుగా ఇళ్లల్లోకి సప్లై చేసే విధానం కూడా అమలుకొస్తుంది కూడా. ఈ మద్యం మత్తులోపడి ప్రజలు బలహీనులై తూగుతున్నంతకాలం పాలకవర్గాలకు ఎదురుండదు. ఈ తాగుడు నుండి వీరిని ఏనాడైతే తప్పించగలమో ఆనాడే విప్లవోద్యమాలు ముందుకు పోగలవు. లేకుంటే ఈ మద్యం మత్తులోపడి ఇదే స్వర్గం అనుకొంటు దోపిడీ వర్గాల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడుతుంటారు. ఇక విప్లవోద్యమాలతో పనేందుకు అనే స్థితికి ప్రజల్ని నెట్టేశారు ఈనాటి పాలకులు. వారికి కావాల్సినంత మత్తు పానీయాలందిస్తున్నారు గదా! 5) 'పన్నుల ఎగవేత, నల్లధనం సమస్య' వ్యాసంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో దాగి ఉన్న రహస్యాన్ని బాగా వివరించారు. గత సమాజాలలోని దోపిడీదార్లందరికన్న, వారిని తలదన్నే విధంగా పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ పాలకవర్గం సమాజ సంపదను ఎన్ని విధాలుగా దోచుకుంటుందో తెలుసుకొనదగిందిగా ఉంది. ప్రజల కళ్లకు గంతలుకట్టి, కూలీ పేరుతో ముసుగేసి ఎట్లా ప్రజల్ని దోచుకొంటారో వివరంగా ఉంది. దేశ సంపద వేళ్లమీద లెక్కించదగిన కొన్ని గుత్త సంస్థలలో ఎట్లా కేంద్రీకృతమవుతుందో తెలిపారు. నేటి ఈ కేంద్రీకరణ సోషలిస్టు విప్లవానికి దగ్గరదారి చూపుతున్నట్లేననేది నిజం. పెరుగుట విరుగుట కొరకే అనేది యదార్థమే గదా. 6) 'మనకున్న దళిత స్పృహ ఎంత?' అనే వ్యాసంలో మన పురాణ సాహిత్యంలోని కథలు చదువుతుంటే ఆదివాసుల్ని దేవతల నాయకులకు వాహనాలుగా, వారి పాదాల దగ్గర మోకరిల్లే వారిగాను రాసిపెట్టినారు. దేవాలయంలోకి పోయి చూస్తే ప్రధాన ద్వారం దగ్గర ఇరువైపులా కాపలాగాసే సేవకులుగా గరుత్మంతుడు, హనుమంతుడు మొదలైన బొమ్మలు కనబడు తుంటాయి గదా! వీరంతా గిరిజన ఆదివాసులేననేది స్పష్టమవుతుంది. ఆ విధంగా అగ్రవర్ణాలకు ఊడిగంచేసే వారిగానే ఈనాటికి గూడా దోపిడీవర్గాలు జనాన్ని మలుచుకొంటున్నారు అనేది బాగా వివరించారు. ఇలాంటి వ్యాసాల్ని ప్రోత్సహించి అందిస్తున్నందుకు, ఎంతో పరిశోధించి రాస్తున్న రచయితలకు నా కృతజ్ఞతాభివందనాలు.

– కడియాల సుబ్బానాచారి, *దుత్తలూరు, నెల్లూరు*

దశాబ్ది ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి రాలేకపోయాను. వీక్షణం గురించి నా అభిప్రాయాలు మీతో పంచుకోవడానికి ఈ లేఖ రాస్తున్నాను.

ఇందులో నేను ప్రస్తావించే అంశాలన్నీ నిర్దిష్టంగా దశాబ్ది ప్రత్యేక సంచికకు సంబంధించినవి మాత్రమే కావు. వీక్షణాన్ని మరింత పరిపుష్టం చేయడానికి, ప్రజా ఆలోచనలకు మరింత చైతన్యాన్ని పదునును కలిగించడానికి, ప్రజాస్వామిక ప్రజా సమీకరణ కేంద్రంగా పత్రిక రూపొందడానికి ఈ సూచనలు ఉపయోగపడతాయని అనుకుంటున్నాను.

ముందుగా ఒకింత విమర్శ. ఎ. నరసింహారెడ్డి, పి.వి. రమణ, బర్నబాస్, లచ్చయ్య వంటి వాళ్ల రచనలు ఎంచుకున్న అంశాన్ని వివరణాత్మకంగానూ, విశ్లేషణాత్మకంగానూ తెలియజేస్తున్నాయి. అదే సమయంలో పత్రికకు సమకాలికతను సమకూరుస్తున్నాయి. కాని కొంతమంది రచనలు చాలా ప్రాథమిక స్థాయిలో, సాధారణమైన టెక్స్ట్‌బుక్స్ నుంచి ఎత్తి రాస్తున్నట్లుగా ఉంటున్నాయి. వాటిల్లో గాఢత లోతు, విమర్శనాత్మక పరిశీలన ఉండడం లేదు. అవి కేవలం మాటర్ ఆఫ్ ఫాక్ట్ వ్యాసాలుగా మాత్రమే ఉంటున్నాయి. వీక్షణంలో అచ్చయిన వ్యాసాలకు ఎకడమిక్ గుర్తింపు ఉంటుందని మీరు ప్రకటించిన తరువాత అలాంటి వ్యాసాలు వస్తున్నట్లుగా నా అంచనా. యుజిసి గ్రాంట్లతో నడిచే సెమినార్‌లలో అలాంటి వ్యాసాలే అత్యధిక శాతం ఉంటాయి. అలాంటి దానికి వీక్షణం అవకాశం ఇవ్వకూడదు. కొత్త రచయితలను ముఖ్యంగా సామాజిక శాస్త్రాల పరిశోధకులను ప్రోత్సహించడం అవసరమే. కాని అలాంటి వారికి పత్రిక సరైన గైడెన్సు ఇవ్వకపోతే ఆశించిన ప్రయోజనం నెరవేరదు.

వీక్షణంలో ఆర్థిక, సామాజిక సంబంధమైన వ్యాసాలు ఎక్కువగానే వస్తున్నాయి. కాని తత్వశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్రలకు సంబంధించిన వ్యాసాలు ఎక్కువగా ఉండడం లేదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో ప్రజల చైతన్యాన్ని మొద్దుపరచడానికి జరుగుతున్న ప్రయత్నాలలో భాగంగా పాలకవర్గాలు సామాజిక శాస్త్రాల నుండి భావనల నుండి ప్రజలను దారి మళ్లించడానికి అనేక విధాల ప్రయత్నిస్తున్నారు. బూర్జువా ప్రజాస్వామ్యం తప్ప మరొక ప్రత్యామ్నాయమేదీ లేదని, చరిత్ర క్రమంలో తలయెత్తిన ప్రత్యామ్నాయాలన్నీ కాలంపెట్టిన పరీక్షలో విఫలమయ్యాయని ఆలోచనాపరులను నమ్మింపజూస్తున్నారు. అందరి ఆలోచనలను గిరిగీసిన ఒక చట్రంలోకి మళ్లిస్తున్నారు. ఈ మానసిక విధ్వంసం చాలా ప్రమాదకరమైంది. దీని నుండి మనుషుల్ని కాపాడుకోవడం ఒక చారిత్రక బాధ్యత.

ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం, దేశభక్తి, అరాచకత్వం, ఫాసిజం – ఇలాంటి భావనలు అవి రూపొందిన కాలం నాటి అర్థాలకు, విలువలకు దూరంగా జరిగిపోయి ప్రజల్ని తప్పుడు చైతన్యంలోకి నెట్టి వేస్తున్నాయి. ప్రతి భావనకు ఒక నిర్దిష్టమైన సమాజ అవసరం నేపథ్యంగా ఉంది. ఆయా కాలాలలో భావ సంఘర్షణ జరగకుండా ఏ కొత్త భావనా తల ఎత్తలేదు. అయితే తాము ఆధిపత్యంలోకి రావడానికి ఇలాంటి భావనలను ఉపయోగించుకున్న వర్గాలు ఆ భావనలే తిరిగి తమ పునాదులను కదిలించకుండా ఉండడానికి ప్రజలకు వాటిని తలకిందులుగా అర్థం చేయించే ప్రయత్నం ఉన్నది.

యుద్ధాలు, సామ్రాజ్యవాదం, విప్లవాలు ఇలాంటి పదాలకున్న నిర్దిష్టమైన అర్థాన్ని, వాటి లోతుల్ని పాఠకులకు తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. ఆయా సందర్భాలలో ఆయా దేశాలలో, సమాజాలలో ధిక్కార స్వరాల రూపాన్ని సారాన్ని పాఠకులకు అందించాలి. అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశంలో ఉంటూ దాని కుళ్లును కుట్రలను, నిర్భయంగా వెల్లడించిన భావాలను పాఠకులకు అందించాలి. అందుచేత జనవరి 2013 సంచిక నుండి ఇలాంటి అంశాలకు సంబంధించిన ఒక శీర్షికను తత్వశాస్త్రం, చరిత్ర, రాజనీతి అనే పేరుతో ప్రారంభిస్తే బాగుంటుంది. అన్నీ కొత్త వ్యాసాలే కానక్కరలేదు. పాత ధిక్కార స్వరాలను ప్రచురించి వాటి ప్రస్తుత ప్రాసంగితను అర్థం చేయించడం కూడా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుర్మార్గాన్ని, హింసను అందరికీ అర్థం చేయించే అవకాశం ఉంటుంది.

అదే విధంగా తెలుగులోనూ, ఇంగ్లీష్‌లోనూ సామాజిక శాస్త్రాలకు సంబంధించి వస్తున్న పుస్తకాలను, వ్యాసాలను క్లుప్తంగానైనా పరిచయం చేయడం మంచిది. హిట్లరు, ముస్సోలినీల ఓటమితో ఫాసిజానికి సమాధి కట్టబడిందని, ఫాసిజం బారి నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడింది అమెరికా, బ్రిటన్ లేననే అపోహ ఇప్పటికీ మన ఆలోచనాపరులలో ఉన్నది. నిజానికి సామ్రాజ్యవాదమే ఫాసిజానికి సృష్టికర్త అని చాలామందికి అర్థం కాదు. అమెరికాలో, బ్రిటన్‌లో ఫాసిజం ఎప్పటి నుండో రాజ్యం ఏలుతుందంటే చాలామంది 'ప్రజాస్వామ్యవాదుల'కు కన్నెర్ర. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఉదారవాద నినాదాలతో జరిగిన ఫ్రెంచ్, బ్రిటిష్ విప్లవాలు తమ అమెరికా స్వాతంత్ర్య పోరాటం కాలక్రమంలో సారాన్ని మార్చుకొని సామ్రాజ్యవాదంగా ఎదిగి తమ తమ దేశాలలో స్వేచ్ఛ నోళ్లు మూయించిన వైనాన్ని వీక్షణం ప్రజలకు అందించాలి. 2013 అంతా సామ్రాజ్యవాదమనే క్రూర జంతువుకు ఉన్న పలు ముఖాలను వివిధ మాధ్యమాలు, ప్రక్రియల ద్వారా వీక్షణం పాఠకులకు అందించాలనేది నా అభిప్రాయం.

– సి.ఎస్.ఆర్. ప్రసాద్, *గుంటూరు*

ఇటీవల వీక్షణంకు గుర్తింపునిచ్చే ఐఎస్ఎస్ఎన్ నెంబర్ రావడం, అందులో రచించినవారికి మార్కులు, వెయిటేజీ లభిస్తాయనడం సంతోషదాయకం. అయితే దీనివల్ల మరింత శ్రద్ధ వహించాల్సిన బాధ్యత రచయితలపైనా, అంతకుమించి సంపాదకులపైనా పెరుగుతుంది. ప్రజల పక్షం వహిస్తూనే, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించే పత్రికకు, అందులోనూ వనరుల పరిమితి దృష్ట్యా

ఇది బరువైన పనే. మంచి కృషి చేస్తున్నారు. కానీ ఇంకా జటిలమైన బాధ్యతగానే ఉంటుంది. అందులోనూ నేటి సంక్లిష్ట పరిస్థితులలో..

ఇలాంటి పత్రికకు – వాస్తవాల ఆధారంగా సత్యాన్వేషణ, శాస్త్రీయ వైఖరి, సమైక్యతాదృష్టి – ఈ మూడూ కావాలి. ఇది చెప్పినంత తేలిక కాదు. చాలా కృషి అవసరం. మెరుగు చేసుకోవాల్సింది చాలా ఉంది. జూలై 2012 సంచికలోని రెండు వ్యాసాలను ఉదహరిస్తూ కొన్ని విషయాలు ... ఆయా రచయితలది మంచి ప్రయత్నమే. అయినా ముందున్న కర్తవ్యాల దృష్ట్యా, రానున్న దశాబ్ది సంచికకు సూచనగా కొన్ని విషయాలు:

'దళిత స్పృహ' గురించి డా. లచ్చయ్య వ్యాసంలోని కొన్ని విషయాలను ఉదహరించి చెప్తున్న ఈ కింది అంశాలను ఇతరులూ గమనించాలని మనవి. (దానికి ముందు ఒక మాట. పెద్దకూర (బీఫ్)ని తినడాన్ని వ్యతిరేకించినవారిలో అత్యధికులు మాంసాహారులేననీ, వీరే శాకాహారులపై జోకులు వేసి గేలిచేస్తుంటారనీ రచయిత సరిగ్గా ఎత్తి చూపారు.) ఇతరులు చాలామంది దీన్ని విస్మరించారు. బుద్ధిజంని క్రీ.పూ. 300 నాటిదిగా చెప్పారు. నిజానికి చాలా ముందటిది. వైదిక కాలంలో యాగాల పేరిట జంతుబలి ఇచ్చింది మనువాదులే అన్నారు. మనువులు ఎందరో కానీ – వేదకాలం తర్వాతే వచ్చారు. వేదకాలంలో మనువాదులెక్కడ? మనువాదుల పద్ధతులలోనే 'అన్ని మతాల్లో రెండు విభజన రేఖలు పొడసూపాయి. కేథలిక్కులు – ప్రొటెస్టెంట్లని; షియాలు – సున్నీలని... ఎవరి కుంపటిని వారు రాజేసుకుంటూనే ఉన్నారు' అని రాశారు. క్రిస్టియన్లలో, ఇస్లాంలో వచ్చిన ఈ తెగలు మనువాదులున్న ఈ గడ్డ మీద, వారి వల్ల ఏర్పడలేదు. ఆ మతాలు పుట్టిన చోట్లే, ఇతర కారణాల వల్ల ఏర్పడినాయి. మన దేశంలో ద్వైత, శైవ వైష్ణవ మొదలైన విభజనలు కూడా వారివల్ల ఏర్పడలేదు. వారందరిలో మనువాదాలున్నారు. అన్నిటినీ మనువాదుల ఖాతాలో పడేస్తే ఎలా?' అని వేర్వేరు పరిణామ ప్రక్రియలు. ఇలాటి లోపాలు వ్యతిరేకులకు అవకాశాన్ని కల్పిస్తాయి. చరిత్రంటే తేదీలు కావు నిజమే.

చరిత్రంటే తేదీలు కావు నిజమే. కానీ చారిత్రకంగా వివిధ భావజాలాలనూ, వాటి ప్రభావాలనూ పరిశీలించేప్పుడు ఇది ముఖ్యాంశమే. ఇలాంటి అంశాలు ఇంకా ఉన్నాయి.

గోవుల్ని రక్షించాలంటే వాటిని ఆహారంగా స్వీకరించడమే శాస్త్రీయమైనది అని రాశారు. దానివల్ల ఆవుల పెంపకం ఊపందుకుని చిన్న కమతాల వ్యవసాయం పూర్వ వైభవం పొందుతుంది అని అన్నారు. గోమాంసం అభ్యంతరం లేదు కానీ, ఈ వాదన వైరుధ్యాలమయంగా ఉన్నది. మొదటిది, గోపూజని నమ్మేవారికి దాన్ని తినడం పొసగదు. అది అలాటి నమ్మకం. పశువులతో కమతం చాలాచోట్ల అంతరించిపోవడానికి అనేక కారణాలున్నాయి. దాన్ని గడ్డి, నీరు, స్థలం, లేబరు లభ్యత – రేట్లు – ఇలాటివన్నీ నిర్ణయిస్తాయి. గోమాంసం తిన్నంత మాత్రాన ఇవెలా మారుతాయి? నేటి ఆధునిక యుగంలో కాలచక్రం మళ్లీ వెనక్కి మళ్లుతుందా? పెద్దకూర తినడం, దానికై ఉత్పత్తి పెరగడం జరిగినా, అది ఆధునిక ప్రాతిపదికపై సాగుతుంది. ఆధునిక కోళ్ల పెంపకంలో లేయర్లు, బ్రాయిలర్లు వేర్వేరు. గుడ్లఫారాల్లో మగవాటిని బతకనీయరు. అలాగే బీఫ్ పరిశ్రమ కూడా కాడెడ్లకు సంబంధం లేకుండా పెరగవచ్చు. కాడెద్దుల వ్యవసాయం, దాని సమస్యలూ, అవకాశాలూ వేరుగా ఉంటాయి. అది మారుతున్న ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అనేకాంశాలతో ముడిపడి ఉంటుంది.

అనాదిగా పాములను ఆదివాసులు మొదలగువారు పూజిస్తున్నారనీ, పాములను చంపడం సినిమాలూ, తప్పుడు ఆలోచనా విధానాలతో, చదువుకొన్న వారి ద్వారా వచ్చిన జాడ్యం అని రాశారు. నాగుల చవితికి పుట్టల్లో పాలు పోసే నమ్మకాన్నీ ప్రస్తావించారు. ఇవన్నీ వాస్తవాలా? లేక వైరుధ్యాల మయంగా ఉన్నాయా? ఆలోచించండి. పాములకు పాలు పోయడం చాలా కులాల్లో, వర్గాల్లో ఉంది. చదువుకున్న వారిలోనూ ఉంది. దాన్ని గొప్ప విషయంగానే సినిమాల్లో చూపుతున్నారు. నాగపూజను సాంఘిక చిత్రాల్లో కూడా కీర్తిస్తున్నారు. మెడలో పాము వేసుకొనే శివుణ్ని, సుబ్రమణ్యేశ్వరుణ్ని, ఇతరులనీ అనేక వర్గాల వారు ఆరాధిస్తున్నారు. నేడే కాదు, శతాబ్దాలుగా. అయినా ఇంట్లోకి పాము వస్తే చాలామంది చంపడానికి ప్రయత్నిస్తున్నారు. దానికి వారు పిలిచేదీ, వచ్చి పట్టేదీ, లేదా చంపేదీ పేదలూ 'కింది' కులాల వారే. (ఇటీవలి పాము మిత్రులు తప్ప). దానికి కొద్ది డబ్బు అడుగుతారు, ఇస్తారు కూడా. వాస్తవాలూ వాదనలూ రచయిత చెప్పినట్టుగా లేవు.

ఉన్నత వర్గాలు తింటున్న మేక, గొర్రె, కోడిమాంసం, చేపలు ఏనాడూ సామాన్యునికి అందుబాటులో ఉండవు. చౌకగా లభించే గొడ్డు మాంసం తినవద్దనే ఆంక్షలు మార్కెట్ మాయాజాలంలోని ఒక భాగమే. దోపిడీవర్గాల వర్గ స్వభావమే. గొడ్డు మాంసాన్ని నిషేధిస్తేనే ఉన్నతవర్గాల ఫామ్స్‌లో పెంచుతున్న మేకల, గొర్రెల, కోళ్ల పెంపకం దినదినాభివృద్ధి అని రాశారు. ఈ విషయంలో కూడా వాస్తవాలూ, వాదనలూ ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. పేదల ఇళ్లల్లో కూడా కోళ్లుంటాయి. ఫామ్స్‌లోనే కాదు, అనేక (ముఖ్యంగా తీరప్రాంతాల్లో) చేపలు పేదలు తినే చౌక మాంసమే. తరచూ కూరగాయాలకన్నా చౌక. అలాగే మేకలు, గొర్రెల పెంపకం ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో కష్టజీవుల జీవనాధారంగానే ఉన్నది. కాగా గొడ్డు మాంసానికీ దాని మార్కెట్ దానికుంది. ముఖ్యంగా కేరళ, ఈశాన్య భారత్, వాటిని తినే ఇతర చోటల్లా. నిజానికి బీఫ్ ఆధునిక పద్ధతిలో పెరిగే ధోరణి ఉంది. ఆల్ కబీర్ అలాంటి ఉత్పత్తి కేంద్రమే. వేములవాడ నుంచి కూడా పశువులు కశాయిశాలకు పోతున్నాయి. అది వేరే సంగతి. అయినా బీఫ్ మార్కెట్ బలాన్ని చూపుతుందది. రచయితలు బాగా నిర్దిష్ట పరిశీలన చేయాలనడానికే ఇదంతా.

దేశంలోని ఆరువందలకు పైగా ఉన్న గిరిజన తెగలూ, ఆదివాసీలూ ఏ మతానికీ చెందరు, ఎవరి మతం వారిదే అని రాశారు. వారిలో చెట్టునీ పుట్టనీ ఆరాధించే వారెక్కువ. నిజమే. అయినా శతాబ్దాల పరిణామ క్రమంలో ఇది పాక్షిక సత్యంగానే మిగిలింది. నిజానికి మతాలూ, మత తెగలూ మారుతూ మారుతూ వస్తున్నాయి. వాటితో పోలిస్తే బహుశా కులాలూ, 'జాతి' (ఎత్నిక్) తెగలూ మరింత స్థిరంగా ఉన్నాయి. దళిత వాడల్లోకి గణేశుని ప్రవేశం గురించి రాశారు. నిజానికి 'హిందూ' మతశాఖలు దళితుల్లోకి శతాబ్దాలుగా విస్తరించాయి. అయ్యప్ప వంటి దేవతలు కింది వర్గాల్లోనే బాగా నాటుకుంటున్నాయి. ఇవన్నీ ఆదివాసీ, గిరిజన తెగల్లోకి కొంత వెళ్లాయి. రామాయణకర్త ఆదివాసీయేనని ఇరు వర్గాలూ గొప్పగా చెప్పుకుంటున్నాయి. రామాయణంలోని అనేక ఆదివాసీ తెగలు రామభక్తులే – శబరి, గుహుడు వంటివారే. హనుమాన్ సరేసరి. భక్తి ఉద్యమాల్లో గురువులూ, శిష్యులూ చాలామంది కింది వర్గాల వారే. భక్త కన్నప్పలూ, నందనార్లూ, వీరశైవ వీరవైష్ణవ బృందాలూ, ఆళ్వారుల్లో కొందరూ – ఇలా పురాణ, పురాణానంతర కథల్లో కూడా వీరు కన్పిస్తారు. ఇది శతాబ్దాలుగా సాగుతున్న క్రమం, కొత్తది కాదు. ఇటీవలి శతాబ్దాల్లో ఇస్లాం, క్రైస్తవం కూడా – ఆయా పాలకుల ప్రోత్సాహంతో – దళితుల్లోకి, ఆదివాసుల్లోకి పాకే క్రమం మొదలై కొనసాగుతున్నది. పై కుల్లాలోకి కూడా ఆ మతాలు వెళ్లాయి, అది వేరే సంగతి. కొత్త అంశం ఏమిటంటే – హిందుత్వ రాజకీయాలు, హిందూమతం, హిందుత్వ వేరు వేరు. అందులోనూ మోటు రకం, నాజూకు రకం రెండూ ప్రోత్సహించబడుతున్నాయి. ఇవి ఆదివాసీ, దళిత, ఇతర 'కింది' వర్గాల్లోకి విస్తరిస్తున్నాయి. కాబట్టి ఈ విషయాల్లో జనరలైజేషన్ కష్టం. నిర్దిష్ట విశ్లేషణ అవసరం. 'అఖండ భారత్ ఆరోగ్యకరంగా, ప్రజాస్వామ్య బద్ధంగా' రూపుదిద్దుకోవడం గురించి రాశారు. ఇప్పుడున్న అఖండ భారత్ భావన ఈ విలువలకు చుక్కెదురు. ఆ రెండూ పొసగవు. నాజూకు హిందుత్వ లాగే అదీ ప్రమాదకరమైన ధోరణే. సంఘ్ పరివార్ గోమాంస భక్షణను బలపరిచినా అది వాంఛనీయం కాదు – సాంఘికంగానే కాక, రాజకీయంగా కూడా. ఈ ప్రతిపాదననూ, దాని పర్యవసానాలనూ తిరిగి పరిశీలించాలి. ఇలాటివే మరికొన్ని ఉన్నాయి.

మహమూద్ గారి జూలై వ్యాసం 'విద్య – శాస్త్రీయత'లో చాలానే మంచి అంశాలున్నాయి. అయితే కొన్ని లోపాలూ ఉన్నాయి. సైన్సు, తత్వ శాస్త్ర రంగాల్లో ప్రాచీన భారత్ మంచి పాత్రను పోషించిన అంశాలున్నాయి. గణితం, ఖగోళ – రుతుశాస్త్రాలు, వైద్యం – శస్త్ర చికిత్స, శిల్ప వాస్తు నిర్మాణ శాస్త్రాలు, లలిత – జానపద కళలు, ముడిరూపంలోనే అయినా కొన్ని భౌతికవాద భావనలు మొదలైనవి. తర్వాతి కాలంలో క్షీణత, పతనం ఉన్నంత మాత్రాన గతంలోని మంచినీ, శాస్త్రీయ అంశాలనూ తృణీకరించాల్సిన అవసరం లేదు. మంచి గతమున కొంచెమేనోయి... అని గురజాడ అన్నాడు. దానర్థం ఆ కొంచెం మంచినీ కాదనమని కాదు. నిజానికి అలా చేస్తే గతానికంతా తామే వారసులమని

చెప్పుకొనే నేటి అభివృద్ధి నిరోధకులకు తోడ్పడుతుంది. అభ్యుదయాన్ని కోరే ఇతరులూ ఈ విషయాల్ని దృష్టిలో పెట్టుకోవాలి.

సముద్రయానాన్ని నిషేధించిన మన పూర్వీకులకు... అంటూ కొంత రాశారు. భారత చరిత్రలో దాదాపు మూడువేల ఏళ్ల క్రితమే నౌకాయానం ఉంది. పడవలు, నౌకల నిర్మాణ ప్రస్తావనా ఉంది. రచనల్లోనే కాదు, పురావస్తు పరిశోధనల్లో కూడా ఆధారాలున్నాయి. బుద్ధుని తర్వాత – బ్రిటిష్ రాక వరకూ – అంతా అంధకారమే అన్నట్టుగా రాశారు. పైన పేర్కొన్న సాధనలు అనేకం బుద్ధుని తర్వాతే వచ్చాయి. బ్రిటిష్ వారి రాకకు ముందటి శతాబ్దాల్లో నాటి భారత్ భూభాగంలో ఉత్పత్తులు, నైపుణ్యాలు, వాణిజ్యం, ఎగుమతులు మరీ అధ్వాన్నంగా ఏమీ లేవు. ఫ్యూడల్ యుగం కాలం చెల్లిపోయింది అంటే అర్థం ఆ కాలపు సాధనాలను కాదనడం కాదు. ఇది పెట్టుబడిదారీ విధానానికి వర్తిస్తుంది. విద్యలో శాస్త్రీయతను కోరేవారు ఈ గతితార్కిక దృష్టితో చూడాలి. బ్రిటిష్ వారు వాటిని ఎలా ధ్వంసం చేశారో అనేక కథనాలున్నాయి. కాబట్టి మధ్య యుగాల్లోని నెగెటివ్ అంశాలను చూసి, బుద్ధుడి తర్వాత దాదాపు ఏమీ లేదనడం సరికాదు. వాస్తవాలతో పొసగదు. ఉదాహరణకి, అశాస్త్రీయత ఉన్నది నిజమే కానీ ఆయుర్వేదం, యోగ మానవుడికి చేసిన సేవలను విస్మరించలేం.

గురజాడ నాటకం ఆనాటి కన్యాశుల్కం గురించి కాదు. అదొక అంశం, మిష మాత్రమే. కాలాతీత రచన అది. అనేక సామాజిక, వైయక్తిక వికారాలను, ధోరణులను, హిపోక్రసీని ప్రతిబింబించిన అపూర్వ కళాఖండం అది. ఏ షేక్స్‌పియర్ నాటకానికో తీసిపోనిది. ఎన్నెన్నో సమకాలీన అంశాలను చేర్చాలి నిజమే. దానర్థం గతంలోని అద్భుత రచనలను వెనక్కి నెట్టేయమని కాదు. నిజానికి అందులో సమకాలీనత కూడా ఉంది. పోలీసు, కోర్టు, విద్య, కపట సంస్కరణ, ఛాందసత్వం... ఇలా ఎన్నో ఉన్నాయి. తర్వాతి తరాలకు అందించాల్సిన ఉత్తమ సాంస్కృతిక వారసత్వం అది. విద్యార్థులను సాంకేతిక పనిముట్లుగా మార్చే విద్యా విధానాన్ని రచయిత సరిగ్గానే వ్యతిరేకించారు. దానికి విరుగుడుగా ఈ సాంస్కృతిక వారసత్వం ఉపయోగ పడుతుంది. రచయిత కాలం చెల్లినదిగా పేర్కొన్న పూర్ణమ్మ తన చెల్లీ చెంద్రమ్మకు ప్రేరణ అని ఒక శతాబ్ది తర్వాత 2005 ఇంటర్వ్యూలో విప్లవ – దళిత కవి సత్యమూర్తి చెప్పుకొన్నారని గమనించాలి.

రచయితలు నిర్దిష్టంగా, లోతైన పరిశీలనతో, మరింత జాగ్రత్తతో ఆలోచించి రాయాలి అనడానికి ఉదాహరణలుగా కొన్ని అంశాలివి. అలాటివి ఇంకా చాలా, ఇతర అనేక రచనల్లో కూడా ఉంటున్నాయి. వాటిని నివారించడానికి రచయితలు సీరియస్‌గా కృషి చేయాలి. ప్రచురణ సందర్భంలో, మరీ తప్పుగా కనిపించే వాస్తవాలు, చరిత్ర, వాదనలను ఎలా ఎడిట్ చేయాలో ఆలోచించాలి. రచయితలతో చర్చించి లోపాల్ని నివారించాలి. చాలా కష్టమైన పనే. చెప్పడం తేలిక. అయినా అందుకోడానికి ప్రయత్నించాలి. ఇవి ఏదో వాదానికి రాసినవి కాదు. దశాబ్ది సంచిక సందర్భంలో రచయితలూ, సంపాదకులూ వీటిని దృష్టిలో పెట్టుకుంటారని ఆశిస్తూ..

– బాపూజీ మరింగంటి, హైదరాబాద్

వీక్షణం జూలై 2012 సంచికలో జూన్ 12న రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల సరళినీ, వాటి ఫలితాలనూ విశ్లేషిస్తూ వచ్చిన రెండు వ్యాసాలలో ధనబలం మరింత బలపడిందని, ప్రజా సమస్యలపై రాజకీయ నాయకుల దృష్టి బలహీనమై పోయిందనే వాస్తవ విషయాలు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. ఉప ఎన్నికలలో ప్రధానంగా రాష్ట్రాన్ని దోచుకునే శక్తుల మధ్య మాత్రమే పోటీ జరిగిందనేది బహిరంగ రహస్యం. ప్రజల స్వీయ, సక్రమ లేదా వాస్తవ ఆలోచనాశక్తిని బలహీనం చేసే దిశగా ధనబల రాజకీయ శక్తులు నిరంతరం వేగవంతంగా, విజయవంతంగా పోటీపడుతున్నాయి. చివరకు, దోపిడీలో ఎక్కువ తక్కువలను బేరీజు వేసుకుని దాని ఆధారంగా కాస్త చెడు, మరి కాస్త చెడు అనుకుంటూ, ఆ రెండు చెడుల మధ్య ప్రభావిత ఆలోచనకు తోచిన మంచిని వెతుక్కుంటూ అభ్యర్థులను ఎంపిక చేసుకునే పరిమితికి మాత్రమే ఓటరు మిగిలాడు. వాస్తవానికి ఓటరుకు మరో బలమైన ప్రత్యామ్నాయ గత్యంతరం కూడా లేకుండా పోయింది. ఎందుకంటే, ఎన్నికలలో అభ్యర్థుల పట్ల నిరసన తెలియజేసే ప్రజాస్వామ్య అధికారిక హక్కు ఓటరుకు లేదు. 65 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం నేటికీ ఓటరును ఓటుకు ఏకపక్ష బానిసగానే గౌరవిస్తుంది. ఆది నుంచి ఎన్నికలలో ప్రజలను చైతన్యహీనులను చేస్తూ ధనబలాన్ని ప్రోత్సహించింది, ప్రజాబలంతో అధికారం చేపట్టిన ఈ ధనబల రాజకీయ ప్రభుత్వాలే. 1996లో తొలిసారిగా ప్రజలు తమ ప్రాంతాలలో నెలకొని ఉన్న సాగునీరు, తాగునీటి సమస్యను దేశ ప్రజల దృష్టికి, ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లేందుకు నల్లగొండ లోకసభ స్థానం నుంచి 480 మందికి పైగా అభ్యర్థులు, తమిళనాడులోని మొడకురిచ్చి అసెంబ్లీ స్థానం నుంచి వెయ్యి మందికి పైగా అభ్యర్థులు నియమానుసారంగా ఎన్నికల బరిలో నిలిచారు. ఇంత భారీ సంఖ్యలో ఒక స్థానం నుంచి ఎన్నికలలో తలపడడం దేశ చరిత్రలో అదే ప్రథమం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ నిరసన తెలిపే క్రమంలో పాటించిన అత్యంత పవిత్రమైన చైతన్యపూరిత స్ఫూర్తిదాయక చట్టబద్ధ చర్య అది. వాస్తవానికి నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆ చర్య ఒక పర్వదినం లాంటిదే. అయితే ఆ స్ఫూర్తి మరో నలుగురికి ఆదర్శప్రాయమై అది ఆచరణలోకి రాకముందే ధనబల రాజకీయాలు పైచేయి సాధించాయి. అప్పటి వరకు ఎన్నికలలో పోటీ చేయడానికి లోకసభ స్థానానికి రు. 500, అసెంబ్లీ స్థానానికి రు. 250 లుగా ఉన్న డిపాజిట్ రుసుం ఏకంగా రు. 10,000 లోకసభ స్థానానికి, రు. 5,000 అసెంబ్లీ స్థానానికి పెంచడం జరిగింది. ఆ తరువాత మరింత పెరిగింది. డిపాజిట్ రుసుం రు. 500 నుంచి ఏకంగా రు. 10,000 కు పెంచడం వెనుక దాగున్న ప్రామాణికం కేవలం ఎన్నికలను ధనబల రాజకీయాలకు మాత్రమే పరిమితం చేయడం, సామాన్య ప్రజలను ఓటుకు మాత్రమే పరిమితం చేయడం. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు, నేడు ఎన్నికలు ఒక పెట్టుబడి అయింది. ఆ పెట్టుబడికి పదింతలు లాభదాయకమైన ఆదాయమార్గం తద్వారా సంక్రమించే అధికారం అయింది. అందుకే జనసామాన్య జీవనానికి అందనంత ఎత్తులో చెరిగిపోని శాశ్వత మనోజీవన సౌధాల్ని నిర్మించుకున్న ధనిక ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు నేడు ప్రజాసేవ ముసుగులో రాజకీయాలతో అధికారం కోసం ప్రాకులాడుతున్నారు, సమస్థాయి వారితో పోటీ పడుతున్నారు. వారిని భరించాల్సిన, భరించి పోషించాల్సిన పౌర బాధ్యత మాత్రమే ప్రజలకు మిగిలింది.

– ఎస్. కిశోర్ కుమార్, హైదరాబాద్

కా. సూర్యం జీవిత చరిత్ర - రచనలకు ఆహ్వానం

అమరుడు కా. సూర్యం (చింతల వెంకటస్వామి) సంస్మరణ సభను ప్రతి సంవత్సరం ఆయన అమరుడయిన సెప్టెంబర్ 29న జరపాలని నిర్ణయించాం. ప్రతి ఏడాది ఆయన అమరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ఒక స్మారకోపన్యాసాన్ని ఇప్పించాలని కూడా నిర్ణయించాం. కా. సూర్యం బయటి జీవితం కన్నా ఉద్యమ జీవితమే సుదీర్ఘమైంది. సమాజాన్ని పాఠశాలగా, ఉద్యమాన్ని గురువుగా చేసుకొని ఆయన తన చైతన్యాన్ని, జ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఉద్యమ ఆచరణను పదును పెట్టుకున్నారు. ఈ క్రమంలో కా. సూర్యం రాష్ట్రమంతటా అనేక స్థాయిలలో విలక్షణమైన బాధ్యతలను నిర్వర్తించారు. తన క్రమశిక్షణతో, పోరాట పటిమతో స్నేహశీలతతో ఆయన ఎందరో కామ్రేడ్స్‌ను ప్రభావితం చేశారు. వారందరినీ భాగస్వాముల్ని చేసి ఉద్యమ విస్తృతికి ఎనలేని కృషి చేశారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 29న జరగబోయే సంస్మరణ సభ నాటికి కా. సూర్యం మిత్రులు, సహచర కామ్రేడ్స్‌ల జ్ఞాపకాలతో ఆయన జీవితాన్ని సమాజానికి అక్షర రూపంలో అందించాలనుకుంటున్నాం. కా. సూర్యంతో మీకున్న పరిచయాన్ని, ఆయన వ్యక్తిత్వం పట్ల, నిబద్ధత పట్ల, ఆచరణ పట్ల మీ అనుభవాలను రాసి ఆగస్ట్ 2012 చివరి లోపు పంపవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఆయనకు సంబంధించిన ఫొటోలు, రచనలు కూడా పంపి కా. సూర్యం జీవిత చరిత్ర రచనకు సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

కన్వీనర్, కా. సూర్యం సంస్మరణ కమిటీ

రచనలు పంపవలసిన చిరునామా :
చింతల మల్లికార్జునరావు, న్యాయవాది,
డోర్ నెం. 26–14–65, రఘురాం నగర్, నగరపాలెం,
గుంటూరు – 522004. సెల్ నెం. 9247237361;
ఇమెయిల్ : mallicadvocate@gmail.com

వీ

గుజరాత్‌లో గొడ్డు మాంసం నిషేధం

గుజరాత్‌లో గొడ్డు మాంసం అమ్మకం, నిల్వలు, రవాణాపై నిషేధం విధించడంపై కబేళా నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. గుజరాత్ జంతుసంరక్షణ (సవరణ) చట్టం–2011 ప్రకారం గొడ్డుమాంసం, దానికి సంబంధించిన ఉప ఉత్పత్తులన్నిటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ చట్టాన్ని రద్దుచేయాలని 'ఖురేశ్ వికాస్ మంచ్' అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు జూన్ 29న గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ, నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని ఆదేశించింది.

పైలట్ల సమ్మె విరమణ

యాభై ఎనిమిది రోజులుగా ఎయిర్ ఇండియా పైలెట్లు చేస్తున్న సమ్మెను జూలై 3న విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలను పరిశీలించడానికి యాజమాన్యం అంగీకరించడంతో పైలట్లు సమ్మె విరమిస్తున్నట్లు ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. సమ్మె కాలంలో తొలగించిన పైలట్లను తిరిగి నియమించుకోవడంతో పాటు వారి సమస్యలను ఎయిర్ ఇండియా యాజమాన్యం సానుభూతితో పరిశీలించాలని ఇరువర్గాల హామీలను పరిగణనలోకి తీసుకోవాలని న్యాయమూర్తి జస్టిస్ క్షేత్రపాల్ అన్నారు. సమ్మెకు బాధ్యులను చేస్తూ 101 మంది పైలట్లను, 10 మంది ఇండియన్ పైలట్స్ గిల్డ్ కార్యవర్గ సభ్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సూచించారు.

రాజేష్‌ఖన్నా ఇకలేరు

హిందీ నటుడు రాజేష్‌ఖన్నా (69) కిడ్నీ, లోబిపి సమస్యలతో బాధపడుతూ ముంబయిలోని తన స్వగృహంలో జూలై 18న మరణించారు. రాజేష్‌ఖన్నా 1942 డిసెంబర్ 29న అమృతసర్‌లో పుట్టారు. ఆయన అసలు పేరు జతిన్‌ఖన్నా. 'ఆఖ్రీ ఖత్'తో 1966లో సినిమాల్లోకి వచ్చిన ఖన్నా 180కి పైగా చిత్రాల్లో నటించారు.

పదమూడవ రాష్ట్రపతిగా ప్రణబ్

యు.పి.ఎ అభ్యర్థిగా పోటీచేసిన ప్రణబ్ ముఖర్జీ (77) బి.జె.పి. బలపరిచిన అభ్యర్థి పి.ఎ. సంగ్మాపై జూలై 18న జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో గెలుపొందారు. పోలైన మొత్తం ఓట్లు 10,29,750 కాగా ప్రణబ్ ముఖర్జీకి 7,13,763 ఓట్లు రాగా, ప్రత్యర్థి పి.ఎ. సంగ్మాకు 3,15,987 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 15. ప్రణబ్ ముఖర్జీ 3,27,776 ఓట్ల ఆధిక్యంతో నెగ్గి 13వ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. జూలై 25న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్. హెచ్. కపాడియా ప్రణబ్ ముఖర్జీతో 13వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

రైతుల ఆత్మహత్యలు

దేశవ్యాప్తంగా 2011లో 14,004 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని జాతీయ క్రైం రికార్డ్ బ్యూరో జూలై 2న ప్రకటించింది. 2010లో ఈ సంఖ్య 15,933గా ఉంది. మహారాష్ట్రలో 2011లో 3,337 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 2004 నుంచి 2011 మధ్య కాలంలో 1.18 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలో ఈ కాలంలో ఆత్మహత్యలు ఎక్కువగా జరిగాయి.

కర్ణాటకకు కొత్త ముఖ్యమంత్రి

కర్ణాటక ముఖ్యమంత్రిగా బి.జె.పికి చెందిన జగదీశ్ శెట్టర్ ఎన్నికయ్యారు. జూలై 12న రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎచ్.ఆర్. భరద్వాజ్ జగదీశ్ శెట్టర్ చేత 21 ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. తరువాత ఉప ముఖ్యమంత్రులుగా కె. ఎస్. ఈశ్వరప్ప, ఆర్. అశోక్ ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి 31 మంది మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

సల్వాజుడుంను ఆపండి

మావోయిస్టులను నిర్మూలించిదానికి చత్తీస్‌గడ్ ప్రభుత్వం ఆదివాసి సల్వాజుడుం సాయుధ సంస్థలకు ఇస్తున్న సహకారాన్ని నిలిపివేసి, వాటిని రద్దు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించక పోవడంపై చత్తీస్‌గడ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నిస్తూ, వివరణ ఇవ్వాలని చెపుతూ ఒకరోజు గడువు ఇచ్చింది. కోర్టు ధిక్కారం కింద చర్య తీసుకోవాలని సామాజికవేత్త నందిని సుందర్, చరిత్రకారుడు రామచంద్ర గుహ, ప్రభుత్వ మాజీ అధికారి ఇ.ఎ.ఎస్ శర్మ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను జూలై 24న కోర్టు విచారించింది.

అవినీతికి వ్యతిరేకంగా అన్నా దీక్ష

అన్నా హజారే బృందం జూలై 25న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అవినీతికి వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించింది. అన్నా బృందం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. 15 మంది మంత్రుల మీద వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలనీ, పటిష్ట లోక్‌పాల్ బిల్లు తేవాలనీ, ఎంపిల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలనీ, పార్టీల అధ్యక్షుల కేసుల విచారణకు ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను అంగీకరించకుంటే జూలై 29 నుంచి తాను నిరసన దీక్ష చేపడుతానని హజారే ప్రకటించారు. అన్నా బృందం ప్రకటించిన చిట్టాలో ప్రధాని, రాష్ట్రపతి, చిదంబరం, కపిల్ సిబాల్, మాజీమంత్రి వీరభద్ర సింగ్‌లు ఉన్నారు.

స్విస్ బ్యాంకుల విధానంలో మార్పులు?

ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన లక్షలాది మంది రాజకీయ, పారిశ్రామిక, వాణిజ్య, అధికారంలో ఉన్న వారంతా అక్రమంగా సంపాదించే డబ్బును స్విస్ బ్యాంకుల్లో దాస్తున్నారు. ఈ అక్రమ సంపాదనా పరులకు రక్షణనిస్తుందనే విషయం అప్రతిష్టగా స్విట్జర్లాండ్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయంపై ఇతర దేశాధినేతలు తమ బ్యాంకుల్లో అక్రమ సంపాదనను దాచుకోవడానికి వీల్లేదంటూ, అటువంటి ఖాతాలను తొలగించాలని ఆలోచిస్తోంది. ఈ మేరకు కొత్త చట్టాలను రూపొందించాలనే చర్యలను స్విస్ ప్రభుత్వం ప్రారంభించింది. 'పాపపు సొమ్మును దాచదానికి మా బ్యాంకులు ఇక అవకాశం ఇవ్వబోవడంలేదు. త్వరలో ఈ స్థితి మారబోతోంది' అని స్విస్ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

ఔషధ పరీక్షలు

చట్ట విరుద్ధంగా ఔషధ పరీక్షలు నిర్వహించడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. మనుషులను గినియా పందులుగా పరిగణిస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం దురదృష్టకరమైన సంఘటనగా జస్టిస్ ఆర్. ఎం. లోధా నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. ఔషధ పరీక్షలపై దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు స్పందించనందుకు కేంద్రం, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను బెంచ్ తప్పుపట్టింది. ఎనిమిది వారాల్లో జవాబు ఇవ్వాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని, వైద్యమండలిని బెంచ్ కోరింది. స్వచ్ఛంద సంస్థలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు, విచారిస్తూ సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జూలై 26న జారీచేసింది. ఈ పరీక్షల వల్ల మధ్యప్రదేశ్‌లో 2వేల మంది మరణించినట్లు భారత ఔషధ నియంత్రణ మండలి వెల్లడించింది. వీ

ఆదివాసుల కాల్చివేత

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నక్సలైట్ల ఏరివేతకు వెళ్లిన సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు జూన్ 28న సార్కెగూడ వద్ద సమావేశమైన ఆదివాసులపై కాల్పులు జరిపి 17 మందిని చంపారు. వర్షాకాలం ప్రారంభమైంది గనుక భూములను దున్నుకోవడానికి, వారి సాంప్రదాయ పండుగలను ఎప్పుడు జరుపుకుందామని మాట్లాడుకోవడానికి సార్కెన్‌గూడ, కొత్తగూడ, రాజుపెంట గ్రామాల ఆదివాసులు సార్కెన్‌గూడలో సమావేశమయ్యారు. సమావేశమైన ఆదివాసులను సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు నలువైపుల చుట్టుముట్టి ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్చిచంపారు. కాల్పుల్లో గాయపడి ఇండ్లల్లో ఉన్నవారిని ఇండ్లనుండి బయటకు గుంజి గొడ్డళ్లు, కత్తులు, రాళ్లు ఉపయోగించి చాలా క్రూరంగా హింసించి చంపారు. మహిళలను అత్యాచారం చేసి చంపారు. అందులో రాజుపెంటకు చెందిన ఇరుప ధర్మయ్య (45), ఇరుప సురేశ్ (18)లు ఉన్నారు. కొత్తగూడకు చెందిన ఇరప నారాయణ (45), మడకం సురేష్ (27), మడకం నాగేశ్ (32), ఇరుప రమేశ్ (27), మడకం రాంవిలాస్ (18), మడకం దిలీప్ (19), కాకా సమ్మయ్య (35), కాకా అనిత (12), కాకా రాహుల్ (13), ఇరుప దినేష్‌లు (25) ఉన్నారు. సార్కెన్ గూడకు చెందిన మాదవి అయితాల్ – (28), కుంజం మల్లా – (22), అప్కా మీటు – (18), సార్కె రామన్న – (22), కోర్స బిచ్చెం – (18) ఉన్నారు. చింతల్నార్ పరిసర గ్రామాల్లోని దున్నడానికి వెళ్లి, పొలం పనులు చేసుకుంటున్న ఇద్దరు రైతులను పోలీసులు కాల్చి చంపారు. ఈ ఘటనపై హోం మంత్రి చిదంబరం మాట్లాడుతూ చనిపోయిన వారు ఒక వేళ మావోయిస్టు సానుభూతి పరులు కాకుంటే మాది పొరపాటే అని అసహనాన్ని ప్రదర్శించారు. సి.ఆర్.పి.ఎఫ్ చీఫ్ కె. విజయకుమార్ ఇది నిజమైన ఎన్‌కౌంటరేనని అందులో తమవాళ్లు కూడా గాయపడ్డారని సమర్థించుకున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి కిశోర్ చంద్రదేవ్ ఎన్‌కౌంటర్ ఘటనపై మాట్లాడుతూ చనిపోయిన వాళ్లంతా అమాయక గిరిజనులేనని, వారి వద్ద కనీసం చిన్న కత్తిలాంటిది గానీ కూడా లేదన్నారు. నిరాయుధులను నిర్దాక్షిణ్యంగా హతమార్చి మావోయిస్టులని ముద్రవేస్తారా, దీన్ని ఎన్‌కౌంటర్ ఘటనగా చిత్రీకరిస్తారా అంటూ పోలీసుల చర్యలను ఖండించారు. ఎన్‌కౌంటర్ ఘటన నిజనిర్ధారణకు సి.డి.ఆర్.ఒ. (కోఆర్డినేషన్ ఆఫ్ డెమోక్రటిక్ ఆర్గనైజేషన్స్ రైట్స్), మానవ హక్కుల వేదిక, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ఎ.పి.డి.ఆర్., ఒ.పి.డి.ఆర్. తదితర సంఘాలకు చెందిన 16 మంది సభ్యుల బృందం సార్కెన్‌గూడ, కొత్తగూడ, రాజుపెంట గ్రామాలకు వెళ్లింది. స్థానికులతో జరిగిన ఘటన వివరాలు అడగగా జూన్ 28 రాత్రి విత్తనాల పండుగ గురించి 60 మంది ఆదివాసులు చర్చించుకుంటున్నారన్నారు. అదే సందర్భంలో 300 మంది సి.ఆర్.పి.ఎఫ్. కోబ్రాలు నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని స్థానికులు తెలిపారు. అందులో 17 మంది చనిపోయారని తెలిపారు. ఆదివాసులను అడవి నుండి బయటకు తరిమేసి ఖనిజ సంపదను దోచుకునే ప్రయత్నంలో భాగమే సార్కెన్‌గూడ ఘటనకు బాధ్యులైన వారిపై ఐ.పి.సి సెక్షన్ 302 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ రాజేందర్ సచార్, స్వామి అగ్నివేశ్‌లతో కూడిన సామాజిక కార్యకర్తల బృందం సార్కెన్‌గూడలోని ఘటన స్థలానికి వెళ్లింది. స్థానిక ప్రజల నుంచి ఘటన వివరాలను సేకరించగా, మరణించిన వారందరూ ఆదివాసులని తెలిపారు. ఈ ఘటనపై జ్యుడిషయల్ విచారణ జరిపించాల్సిందేనని రామచంద్ర సచార్ బృందం డిమాండ్ చేసింది. గ్రామీణులను కిరాతకంగా హత్యచేశారని ఇది జలియన్‌వాలాబాగ్ దురాగతాన్ని తలపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సార్కెన్‌గూడలో చిన్న పిల్లలు చనిపోయారని, కాల్పులు ఏకపక్షంగా జరిగాయని ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సి.పి.ఎం పార్టీ డిమాండ్ చేసింది. నక్సల్స్ వ్యతిరేక చర్యల పేరుతో ఆదివాసీలను పొట్టన పెట్టుకున్నారని సి.పి.ఐ ఆరోపించింది. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. చత్తీస్‌గడ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 మంది బృందం సంఘటనా స్థలానికి వెళ్లింది. అక్కడ జరిగిన ఘటనా వివరాలను తెలుసుకున్న కాంగ్రెస్ బృందం ఇది బూటకపు ఎన్‌కౌంటర్లా కనిపిస్తోందని అన్నారు. జరిగిన ఘటనపై సి.బి.ఐతో విచారణ జరిపించాలని, ఘటనకు బాధ్యత వహిస్తూ, సి.ఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ఇనుప ఖనిజాన్ని బడా సంస్థలకు దోచిపెట్టాలనే ఉద్దేశ్యంతోనే ఆదివాసులపై పాలకులు ఈ మారణకాండ కొనసాగిస్తున్నారు. దేశ సహజ సంపదను అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్న ప్రజలను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపడాన్ని దేశ ప్రజలందరూ అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

అస్సాంలో ఆగని అల్లర్లు

అస్సాంలో బోడోలాండ్ ఉద్యమం మళ్లీ మొదలైంది. రాష్ట్రంలో బోడోలు అధికంగా ఉండే కోక్రాజార్, చిరాంగ్, బక్సా, ఉదాల్‌గురి జిల్లాల్లో అల్లర్లు జరిగి ఇప్పటికే 44 మంది చనిపోయారు. ఈ అల్లర్లకు మైనారిటీ విద్యార్థి సంఘాలు కారణమని తెలుస్తోంది. ఈ అల్లర్ల కారణంగా ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. ప్రస్తుతం 125 సహాయక శిబిరాల్లో రెండు లక్షల మంది ప్రజలు ఉంటున్నారు. ఈ ఘటనలతో ఈశాన్య రాష్ట్రాలకు రైళ్ల రాకపోకలు స్తంభించిపోయాయి. 1980లలో ప్రత్యేక 'బోడోల్యాండ్' ఏర్పాటు చేయాలని కోరుతూ ఉద్యమం ప్రారంభమై అది సాయుధ పోరాటానికి దారి తీసింది. 2003లో బోడోల కోసం ప్రత్యేక బోడో ప్రాదేశిక మండలి (బిటిసి) ఏర్పాటు ఒప్పందం కుదిరింది. దీంతో ప్రత్యేక బోడోల్యాండ్ కోసం ఉద్యమించిన నాయకులు ఉద్యమం నుంచి విరమించుకున్నారు. 2003లో కేంద్రం బోడోల స్వయం ప్రతిపత్తికి అంగీకరించడంతో ఈ ప్రాంతంపై బోడోల ఆధిపత్యం పెరిగింది. బోడో ప్రాదేశిక మండలి కింద ఉన్న జిల్లాల్లో బోడోలకు స్థానిక ముస్లింలకు మధ్య వైరుధ్యాలు పెరిగిపోయి ఈ ఘర్షణలకు కారణమయ్యాయనే వాదన ఉంది. బి.టి.సి ఏర్పాటు ఒప్పందంలో బోడోల ఆకాంక్షల గురించే పట్టించుకుందేగానీ స్థానికంగా ఉండే బోడోయేతర, ముఖ్యంగా ముస్లింల గురించి పట్టించుకోలేదన్న అసంతృప్తి ఉంది. 2010లో జరిగిన అల్లర్లకు కూడా ఈ అసంతృప్తే కారణం అంటున్నారు. ప్రస్తుతం బోడోల ప్రాదేశిక మండలి ప్రాంతంలో పాలన సాగిస్తున్న బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బి.పి.ఎఫ్) పార్టీ ఎక్కువగా బోడోల్యాండ్ కోసం సాయుధ పోరాటం చేసిన మాజీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పార్టీ. వీరి పాలనలో తమకు న్యాయం జరగదని మైనారిటీ విద్యార్థి సంఘాలు ప్రస్తుతం ఉద్యమిస్తున్నాయి.బోడోల ప్రాదేశిక మండలిలో 40 మంది సభ్యులుంటారు. దీనిలో 29 స్థానాలు బోడో తెగకు చెందిన వారికే రిజర్వు చేశారు. 5 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ స్థానాలకు ఎవరైనా పోటీ చేయవచ్చు. ఇంకా మిగిలిన ఆరు స్థానాలకు బోడోయేతర తెగల నుంచి ప్రభుత్వం నియమిస్తుంది. బోడోయేతర తెగలకు స్థానం కల్పించినట్లు కనబడినా, వాస్తవానికి వచ్చేసరికి బోడోల బలం ముందు వారేమీ చెయ్యలేక పోతున్నారన్నది మైనారిటీ విద్యార్థి సంఘాల ఆందోళనకు కారణమైంది. అక్కడ ఉండే స్థానిక భూములపై బోడోలకు, ముస్లింలకు మధ్య 1990ల నుంచీ ఘర్షణలు జరుగుతున్నాయి. జరుగుతున్న ఘటనలపై సిబిఐతో విచారణ జరిపించాలని బోడోలాండ్ ప్రాదేశిక మండలిలోని రిలిజియన్ మైనారిటీ కౌన్సిల్ కార్యదర్శి అల్లాఉద్దీన్ అలీ డిమాండ్ చేశారు. అస్సాం ఘటనలకు గుజరాత్ అల్లర్లతో పోల్చతగదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లో జరిగిన ఘటనలకు నరేంద్రమోడీ ప్రభుత్వమే వాటిని ప్రోత్సహించింది. ఇప్పుడు అస్సాంలో ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ అల్లర్లను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి శరణార్థులు, చొరబాటు దార్ల సంఖ్య పెరిగిపోవడం, స్థానిక బోడోలు అల్పసంఖ్యాకులుగా మారడంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయనే వాదన ఉంది. బోడోలు సామాజికంగా రాజకీయంగా సాంస్కృతికంగా వెనుకబడుతున్నారు. ఈ సమస్య 65 ఏళ్లుగా నానుతూనే ఉందిగాని ప్రభుత్వాలు మాత్రం సరయిన పరిష్కారాలు చూపడం లేదు. ప్రజలు ఒకటి కోరితే ప్రభుత్వాలు ఒక పరిష్కారాన్ని చూపడంవల్ల సమస్య మళ్లీ మళ్లీ మొదటికి వస్తూనే ఉంటుంది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను గౌరవించకుండా నిర్బంధించి ఉంచాలనుకుంటుంది. కాని ప్రజలు తమ సమస్యలకు తమదైన పద్ధతిలో పరిష్కార మార్గాలు వెతుక్కోవాల్సిన పరిస్థితే ఉంది.

వార్త – వ్యాఖ్య : వై. రామచంద్రం

బాంబు దాడులతో దద్దరిల్లిన ఇరాక్

ఇరాక్ బాంబు పేలుళ్లతో అతలాకుతలం అవుతోంది. వేర్వేరు ప్రాంతాల్లో జూలై 3న జరిగిన బాంబు పేలుళ్లలో 38 మంది మరణించగా, వంద మందికి పైగా గాయపడ్డారు. ఈ సంఘటన దివానియా నగరంలో ఉన్న సెంట్రల్ మార్కెట్‌లో జరిగింది. జూలై 23న మరోమారు జరిగిన బాంబు దాడులలో 111 మంది మరణించారు. 250 మంది గాయపడ్డారు. 13 నగరాల్లో, కొన్ని పట్టణాల్లో కొద్ది గంటల వ్యవధిలోనే జరిగిన బాంబు పేలుళ్లు, తుపాకుల కాల్పులు జరిగాయి.

నైజీరియాలో ఆయిల్ టాంకర్ల పేలుళ్లు

దక్షిణ నైజీరియాలోని పోర్టు హార్‌కోర్ట్ నగరంలో జూలై 20న ఐదు టాంకర్లకు ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని పేలడంతో 30 మంది సజీవదహనమయ్యారు. వారంలో రెండవ సంఘటన ఇది. గత వారంలో జరిగిన పేలుళ్లలో 200 మంది మృత్యువాతపడ్డారు.

చైనాలో వరద బీభత్సం

ఆరు శతాబ్దాల్లో కనీవినీ ఎరుగని కుంభవృష్టి చైనా రాజధాని బీజింగ్‌ను జూలై 22న ముంచెత్తింది. ఈ కుంభవృష్టి వలన 37 మంది మరణించారు. వివిధ ప్రాంతాల్లో నివసించే సుమారు 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

క్యూబా ఉపాధ్యక్షులుగా మరియామచాడో

క్యూబా పార్లమెంటు కొత్త ఉపాధ్యక్షురాలుగా యానా మరియా మారీ మచాడో ఎన్నికయ్యారు. ఇంతకు ముందున్న జైమీ క్రాంబెట్ అస్వస్థకు గురయిన కారణంగా ఆయనను పదవీ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, ఆ స్థానంలో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలైన ఈమెను ఉపాధ్యక్షులుగా పార్లమెంటు ఎన్నుకుంది.

చిలీలో భారీ ర్యాలీ

విద్యారంగ ప్రవేటీకరణకు, విద్యా రుణాల కుదింపుకు వ్యతిరేకంగా చిలీలో జూలై 1న లక్షలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలియజేశారు. ఈ ర్యాలీలో దాదాపుగా 1.2 లక్షల మంది పాల్గొన్నారు. విద్యా రంగాన్ని మొత్తంగా ప్రక్షాళన చేయాలని అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరాను డిమాండ్ చేస్తూ వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు గత ఏడాదిలో నలభైకి పైగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

డాక్టర్ కొట్నీస్ భార్య కన్నుమూత

1930 దశకంలో జపాన్ సామ్రాజ్యవాదులు చైనాపై దండెత్తినప్పుడు చైనాలో సైనికులకు మరువలేని సేవలు అందజేసిన డాక్టర్ కొట్నీస్ భార్య డాక్టర్ గువో క్వింగ్లాన్ చైనాలోని డాలియాన్ సిటీలో జూన్ 29న కన్నుమూశారు. ఆమె వయసు 96 సంవత్సరాలు.చైనాలో శాంగీ రాష్ట్రానికి చెందిన గువో నర్సుగా పనిచేసే వారు. కొట్నీస్ నిస్వార్థ సేవలను చూసి ఆయనను 1941లో ఆయన చనిపోవడానికి సంవత్సరం ముందు ఆయనను వివాహం చేసుకున్నారు.

అఫ్ఘనిస్తాన్ శరణార్థులకు ముప్పు

ప్రపంచంలోనే అతి పెద్దదైన అఫ్ఘనిస్తాన్ శరణార్థి శిబిరం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ శివారులో ఈ శిబిరం ఉంది. దీన్ని రద్దు చేయాలని పాకిస్తాన్ భావిస్తోంది. పాకిస్తాన్ తీరు సర్వత్రా ఆందోళనకు దారితీస్తుంది. ఒకవేల దీనిని రద్దు చేస్తే 30 లక్షల ఆఫ్ఘన్ శరణార్థులు నిర్వాసితులవుతారు.

సైప్రస్‌కు ఈయూ అధ్యక్షత

యూరోపియన్ యూనియన్(ఈయూ) అధ్యక్ష బాధ్యతలను జూలై 1న సైప్రస్ చేపట్టారు. సైప్రస్ ఈయూకు అధ్యక్షులు కావడం ఇదే తొలిసారి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఈయూకు అధ్యక్ష బాధ్యత దక్కడం విశేషం.

జపాన్ అధికార పార్టీలో ముసలం

జపాన్‌లో అమ్మకపు పన్నును రానున్న మూడేళ్లలో రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అధికార పార్టీ సీనియర్ నేత ఇచిర ఒజావా నాయకత్వంలోని పార్లమెంట్ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు పార్టీ నుంచి కూడా వైదొలిగారు. గత రెండేళ్లుగా జపాన్ రుణ భారాన్ని తగ్గించడంలో విఫలం కావడంతో దాన్నుంచి కొంతమేరకైనా బయట పడడానికి ప్రభుత్వం అమ్మకపు పన్నును పెంచాలనే ప్రతిపాదన చేసింది. దీనికి పార్లమెంట్‌లో అధికార పార్టీ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (డిపిజె)కు చెందిన 57 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేయగా, 15 మంది సభ్యులు సభకు హాజరు కాలేదు. ఈ ప్రతిపాదనను నిరసిస్తూ దిగువ సభకు చెందిన 40 మంది సభ్యులు, ఎగువ సభలోని 12 మంది సభ్యులు డిపిజె నుండి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

అక్రమాల ఎచ్ఎస్‌బిసి బ్యాంక్

యూరోప్‌లోనే అతి పెద్ద బ్యాంకయిన ఎచ్ఎస్‌బిసి బ్యాంక్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు అమెరికన్ సెనెట్ దర్యాప్తుల్లో తేలింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 80కి పైగా దేశాలలో ఈ బ్యాంకు కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా మెక్సికన్ మాదవ ద్రవ్య వ్యాపారులు ఈ బ్యాంకు ద్వారా కోట్లాది రూపాయల మనీలాండరింగ్‌కు పాల్పడ్డట్టు వెల్లడయింది. మనీ లాండరింగ్ నియంత్రణ తక్కువగా ఉండడంతో మాదక ద్రవ్య వ్యాపారులకు ఇది వరంగా మారింది.

సిరియా రక్షణ మంత్రి హత్య

సిరియా రాజధానిలోని జాతీయ భద్రతా కార్యాలయంపై జూలై 18న జరిగిన ఆత్మాహుతి దాడిలో సిరియా రక్షణ మంత్రి దావుద్ రజాతో సహా ముగ్గురు సీనియర్ అధికారులు మరణించారు. ప్రజా ఉద్యమాలతో అట్టుడికిపోతున్న సిరియాలో మళ్లీ నెత్తురు పారింది. హమా రాష్ట్రంలో జూలై 13న ట్రీంసా గ్రామంలో ప్రభుత్వ బలగాలు జరిపిన దాడుల్లో 200 మందికి పైగా ప్రజలు మరణించారని తిరుగుబాటుదార్లు వెల్లడించారు. వీ

మోన్‌శాంటోపై బ్రెజిల్ రైతుల పోరాటం

ప్రపంచంలో సోయాబీన్ పంట పండిస్తున్న దేశాలలో రెండవ స్థానంలో ఉన్న బ్రెజిల్‌లో రైతులు మోన్‌శాంటో కంపెనీకి వ్యతిరేకంగా అక్కడి కోర్టులో దావా వేశారు. బ్రెజిల్‌లో 62 మిలియన్ ఎకరాలలో సోయా బీన్ పంట పండిస్తారు. ప్రతి సంవత్సరం 24.1 బిలియన్ డాలర్ల విలువ చేసే సోయాబీన్‌లు ఎగుమతి చేస్తుంది. బ్రెజిల్ నుంచి సోయాబీన్‌ను ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశం చైనా. బ్రెజిల్‌లో దాదాపు 85 శాతం జెనిటికల్ సోయాబీన్ విత్తనాలనే వాడతారు. మోన్‌శాంటో ప్రధాన విత్తన సరఫరా చేసే కంపెనీ. మోన్‌శాంటో కంపెనీ బలవంతంగా తమ నుంచి విత్తనాలు తయారీ చేసునే దానిపై రాయల్టీని గుంజుకుందనీ అక్కడి యాభై లక్షల మంది రైతులు కంపెనీ మీద నష్టపరిహారం కోసం కోర్టులో దావా వేశారు. తమ నుంచి రాయల్టీ రూపేణా అక్రమంగా వసూలు చేసిన 6.2 బిలియన్ డాలర్లను తమకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్రెజిల్ రియో గ్రాండె డు సుల్ కోర్టు రైతులకు అనుకూలంగా తీర్పు నిచ్చింది. మోన్‌శాంటో కంపెనీ బ్రెజిల్ రైతు చట్టాలను అతిక్రమించిందనీ, 2004 నుంచి రాయల్టీ రూపంలో తీసుకున్న మొత్తాన్నీ లేదా రెండు బిలియన్ డాలర్లను రైతలకు తిరిగి ఇచ్చేయాలనీ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా మోన్‌శాంటో ఫెడరల్ కోర్టులో అప్పీలు చేసింది. 2014లో ఈ కేసుకు సంబంధించిన తీర్పు వెలువడనుంది.

దిగజారుతున్న పౌరుల జీవన పరిస్థితులు

అగ్రరాజ్యంగా వెలుగొందుతున్న అమెరికాలో రోజురోజుకూ సామాన్య పౌరుల జీవన పరిస్థితులు దిగజారుతున్నాయి. అమెరికాలో 8.2 శాతం నిరుద్యోగ రేటు నమోదైంది. దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన నిరాశాజనక పరిస్థితులను ఎదుర్కొంటుండంతో అనేక మంది ఇప్పుడు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపు 80 లక్షల మందికి పైగా అమెరికా వారు పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఒబామా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పొదుపు చర్యలు విద్యార్థులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పొదుపు చర్యలను ఆసరా చేసుకొని ప్రభుత్వ వర్శిటీలు విద్యార్థులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. అమలులో ఉన్న కోర్సులను రద్దు చేయడం, అధ్యాపకులకు ఉద్వాసన చెప్పడం, ట్యూషన్ ఫీజులను కూడా భారీగా పెంచేస్తున్నాయి. యూనివర్శిటీలలో నాలుగేళ్ల విద్యకు అయ్యే ఖర్చు గత దశాబ్ద కాలంలో 70 శాతానికి పైగా పెరిగింది. విద్యారంగ బడ్జెట్‌పై భారీ ఎత్తున కోతలు పెరగడంతో విద్యా వ్యయం గణనీయంగా పెరిగిపోయింది. ఇదిలా ఉండగా, అమెరికా తీవ్రమైన కరువు పరిస్థితిని ఎదుర్కొంటోంది. దాదాపు 61 శాతం భూమి కరువు బారిన పడిరది. పంటలు దెబ్బ తినడంతో ఆహార ధరలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితి ఉన్న అమెరికాలో 185 మిలియన్ పౌరుల దగ్గర ఉన్న ఆస్తి కంటే కూడా ఎక్కువ అక్కడి అతి ధనవంతులైన నాలుగు వందల మంది దగ్గర పోగుబడి ఉంది.

ప్రజాగ్రహానికి గురవుతున్న స్పెయిన్ ప్రభుత్వం

స్పెయిన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పొదుపు చర్యలు అక్కడి ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పదివేల కోట్ల యూరోల ఉద్దీపన ప్యాకేజీలు జర్మనీ నుండి అందుకోనున్నది. దీనికి బదులుగా దేశ ప్రజలపై దాదాపు 6,500 కోట్ల యూరోల భారం మోపబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర నిరసన ప్రదర్శన వెలిబుచ్చుతున్నారు. దాదాపు 80కి పైగా నగరాల్లో భారీ నిరసన ప్రదర్శను జరిగాయి. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దాదాపు లక్ష మందికి పైగా ప్రజలు ఈ నిరసన ప్రదర్శనలు పాల్గొన్నారు. ప్రస్తుతం స్పెయిన్‌లో నిరుద్యోగిత 25 శాతాన్ని అధిగమించింది. దీనికి తోడు ఉద్యోగుల వేతనాల్లో భారీ కోతలు, పన్నులను పెంచుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అప్పుల్లో పీకల్లోతున కూరుకు పోయిన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు అవసరమైన నిధులను ప్రజల నుంచే సేకరించాలన్న ఒత్తిడి స్పెయిన్‌పై పెరుగుతోంది. ఉద్దీపనల సాయానికి బదులుగా ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించాలంటూ అంతర్జాతీయ ద్రవ్య నిధి, యూరోపియన్ యూనియన్ నుంచి తీవ్రమైన షరతులు ఉన్నాయి.

గ్రీస్‌లో మహా సంక్షోభం

గ్రీస్ ప్రభుత్వం పీకల్లోతు సంక్షోభంలో చిక్కుకుపోయింది. 1930ల్లో అమెరికా అనుభవించిన తరహా మహామాంద్యాన్ని ఇప్పుడు గ్రీస్ ఎదుర్కొంటోందని ఆ దేశ ప్రధాని అంటోనీస్ సమరస్ అంటున్నారంటే పరిస్థితి తీవ్రత ఎంతో ఊహించుకోవచ్చు. రుణాలను చెల్లించలేని పరిస్థితిలో దేశం కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయంగా రుణం సంపాదించాలంటే ప్రజలపై మరిన్ని కోతలు విధించాలని ఒత్తిడి తెస్తున్నాయి. గత మార్చిలో యూరోపియన్ యూనియన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 130 బిలియన్ యూరోలను ఉద్దీపన పొందేందుకు అంగీకరించిన షరతులకు లొంగి విధించిన కోతలతో ప్రజలు అతలా కుతలం అవుతున్నారు. అధిక పన్నులూ, వ్యయ కోతలూ, వేతన కోతలతో ప్రజల జీవన పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. నిరుద్యోగం, ఉద్యోగులు వేతనాల్లో కోతలూ, పన్నుల పెంపులకు తోడు ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

సిరియాలో అంతర్గత సంక్షోభం

సిరియా రోజురోజుకూ అంతర్గత సంక్షోభంలో కూరుకుపోతోంది. ప్రభుత్వ దళాలకూ, తిరుగుబాటు దారులకూ మధ్య నిత్యం ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఒకరి ప్రాంతాలపై మరొకరు బాంబులతో, తుపాకులతో, రాకెట్ లాంచర్లతో దాడులకు దిగుతున్నారు. దీంతో సామాన్య ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తీవ్రంగా జరుగుతోంది. అధ్యక్షుడు అసద్ దిగిపోవాలంటూ గత ఏడాది నుంచి ప్రజలు తీవ్రమైన పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వ బలగాలు అదే తీవ్రతతో అణచివేత కార్యక్రమాలు చేపడుతున్నాయి. సిరియా నిరంకుశ పాలకుల మీద అక్కడి ప్రజలు సాగిస్తున్న పోరాటాన్ని ముస్లిం మత ఛాందస వాదంగా అర్థం చేసుకోవాలా, పాలకులను అమెరికా సమర్థిస్తున్నందు వల్ల దీన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యక్తీకరణగా చూడాలా అని అంతర్జాతీయంగా ప్రగతిశీల శిబిరంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మత శక్తులతో పాటు అనేక ఇతర అభివృద్ధి నిరోధక శక్తులు పాల్గొంటున్నప్పటికీ సామ్రాజ్యవాద అనుకూల నిరంకుశ పాలకుల మీద సాగుతున్న ఈ పోరాటాన్ని సమర్థించవలసిందే.

వార్త – వ్యాఖ్య : సి. రాజశేఖర్, ఎ. మల్లేశ్ వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చుయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 మే నుండి 30 జూన్ 2012 వరకు 15 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1731)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్		4	–	20	24	4	4	2	3	2	4	4	1	–	21	28	–	–	–	–	–
హైదరాబాద్	–	–	–	12	16	–	–	–	3	4	4	13	–	–	27	17	–	–	–	12	–
కరీంనగర్	1	4	1	21	31	2	19	1	2	2	6	9	7	7	27	23	–	1	–	–	17
ఖమ్మం	–	4	–	6	8	3	3	4	–	–	6	8	2	5	18	11	–	–	–	–	103
మహబూబ్‌నగర్	–	8	–	20	17	10	–	3	5	7	10	15	8	38	18	–	–	–	–	–	2
మెదక్	–	2	–	14	8	2	1	1	2	4	4	8	2	7	60	16	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	3	10	4	3	1	–	1	–	2	7	3	12	23	–	–	–	–	–
రంగారెడ్డి	1	2	–	10	8	13	15	2	3	5	1	5	–	5	32	8	–	–	–	–	3
వరంగల్	–	2	–	6	7	5	4	8	2	2	–	–	2	7	15	8	–	–	–	–	6
అనంతపూర్	–	3	–	11	5	6	5	6	1	1	4	6	2	9	48	2	–	–	–	–	–
కర్నూలు	–	2	1	14	16	2	9	2	3	8	4	8	4	3	31	23	–	–	–	–	3
గుంటూరు	5	–	–	3	16	1	–	1	–	–	1	4	–	2	14	4	–	–	–	–	1
కడప	–	1	–	3	1	2	2	2	–	–	4	7	3	2	19	1	–	–	–	–	7
నెల్లూరు	–	–	–	–	2	–	–	–	–	4	–	1	–	1	27	11	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	6	14	–	2	–	3	9	–	2	18	–	24	19	–	–	–	8	99
మొత్తం	**7**	**32**	**2**	**149**	**183**	**54**	**67**	**33**	**27**	**49**	**42**	**92**	**56**	**89**	**393**	**194**	**–**	**1**	**–**	**20**	**241**



వీక్షణం దశాబ్ది సంచిక రూపకల్పన కోసం..

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 133 - August 2012 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/07/2012 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణంకు మీ అండదండలు ఇవ్వండి!
ఈ ప్రజాపక్ష వేదిక పదికాలాలపాటు నిలబడేలా తోడ్పడండి!

- వీక్షణం చదవండి, చదివించండి, చర్చించండి ఇతరులకు పరిచయం చేయండి.
- వీక్షణంలో మీకు నచ్చిన, నచ్చని రచనల మీద ఉత్తరాలు, వ్యాసాలు రాయండి. ప్రజలకు తెలియడం అవసరం అని మీరు అనుకునే ఏ విషయం మీదనైనా వ్యాసం రాయండి. కనీసం ఉత్తరం రాయండి. లేదా వ్యాసం వస్తే బాగుంటుందని సంపాదకవర్గానికి సూచించండి. మీ పరిచయస్తులైన రచయితలు వీక్షణంకు రాసేలా ప్రోత్సహించండి
- వీక్షణంకు చందాదారులు కండి, చందాదారులను చేర్పించండి, మీ మిత్రులకు కానుకగా చందా చేర్పించండి. మీ గ్రామంలో గ్రంథాలయాలలో, సంస్థలలో, కళాశాలలలో, కార్యాలయాలలో వీక్షణం చందాలు చేర్పించండి. మీ జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయాలు వీక్షణం తెప్పిస్తున్నాయో లేదో కనుక్కుని తెప్పించే ఏర్పాటు చేయండి
- మీ గ్రామంలో, పట్టణంలో వీక్షణం విడిప్రతులు అమ్మే న్యూస్ ఏజెంటును ఏర్పాటు చేయండి
- మీకు తెలిసిన దాతలకు, ప్రముఖులకు, సంపన్నులకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంకు విరాళాలు ఇచ్చేలా ప్రోత్సహించండి. మీకు తెలిసిన విద్యాసంస్థలకు, ఆస్పత్రులకు, వ్యాపారసంస్థలకు, కార్యాలయాలకు వీక్షణంను పరిచయం చేసి వారు వీక్షణంలో వ్యాపార ప్రకటనలు ఇచ్చేలా చూడండి.

వివరాలకు

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao